

'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15
సంచిక: 221

బుధవారం 26-4-2023



గుజరాత్ గెలుపు
ఐపీఎల్‌లో 55 పరుగుల తేడాతో ఓడిన ముంబై ఇండియన్స్ - 12లో




లాభాల్లో మార్కెట్లు
సెన్సెక్స్ 75 పాయింట్లు లాభం.. నిఫ్టీ 26 పాయింట్లు అప్ - 13లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



రాష్ట్రాల అభివృద్ధే దేశాభివృద్ధి
రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశం వేగంగా పురోగతి సాధిస్తుందని ప్రధాని మోదీ చెప్పారు. కేరళలో వాటర్ మెట్రోను ప్రారంభించారు.
వివరాలు 6లో ▸



మళ్లీ ఎన్నికల బరిలోకి
అసంపూర్తిగా ఉన్న బాధ్యతలను పూర్తి చేసేందుకు తనకు మరో అవకాశమివ్వాలని అమెరికా ప్రజలను అధ్యక్షుడు బైడెన్ కోరారు.
వివరాలు 6లో ▸



పాక్ పోలీస్‌స్టేషన్‌లో పేలుళ్లు
పాకిస్తాన్‌లోని స్వాత్ జిల్లా కబాల్ పోలీస్ స్టేషన్‌లో సంభవించిన పేలుళ్లతో 18 మంది చనిపోగా, 70 మంది గాయాలపాలయ్యారు.
వివరాలు 6లో ▸



సూడాన్‌ను వీడిన భారతీయులు
భారత నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్ సుమేధ మొదటి విడతగా 278 మంది భారతీయులతో సూడాన్ నుంచి బయలుదేరింది.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

టీడీపీ సెల్ఫీల గోల



టీడీపీ నేతలు సెల్ఫీ రాజకీయం చేస్తున్నారని.. ఉత్తుత్తి ఫొటోలతో గోల చేస్తున్నారని మంత్రి బొత్స ఎద్దేవా చేశారు. వారిలా భావిస్తే సీఎం జగన్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై లెక్కలేనన్ని సెల్ఫీలు తీయాల్సి వస్తుందన్నారు.
వివరాలు 2లో ▸

వారం వరకు వడగాడ్పులుండవు



రాష్ట్రంలో మరో వారం పాటు వడగాడ్పులు ఉండవని వాతావరణ శాఖ ప్రకటించింది. పలు చోట్ల సాధారణం కంటే 2–3 డిగ్రీల తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రజలకు దీని వల్ల కాస్త ఉపశమనం కలుగుతుందని వాతావరణ శాఖ పేర్కొంది.
వివరాలు 2లో ▸

పేదల చెంతకు విద్య, వైద్య రంగాలు



ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమీ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలు–2023 ప్రదానోత్సవం ఏఎస్‌యూలో జరిగింది. నాణ్యమైన విద్య, వైద్య రంగాలను పేదల చెంతకు చేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని హోం మంత్రి వనిత అన్నారు.
వివరాలు 14లో ▸

బిహార్‌లో గ్యాంగ్‌స్టర్‌కు క్షమాభిక్ష



తెలుగు వ్యక్తి అయిన ఐఏఎస్ అధికారి కృష్ణయ్య హత్య కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న గ్యాంగ్‌స్టర్ ఆనంద్ మోహన్‌కు క్షమాభిక్ష ప్రసాదిస్తూ బిహార్‌లోని నితీశ్ సర్కార్ వివాదాస్పద నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం ఏకంగా నిబంధనలనే మార్చేసింది.
వివరాలు 6లో ▸

ఇదండీ సంగతి



ఎవరయినా అన్నన్ని వాగ్దానాలు ఇస్తారా..!

జూమ్‌లో.. కామ్‌గా ఆధారాలు ధ్వంసం!

మార్గదర్శి యాజమాన్యం అర్ధరాత్రి 'మేనేజ్‌మెంట్'

- రికార్డులు డిలీట్ చేయండి... ఏ ఒక్కటీ దొరక్కూడదు
- చిట్స్ బ్రాంచీల సిబ్బందికి హైదరాబాద్ నుంచి ఆదేశాలు
- జూమ్ మీటింగ్‌లో ప్రాక్టికల్‌గా చూపించిన 'పెద్దలు'
- తమ వివరాలు ఏమవుతాయోనన్న ఆందోళనలో ఖాతాదారులు.. ఇప్పటికే 2,3 నెలలుగా డబ్బులు అందక చిట్ పాటదారుల తిప్పలు
- ష్యూరిటీలు సహా రకరకాల కారణాలతో జాప్యం చేస్తున్న మార్గదర్శి.. ఇప్పటిదాకా 'సర్క్యులర్' వ్యాపారానికి అలవాటుపడ్డ వైనం
- కొత్త చిట్లు వస్తే.. ఆ సొమ్మును పాత చిట్లకు చెల్లిస్తున్న సంస్థ.. సగానికి సగం ఖాళీ ఉన్న చిట్లలో... అన్నీ ఫోర్‌మెన్ పేరిటే
- వాటికి తన తరఫున వాటా చెల్లించకుండానే కానిచ్చేస్తున్న తీరు.. డిసెంబరు నుంచి ఏపీలో కొత్త చిట్లే లేవు.. దీంతో నిధుల కొరత
- అందుకే చిట్లు పాడుకున్నవారికి చెల్లింపుల్లో అంతులేని జాప్యం.. తాజా పరిస్థితుల్లో తమ కష్టార్జితం ఏమవుతుందోనని చిట్‌దారుల ఆందోళన
- నిబంధనలు పాటిస్తే ఈ పరిస్థితి తలెత్తేది కాదంటున్న అధికారులు.. ప్రతి చిట్‌కూ ఓ బ్యాంకు ఖాతా ఉంటే.. జాప్యానికి అవకాశమే ఉండదు



సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ వ్యవహారాల కేసులో ఉక్కిరిబిక్కిరి అవుతున్న చెరుకూరి రామోజీరావు (ఏ–1) కీలక ఆధారాలను మాయం చేసేందుకు విఫలయత్నం చేసినట్లు బహిర్గతమైంది. మార్గదర్శి బ్రాంచ్ కార్యాలయాల్లో కీలక ఆధారాలు, రికార్డులను గుట్టు చప్పుడు కాకుండా ధ్వంసం చేసినట్లు తాజాగా సీఐడీ అధికారులు గుర్తించారు. ఈ తతంగాన్ని హైదరాబాద్‌లోని మార్గదర్శి ప్రధాన కార్యాలయం నుంచే పర్యవేక్షించారని, అందుకోసం ఫోర్‌మెన్‌లతో ప్రత్యేకంగా జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించినట్లు తేలింది. ఏ ఒక్కటీ ఆధారం దొరకకుండా రికార్డులు డిలీట్ చేయాలని మార్గదర్శి చిట్స్ బ్రాంచీల సిబ్బందిని ఆదేశించిన యాజమాన్యం జూమ్ మీటింగ్‌లో అర్ధరాత్రి దాకా ఈ వ్యవహారాన్ని పర్యవేక్షించినట్లు వెలుగు చూసింది. మరోవైపు గత డిసెంబర్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా తమ లావాదేవీలు దాదాపు స్తంభించిపోవడంతో గొలుసుకట్టు తరహా మిగతా 2వ పేజీలో ▸



ఆత్మ గౌరవంతో 'లక్ష'ణంగా..!

జూన్ నాటికి లక్ష టిడ్కో ఇళ్ల పంపిణీ

- అన్ని సదుపాయాలతో ముస్తాబైన పేదల ఇళ్లు
- ఇప్పటికే 48 వేలకు పైగా గృహ ప్రవేశాలు
- రెండో విడతలో మరో 40 వేలకుపైగా..
- 28న కావలి నుంచి ప్రారంభం.. పేదలకు 2,112 టిడ్కో ఇళ్లు
- 29న శ్రీకాకుళంలో మరో 1,280 యూనిట్ల పంపిణీ
- సీఆర్డీఏ పరిధిలో 5,024 యూనిట్లు సిద్ధం
- గృహ శోభతో సందడిగా పట్టణాలు

సాక్షి, అమరావతి: పట్టణ పేదలు ఆత్మ గౌరవంతో సగర్వంగా జీవించేలా తీర్చిదిద్దిన టిడ్కో ఇళ్ల పంపిణీని రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. మొదటి విడతగా ఇప్పటికే 48,416 టిడ్కో ఇళ్లను పంపిణీ చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రెండో దఫాలో మరో 40 వేలకు పైగా యూనిట్లను పట్టణ పేదలకు అందచేసేందుకు సిద్ధమైంది. జూన్ నాటికి మొత్తం లక్ష టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించేలా కార్యాచరణ రూపొందించారు. దశాబ్దాలుగా అద్దె ఇళ్లలో భారంగా గడిపిన బడుగు జీవులు అన్ని సదుపాయాలతో తీర్చిదిద్దిన టిడ్కో గృహాలకు యజమానులుగా మారుతుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం కావలి నుంచి మొదలయ్యే టిడ్కో ఇళ్ల పంపిణీ ప్రక్రియ జూన్ చివరి వరకు కొనసాగనుంది. కావలి మున్సిపాలిటీలో అన్ని వసతులతో మిగతా 3వ పేజీలో ▸

బాబు చీకటికి.. జగన్ వెలుగులకు ప్రతినిధి



- చంద్రబాబుకు బీసీలంటే చిన్నచూపు
- ఎన్నికలప్పుడే ఆయనకు వాళ్లు గుర్తుకొస్తారు
- వచ్చే ఎన్నికల్లో ఆయన్ను భూస్థాపితం చేసేది వాళ్లే
- నాయీ బ్రాహ్మణులు కాలర్ ఎగిరేసి బతికేలా చేసింది సీఎం జగనే
- 175కి 175 సీట్లు కొట్టడమే లక్ష్యంగా పనిచేయాలి
- నాయీబ్రాహ్మణుల కృతజ్ఞతా సభలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి 'సజ్జల రామకృష్ణారెడ్డి' పిలుపు
- చట్టసభల్లో నాయీ బ్రాహ్మణులకు అవకాశం
- సీఎం జగన్‌కు అండగా నిలుస్తాం: నాయీ బ్రాహ్మణులు

2లో

టెలిఫోన్ రంగంలో సంస్కరణల ఘనత నాదే

పేదలను కోటీశ్వరులను చేస్తా.. పెదకూరపాడు నియోజకవర్గం అమరావతిలో చంద్రబాబు



సాక్షి, నరసరావుపేట/అమరావతి: అధికారంలోకి వస్తే పేదవారిని కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యమని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు చెప్పారు. త్వరలోనే తమ పార్టీ తరఫున మెరుగైన సంక్షేమ పథకాలను ప్రకటిస్తానన్నారు. పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గం అమరావతిలో మంగళవారం రాత్రి ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మిగతా 3వ పేజీలో ▸



మూడు అంశాల ఆధారంగానే..

సచివాలయాల ఉద్యోగులకు బదిలీలు

- పరస్పర, భార్యాభర్తల ప్రాతిపదిక, ఆరోగ్య సమస్యతో కూడిన బదిలీలకే అవకాశం
- పాత జిల్లాలే ప్రాతిపదిక.. కనీసం రెండేళ్ల సర్వీసు నిబంధన కూడా.. ఉద్యోగి సొంత గ్రామాలకు అవకాశంలేదు
- సచివాలయ ఉద్యోగుల బదిలీలపై విధివిధానాలకు గ్రామ, వార్డు సచివాలయ శాఖ కసరత్తు
- ఉద్యోగ సంఘాల సూచనలు, సలహాలు స్వీకరించిన ఆ శాఖ స్పెషల్ సీఎస్

14లో

రోజుకు 50 వేల సర్వే రాళ్లు



సర్వే రాళ్లను పాతుతున్న సిబ్బంది

- రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో ముమ్మరంగా రాళ్లు పాతే కార్యక్రమం
- విశాఖ, గుంటూరు, అల్లూరి సీతారామరాజు, నంద్యాల జిల్లాల్లో పూర్తి
- మిగతా జిల్లాల్లోనూ వేగంగా కార్యక్రమం అమలు
- మే 20కి అన్ని జిల్లాల్లో పూర్తి చేసేందుకు సన్నాహాలు
- ఈ గ్రామాలను మోడల్ రీ సర్వే గ్రామాలుగా చేస్తున్న ప్రభుత్వం

2లో

ప్రకాశ్‌సింగ్ బాదల్ కన్నుమూత

పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి, శిరోమణి అకాలీ దళ్ అగ్రనేత ప్రకాశ్‌సింగ్ బాదల్(95) తుదిశ్వాస విడిచారు. చాలా రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మొహాలీలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి 8 గంటలకు కన్నుమూశారు. ఆయన మృతి పట్ల ప్రధాని మోదీతో పాటు పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. 1927 డిసెంబర్ 8న పంజాబ్‌లోని అబుల్ ఖురానా అనే చిన్న గ్రామంలో జన్మించిన బాదల్.. 1947లో రాజకీయాల్లో అడుగు పెట్టారు. ఐదుసార్లు పంజాబ్ ముఖ్యమంత్రిగా పనిచేశారు.

- వివరాలు 6లో



మే నుంచి చిరుధాన్యాల పంపిణీ

- తొలుత రాయలసీమ జిల్లాల్లో సరఫరాకు శ్రీకారం
- ఖరీఫ్ నుంచి మిల్లెట్ల సాగును ప్రోత్సహించేలా ప్రణాళిక
- వచ్చే సీజన్‌లో రైతుల నుంచి మద్దతు ధరకు కందులు కొనుగోలు
- బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు ధర రూ.130
- ప్రభుత్వం సబ్సిడీపై రూ.67కే అందజేత.. ఏప్రిల్‌లో 7,100 టన్నుల సరఫరా
- కిలో బియ్యం బదులు ఉచితంగా గోధుమ పిండి పంపిణీపై ప్రజాభిప్రాయ సేకరణ




సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యం కార్డుదారులకు పూర్తిస్థాయిలో నిత్యావసరాలను అందించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నది. అందులో భాగంగా ఆయా పంట ఉత్పత్తులను రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసేలా ప్రణాళికలు రచిస్తోంది. కేంద్ర ప్రభుత్వం 2023ను మిల్లెట్ ఇయర్‌గా ప్రకటించిన నేపథ్యంలో మే 1వ తేదీ నుంచి రాయలసీమ జిల్లాల్లో చిరుధాన్యాల (జొన్నలు, రాగులు) పంపిణీకి మిగతా 2వ పేజీలో ▸

కర్నూలుకు 'ఏపీఈఆర్‌సీ'

ఇకపై అక్కడి నుంచే ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి కార్యకలాపాలు

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- 1999లో ఉమ్మడి ఏపీలో మండలి ఏర్పాటు
- విభజన తరువాత అమరావతికి తరలిస్తూ ఆదేశాలిచ్చినా హైదరాబాద్ కేంద్రంగానే కార్యకలాపాలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) కార్యకలాపాలు ఇకపై కర్నూలు జిల్లా నుంచి జరగనున్నాయి. ఈ మేరకు ఏపీఈఆర్‌సీ ప్రధాన కార్యాలయం కర్నూలులో ఏర్పాటుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. విద్యుత్ చట్టం 2003 సెక్షన్ 82(3), కేంద్ర చట్టం నెం 36 (2003) ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.8లో ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ నోటిఫికేషన్ విడుదల చేశారు. దీని ప్రకారం కర్నూలులో ఏపీఈఆర్‌సీ ప్రధాన కార్యాలయం ఏర్పాటు ఆదేశాలు తక్షణమే అమలులోకి వస్తాయని స్పష్టం చేశారు. ఉమ్మడి ఏపీలో హైదరాబాద్ కేంద్రంగా 1999 మార్చిలో ఏపీఈఆర్‌సీ ఏర్పడింది. రాష్ట్ర విభజన తరువాత అమరావతి ప్రాంతానికి తరలిస్తూ 2014 ఆగస్టులో ఆదేశాలు వెలువడ్డా హైదరాబాద్ కేంద్రంగానే పని చేస్తోంది. కొన్నేళ్లుగా వార్షిక టారిఫ్ ఆర్డర్(విద్యుత్ చార్జీల సవరణ)పై ప్రజాభిప్రాయ సేకరణ, ఆర్డర్ విడుదల లాంటి కార్యకలాపాలను విశాఖపట్నం నుంచి నిర్వహిస్తోంది. తాజా ఆదేశాలతో ఏపీఈఆర్‌సీ కర్నూలులో ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుని అక్కడి నుంచే విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఏపీఈఆర్‌సీకి మిగతా 2వ పేజీలో ▸



నేడు ఇంటర్మీడియెట్ ఫలితాలు

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల ఫలితాలు బుధవారం (నేడు) విడుదల కానున్నాయి. విజయవాడలో సాయంత్రం 5 గంటలకు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఈ ఫలితాలను విడుదల చేయనున్నారు. ఫస్టియర్, సెకండియర్ పరీక్షల ఫలితాలు రెండూ ఒకేసారి విడుదల చేసేలా ఇంటర్మీడియెట్ బోర్డు ఏర్పాట్లు చేసింది. మార్చిలో జరిగిన ఈ పరీక్షలను 10,04,304 మంది విద్యార్థులు రాశారు. ఫలితాలను www.sakshieducation.comలో చూడవచ్చు.

సూడాన్‌లో చిక్కుకున్న వారిని వెనక్కి రప్పించేందుకు చర్యలు

అధికారులకు సీఎం జగన్ ఆదేశాలు

సాక్షి, అమరావతి: అంతర్యుద్ధం కారణంగా సూడాన్‌లో చిక్కుకున్న తెలుగువారిని రక్షించేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్ అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుని వారిని సురక్షితంగా వెనక్కి రప్పించేందుకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. స్వదేశానికి రాగానే వారిని స్వస్థలాలకు పంపించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఉక్రెయిన్ సంక్షోభం సమయంలో వ్యవహరించిన మాదిరిగానే వీరికి విమాన టికెట్లు, ప్రయాణ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎయిర్‌పోర్టులో వారిని రిసీవ్ చేసుకుని అక్కడి నుంచి స్వస్థలాలకు చేరుకునే వరకూ కూడా వారికి అండగా నిలవాలన్నారు. సూడాన్‌లో ఇప్పటివరకు 56 మంది తెలుగువారు ఉన్నట్లు తెలుస్తోందని అధికారులు సీఎంకు వివరించారు.

టీడీపీ సెల్ఫీల గోల: మంత్రి బొత్స

చీపురుపల్లిరూరల్: ఇటీవల ప్రతిపక్ష టీడీపీ నాయకులు సెల్ఫీల రాజకీయం చేస్తున్నారని, ఉత్తుత్తి ఫొటోలతో ఏదో గతంలో అభివృద్ధి చేసినట్లు గోలపెడుతున్నారని రాష్ట్ర విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ ఎద్దేవా చేశారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం కర్లాం గ్రామంలో మంగళవారం పలు అభివృద్ధి పనుల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గతంలో ఎప్పుడో ఒకటి, రెండు పనులు చేస్తే ఆ పనుల దగ్గరికి వెళ్లి ఆ పార్టీ నాయకులు సెల్ఫీలతో ఫొటోలు పెడుతుండడం సిగ్గుచేటన్నారు. వారిలా భావిస్తే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై లెక్కలేనన్ని సెల్ఫీలు తీయాల్సి ఉంటుందన్నారు. నాడు–నేడు కార్యక్రమంలో జరిగిన అభివృద్ధి పనులు ఊరూరా కళ్లకు అద్దినట్లు కనిపిస్తాయన్నారు. ఒకటి రెండు పనులు చేసిన వారు అలా సెల్ఫీల ఫొటోలు పెట్టుకుంటారని, ప్రతీ అభివృద్ధి కార్యక్రమం మనం చేసినవేనని.. మనం ఎన్నెన్ని ఫొటోలు పెడతాం చెప్పండని ప్రజలను ప్రశ్నిస్తూ నవ్వుకున్నారు.

జూమ్‌లో.. కామ్‌గా ఆధారాలు ధ్వంసం!

▶ మొదటి పేజీ తరువాయి

మోసాలకు అలవాటుపడిన మార్గదర్శి యాజమాన్యం కొత్త చిట్టీలు లేకపోవడంతో దిక్కులు చూస్తోంది. పాడుకున్న చిట్టీల మొత్తం కోసం చందాదారులు మార్గదర్శి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండగా.. రశీదు రూపంలో డిపాజిట్లు చేసిన వారిలో తీవ్ర ఆందోళన నెలకొంది. తమ వివరాలు ఏమవుతాయోనన్న ఆందోళన ఖాతాదారుల్లో నెలకొంది.

అడ్డదారిలో.. గుట్టుగా

మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమ వ్యవహారాల కేసులో తిమ్మిని బమ్మిని చేసేందుకు రామోజీరావు బరి తెగించారు. నిధుల మళ్లింపు, అక్రమ పెట్టుబడులు పెట్టినట్లు తేలడంతో కేసు దర్యాప్తును తప్పుదారి పట్టించేందుకు అడ్డదారులు పట్టారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి కార్యాలయాల్లో కీలక ఆధారాలు, రికార్డులను ధ్వంసం చేయించారు. దర్యాప్తులో ఉన్న కేసుకు సంబంధించిన ఆధారాలను ధ్వంసం చేయకూడదన్న నిబంధనను అతిక్రమించారు. గతంలో కూడా మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరిట రామోజీరావు అక్రమంగా రూ.2,600 కోట్ల డిపాజిట్లు వసూలు చేసినట్లు 2006లో బయటపడింది. నాడు రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) ఆదేశాలతో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో సీఐడీ విభాగం మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై కేసు నమోదు చేసింది. దీంతో డిపాజిట్లు వసూలు చేయడం తమ తప్పిదమేనని రామోజీరావు అంగీకరించారు. ఆ కేసు దర్యాప్తులో ఉండగానే మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను ఆయన హఠాత్తుగా మూసివేశారు. ఇప్పుడు మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేసులో కూడా అదే తరహాలో రికార్డులను నాశనం చేసే ప్రక్రియను గుట్టు చప్పుడు కాకుండా ముగించారు.



చందాదారుల ప్రదక్షిణలు.. డిపాజిట్‌దారుల్లో ఆందోళన

గతేడాది డిసెంబర్ నుంచి కొత్త చిట్టీలు ప్రారంభం కాకపోవడంతో మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో మనీ సర్క్యులేషన్ నిలిచిపోయింది. పాత చిట్టీల చందాదారులు చెల్లించిన మొత్తాన్ని రామోజీరావు అక్రమంగా తమ సొంత సంస్థల్లో పెట్టుబడులుగా మళ్లించేశారు. రశీదు రూపంలో సేకరించిన అక్రమ డిపాజిట్లను మ్యూచ్‌వల్ ఫండ్స్, షేర్ మార్కెట్‌లో పెట్టుబడిగా పెట్టారు. కొత్త చిట్టీలు ప్రారంభమైతే ఆ చందాదారులు చెల్లించే మొత్తాన్ని పాత చిట్టీలు పాడిన వారికి చెల్లిస్తుంటారు. గడువు తీరిన అక్రమ డిపాజిట్ల విత్‌డ్రాయల్స్ మొత్తంగా చెల్లించడం, వడ్డీలు చెల్లించడం మొదలైన వ్యవహారాలు నిర్వహించేవారు. ప్రతి చిట్టీలోనూ యాజమాన్యం వాటా కింద అట్టిపెట్టుకున్న టికెట్ల చందా మొత్తాన్ని కూడా అవే నిధుల్లో చెల్లించినట్టు రికార్డుల్లో మాయ చేసేవారు. ఈ గొలుసు కట్టు తరహా మోసాన్ని దశాబ్దాలుగా చేస్తున్నారు. ఇప్పుడు కొత్త చిట్టీలు లేనందున మార్గదర్శి లావాదేవీలు నిలిచిపోయాయి. పాత చిట్టీలు పాడిన చందాదారులకు సకాలంలో చెల్లించడం లేదు. తాము ష్యూరిటీ సంతకాలన్నీ చేయించినా చిట్టీ మొత్తం చెల్లించకపోవడంతో చందాదారులు ఆందోళన చెందుతున్నారు. మార్గదర్శి కార్యాలయాల చుట్టూ మండుటెండల్లో ప్రదక్షిణలు చేస్తున్నారు. విజయవాడలోని లబ్బీపేట, విశాఖపట్నంలోని సీతంపేట, గుంటూరు అరండల్‌పేట బ్రాంచి కార్యాలయాలకు వచ్చి రిక్త హస్తాలతో వెనుదిరుగుతున్నారు. దీనిపై కొందరు చిట్ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదులు కూడా చేస్తుండటం గమనార్హం. మరోవైపు గతంలో చిట్టీలు పాడిన మొత్తాన్ని వారికి చెల్లించకుండా రశీదు ఇచ్చి అక్రమంగా డిపాజిట్లు సేకరించారు. మార్గదర్శి అక్రమాలు బయటపడటంతో ఆ డిపాజిట్‌దారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తమ డిపాజిట్ మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని, వడ్డీ లేకపోయినా అసలైనా ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారు. బ్రాంచి కార్యాలయాల నుంచి సరైన స్పందన లేకపోవడంతో వారిలో ఆందోళన తీవ్రమవుతోంది. కొందరు సీఐడీ అధికారులను కూడా సంప్రదించడం ప్రాధాన్యం సంతరించుకుంది. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌ను నమ్మి తమ కష్టార్జితాన్ని ధారపోసి నిండా మునిగిపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా నిబంధనలు పాటిస్తే ఈ పరిస్థితి తలెత్తేది కాదని, ప్రతి చిట్‌కూ ఓ బ్యాంకు ఖాతా ఉంటే జాప్యానికి ఆస్కారమే ఉండదని, నిధుల మళ్లింపు జరగకుంటే చిట్‌దారులకు చెల్లింపులు ఆలస్యమయ్యేవి కావని అధికారులు పేర్కొంటున్నారు.

అర్ధరాత్రి విధ్వంసం.. జూమ్‌లో పర్యవేక్షణ

మార్గదర్శి కార్యాలయాల్లో సోదాలను సీఐడీ అధికారులు విస్తృతం చేయడంతో బెంబేలెత్తిన రామోజీరావు తనకు అలవాటైన రీతిలో ఆధారాలను ధ్వంసం చేసేందుకు సిద్ధపడ్డారు. అందుకోసం బ్రాంచి కార్యాలయాల మేనేజర్లతో (ఫోర్‌మెన్) మార్గదర్శి చిట్‌ఫండ్స్ యాజమాన్యం ప్రత్యేకంగా జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించింది. అక్రమ వ్యవహారాలకు సంబంధించిన పత్రాలు, రికార్డులు, ఇతర ఆధారాలను ఎలా ధ్వంసం చేయాలో వారికి క్షుణ్ణంగా వివరించారు. ఈ తతంగాన్ని హైదరాబాద్‌లోని మార్గదర్శి ప్రధాన కార్యాలయం నుంచే పర్యవేక్షించారు. ప్రధాన కార్యాలయానికి మళ్లించిన చందాదారుల నగదు వివరాలు, భారీగా నిధుల తరలింపు, రశీదుల ముసుగులో అక్రమ డిపాజిట్ల వసూలు, పాట పాడిన చందాదారులకు చిట్టీ మొత్తం ఇవ్వకుండా కొంత మొత్తాన్ని అక్రమ డిపాజిట్‌గా అట్టిపెట్టడం, యాజమాన్య వాటా కింద అట్టిపెట్టిన చిట్టీల టికెట్లు, వాటిపై చందా చెల్లించకుండానే చెల్లించినట్టుగా మాయ చేయడం.. వీటన్నింటికి సంబంధించిన రికార్డులు, పత్రాలను ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లోనూ ఎలా ధ్వంసం చేయాలో మార్గదర్శి ప్రధాన కార్యాలయ అధికారులు బ్రాంచి మేనేజర్లకు వివరించారు. ఆధారాల ధ్వంసం ప్రక్రియను ప్రధాన కార్యాలయం నుంచే అర్ధరాత్రి వరకూ పర్యవేక్షించారు. సీఐడీ అధికారులు తాజాగా నిర్వహించిన సోదాల్లో ఈ వ్యవహారం బహిర్గతం కావడంతో తీవ్రంగా పరిగణిస్తున్నారు. ధ్వంసం చేసిన ఆధారాలు, ఆన్‌లైన్ రికార్డులను సీఐడీ విభాగం రిట్రీవ్ చేసింది.

డిసెంబర్ నుంచి కొత్త చిట్టీలు లేవు

మార్గదర్శి అక్రమ వ్యవహారాలు వెలుగులోకి రావడంతో కొత్త చిట్టీలు వేసేందుకు చందాదారులు ముందుకు రావడం లేదు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి కార్యాలయాల్లో ఆర్థిక కార్యకలాపాలు 2022 డిసెంబర్ నుంచి దాదాపుగా స్తంభించిపోయాయి. కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని చిట్ రిజిస్ట్రార్ స్పష్టం చేస్తుండగా రామోజీరావు ఆ చట్టాన్ని ఏనాడూ పట్టించుకోలేదు. దీంతో కొత్త చిట్టీలు ఆగిపోయాయి. స్టాంపులు–రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల సోదాల్లో బయటపడిన వివరాల ప్రకారం రాష్ట్రంలో మార్గదర్శి 37 బ్రాంచి కార్యాలయాల్లో రూ.273 కోట్ల వేలం టర్నోవర్‌తో 2,357 చిట్టీలను నిర్వహిస్తున్నారు. ప్రతి నెలా రూ.6.29 కోట్లు వేలం టర్నోవర్ విలువ ఉన్న 148 కొత్త చిట్టీలను ప్రారంభిస్తారు. వాటిపై మార్గదర్శి యాజమాన్యానికి కమీషన్ రూపంలోనే రూ.31.45 లక్షలు వస్తాయి. డిసెంబర్ నుంచి చందాదారులు ముందుకు రాకపోవడంతో ఏకంగా 1,200కుపైగా కొత్త చిట్టీలు ప్రారంభం కాలేదు. రూ.51 కోట్ల వేలం టర్నోవర్ ఉన్న చిట్టీలు నిలిచిపోయాయి. ఆ మొత్తాన్ని మ్యూచ్‌వల్ ఫండ్స్, షేర్ మార్కెట్‌లతోపాటు తమ సొంత సంస్థల్లో పెట్టుబడిగా మళ్లించేందుకు సాధ్యం కావడం లేదు. ఇక కమీషన్ రూపంలో రూ.2.55 కోట్ల మేర మార్గదర్శి యాజమాన్యానికి రాకుండా పోయింది. కొత్త చిట్టీల కోసం చందాదారులను రప్పించేందుకు బ్రాంచి మేనేజర్ల ద్వారా చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు.

వారం వరకు వడగాడ్పులుండవు

అప్పటి వరకు తేలికపాటి వర్షాలు, గాలులు

తగ్గుముఖం పట్టిన పగటి ఉష్ణోగ్రతలు



సాక్షి, విశాఖపట్నం: మూడు వారాల నుంచి కొద్దిరోజుల కిందటి వరకు దడపుట్టించిన వడగాడ్పులు తగ్గుముఖం పట్టాయి. మరో వారం పాటు వడగాడ్పులు ఉండవని వాతావరణశాఖ ప్రకటించింది. ఈ సమాచారం ప్రజలకు ఉపశమనం కలిగించింది. ఇటీవలి వరకు రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణంకంటే 3 నుంచి 7 డిగ్రీల వరకు అధికంగా నమోదయ్యాయి. వివిధ ప్రాంతాల్లో 44 డిగ్రీలకు పైనే ఉండటంతో పలుచోట్ల వడగాడ్పులు, కొన్నిచోట్ల తీవ్ర వడగాడ్పులు కూడా వీచాయి. నిప్పులు చెరిగే ఎండలకు జనం అల్లాడిపోయారు. 4 రోజుల కిందటి నుంచి పరిస్థితిలో మార్పు వచ్చింది. అల్పపీడన ద్రోణి, విండ్ డిస్కంటిన్యూటీ (గాలికోత)ల కారణంగా అకాల వర్షాలు మొదలయ్యాయి. ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలులు వీస్తున్నాయి. దీంతో ఆకాశంలో మబ్బులు కమ్మి ఒకింత చల్లదనాన్ని పంచుతున్నాయి. ఈ పరిణామాలతో పగటి ఉష్ణోగ్రతలు మధ్యాహ్నం వరకు ఒకింత ప్రభావం చూపుతున్నా ఆ తర్వాత తగ్గుముఖం పడుతూ ఊరట నిస్తున్నాయి. ప్రస్తుతం పలుచోట్ల సాధారణంగాను, కొన్నిచోట్ల సాధారణం కంటే 2–3 డిగ్రీలు తక్కువగాను, అక్కడక్కడ 1–2 డిగ్రీలు ఎక్కువగాను నమోదవుతున్నాయి. ఫలితంగా నాలుగైదు రోజుల నుంచి రాష్ట్రంలో ఎక్కడా ఎండలు విజృంభించడం లేదు. వడగాడ్పులు లేవు. ప్రస్తుతం అల్పపీడన ద్రోణి/గాలులకోత పశ్చిమ విదర్భపై ఉన్న ఉపరితల ఆవర్తనం నుంచి దక్షిణ అంతర్గత కర్ణాటక వరకు వ్యాపించి ఉంది. ఇది సగటు సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్, యానాంలలో దిగువ ట్రోపో ఆవరణంలో దక్షిణ, నైరుతి గాలులు వీస్తున్నాయి. వీటి ఫలితంగా రాష్ట్రంలో ఈదురు గాలులతో వర్షాలు కురుస్తున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు మునుపటికంటే తక్కువగా నమోదవుతున్నాయి. ఈ పరిస్థితులు వారం రోజులపాటు కొనసాగుతాయని, అందువల్ల అప్పటివరకు వడగాడ్పులు వీచే అవకాశాల్లేవని భారత వాతావరణ విభాగం మంగళవారం తెలిపింది. మే నెల సమీపిస్తున్న తరుణంలో ఏప్రిల్ ఆఖరి వరకు ఇంకెంత ఉష్ణతీవ్రతను భరించాల్సి వస్తుందోనని ఆందోళన చెందుతున్న ప్రజలకు ఈ సమాచారం ఊరటనిచ్చే అంశమని విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం డైరెక్టర్ సునంద 'సాక్షి'తో పేర్కొన్నారు. రాష్ట్రంలో కొన్నిచోట్ల మధ్యాహ్నం వేళ వరకు ఒకింత ఉష్ణ తీవ్రత అనిపించినా ఆ తర్వాత ఉరుములు, మెరుపులతో పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తూ వాతావరణం చల్లబడుతోందని చెప్పారు.

మే నుంచి చిరుధాన్యాల పంపిణీ

▶ మొదటి పేజీ తరువాయి

శ్రీకారం చుట్టింది. ఇప్పటికే పౌరసరఫరాల సంస్థ రైతుల నుంచి జొన్న ఉత్పత్తులను సేకరించగా.. కర్ణాటక నుంచి ఎఫ్‌సీఐ ద్వారా రాగులు కొనుగోలు చేయనుంది.

చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచేలా..

పేదలకు పీడీఎస్ కింద పౌష్టికాహార ఉత్పత్తులను అందించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా రాష్ట్రంలో ఖరీఫ్ నుంచి చిరుధాన్యాల సాగు విస్తీర్ణాన్ని పెంచేలా వ్యవసాయ, పౌరసరఫరాల శాఖ అధికారులు సన్నద్ధమవుతున్నారు. వరికి ప్రత్యామ్నాయంగా రైతులు మిల్లెట్లు పండించేలా అవగాహన కల్పించనున్నారు. చిరుధాన్యాల ఉత్పత్తులను స్థానికంగానే రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేసి పీడీఎస్‌లో పంపిణీ చేయనున్నారు. ఫలితంగా రైతులకు మార్కెట్‌లో పక్కా ధర భరోసా దక్కనుంది.

వచ్చే ఖరీఫ్‌లో కందుల కొనుగోలు

రాష్ట్రంలో ఖరీఫ్, రబీ సీజన్లలో కలిపి సుమారు 4లక్షల టన్నుల వరకు కందుల దిగుబడి నమోదవుతోంది. ఈ క్రమంలోనే పీడీఎస్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని వచ్చే ఖరీఫ్‌లో నేరుగా రైతుల నుంచి కందులు సేకరించేలా పౌరసరఫరాల శాఖ సన్నాహాలు చేస్తోంది. రాష్ట్రంలో 1.45 కోట్ల రైస్ కార్డులు ఉండగా.. ఇందులో ప్రతి నెలా సగటున 5,500 టన్నుల కందిపప్పు అవసరం అవుతున్నది. ప్రస్తుతం రిటైల్ మార్కెట్‌లో కిలో కందిపప్పు సాధారణ రకం రూ.120–రూ.125, ఫైన్ వెరైటీ రూ.130 వరకు పలుకుతోంది. ఈ క్రమంలోనే ప్రభుత్వం సబ్సిడీపై కిలో కందిపప్పును రూ.67కే అందిస్తోంది. ఫలితంగా ఏప్రిల్‌లో ఏకంగా 7,100 టన్నుల కందిపప్పును వినియోగదారులకు సరఫరా చేసింది.

బియ్యం బదులు గోధుమ పిండి

కేంద్ర ప్రభుత్వం పీడీఎస్ కింద నెలకు 1,800 టన్నులు మాత్రమే గోధుమ ఉత్పత్తులను రాష్ట్రానికి కేటాయిస్తుండగా.. వాటిని తొలి ప్రాధాన్యత కింద వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాల్లో పంపిణీ చేస్తున్నారు. కిలో రూ.16 చొప్పున కార్డుకు గరిష్ఠంగా రెండు కిలోలు సరఫరా చేస్తున్నారు. అయితే గోధుమను రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేసేందుకు వినియోగదారుల నుంచి ఐవీఆర్ఎస్ ద్వారా అభిప్రాయాలను సేకరించనున్నారు. ఇక్కడ ప్రతినెలా ఇచ్చే రేషన్‌లో కేజీ బియ్యం బదులు ఉచితంగా గోధుమ పిండి ఇచ్చేలా పౌరసరఫరాల శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నది.

స్థానిక అవసరాలకు అనుగుణంగా..

రాష్ట్రంలో ప్రజా పంపిణీకి అవసరమైన నిత్యావసరాల ఉత్పత్తులను స్థానికంగా రైతుల నుంచి కొనుగోలు చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నాం. ఫలితంగా రైతులకు మద్దతు ధర భరోసా దక్కడంతో పాటు.. కేంద్ర ప్రభుత్వం సరుకు ఇచ్చే వరకు ఎదురు చూడాల్సిన అవసరం ఉండదు.

– హెచ్.అరుణ్‌కుమార్, కమిషనర్, పౌరసరఫరాల శాఖ

కర్నూలుకు 'ఏపీఈఆర్‌సీ'

▶ మొదటి పేజీ తరువాయి

చైర్మన్‌తో పాటు ఇద్దరు సభ్యులు ఉంటారు. డైరెక్టర్ హోదాలో కమిషన్ సెక్రటరీ, జాయింట్ డైరెక్టర్, ఐదుగురు డిప్యూటీ డైరెక్టర్లు, లీగల్ కన్సల్టెంట్, ఐటీ కన్సల్టెంట్, కార్యాలయ సిబ్బంది ఉంటారు.

'ఏపీఈఆర్‌సీ' ఏం చేస్తుందంటే?

విద్యుత్ చట్టం సెక్షన్ 86 ద్వారా కమిషన్‌కు పలు విధులను నిర్దేశించారు. విద్యుత్ ప్రసారం, పంపిణీ, రిటైల్ సరఫరా కార్యకలాపాలు, నిర్వహణను మెరుగుపరిచి, విద్యుత్ చార్జీలను నిర్ణయించడం లాంటి కీలక బాధ్యతలను మండలి నిర్వర్తిస్తుంది. విద్యుత్తు అంతర్రాష్ట్ర ప్రసారం, పంపిణీ, రిటైల్ సరఫరాలో పోటీ మార్కెట్ల అభివృద్ధికి అవసరమైన సాంకేతిక, సంస్థాగత మార్పులను తేవడం లాంటివి చేపడుతుంది. పంపిణీ, సరఫరా కోసం విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, సేకరణ ప్రక్రియను నియంత్రిస్తుంది. ట్రాన్స్‌మిషన్ లైసెన్సులు, డిస్ట్రిబ్యూషన్ లైసెన్సులు జారీ చేస్తుంది. పునరుత్పాదక శక్తిని ప్రోత్సహించేందుకు మొత్తం విద్యుత్ వినియోగంలో ఎంత శాతం ఉండాలో నిర్ణయిస్తుంది. డిస్కంలు, ఉత్పాదక సంస్థల మధ్య వివాదాలపై విచారణ జరిపి పరిష్కరిస్తుంది. వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించేలా ప్రభుత్వానికి సలహాలు ఇవ్వడం లాంటివి కమిషన్ ప్రధాన విధులుగా నిర్దేశించారు.

77 మంది ఏఎస్పీ, డీఎస్పీల బదిలీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 77 మంది ఏఎస్పీ, డీఎస్పీలను బదిలీ చేశారు. ఈ మేరకు డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. వీరిలో ఎక్కువ మందిని శాంతిభద్రతల విభాగానికి బదిలీ చేయగా ఎనిమిది మందిని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. ఈ బదిలీ ఆదేశాలు తక్షణం అమలులోకి వస్తాయని డీజీపీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేడు జగనన్న వసతి దీవెన

9,55,662 మంది విద్యార్థులు, వారి తల్లులకు రూ.912.71 కోట్ల లబ్ధి

- అనంతపురం జిల్లా నార్పలలో నగదు జమ చేయనున్న సీఎం జగన్
- ఇప్పటిదాకా 25,17,245 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.4,275.76 కోట్లు జమ
- విద్యా రంగంపై ఇప్పటి వరకు రూ.58,555.07 కోట్లు వ్యయం

సాక్షి, అమరావతి: చెప్పిన మాట మేరకు సంక్షేమ క్యాలెండర్‌లో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం జగనన్న వసతి దీవెన అమలు చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 9,55,662 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.912.71 కోట్ల ఆర్థిక సాయాన్ని అనంతపురం జిల్లా నార్పల వేదికగా కంప్యూటర్‌లో బటన్ నొక్కి జమ చేయనున్నారు. ఈ మొత్తంతో కలిపి ఇప్పటి వరకు 25,17,245 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.4,275.76 కోట్లు జమ చేసినట్లు అవుతుంది. గత ప్రభుత్వంలో అరకొరగా ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయడమేగాక 2017 నుంచి పెండింగ్ పెట్టిన బకాయిలు రూ.1,778 కోట్లను కూడా జగన్ ప్రభుత్వం చెల్లించింది. ఈ బకాయిలు, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతిదీవెన కింద ఇప్పటివరకు వైఎస్ జగన్ ప్రభుత్వం అందించిన మొత్తం సాయం రూ.14,223.60 కోట్లు. వసతి దీవెన పథకం కింద ఉన్నత చదువులు చదివే పేద విద్యార్థుల భోజన, వసతి ఖర్చుల కోసం ఇబ్బంది పడకుండా ఏటా రెండు వాయిదాల్లో ఐటీఐ విద్యార్థులకు రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు అభ్యసించే వారికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్న విషయం తెలిసిందే.

విప్లవాత్మక సంస్కరణలు

కరిక్యులమ్‌లో మార్పులు, నాలుగేళ్ల ఆనర్స్ కోర్సులు, నైపుణ్యాభివృద్ధి కోర్సులు, తప్పనిసరిగా ఇంటర్న్‌షిప్ తదితర విప్లవాత్మక కార్యక్రమాలతో విద్యా రంగాన్ని బలోపేతం చేస్తోంది. డిజిటల్ విద్యలో భాగంగా 8 వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ఉచిత ట్యాబ్‌లు, నాడు–నేడు ద్వారా ఇప్పటికే అభివృద్ధి చేసిన పాఠశాలల్లో 6వ తరగతి పైన ప్రతి క్లాస్‌రూమ్‌లో 30,213 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్, 10,038 ఫౌండేషన్, ఫౌండేషన్ ప్లస్ స్కూళ్లలో స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేసింది. అధికారంలోకి వచ్చిన ఈ 46 నెలల కాలంలోనే ఒక్క విద్యా రంగంపై రూ.58,555.07 కోట్లు వెచ్చించింది. కాగా, బుధవారం ఉదయం సీఎం వైఎస్ జగన్ ఉదయం 8.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 10.20 గంటలకు నార్పల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చేరుకుంటారు. అనంతరం నార్పల క్రాస్‌రోడ్స్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని, జగనన్న వసతి దీవెన కింద లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేస్తారు. తిరిగి 2.50 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

రోజుకు 50 వేల సర్వే రాళ్లు

- రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో ముమ్మరంగా రాళ్లు పాతే కార్యక్రమం



రీ సర్వే తర్వాత పాతుతున్న సర్వే రాళ్లు

సాక్షి, అమరావతి: భూముల రీ సర్వే పూర్తయిన 2 వేల గ్రామాల్లో సర్వే రాళ్లు పాతే కార్యక్రమం ముమ్మరంగా జరుగుతోంది. రైతులపై పైసా భారం లేకుండా ప్రభుత్వ ఖర్చుతోనే సర్వే చేసిన భూముల్లో రాళ్లు పాతుతున్నారు. ఇప్పటికే విశాఖపట్నం, గుంటూరు, నంద్యాల, అల్లూరి సీతారామ రాజు జిల్లాల్లో ఈ కార్యక్రమం వంద శాతం పూర్తయింది. మిగతా జిల్లాల్లోనూ వేగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రోజుకు 50 వేల రాళ్లు పాతడమే లక్ష్యంగా సర్వే సెటిల్మెంట్, రెవెన్యూ యంత్రాంగాలు పనిచేస్తున్నాయి. ఈ నెల 18వ తేదీన 54,538 రాళ్లను రైతుల భూముల సరిహద్దుల్లో పాతారు. ఆరోజు ఒక్క శ్రీకాకుళం జిల్లాలోనే 8 వేలకుపైగా రాళ్లను పాతారు. ఆ తర్వాత నుంచి ప్రతి రోజూ 50 వేలకు తగ్గకుండా రాళ్లను పాతుతున్నారు. ఇందుకోసం జిల్లాలవారీగా షెడ్యూల్‌ను రూపొందించారు. దాని ప్రకారం రోజూ రాళ్లు పాతుతున్నారో లేదో పర్యవేక్షిస్తున్నారు. ఒకేసారి భారీగా సర్వే రాళ్లు పాతుతుండడంతో ఉన్న రోవర్లు సరిపోవడంలేదు. దీంతో సర్వే శాఖ అదనంగా వెయ్యి రోవర్లను సమకూర్చుకుంది. వచ్చే నెల 20లోగా సర్వే పూర్తయిన గ్రామాలన్నింటిలో ఈ కార్యక్రమం పూర్తి చేయాలని లక్ష్యంగా పనిచేస్తున్నారు. ఈ గ్రామాల్లో 25.80 లక్షల రాళ్లు పాతాల్సి ఉండగా ఇప్పటివరకు 14 లక్షలకుపైగా రాళ్లు పాతారు. రికార్డు స్థాయిలో సర్వే రాళ్లు పాతే కార్యక్రమం నడుస్తోందని సర్వే, సెటిల్మెంట్ కమిషనర్ సిద్దార్థ జైన్ తెలిపారు. రీ సర్వే పూర్తయిన 2 వేల గ్రామాల్లోని రైతులకు భూహక్కు పత్రాల పంపిణీ చివరి దశకు వచ్చిందని చెప్పారు. రాళ్లు కూడా పాతడం పూర్తయితే రీ సర్వే ప్రాజెక్టులో ఈ గ్రామాలు మోడల్‌గా ఉంటాయని తెలిపారు.

కోటీ ఇరవై ఐదు లక్షల సర్వే రాళ్లు అవసరం

రీ సర్వే కోసం రాష్ట్రవ్యాప్తంగా కోటీ ఇరవై ఐదు లక్షల సర్వే రాళ్లు అవసరమవుతాయని అంచనా. అన్ని రాళ్లను సమకూర్చే సామర్థ్యం ఉన్న ఫ్యాక్టరీలు రాష్ట్రంలో, సమీప రాష్ట్రాల్లోనూ లేవు. దీంతో రాష్ట్ర ప్రభుత్వమే 4 సర్వే రాళ్ల కర్మాగారాలు ఏర్పాటు చేసి రాళ్లు ఉత్పత్తి చేస్తోంది. సర్వే రాళ్లు తయారు చేయడానికి అవసరమైన గ్రానైట్ రాళ్లను గనుల శాఖ ఈ ఫ్యాక్టరీలకు సమకూరుస్తోంది. వాటిని 2 సైజుల్లో తయారు చేసి సర్వే శాఖకు అప్పగిస్తున్నారు.

బాబు చీకటికి.. జగన్ వెలుగులకు ప్రతినిధి

నాయీబ్రాహ్మణుల కృతజ్ఞతా సభలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి 'సజ్జల'



సభలో మాట్లాడుతున్న సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి: చంద్రబాబు చీకటికి ప్రతినిధి అయితే సీఎం వైఎస్ జగన్ వెలుగులకు ప్రతినిధి అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అభివర్ణించారు. చంద్రబాబుకు ఎన్నికల సమయంలోనే బీసీలు గుర్తొస్తారని.. బీసీల తోకలు కత్తిరిస్తానంటూ చంద్రబాబు వారిని అవహేళన చేశారని గుర్తు చేశారు. బాబుకు బీసీలంటే చిన్నచూపు అని, వారిని అణిచివేయడమే లక్ష్యంగా పనిచేస్తారని విమర్శించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన నాయీబ్రాహ్మణ కృతజ్ఞతా సభలో సజ్జల మాట్లాడారు..

నాయీ బ్రాహ్మణులు కాలర్ ఎగరేసి బతికేలా సీఎం జగన్ చేశారు. అలాంటి నాయకుడికి నాయీ బ్రాహ్మణులు అండగా నిలవాలి. వారికి ఇప్పటికే ఆలయాల పాలక మండళ్లలో అవకాశం కల్పించారు. చట్ట సభల్లో కూడా అవకాశం దక్కుతుంది. త్వరలో ఎమ్మెల్సీ కూడా వస్తుంది. వచ్చే ఎన్నికల్లో బీసీలే బాబును భూస్థాపితం చేస్తారు. బీసీలకు ఇప్పటికే అధికభాగం పదవులు ఇవ్వగలిగాం. సమాజంలో బీసీల ఆత్మగౌరవం పెరిగేందుకే ఇదంతా చేస్తున్నారు. అన్న క్యాంటీన్ల దగ్గర నుంచి మరుగుదొడ్ల వరకు బాబు హయాంలో అంతటా అవినీతి, అక్రమాలే. లోకేశ్‌కు ఏం పీకుతున్నారనే మాట తప్ప మరేదీ నేర్పలేదేమో? నోరు తెరిస్తే ఆ పీకుడు భాషే మాట్లాడుతున్నారు. చంద్రబాబుకు మీడియా బలం తప్ప మరేమీలేదు. ఇక వచ్చే ఎన్నికలలో వంచనతోనే చంద్రబాబు గెలవాలనుకుంటున్నారు. ఆయన పాలనలో సామాన్యులు బతకలేరు. ఈసారి చంద్రబాబును రాజకీయంగా అంతం చేయాలి. వైఎస్సార్‌సీపీ 175కి 175 సీట్లు విజయం సాధించడమే లక్ష్యంగా బీసీలు పనిచేయాలి.

చెప్పింది చెప్పినట్లుగా.. : యానాదయ్య

సభాధ్యక్షుడు, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్ధవటం యానాదయ్య మాట్లాడుతూ.. వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టగానే పాదయాత్రలో నాయీ బ్రాహ్మణులకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి నెరవేర్చుకుంటూ వస్తున్నారన్నారు. జగనన్న చేదోడు ద్వారా రాష్ట్రంలోని వృత్తిదారులైన నాయీబ్రాహ్మణులకు ఇప్పటికే మూడుసార్లు పదివేల చొప్పున అంటే రూ.30 వేలు వారి ఖాతాల్లో వేశారన్నారు. అలాగే, వృత్తిదారులకు 150 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నారని గుర్తుచేశారు. అంతేకాక, వివిధ దేవాలయాలలో పనిచేసే నాయీబ్రాహ్మణులకు రూ.20 వేలు వేతనం అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. సీఎం జగన్‌కు ఎప్పటికీ అండగా నిలుస్తామని యానాదయ్య స్పష్టంచేశారు.

బ్రాండ్ అంబాసిడర్లుగా పనిచేయాలి..

మంత్రులు జోగి రమేష్, కొట్టు సత్యనారాయణ, చెల్లుబోయిన వేణు మాట్లాడుతూ.. అసెంబ్లీలో, మండలిలో వారిని అడుగుపెట్టించేలా చేయగల సత్తా సీఎం జగన్‌కే ఉందన్నారు. ఆయన తన పాదయాత్ర ద్వారా 139 బీసీ కులాల వారితో మాట్లాడి ఆయా కులాల అభ్యున్నతికి ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని.. తన కేబినెట్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన 17 మందిని మంత్రులుగా చేసి సామాజిక న్యాయాన్ని అమలుచేసిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. ఆయన తన మాటను ఎలా నెరవేర్చారో నాయీ బ్రాహ్మణులందరూ అదే రీతిలో వచ్చే ఎన్నికల్లో జగన్‌ని సీఎంని చేసేందుకు బ్రాండ్ అంబాసిడర్లుగా పనిచేయాలని వారు పిలుపునిచ్చారు. పార్టీ అనుబంధ సంఘాల రాష్ట్ర కోఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కరరెడ్డి మాట్లాడుతూ.. సీఎం జగన్‌కు అండగా నిలవాల్సిన బాధ్యత బీసీలందరిపై ఉందన్నారు.

దివంగత నేత వైఎస్సార్, జ్యోతిరావు పూలే, ధన్వంతరీ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సభలో పార్టీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకులు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ నాయకులు పుత్తా ప్రతాప్‌రెడ్డి, ఎ. నారాయణమూర్తి, నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు డాక్టర్ సుబ్బారావు, ఆరెపాటి పెంటారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు కోటేశ్వరరావు (ఆంధ్ర), ఎం సుబ్బరాయుడు (రాయలసీమ) వెంపటాపు లోకరాజు (ఉత్తరాంధ్ర), రాష్ట్ర కోశాధికారి ఎస్. ధనవిజయుడు, గౌరవ సలహాదారులు కిందాడ సత్యన్నారాయణ దేవాలయాల జేఏసీ అధ్యక్షుడు గుంటుపల్లి రామదాసు, డైరెక్టర్ తొండమల్లు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన కేంద్రాల్లో మంగళవారం నమోదైన గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో)

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
కర్నూలు	39.0	28.0
రెంటచింతల	40.8	26.4
విజయనగరం	35.0	28.0
మార్కాపురం	36.0	26.0
నెల్లూరు	35.0	28.0
కడప	39.2	28.9
ఏలూరు	36.0	27.0
శ్రీకాకుళం	36.0	24.0
రాజమహేంద్రవరం	39.0	26.5
విజయవాడ	36.0	26.0
విశాఖపట్నం	34.6	26.0



క్లుప్తంగా...

'పేదలకు ఇళ్లు' అమల్లో కీలకంగా వ్యవహరించాలి

జేఏసీతో గృహ నిర్మాణ సంస్థ ఎండీ లక్ష్మీశా

సాక్షి, అమరావతి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోన్న నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం అమల్లో కీలక పాత్ర పోషించాలని గృహ నిర్మాణ సంస్థ ఎండీ లక్ష్మీశా అన్నారు. ఏపీ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ)తో మంగళవారం ప్రధాన కార్యాలయంలో ఎండీ లక్ష్మీశా సమావేశమయ్యారు. కోర్టు ఆదేశాల మేరకు పదవీ విరమణ వయసును 62 ఏళ్లుగా అమలు చేయాలని జేఏసీ నేతలు కోరారు. కరోనాతో మృతిచెందిన ఉద్యోగుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందజేయాలని అభ్యర్థించారు. నాయకుల డిమాండ్లపై ఎండీ సానుకూలంగా స్పందించారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో జేఏసీ చైర్మన్ డీఎస్ సుబ్రహ్మణ్యం, జనరల్ సెక్రటరీ దాశరథి శర్మ, నాయకులు భాస్కర్‌రావు, జయరామాచారి తదితరులు పాల్గొన్నారు.

దళితులు అంటే చంద్రబాబుకు చులకన

- మంత్రి సురేశ్‌పై రాళ్లదాడి చేయించడం సిగ్గుచేటు
- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున



ఒంగోలు అర్బన్: చంద్రబాబుకు, ఆయన తొత్తులుగా వ్యవహరిస్తున్న రామోజీరావు, టీవీ 5, ఏబీఎన్‌లకు దళితులంటే ఎంతో చులకన భావమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మేరుగు నాగార్జున ధ్వజమెత్తారు. మంగళవారం డీఆర్‌సీ సమావేశానికి హాజరైన మంత్రి... అనంతరం మీడియాతో మాట్లాడారు. డీఆర్‌సీ సమావేశాలతో జిల్లాలో మౌలిక వసతులు, సమగ్రాభివృద్ధి సాధ్యమవుతోందన్నారు. అందితే జుట్టు, లేకుంటే కాళ్లు పట్టుకునే నైజం చంద్రబాబుదన్నారు. దళితుల్లో ఎవరైనా పుట్టాలనుకుంటారా.. అన్న చంద్రబాబు.. ఇటీవల జిల్లాకు వచ్చినప్పుడు మంత్రి ఆదిమూలపు సురేశ్‌పై రాళ్లతో దాడి చేయించడం సిగ్గుచేటన్నారు. ఆయనకు మద్దతు ఇచ్చే ఈనాడు, టీవీ5, ఏబీఎన్‌లు చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్ దళితులపై చేసే వ్యాఖ్యలను ప్రజలకు తెలిపేలా ఎందుకు టీవీల్లో, పేపర్లలో చూపరని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్ మాత్రమే ఎస్సీ, ఎస్టీ, బీసీల పక్షపాతి అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.2.8 లక్షల కోట్లు ఎటువంటి అవినీతి లేకుండా నేరుగా పేదలైన లబ్ధిదారులకు చేరిందని చెప్పారు. రాజధాని ప్రాంతంలో ఇళ్ల పట్టాలు ఇస్తుంటే చంద్రబాబు డెమోగ్రాఫికల్ ఇంబ్యాలెన్స్ వస్తుందన్న వ్యాఖ్యలు ఎందుకు రామోజీరావు ప్రజలకు తెలపలేదని ప్రశ్నించారు. ఫిల్మ్‌సిటీలో దళితుల భూములు లేవని రామోజీరావు పేపర్‌లో ప్రచురించగలరా... అని సవాల్ విసిరారు. అంబేడ్కర్ ఆశయాల మేరకు పేదలకు మెరుగైన విద్యను అందించాలని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెడితే కోర్టుకు ఎందుకు వెళ్లారన్నారు.


బొప్పరాజు అవినీతి చరిత్రను బయట పెడతాం

- రెవెన్యూ జేఏసీ అధ్యక్షుడు దివాకర్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యోగులను రెచ్చగొడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు అవినీతి చరిత్రను త్వరలో బయట పెడతామని ఏపీ రెవెన్యూ జేఏసీ అధ్యక్షుడు వీఎస్ దివాకర్ తెలిపారు. అమరావతి జేఏసీ పేరుతో బొప్పరాజు చేయిస్తున్న ఆందోళనలను తీవ్రంగా ఖండిస్తూ ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని సమ్మె చేసినా అక్కడి ప్రభుత్వం పట్టించుకోలేదని గుర్తు చేశారు. మన రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ అడగకుండానే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారని వివరించారు. కోవిడ్ సమయంలో బస్సులు తిరగకపోయినా ఆర్టీసీ ఉద్యోగులకు జీతాలిచ్చారని పేర్కొన్నారు. గతంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 6, 7 నెలలకు జీతాలిచ్చారని.. ఒక్కోసారి 15 నెలల తర్వాత జీతాలిచ్చిన సందర్భాలున్నాయని వివరించారు. అప్పట్లో ఉద్యోగ భద్రత కూడా లేదని, వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కార్పొరేషన్ ఏర్పాటుచేసి ఉద్యోగ భద్రత కల్పించిందని, ప్రతి నెలా వారికి సక్రమంగా జీతాలిస్తోందని వివరించారు. ఇవన్నీ చేస్తున్నందుకు బొప్పరాజు ఉద్యమం చేస్తున్నారా.. అని ప్రశ్నించారు. రెవెన్యూ శాఖలో 4 వేల మంది వీఆర్‌ఏలను వీఆర్‌ఓలుగా, వీఆర్‌ఓలను సీనియర్ సహాయకులుగా, 66 మంది తహసీల్దారులకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులు ఇచ్చినందుకు ఉద్యమం చేస్తున్నారా... అని నిలదీశారు. బొప్పరాజు ఉద్యమాల వెనుక రాజకీయ ప్రోద్బలం ఉందన్నారు. బొప్పరాజు ఆందోళనల్లో కంప్యూటర్ ఆపరేటర్ల అసోసియేషన్, తమ సంఘం వారెవరూ పాల్గొనడం లేదని స్పష్టం చేశారు.



పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలం కొండచిలకాంలో సంక్షేమపాలన గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి



బాపట్ల జిల్లా కర్లపాలెంలో లబ్ధిదారుకు బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి



కృష్ణా జిల్లా మోపిదేవి మండలం కె.కొత్తపాలెం గ్రామంలో స్టిక్కర్ అంటిస్తున్న అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

ఇంటింటా అభిమానం

- జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి 19వ రోజూ విశేష స్పందన
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ 84 లక్షల కుటుంబాలు మిస్డ్‌కాల్స్

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో 46 నెలలుగా సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలన ద్వారా సీఎం వైఎస్ జగన్ చేస్తున్న మేలును వివరించడం.. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం పండుగ వాతావరణంలో కొనసాగుతోంది. కార్యక్రమానికి 19వ రోజైన మంగళవారం అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు, సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులతో కూడిన బృందానికి ప్రతి ఇంటా ఆ కుటుంబ సభ్యులు ఆత్మీయ స్వాగతం పలుకుతున్నారు. 2014 ఎన్నికల్లో 600 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. వాటిలో ఏ ఒక్కటీ అమలుచేయకపోవడాన్ని జగనన్న సైన్యం ప్రతి ఇంటా వివరిస్తోంది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 98.5 శాతం హామీలను సీఎం వైఎస్ జగన్ అమలుచేయడాన్ని చాటి చెబుతోంది. జగనన్న సైన్యం చేస్తున్న ప్రచారానికి ప్రతి ఇంటా అపూర్వ స్పందన లభిస్తోంది. మోసానికి చంద్రబాబు ప్రతీకైతే.. సీఎం వైఎస్ జగన్ విశ్వసనీయతకు ప్రతీక అని అక్కాచెల్లెమ్మలు, అవ్వాతాతలు, అన్నదమ్ములు నినదించారు. గత 46 నెలల్లో సంక్షేమ పథకాల ద్వారా తమ కుటుంబానికి సీఎం వైఎస్ జగన్ చేసిన మేలును వివరిస్తూ.. 'మా నమ్మకం నువ్వే జగన్' అంటూ ప్రతి ఇంటా ప్రజలు కొనియాడారు. ఇక జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో నిర్వహిస్తున్న మెగా పీపుల్స్ సర్వేకు కూడా ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోంది. సీఎం వైఎస్ జగన్ పాలనకు మద్దతు తెలుపుతూ సోమవారం నాటికి 84 లక్షల కుటుంబాల ప్రజలు 82960–82960 నెంబర్‌కు మిస్డ్‌కాల్స్ ఇచ్చారు. సీఎం జగన్ ఫొటోతో కూడిన స్టిక్కర్లను గృహసారథులను అడిగి మరీ తీసుకుని.. ఇంటి తలుపులకు, మొబైల్ ఫోన్లకు అతికించుకుని ప్రజలు అభిమానాన్ని చాటుకుంటున్నారు.

పేదల ఇళ్ల నిర్మాణాలకు..
రోజువారీ లక్ష్యాలు

ఈ ఆర్థిక సంవత్సరంలో రోజుకు రూ.43 కోట్లు విలువైన పనులు చేయాలని కార్యాచరణ

- ప్రస్తుతం జరుగుతున్నవి రోజుకు రూ.28 కోట్ల పనులు
- ప్రతి శనివారం హౌసింగ్ డే నిర్వహణ.. అధికారులు లేఅవుట్ల సందర్శన



సాక్షి, అమరావతి : పేదల ఇళ్ల నిర్మాణాలను శరవేగంగా పూర్తిచేసేందుకు రాష్ట్ర గృహనిర్మాణ శాఖ రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకెళ్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రోజుకు సగటున రూ.43 కోట్ల విలువ చేసే పనులను పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ లెక్కన 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.15,810 కోట్లు ఖర్చుచేయనుంది. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద రాష్ట్రంలో పేదలకు 30 లక్షలకు పైగా ఇళ్లను నిర్మించే యజ్ఞాన్ని ప్రభుత్వం తలపెట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో టిడ్కోతో కలిపి ఇప్పటికే రెండు విడతల్లో 21.25 లక్షల ఇళ్ల నిర్మాణానికి అనుమతులివ్వగా 20.28 ఇళ్లకు శంకుస్థాపనలు జరిగి వివిధ దశల్లో నిర్మాణాలు కొనసాగుతున్నాయి. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్లలో ఇప్పటికే 3.40 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.

లక్ష్య సాధనలో భాగంగా...

ప్రస్తుతం రోజుకు సగటున రూ.25 కోట్ల నుంచి రూ.28 కోట్ల పనులు చేస్తున్నారు. నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు రూ.43 కోట్ల మేర పనులు పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా బిల్లుల చెల్లింపుల్లో కాలయాపన లేకుండా చూస్తున్నారు. కొత్త ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే రూ.730 కోట్ల మేర గృహ నిర్మాణ సంస్థ బిల్లు చెల్లింపులు చేపట్టింది. మరోవైపు.. శనివారాన్ని హౌసింగ్ డేగా నిర్వహిస్తున్నారు. ఆ రోజు జిల్లా కలెక్టర్లు, మండల, సచివాలయాల స్థాయి అధికారులు లేఅవుట్‌లను సందర్శించి పనుల పురోగతిని ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నారు. ఇలా ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకూ ఏడు హౌసింగ్ డేలు నిర్వహించారు. అధికారులు 306 లేఅవుట్‌లను సందర్శించారు. ఈ కార్యక్రమం కోసమే ప్రత్యేకంగా ఒక యాప్‌ను రూపొందించారు. ఇందులో హౌసింగ్ డే రోజున లేఅవుట్‌లకు వెళ్లిన అధికారులు తనిఖీల తాలూకు ఫొటోలను అప్‌లోడ్ చేయడంతో పాటు, తమ దృష్టికి వచ్చిన సమస్యలు, ఇబ్బందులను టోకెన్ రైజ్ చేస్తున్నారు. అంతేకాక.. 11 మంది సీనియర్ అధికారులను ఆయా జిల్లాలకు ప్రత్యేకాధికారులుగా గృహ నిర్మాణ శాఖ నియమించింది. వీరు ప్రతినెలా తమకు కేటాయించిన జిల్లాలకు వెళ్లి ఇళ్ల పథకం అమలు, తీరుతెన్నులను పరిశీలిస్తున్నారు.

జిల్లాలకు రోజువారీ లక్ష్యాలు

ఇళ్ల నిర్మాణాల వేగాన్ని మరింత పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాల వారీగా రోజువారీ లక్ష్యాలను నిర్దేశిస్తున్నాం. ఎక్కడైనా పనులు మందగమనంలో ఉంటే అక్కడ పర్యటించి సమీక్షించి పనులు జోరందుకునేలా చేస్తున్నాం. ప్రస్తుతం పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. త్వరలోనే ఐదు లక్షల ఇళ్లను పూర్తి చేయనున్నాం.
– లక్ష్మీశా, గృహ నిర్మాణ సంస్థ ఎండీ

గత ఏడాది రోజూ రూ.28 కోట్ల ఖర్చు

గత ఆర్థిక సంవత్సరంలో రోజుకు సగటున రూ.28 కోట్ల చొప్పున పేదల గృహ నిర్మాణాలకు ప్రభుత్వం ఖర్చుచేసింది. పేదలకు ఖరీదైన ప్రాంతాల్లో ఉచితంగా స్థలాలిచ్చిన ప్రభుత్వం, ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఇస్తోంది. దీంతోపాటు పావలా వడ్డీకి బ్యాంకు రుణం రూపంలో రూ.35 వేలు అందిస్తున్నారు. ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే ఇసుకను ఉచితంగా ఇవ్వడంతో పాటు.. సిమెంట్, ఐరన్, ఇతర నిర్మాణ సామగ్రిని సబ్సిడీపై అందిస్తున్నారు. ఇలా 2022–23 ఆర్థిక సంవత్సరంలో గృహ నిర్మాణ పథకం కోసం ప్రభుత్వం రూ.10,203 కోట్లు ఖర్చుచేసింది.

రైతులు నష్టపోవడానికి వీల్లేదు

- బ్యాంకు, బీమా కంపెనీ వివాదంపై హైకోర్టు ధర్మాసనం
- రైతులకు పరిహారం చెల్లింపు వివాదంలో తప్పెవరిదో తేలుస్తాం
- వినియోగదారుల కమిషన్ ఉత్తర్వులపై స్టే విధింపు
- 50 శాతం మొత్తాన్ని డిపాజిట్ చేయాలని బీమా కంపెనీకి ఆదేశం

సాక్షి, అమరావతి : కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు, బీమా సంస్థల మధ్య వివాదం కారణంగా రైతులు నష్టపోవడానికి వీల్లేదని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, పరిహారం విషయంలో ఎవరిది తప్పో తేలుస్తామంది. తుపాను కారణంగా నష్టపోయిన కాకినాడ జిల్లాలోని రైతులకు పరిహారం కింద రూ.16.46 కోట్లు చెల్లించాలని ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీని ఆదేశిస్తూ కాకినాడ వినియోగదారుల కమిషన్ జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు నిలిపివేసింది. అయితే ఆ సొమ్ములో 50 శాతం కమిషన్ వద్దే జమ చేయాలని ఎస్‌బీఐని ఆదేశించింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి, రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు సీఈవోలను ఆదేశించింది. తదుపరి విచారణను జూన్ 20కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

జోక్యం చేసుకునే పరిధి కమిషన్‌కు లేదు

2020లో తుపాను కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారంగా రూ.16.46 కోట్లు చెల్లించాలంటూ కాకినాడ వినియోగదారుల కమిషన్ ఈ ఏడాది జనవరిలో ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ వ్యాజ్యంపై ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ జరిపింది. ఎస్‌బీఐ తరఫున సీనియర్ న్యాయవాది పమిడిఘంటం శ్రీరఘురాం వాదనలు వినిపిస్తూ.. పీఎంఎఫ్‌బీవై కింద రైతులకు సకాలంలో బీమా ప్రీమియం చెల్లించాల్సిన బాధ్యత కాకినాడ సెంట్రల్ బ్యాంకుదేనన్నారు. బ్యాంకు అధికారులు సకాలంలో ప్రీమియం చెల్లించలేదన్నారు. ప్రీమియం చెల్లించకుండా పరిహారం పొందే ఆస్కారం లేదన్నారు. ఈ విషయంలో జోక్యం చేసుకునే పరిధి వినియోగదారుల కమిషన్‌కు లేదని వివరించారు. కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు తరఫున న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. కమిషన్ ఉత్తర్వులపై ఎలాంటి స్టే ఇవ్వొద్దన్నారు. స్టే ఇస్తే రైతులకు నష్టం జరుగుతుందని వివరించారు.

'గల్ఫ్'కు సక్రమంగా వెళ్లాలి

- ఏజెంట్లను నమ్మి మోసపోవద్దు
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి



మాట్లాడుతున్న మంత్రి కారుమూరి. పక్కన మేడపాటి వెంకట్ తదితరులు

తణుకు అర్బన్ : ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లేవారు అన్ని అనుమతులు తీసుకోవాలని, ఏజెంట్లను నమ్మి మోసపోవద్దని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సూచించారు. భారత ప్రభుత్వం గుర్తించిన ఏజెంట్ల ద్వారా మాత్రమే విదేశాలకు వెళ్లాలని చెప్పారు. గల్ఫ్ దేశాలకు వెళ్లే కార్మికులు, ఉద్యోగులకు సక్రమ వలసలపై ఆంధ్రప్రదేశ్ ప్రవాస తెలుగు సంఘం (ఏపీఎన్‌ఆర్‌టీఎస్) ఆధ్వర్యాన మంగళవారం పశ్చిమగోదావరి జిల్లా తణుకులో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కారుమూరి మాట్లాడుతూ అక్రమ మార్గాల్లో విదేశాలకు వెళ్లే కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా ఎంతో కొంత సంపాదించి కుటుంబానికి అండగా నిలవాలనే ఆశతో టూరిస్ట్ వీసాతో విదేశాలకు వెళ్లి చిక్కుకుపోతుండడం బాధాకరమన్నారు. గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం వెళ్లిన కార్మికులు, ఏజెంట్ల మోసాలతో ఇబ్బందులు పడుతున్నవారిని స్వదేశానికి చేర్చడం, విదేశీ ఎంబసీలతో మాట్లాడి వారికి న్యాయం అందించడంలో ఏపీఎన్‌ఆర్‌టీఎస్ కీలకపాత్ర పోషిస్తోందని ప్రశంసించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడిన రోజు నుంచి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల వల్ల గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం వెళ్లే కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గిందని తెలిపారు. ఏపీఎన్‌ఆర్‌టీఎస్ అధ్యక్షుడు మేడపాటి వెంకట్ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో వేలాదిమంది ఆంధ్రులను సురక్షితంగా స్వదేశానికి చేర్చామని తెలిపారు. ఉక్రెయిన్‌లో యుద్ధ సమయంలోనూ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 950 మంది వైద్య విద్యార్థులను స్వదేశానికి తీసుకువచ్చినట్లు చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవాసాంధ్ర భరోసా బీమా పథకం ద్వారా ఉద్యోగులకు మూడేళ్లకు రూ.550 చొప్పున రూ.10 లక్షలు ప్రమాద బీమా, విద్యార్థులకు ఏడాదికి కేవలం రూ.180తో రూ.10 లక్షల బీమా సౌకర్యాన్ని కల్పించారని వివరించారు. ఎవరైనా విదేశాల్లో మరణిస్తే రూ.50 వేలు ఆర్థిక సాయంతోపాటు ఉచితంగా స్వదేశానికి తీసుకువస్తున్నట్లు తెలిపారు. గల్ఫ్ బాధితురాలికి మంత్రి కారుమూరి రూ.5 వేలు అందజేశారు. ఏపీఎన్‌ఆర్‌టీఎస్ సీఈవో పి.హేమలత రాణి, డైరెక్టర్ బీహెచ్ ఇలియాస్, డిప్యూటీ డైరెక్టర్ మొహమ్మద్ కరీముల్లా షేక్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, నాయకులు మంగెన సూర్య, నూకల కనకదుర్గ పాల్గొన్నారు.

టెలిఫోన్ రంగంలో సంస్కరణల ఘనత నాదే

▶ మొదటి పేజీ తరువాయి

బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. దేశంలో డ్వాక్రా సంఘాలను తొలుత ప్రవేశపెట్టిన ఘనత తనదేనన్నారు. సెల్‌ఫోన్లు వినియోగంలోకి తేవడానికి టెలిఫోన్ రంగంలో సంస్కరణలకు వాజపేయికి సూచనలు ఇచ్చిన ఘనత తనదేనని చెప్పారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన మొదటి పార్టీ తెలుగుదేశమేనని పేర్కొన్నారు. ఎస్సీలకు న్యాయం చేసిన ఏకైక పార్టీ టీడీపీ మాత్రమేనని, ఈ విషయంపై చర్చకు సిద్ధమని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల రూపంలో పది రూపాయలు ఇచ్చి, పన్నుల రూపంలో రూ.100 దోచుకుంటున్నాడన్నారు. ప్రజల అనుమతి లేకుండా ఇంటికి జగన్ స్టిక్కర్ ఎందుకు వేస్తున్నారని ప్రశ్నించారు. ఈ ప్రాంతం పేరైన అమరావతి పేరునే రాజధానికి పెట్టానన్నారు. అటువంటి రాజధాని ఇప్పుడు అటకెక్కిందన్నారు. తనపైన, తన భద్రత సిబ్బందిపైనా వైఎస్సార్‌సీపీ నాయకులు దాడులకు దిగుతున్నారని ఆయన ఆరోపించారు.

బాబు రోడ్ షో.. యువకుడికి గాయాలు

చంద్రబాబు రోడ్‌షో నుంచి సభాస్థలికి వెళుతుండగా జరిగిన ప్రమాదంలో ఒక యువకుడు శరీరం కాలి తీవ్రంగా గాయపడ్డాడు. అచ్చంపేట మండలం గ్రంథశిరి గ్రామానికి చెందిన అడుసుమల్లి బాలవెంకటేశ్వర్లు ద్విచక్రవాహనంపై సభాస్థలికి వెళుతుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో బాలవెంకటేశ్వర్లు వాహనం పెట్రోలు ట్యాంక్ పేలి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. బాలవెంకటేశ్వర్లు ఒంటికి నిప్పంటుకుంది. అతడికి అమరావతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ప్రాథమిక చికిత్స చేయించి గుంటూరు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై అమరావతి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మ గౌరవంతో 'లక్ష'ణంగా..!

▶ మొదటి పేజీ తరువాయి

పూర్తి చేసిన 2,112 టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేయనున్నారు. ఈ నెల 29వతేదీన శ్రీకాకుళంలో 1,280 యూనిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు.

సీఆర్డీఏ పరిధిలో 5,024 యూనిట్లు

సీఆర్డీఏ పరిధిలో 5,024 యూనిట్ల టిడ్కో ఇళ్ల పంపిణీ మే నెల మొదటి వారంలో మొదలు కానుంది. మే రెండో వారంలో పొన్నూరు, గుంటూరు యూఎల్బీలోని వెంగళాయపాలెం, అడవి తక్కెళ్లపాడుతోపాటు ఆళ్లగడ్డ, డోన్, విశాఖపట్నం, గుడివాడ, మచిలీపట్నం, పిఠాపురం, యలమంచిలి, కందుకూరు యూఎల్బీల్లో ఇళ్లను అందజేయనున్నారు. గుడివాడలో భారీ స్థాయిలో నిర్మించిన 8,912 టిడ్కో ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించాలని యోచిస్తున్నారు.

అనకాపల్లి యూఎల్బీలో..

అనకాపల్లి యూఎల్బీలో జూన్ మొదటి వారంలో టిడ్కో ఇళ్ల పంపిణీ ప్రారంభించనున్నారు. సత్యనారాయణపురం (అనకాపల్లి)లో 3,256 యూనిట్లు, చిత్తూరులో 2,832, పుంగనూరులో 1,536, నరసరావుపేటలో 1,504 యూనిట్లను లబ్ధిదారులకు అందచేస్తారు.

రిజిస్ట్రేషన్లు సైతం ఉచితంగానే..

మున్సిపాలిటీల పరిధిలో నివసించే నిరుపేదలు, దిగువ మధ్య తరగతి వర్గాలకు అనువుగా జీ+3 అంతస్తుల్లో 300, 365, 430 చ.అడుగుల్లో టిడ్కో ఫ్లాట్లను ప్రభుత్వం నిర్మించి ఇస్తోంది. లబ్ధిదారులపై ఏమాత్రం భారం పడకుండా వారి పేరిట ఉచితంగానే రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఈమేరకు నివాస ప్రాంగణాల్లో అన్ని వసతులు కల్పించిన అనంతరం లబ్ధిదారుల పేరిట ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి పూర్తి హక్కు పత్రాలు, ఇంటి తాళాలను అధికారులు అందజేస్తున్నారు. ఈ దఫాలో 17 ప్రాంతాల్లో మొత్తం 40,728 యూనిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. మొత్తం 88 యూఎల్బీల్లో 163 ప్రాంతాల్లో టిడ్కో ఇళ్లను నిర్మిస్తున్నారు. వీటిలో ఇప్పటికే 24 ప్రాంతాల్లో నూరు శాతం ఇళ్ల పంపిణీ పూర్తైంది. కావలి, పాత్రునివలస (శ్రీకాకుళం)లో కూడా శుక్ర, శనివారాల్లో నూరు శాతం పంపిణీ పూర్తవుతుందని టిడ్కో ఎండీ చిత్తూరి శ్రీధర్ తెలిపారు.



కావలిలో సిద్ధమైన టిడ్కో ఇళ్లు

టిడ్కో ఇళ్లు ఇలా

కావలి	2,112
శ్రీకాకుళం	1,280
సీఆర్డీఏ	5,024
పొన్నూరు	2,368
పిఠాపురం	864
యలమంచిలి	432
కందుకూరు	1,408
గుంటూరు	4,500
ఆళ్లగడ్డ	1,392
డోన్	288
విశాఖపట్నం	1,920
గుడివాడ	8,912
అనకాపల్లి	3,256
మచిలీపట్నం	1,100
చిత్తూరు	2,832
పుంగనూరు	1,536
నర్సారావుపేట	1,504
మొత్తం	40,728

పేదల గౌరవాన్ని పెంచారు ▶

రాష్ట్రంలో ఎన్నో ఏళ్లగా సొంత ఇల్లంటూ లేని నిరుపేదల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 21.25 లక్షల గృహాలను నిర్మిస్తున్నారు. ఈ స్థాయిలో ఇళ్లు ఇచ్చిన ముఖ్యమంత్రి దేశంలో మరొకరు లేరు. ఇళ్ల నిర్మాణాలను శరవేగంగా పూర్తి చేస్తూ పేదల ఆత్మ గౌరవాన్ని పెంపొందిస్తున్నారు. దేశవ్యాప్తంగా హౌసింగ్ విధానాలపై ఇటీవల కేంద్ర పట్టణ గృహ నిర్మాణ శాఖ నిర్వహించిన సర్వేలో ఆంధ్రప్రదేశ్‌లోని టిడ్కో హౌసింగ్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఇది సీఎం జగన్ చొరవ వల్లే సాధ్యమైంది. నిర్దేశించిన లక్ష్యం మేరకు జూన్ నాటికి లక్ష టిడ్కో ఇళ్లు ఇస్తాం. శుక్రవారం నుంచి మలి విడతగా 40,728 ఇళ్లు పంపిణీ చేయనున్నాం.



– జమ్మాన ప్రసన్నకుమార్, టిడ్కో చైర్మన్

దళిత ద్రోహి చంద్రబాబు

- దళిత, గిరిజన నేతలు కనకారావు, సునీల్, హనుమంతనాయక్







సాక్షి, అమరావతి/తాడేపల్లి రూరల్: టీడీపీ అధినేత చంద్రబాబు దళిత ద్రోహి అని.. వచ్చే ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలే ఆయనకు తగిన బుద్ధి చెబుతారని దళిత నాయకులు ధ్వజమెత్తారు. మంగళవారం తాడేపల్లిలో మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డ్ చైర్మన్ పులి సునీల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంత్ నాయక్ వేర్వేరుగా మీడియాతో మాట్లాడారు. ఎస్సీల అభివృద్ధి, సంక్షేమం కోసం భవిష్యత్‌లో ఇంకా ఏమి చేయాలనే విషయమై తాము సమావేశం నిర్వహిస్తే.. టీడీపీ నాయకులు అడ్డగోలుగా విమర్శలు చేయడం, వాటిని ఎల్లోమీడియా విష ప్రచారం చేయడం సిగ్గు చేటని విరుచుకుపడ్డారు. 'దళితులుగా ఎవరైనా పుట్టాలనుకుంటారా.. అని దళితుల్ని చంద్రబాబు చులకనగా మాట్లాడారు. దళిత అధికారులపై పెత్తందారుతో దాడులు చేయించి, వారిని ఉద్యోగాలు చేయనీయకుండా అడ్డుకున్న ద్రోహి చంద్రబాబు. అధికారం కోల్పోయిన తర్వాత దళితులపై ప్రేమ ఒలకబోస్తున్నారు. టీడీపీ, ఎల్లో మీడియా ఎన్ని కుట్రలు చేసినా పేదల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని 2024లో మళ్లీ ముఖ్యమంత్రిగా చేస్తాం. ఎల్లో మీడియా, టీడీపీ మాటలను దళితులు నమ్మరు. టీడీపీకి తగిన బుద్ధి చెప్పేందుకు ఎస్సీ, ఎస్టీలు సిద్ధంగా ఉన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఎస్సీలకు రూ.48,899.66 కోట్లు, ఎస్టీలకు రూ.15,589.38 కోట్లు నిధులు ఖర్చు చేసింది' అని వారు వివరించారు.

ఉసురు తీసిన ఈత సరదా

- కాలువలో మునిగి ఐదుగురు మృత్యువాత
- కర్ణాటకలోని దొడ్డకొత్తగెరె గ్రామంలో ఘటన



రోదిస్తున్న బంధువులు

మండ్య: ఈత సరదా ఐదుగురి ఉసురు తీసిన ఘటన కర్ణాటక రాష్ట్రం మండ్య పట్టణం సమీపంలోని దొడ్డకొత్తగెరె గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... బెంగళూరు నీలసంద్ర లే అవుట్‌లో నివసించే సుమారు 15 మంది రంజాన్ పండుగ సెలవులు కావడంతో మండ్య దగ్గరిలోని హళ్లెగెరెలోని బంధువుల ఇంటికి సోమవారం వచ్చారు. అనిషా బేగం (10), తస్మియా (22), మెహతాబ్ (10), అష్రాక్ (28), అఫీక (22) తదితరులు మంగళవారం ఉదయం దొడ్డకొత్తగెరె వద్ద ఉన్న విశ్వేశ్వరయ్య కాలువలో ఈతకు వెళ్లారు. ఈత కొడుతున్న సమయంలో ఓ బాలుడు లోతైన చోట మునిగిపోతుండగా అతన్ని కాపాడడానికి మిగతావారు ప్రయత్నించి నీటిలో కొట్టుకుపోయారు. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ అధికారులు వెంటనే గ్రామానికి చేరుకుని కాలువలో గాలించి మృతదేహాలను వెలికితీశారు. మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోదీతోనే దేశానికి గుర్తింపు: చంద్రబాబు

సాక్షి, అమరావతి: ప్రపంచం అంతా తిరిగి భారత్‌కు బ్రాండింగ్ చేస్తున్న ప్రధానమంత్రి మోదీతోనే దేశానికి గుర్తింపు అని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు చెప్పారు. రిపబ్లిక్ టీవీ మంగళవారం ఢిల్లీలో నిర్వహించిన సదస్సులో చంద్రబాబు మంగళగిరి నుంచి ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో ప్రధాని ఆలోచనే, తన ఆలోచన కూడా అని చెప్పారు. మోదీ విధానాలను తాను ఎప్పుడూ వ్యతిరేకించలేదన్నారు. ఎన్డీఏకు మద్దతిచ్చే విషయంపై సమయానుకూలంగా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. మైక్రోసాఫ్ట్‌ను హైదరాబాద్ తీసుకురావడానికి బిల్‌గేట్స్‌ను ఒప్పించానన్నారు. గతంలో తాను విజన్ గురించి మాట్లాడితే విమర్శించారని, కానీ విజన్–2020 హైదరాబాద్‌లో సాకారమైందని చెప్పారు. సమాజంలో రాజకీయ కోణం వేరు, అభివృద్ధి వేరు అని తాను నమ్ముతానని చెప్పారు. పార్టీలు వేరు అయినా నేషన్ ఫస్ట్ అని భావిస్తానన్నారు. మన కరెన్సీలో ఉన్న రూ.500, ఆపై నోట్లను రద్దుచేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. దేశంలో సరైన విధానాలు రూపొందించడం, అమలు చేయడం ద్వారా అమెరికా, చైనాలను దాటి ఇండియా ప్రపంచ నంబర్ వన్ దేశం అవుతుందని, అతిపెద్ద ఎకానమీ అయ్యే అవకాశం ఉందని ఆయన చెప్పారు.



మౌనంగా ఉన్నాడని నిందిస్తారు, ఎక్కువ మాట్లాడుతున్నాడని నిందిస్తారు, తక్కువ మాట్లాడుతున్నాడని నిందిస్తారు. ఈ ప్రపంచంలో నిందలకు గురికాకుండా ఎవరూ ఉండరు.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 26 ఏప్రిల్ 2023

జలపథంలో... తొలి పదం

దేశచరిత్రలోనే ఇది తొట్టతొలి ప్రయత్నం. మనిషికి ప్రాణావసరమైన జల వనరులు ఎక్కడెక్కడ, ఎంతెంత, ఎలా ఉన్నాయని లెక్కలు తేల్చిన ఘట్టం. మానవ తప్పిదాల వల్ల క్షీణిస్తున్న నీటి వసతులను ఎంత జాగ్రత్తగా కాపాడుకోవాలో మరోసారి గుర్తు చేసిన జలగణన యజ్ఞం. కేంద్ర జలశక్తి శాఖ ఇటీవల విడుదల చేసిన భారత జలవనరుల తొలి గణన అనేక విధాల కీలకమైనది అందుకే. దేశంలో అటు ప్రకృతి సహజమైన, ఇటు మానవ కల్పితమైన చెరువులు, సరస్సులు, నీటి కుంటల సమగ్ర సమాచారాన్ని ఈ లెక్కలు తొలిసారిగా ముందుకు తెచ్చాయి. దేశంలో ఈ జల వనరులు ఏ మేరకు ఆక్రమణకు గురైనదీ తేల్చాయి. సమస్త జీవరాశి మనుగడ కొనసాగాలంటే... ప్రతి నీటి చుక్కా కీలక సమకాలీన సందర్భంలో కేంద్రశాఖ నిర్వహించిన ఈ జలవనరుల గణన ఆహ్వానించదగ్గ యత్నం.

ప్రతి ఇంటికీ సురక్షిత మంచి నీటిని అందిస్తామని పాలకులు పదే పదే సంకల్పం చెప్పుకుంటున్న వేళ ఈ నీటి వసతుల సమగ్ర సమాచారం ప్రాధాన్యం సంతరించుకుంది. చెరువులు, రిజర్వాయర్లు, సరస్సులు – ఇలా జలవనరులు వివిధ రకాలు. కాగా, వాగులు, నీటి చెలమలు, గృహ సముదాయాలు – ఇతర ప్రాంతాల నుంచి చేరిన వర్షపునీళ్ళు, ఏదైనా నది – వాగుల నుంచి దారి మళ్ళించడం ద్వారా నిల్వచేసిన నీళ్ళు, మంచు కరగడంతో ఏర్పడ్డ నీటి వసతి... ఇలాంటివన్నీ కూడా నీటి వనరులేనని ఈ తొలి జలగణన నివేదిక నిర్వచించింది. వ్యవసాయం, చేపల పెంపకం, ఆధ్యాత్మికత – ఇలా రకరకాల ప్రయోజనాల కోసం నీటిని నిల్వ చేసినవాటిని జాబితాకు ఎక్కించింది. 2018–19లో చేసిన ఈ గణన దేశం మొత్తం మీద 24 లక్షలకు పైగా జలవనరులు ఉన్నాయని తేల్చింది. వీటిలో 97.1 శాతం గ్రామీణ ప్రాంతాల్లో ఉంటే, 2.9 శాతమే పట్టణ ప్రాంతాల్లో ఉన్నాయి. నీటి వసతుల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఉన్న భారీ అంతరాలను ఈ జల నివేదిక ఎత్తిచూపింది.

ఈ లెక్కల్లో దేశంలోకెల్లా అత్యధికంగా 7.47 లక్షల జలవనరులతో పశ్చిమ బెంగాల్ ప్రథమ స్థానం దక్కించుకోగా, దేశంలోనే అత్యధిక జనాభాకు నిలయమైన ఉత్తర ప్రదేశ్ కేవలం 2.5 లక్షల నీటివనరులతో రెండో స్థానంలో నిలిచింది. బెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లా ఏకంగా 3.55 లక్షల నీటి వనరులతో దేశంలోనే ముందుంది. అలాగే, దేశంలోని నీటి వనరుల్లో దాదాపు 63 శాతం పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల్లో నెలకొన్నాయి. బెంగాల్‌లో నీటి మడుగులు, రిజర్వాయర్లు, ఆంధ్రప్రదేశ్‌లో చెరువులు, తమిళనాట సరస్సులు ఎక్కువని ఈ నివేదిక తేల్చింది. అదే సమయంలో దాదాపు 1.6 శాతం మేర, అంటే 38 వేలకు పైగా వనరులు కబ్జాకు గురయ్యాయట. ఈ కబ్జాలో 40 శాతం వాటా యూపీదే అన్నది నివేదిక సారాంశం.

నిజానికి, 1986 నుంచి అయిదేళ్ళకోసారి కేవలం చిన్న నీటిపారుదల వసతుల లెక్కలను కేంద్రం చేపడుతూ వచ్చింది. అందులో ప్రధానంగా ప్రభుత్వ సంస్థల జనాభా లెక్కల నుంచి సేకరించిన డేటాను సంకలనం చేస్తూ వచ్చింది. అయితే, ప్రభుత్వాలు ఒకప్పుడు నీటి వసతులను కేవలం వ్యవసాయ, ఆర్థిక ప్రయోజనాల్లో భాగంగానే చూస్తూ వచ్చాయి. ఆ దృక్కోణం గత రెండు దశాబ్దాల్లో మారింది. మానవ, పర్యావరణ సంక్షేమానికి జలవనరుల ప్రాధాన్యాన్ని గ్రహించి, పాత తప్పును సరిదిద్దుకొనే పనిలో ప్రభుత్వాలు పడ్డాయి. 2005లోనే కాంగ్రెస్ సారథ్యంలోని అప్పటి యూపీఏ ప్రభుత్వం 'జలవనరుల మరమ్మతులు, నవీకరణ, పునరుద్ధరణ పథకం' చేపట్టింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చెరువుల లాంటి సాంప్రదాయిక నీటివసతులకు మళ్ళీ ఊపిరిపోసే పని చేపట్టింది. అయితే, సమగ్ర సమాచార లేమి వల్ల ఈ పథకాల లక్ష్యాలు ఏ మేరకు సిద్ధించాయో చెప్పలేని పరిస్థితి. తాజా జలగణన ముఖ్యత్వం సంపాదించుకున్నది అక్కడే.

ఆఖరుసారి 2013–14లో చేసిన చిన్న నీటిపారుదల వసతుల సర్వేతో పోలిస్తే, తాజా గణనలో నీటి వసతుల సంఖ్య 5 రెట్లు పెరగడం విశేషం. పట్టణప్రాంత చెరువులు, కుంటల వివరాలపై పౌరసంస్థలు, విద్యాకేంద్రాలే గళమెత్తేవి. వాటి క్రియాశీలత వల్లే చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, శ్రీనగర్, అహ్మదాబాద్ లాంటి నగరాల్లో చెరువులు కనుమరుగవుతున్న తీరు కొంతైనా జనం దృష్టికి వచ్చింది. ఇప్పుడు నేరుగా ప్రభుత్వమే జలగణనతో రంగంలోకి వచ్చింది గనక పరిస్థితులు మరింత మెరుగవుతాయని చిన్న ఆశ. గమనిస్తే, ఒకప్పుడు పుష్కలంగా నీళ్ళున్న భారతావని ఇవాళ అధిక జనాభా, పట్టణీకరణతో నీటి కొరత దిశగా జారిపోతోంది. దీనికి తక్షణం పగ్గం వేయాలి.

ప్రపంచంలో 18 శాతం జనాభాకు నెలవైన మన దేశంలో ఉన్న నీటి వనరులు 4 శాతమే. అవసరాలు ఎక్కువ, అందుబాటులో ఉన్న నీరు తక్కువ గనక నీటి కోసం ఒత్తిడీ అధికమే. దానికి తోడు పర్యావరణ మార్పుల ప్రభావం నీటి వసతులు, వాటి నాణ్యత, నిర్వహణ పైన గణనీయంగా పడుతోంది. ఈ పరిస్థితుల్లో జనగణన లాగానే క్రమం తప్పకుండా జల వనరుల గణన చేయడం అవసరం. పదేళ్ళకోసారి చేసే జనాభా లెక్కల లాగా కాక, వీలైనంత తరచుగా ఈ నీటి లెక్కలు తీయాలి. ప్రతి సుస్థిర అభివృద్ధి లక్ష్యానికీ, నీటికీ లంకె ఉంది గనక దీంతో నీటి నిర్వహణను మెరుగుపరుచుకొనే వీలు చిక్కుతుంది. అలాగే పట్టణ నిర్మాణం, విస్తరణల్లో పాలకులు సరైన నిర్ణయాలు చేయడానికీ నీటి వసతుల వివరాలు దోహదపడతాయి. స్థానిక సంస్థలను, పౌరసమాజ బృందాలను కూడా ఈ జలగణనలో భాగస్థుల్ని చేస్తే మెరుగైన ఫలితాలొస్తాయి. ఆ దిశగా ఈ నివేదిక తొలి అడుగు. మేలైన ముందడుగు.

రష్యాపై ఎందుకీ తటస్థ వైఖరి?

విశ్లేషణ



జోస్ కబల్లెరో

రష్యా, ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ ఏకాభిప్రాయాన్ని నిర్మించే ప్రయత్నాలు నిలిచిపోయాయి. ఒకప్పుడు ఉక్రెయిన్ అనుకూల వైఖరిని తీసుకున్న దేశాలు కూడా రష్యాకు అనుకూలంగానో, తటస్థంగానో మారిపోయాయి. ప్రచ్ఛన్న యుద్ధకాలంలోని అలీనోద్యమం నుంచి ప్రస్తుత జాగరూకత, తటస్థ వైఖరి ప్రభావితమయ్యాయి. తమ నిబంధనల మేరకు వ్యవహరించడానికి అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఈ అలీనోద్యమం ఒక మార్గం కల్పించింది. నిర్దిష్ట ఆర్థిక, రాజకీయ ప్రోత్సాహకాలు కూడా ఇందులో ప్రభావం చూపుతున్నాయి. అయితే, అలీన దేశాలకు మానవతా సాయం అందించాలన్న పాశ్చాత్య దేశాల నిబంధనల వెలుగులో ఈ తటస్థత అనేది ఒక 'గమ్మత్తయిన సంతులన చర్య'గా మారుతోంది.

ఉక్రెయిన్ యుద్ధం మొదలై ఏడాది దాటిన తర్వాత, రష్యాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ ఏకాభిప్రాయాన్ని నిర్మించే ప్రయత్నాలు నిలిచిపోయినట్లు కనిపిస్తోంది. చాలాదేశాలు తటస్థతను ఎంచుకోవడమే దీనికి కారణం. కొన్ని ఆధారాల ప్రకారం, రష్యాను ఖండిస్తున్న దేశాల సంఖ్య కూడా ప్రస్తుతం తగ్గిపోయింది. ఉక్రెయిన్ అనుకూల వైఖరి నుండి బోట్స్వానా రష్యా వైపు మళ్లింది. దక్షిణాఫ్రికా, తటస్థత నుంచి రష్యా అనుకూల వైఖరి చూపుతోంది. రష్యా చర్యను ఖండించిన కొలంబియా ఇప్పుడు తటస్థ వైఖరి అవలంబిస్తోంది. అదే సమయంలో, చాలా దేశాలు ఉక్రెయిన్‌కు మద్దతు ఇవ్వడానికి అయిష్టత చూపుతున్నాయి.

ఆఫ్రికాను తీసుకుందాం. మాస్కో తక్షణం కాల్పుల విరమణ ప్రకటించాలని ఆఫ్రికన్ యూనియన్ పిలుపునిస్తున్నప్పటికీ, అనేక ఆఫ్రికా ఖండ దేశాలు తటస్థంగానే ఉంటున్నాయి. ఇది ప్రచ్ఛన్న యుద్ధ కాలం నాటి వామపక్ష అనుకూల ప్రభుత్వాల సంప్రదాయ ఫలితమేనని కొందరు పరిశీలకులు వాదిస్తు న్నారు. ఆఫ్రికా దేశాల అయిష్టతకు మూలం తమ అంతర్గత వ్యవహారాల్లో కొన్నిసార్లు రహస్యంగా, కొన్నిసార్లు బహిరంగంగా పాశ్చాత్య దేశాలు పాటించిన జోక్యందారీ చరిత్రలో ఉందని మరికొందరు చెబుతున్నారు.

రష్యాను ఖండించడానికి అయిష్టత చూపడం అనేది ఆఫ్రికాను దాటిపోయింది. రష్యా బేషరతుగా, తక్షణం ఉక్రెయిన్ నుంచి వెళ్లిపోవాలంటూ ఐక్యరాజ్య సమితి చేసిన తీర్మానాన్ని 2023 ఫిబ్రవరిలో లాటిన్ అమెరికన్ దేశాల్లో చాలావరకు బలపర్చాయి. ఉక్రెయిన్ కి అనుకూలంగా ఐక్యరాజ్యసమితి చేసిన పలు తీర్మానాలను బ్రెజిల్ బలపర్చినప్పటికీ, అది రష్యాను నిర్ద్వంద్వంగా ఖండించలేదు. ఐక్యరాజ్య సమితిలో బొలీవియా, క్యూబా, ఎల్ సాల్వడార్, వెనిజులా దేశాల వైఖరిని చూద్దాం. పాశ్చాత్య దేశాల ఆంక్షలను రష్యా తిప్పికొట్టాలని అవి సూచించాయి. పైగా, బ్రెజిల్, అర్జెంటీనా, చిలీ దేశాలు ఉక్రెయిన్‌కు సైనిక సహాయం చేయాలన్న పిలుపును తిరస్కరించాయి. ఉక్రెయిన్‌కు యుద్ధ ట్యాంకులు అందించాలని జర్మనీ తీసుకున్న నిర్ణయాన్ని మెక్సికో ప్రశ్నించింది.

ఆసియాలోనూ ఇదే రకమైన విభజనలు కనిపిస్తున్నాయి. జపాన్, దక్షిణ కొరియా బహిరంగంగానే రష్యాను ఖండించాయి. కానీ ఆగ్నేయాసియా దేశాల కూటమి సామూహికంగా ఈ ఖండన చేయలేదు. ఇక చైనా విషయానికొస్తే – రష్యాతో వ్యూహాత్మక భాగస్వామ్యం నెరుపుతూనే, ఐక్యరాజ్యసమితిలో పెరుగుతున్న తన ప్రాభవం ద్వారా సమతుల్యత సాధించేలా వ్యవహరిస్తోంది. భారత్ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సభ్యదేశంగా ఉన్నప్పుడు, ఉక్రెయిన్ ఘర్షణపై జరిగిన ఓటింగుకు గైర్హాజరైంది.

ప్రచ్ఛన్న యుద్ధకాలంలోని అలీనోద్యమం నుంచి ప్రస్తుత జాగరూకత, తటస్థ వైఖరి ప్రభావితమయ్యాయి. తమ నిబంధనల



మేరకు ఘర్షణతో పోరాడటానికి అభివృద్ధి చెందుతున్న దేశాలకు అలీనోద్యమం ఒక మార్గం కల్పించింది. అందువల్ల సోవియట్ యూనియన్, పాశ్చాత్య దేశాల ప్రభావ పరిధికి వెలుపల విదేశీ విధానంలో స్వయంప్రతిపత్తిని ఈ దేశాలు పొందగలిగాయి.

యూరోపియన్ యూనియన్ వైఖరిని బలపర్చడంలో ఇతర దేశాల అయిష్టత అనేది విదేశీ విధాన స్వతంత్ర కాంక్షకూ, పొరుగు దేశంతో విరోధం పెట్టుకోవడానికి అయిష్టతకూ సంబంధించినదిగా ఉంటోందని యూరోపియన్ యూనియన్ ఆంక్షల అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. పశ్చిమ దేశాలకూ, రష్యాకూ మధ్య పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల్లో చిక్కుకుపోకుండా ఉండటానికి అలీన విధానం ఆయా దేశాలకు ఉపకరిస్తోంది. ఈ కారణం వల్లే, అనేక ప్రజాస్వామిక దేశాలు తటస్థ వైఖరికి ప్రాధాన్యమిస్తున్నట్లు కనిపిస్తోంది. దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రాంపోసా 'ఇరుపక్షాలతో మాట్లాడండి' అనడంలో దీన్నే మనం చూడవచ్చు. రష్యాను ఖండించడానికి వ్యతిరేకంగా ఉండాలని దేశాలు నిర్ణయించుకోవడంలో నిర్దిష్ట ఆర్థిక, రాజకీయ ప్రోత్సాహకాలు ప్రభావం చూపుతున్నాయి.

ఇండియాకు పెరిగిన రష్యా చమురు

ప్రచ్ఛన్న యుద్ధానంతర కాలంలో రష్యా, భారత్ ఒకే విధమైన వ్యూహాత్మక, రాజకీయ అభిప్రాయాలను పంచుకోవడం కొనసాగించాయని పరిశీలకులు ఎత్తి చూపుతున్నారు. 2000 సంవత్సరంలో తమ వ్యూహాత్మక భాగస్వామ్యం నేపథ్యంలో బహుళ ధ్రువ గ్లోబల్ వ్యవస్థను నిర్మించాలన్నది రష్యా ఉద్దేశంగా ఉండింది. అమెరికాను భాగస్వామిగా చేసుకోవడం పట్ల జాగ్రత్తగా ఉండాలని భారతదేశాన్ని రష్యా అభ్యర్థించేది. అలాగే భారతీయ అణ్వాయుధ కార్యక్రమానికి రష్యా మద్దతునిచ్చింది, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశంగా మారడానికి భారత్ చేస్తున్న ప్రయత్నాలను రష్యా బలపరుస్తూ వచ్చింది.

భారత్ ఆయుధ వాణిజ్యంలో రష్యా కీలక భాగస్వామిగా ఉండటాన్ని రష్యా కొనసాగించింది. 1992 నుంచి 2021 వరకు భారత్ దిగుమతి చేసుకున్న ఆయుధాల్లో 65 శాతం వరకు రష్యా సరఫరా చేసింది. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైనప్పటినుంచి, భారత్‌కు చౌక ధరకు చమురు అందించే కీలకమైన సరఫరాదారుగా రష్యా మారిపోయింది. 2021లో రష్యా నుంచి రోజుకు 50 వేల బ్యారెల్స్‌ను భారత్ కొనుగోలు చేయగా, 2022 జూన్ నాటికి అది రోజుకు పది లక్షల బ్యారెల్స్‌కు పెరిగింది.

బ్రెజిల్, దక్షిణాఫ్రికా ప్రయోజనాలు

ప్రపంచంలోనే అత్యంత పెద్ద వ్యవసాయ ఉత్పత్తిదారుల్లో ఒక్కటిగా ఉన్న బ్రెజిల్ అత్యధిక ఎరువుల వినియోగదారు కూడా. 2021లో రష్యా నుంచి బ్రెజిల్ దిగుమతి చేసుకున్న దిగుమతుల విలువ 5.58 బిలియన్ డాలర్లు కాగా, వాటిలో 64 శాతం వాటా ఎరువులదే. తమ రెండు దేశాల మధ్య ఇంధన సంబంధాలను విస్తరించుకోవడంలో భాగంగా రష్యా గ్యాస్ సంస్థ గాజ్‌ప్రోమ్ బ్రెజిల్ ఇంధన రంగంలో పెట్టుబడులు పెడుతుందని 2023 ఫిబ్రవరిలో బ్రెజిల్ ప్రకటించింది. 2023 మార్చి నాటికి బ్రెజిల్‌కు రష్యా డీజిల్ ఎగుమతులు కొత్త రికార్డులను చేరుకున్నాయి. అదే సమయంలో రష్యన్ చమురు ఉత్పత్తులపై ఈయూ ఆంక్షలు కూడా పతాక స్థాయిని చేరుకున్నాయి.

ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమై సంవత్సరం పూర్తయిన సందర్భంలో– రష్యా, చైనాలతో కలిసి దక్షిణాఫ్రికా సంయుక్త నౌకా విన్యాసాలను చేపట్టింది. నౌకాదళ నిధుల లేమితో ఉన్న దక్షిణాఫ్రికా ఈ విన్యాసాల నుంచి ప్రయోజనం పొందుతుంది. ఆఫ్రికా ఖండానికి అతిపెద్ద ఆయుధ ఎగుమతిదారుగా రష్యా నిలుస్తోంది. అణుశక్తిని కూడా రష్యా సరఫరా చేస్తోంది. ఆఫ్రికా ఖండానికి 30 శాతం వరకు గోధుమ వంటి ధాన్యాలను కూడా రష్యా సరఫరా చేస్తోంది. రష్యా ఉత్పత్తుల్లో 70 శాతం వరకు ఆఫ్రికా ఖండానికి చేరుతున్నాయి.

మరొక ప్రజాస్వామిక వ్యవస్థ సమస్యల్లో చిక్కుకున్నప్పుడు మద్దతుగా నిలబడాలని అభ్యర్థనలు చేస్తున్నప్పటికీ, అలీన విధానం ఇప్పటికీ పాపులర్ ఎంపికగా కొనసాగుతోందని ఉక్రెయిన్ యుద్ధం ఎత్తి చూపింది. భారత్ వంటి దేశాలకు ముఖ్యమైన రాజకీయ ఉనికిగా అలీన విధానం చాలాకాలంగా కొనసాగుతూ వస్తోంది. ఇతర ఉదంతాలను చూస్తే, అధ్యక్షుడు జైర్ బొల్సొనారో హయాంలో ఇది మారినప్పటికీ, ఇతరుల వ్యవహారాల్లో జోక్యం చేసుకోకపోవడమే బ్రెజిల్ వంటి దేశాల సంప్రదాయ విధానంగా కొనసాగుతోంది. ప్రత్యేకించి అలీన దేశాల్లో చాలావాటికి ప్రత్యక్ష మదుపులు, అభివృద్ధి, మానవతా సహాయాన్ని అందించడం అనే పాశ్చాత్య నిబంధనల వెలుగులో చూస్తే ఇది విరుద్ధ ప్రయోజనాల ఘర్షణకు దారితీస్తోంది. ఈ నేపథ్యంలో తటస్థత అనేది ఒక 'గమ్మత్తయిన సంతులన చర్య'గా మారుతోంది.

వ్యాసకర్త సీనియర్ ఆర్థికవేత్త
('ద కాన్వర్సేషన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఇప్పుడేంటి?



మత ఛాందసవాదులు, అతి జాతీయవాదులతో సమస్య ఏమిటంటే– గణితం, తత్వశాస్త్రం, సాహిత్యం, సైన్సు మీద వాళ్లు సమయం పెట్టకుండా, ఐదువేల ఏళ్ల క్రితం వాళ్ల పూర్వీకులు వీటన్నింటిలో ప్రవీణులని నిరూపించడానికి సమయం వెచ్చిస్తారు.

– పల్లవీ అయ్యర్, రచయిత్రి

కొత్త ట్రెండ్



'ఎల్జీబీటీక్యూఐ+ ఆల్ఫాబెట్' ఉద్యమానికి తర్వాత కలవవలసిన ధోరణి వయసుకు సంబంధించినది. పురుషులు, మహిళలు తమను తాము చిన్నపిల్లల్లా ఐడెంటిఫై అవుతున్నారు. ఇది జోక్ కాదు. ఇది వాస్తవం.

– ఓలి లండన్, రచయిత్రి

స్వీయ బలి



గత వారంలోనే, పాకిస్తాన్‌లో ముగ్గురి మీద దైవ దూషణ చేశారన్న ఆరోపణలు వచ్చాయి. అందులో ఒకరు మౌలిక వసతుల ఆధునికీకరణలో సాయం చేస్తున్న చైనా దేశీయుడు కూడా ఉన్నారు. పాకిస్తాన్ సృష్టించిన రాకాసి పాకిస్తాన్‌కే ఎదురు తిరుగుతోంది.

– హారిస్ సుల్తాన్, యాక్టివిస్ట్

శాంతి దూత



అసాధ్యమైన దాన్ని సాధ్యం చేసిన దేశం మాది. ఇజ్రాయిల్‌తో శాంతి నెలకొల్పాం. (యూఏఈ అధ్యక్షుడు) షేక్ మహమ్మద్ బిన్ జాయేద్‌ను దేవుడు దీవించుగాక!

– హసన్ సజ్వానీ, కామెంటేటర్

నియంత్రణ



చైనాలో వేలాది మంది 'వ్యవసాయ నిర్వహణ అధికారు'ల పనేమిటంటే – ప్రభుత్వ నిబంధనలకు లోబడే రైతులు పంటలు పండిస్తున్నారో లేదో తనిఖీ చేయడం! అంతగా చైనా నియంత్రణలు అమలు చేస్తోంది.

– జేమ్స్ మెల్‌విల్, కామెంటేటర్

ప్రకృతికి శిరమొగ్గి నిలిచిన 'శివుడు'!



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

"చరిత్రలో ఇంతవరకు కనీవినీ ఎరుగని ఎండలు, వేడి గాలులు ఆసియా దేశాల్ని పీల్చి పిప్పి చేస్తాయి. ఈ అసాధారణ పరిణామం భారత, చైనా దేశాలలో పెక్కుమంది ప్రజల దుర్మరణాలకు దారి తీస్తుంది. ముఖ్యంగా ఏప్రిల్–మే నెలలు ఆసియా ఖండ చరిత్రలోనే విలయ తాండవంగా భావించవచ్చు. ఉత్తర, తూర్పు భారత రాష్ట్రాలలో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు తగ్గవు. ఒకవేళ వేడి తీవ్రత తగ్గని పక్షంలో పరిణామాలు ప్రమాదకరంగా మారవచ్చు"

– మాక్సిమిలియానో హెరీరా, వాతావరణ శాస్త్రవేత్త
('గార్డియన్' పత్రిక; 20 ఏప్రిల్ 2023)

వాతావరణ శాస్త్రవేత్తల తాజా అధ్యయనం ప్రకారం, భూమిపై ఏకంగా 20 లక్షల ఏళ్లపాటు వర్షం పడిందన్న వార్త 'కలగుండు' పడినట్లయింది. అంటే సృష్టి, వినాశాల మధ్య భూమి, ప్రకృతి పబ్బం గడుపుకుంటూ వచ్చాయని భావించాలి. సృష్టి, వినాశాలు ప్రాకృతిక సహజాలు. పెరుగుతూ వచ్చిన సృష్టి రహస్యాల పరిజ్ఞానంతో మానవజాతి తన మనుగడను కాపాడుకుంటూ వస్తోంది. ఇదిలా ఉండగా, దక్షిణాసియా దేశాలకు దఫదఫాలుగా వినాశంగా పరిణమిస్తున్న ఇండో–పసిఫిక్ వాతావరణ మార్పులు ఒకసారి దుర్భరమైన వేడి గాలులకు (ఎల్‌నినో), మరోసారి అమితమైన చలి గాడ్పులకు (లానినా) కారణమవుతున్నాయి. 2009 నుంచి 2018 వరకు మన దేశంలో అసాధారణ వేడిగాడ్పులకు కారణమైనది ఎల్‌నినో. ఫలితంగా ఖరీఫ్ పంటలు దెబ్బతిన్నాయి. ప్రతీ 2–7 సంవత్సరాలకు ఎల్‌నినో వరసగా దెబ్బతీస్తూనే వచ్చింది.

ప్రకృతి వైపరీత్యం ఎంత దెబ్బతీయకపోతే, లోకాల్ని శాసించే శివుడు సహితం చలికి తట్టుకోలేక హిమాలయాల్ని వదిలి భూమ్మీద చెట్ల నీడను ఆశ్రయించాల్సిన గతి పడుతుంది! (**'హరుడు కైలాస కుధర నాథాగ్ర వసతి విడిచి/ వటమూల తలముల విశ్రమించె'.**) ఈ సత్యాన్ని 'వైజయంతీ విలాసం' కావ్యం ద్వారా సారంగు తమ్మయ్య ప్రజలపై ప్రకృతి ప్రభావాన్ని తెలియ జెప్పడం కోసం ప్రకటించాడు. దుర్భాక రాజశేఖర శతావధాని తన 'రాణా ప్రతాప సింహ చరిత్ర'లో హల్దీఘాట్ కనుమ దగ్గర రాజపుత్రులకూ, మొగలాయీలకూ మధ్య జరిగిన యుద్ధాన్ని వర్ణిస్తూ, మధ్యాహ్నాన్నిలా చిత్రించాడు:

"మెండై ఎండలు నిండె, నల్దెసల గ్రమ్మెన్ నిప్పులన్ గుప్పుచు/ ద్దండ గ్రీష్మ సమీరముల్ నిఖిల జగంబుల్ కడున్ దస్సె బ్ర/హ్మాండబందు పొగల్ సెగల్ తటుముల్తై వ్యాపించి మధ్యాహ్నమా/ర్తాండుండుజ్వల కాండుడై గగనమధ్యం బందు మెల్గొందగన్."

ఇదిలా ఉండగా నన్నెచోడుడు 'కుమార సంభవం' కావ్యంలో, పార్వతి మండుటెండలకు పంచాగ్ని మధ్యంలో

రెండో మాట



ఘోర తపస్సు చేస్తున్న సందర్భాన్ని వర్ణించాడు. 'లోకులు భయపడేంత'గా వడగాలి వీచడాన్ని, ఆ వడగాలికి ఏనుగుల తలలు పేలిపోయి లోపలి ముత్యాలు పేలాలుగా పటపటా చిట్లిపోయినట్లు, దప్పిక కోసం ఎదురు చూసే చెట్లు తమ నీడల్ని తామే తాగుతున్నట్లు చిత్రించాడు. ఇక విశ్వనాథ పగటి ఎండల తీవ్రతల వల్ల జిల్లేడు కాయల్లా, వడ్లగింజల్లా, సున్నపురాయిలా విరిగిపోయి భూమి కాస్తా కకావికలై పోయిందని వర్ణించాడు!

ఆధునికుడైన కవి కాకరపర్తి కృష్ణశాస్త్రి తన కాలంలోనే సముద్రం ఉప్పొంగడం, అది భూమిని ముంచేసిన ఘటనలను 'ప్రళయ సంరంభం' కవితలో కళ్లకు కట్టి చూపాడిలా:

"ఆకసమంటుచున్ ఘుమ ఘుమార్భటితో దిశలన్ స్పృశించుచునే/ భీకర లీల లేచి అతివేల జవంబున వచ్చి వచ్చియ/ స్తోక తరంగ మొందుపడు దుస్సహమై ధరముంచి వైచి తా/ నేక పయోధి సూత్రముగ ఎంతయు జేసి శమించెనంతటన్"!

ఆంధ్ర సామ్రాజ్య విచ్ఛిన్నానికి 'రాళ్లు' కూడా దుఃఖంతో ఎలా కరిగిపోయాయో కవి కొడాలి సుబ్బారావు ఎంతో ఆర్ద్రతతో గుండె చెరువై ఇలా వర్ణించాల్సి వచ్చింది:

"శిలలు ద్రవించి యేడ్చినవి, జీర్ణములైనవి తుంగభద్రలో/ పల గుడి గోపురంబులు, సభాస్థలులైనవి కొండ ముచ్చుగుం/ పులకు, చరిత్రలో మునిగి పోయిన దాంధ్రవబంధరాధిపో/జ్జ్వల విజయ ప్రతాప రభ సంబొక స్వప్న కథావిశేషమై."

ఇంతకూ, సంభవించే ప్రకృతి వైపరీత్యాలకేమిగాని మానవ హృదయంలో సహజంగానే ప్రకృతిని చూసి ఆనందించే లక్షణం మాత్రం చచ్చిపోదని చెబుతూ ప్రసిద్ధ కళాకారుడు, కవి అడవి బాపి రాజు ఓ చిరంతన సత్యాన్ని ప్రకటించిపోయారు:

"అందరికీ ప్రకృతిని చూసి ఆనందించే లక్షణం ఉంది. ఆ ప్రకృతి భౌతిక రూపంగా, మనోమయ రూపంగా, బుద్ధి రూపంగా ప్రత్యక్షం అవుతూనే ఉంటుంది. అలాంటప్పుడు ఆ ప్రకృతిలో మనస్సుకుగాని, హృదయానికిగాని, బుద్ధికిగాని, ఆత్మకుగాని ఆనందం కల్గించే ఒక దృశ్యం, ఒక రూపం, ఒక జీవితం, ఒక భావం, కళాశక్తి కలిగిన రసజ్ఞునికి గోచరించినప్పుడు – తనలో ఉండే ఆ కళా శక్తి పైకి ఒక స్వరూపంగా జన్మించాలని ఆవేదన పొందడం చేత కళాస్వరూపం ఉద్భవిస్తున్నది. ఆ కళా స్వరూపంలో ఉన్న ముఖ్య లక్షణం ఆనందం. ఆ సృష్టి భాషా స్వరూపమైతే కవిత్వం, వర్ణ స్వరూపమైతే చిత్ర లేఖనం, మూర్తి స్వరూపమైతే శిల్పం, అంగ విక్షేప స్వరూపమైతే నృత్యం, భవన స్వరూపమైతే ఆలయం అవుతుంది"!

ప్రకృతిలో మనం భాగం కాబట్టి, అందులో దఫదఫాలుగా ఇదే మానవుడి చేష్టల వల్లనో, ప్రకృతి సహజంగానో పెల్లుబుకి వచ్చే ఉపద్రవాలను భరిస్తూనే లోకయాత్ర సాగుతూండటం సహజ పరిణామం.

abkprasad2006@yahoo.co.in

సమాచార హక్కు 'ఆద్యుడు'

అభిప్రాయం



మాడభూషి శ్రీధర్

'విముక్తి' గురించి తెలుసుకొనే సమాచారం అందరికీ ఇవ్వాలి. ముక్తి మార్గం, భక్తి సాధనం, మంత్రోపదేశం, విజ్ఞాన సమాచారం అందరిదీ అని... వెయ్యేళ్ల కాలం కిందటే 'సమాచార హక్కు' అవసరమని చెప్పినవారు రామానుజుడు. జ్ఞానాన్ని అందరికీ చేర్చడం కోసం జీవితాన్ని అంకితం చేసిన గురువు ఆయన. రామానుజుడు తిరు మంత్రం తెలుసుకోవడానికి 18 సార్లు శ్రీరంగం నుంచి తిరుగోష్ఠీయూరు దాకా ప్రయాణించి గురువు గారిని అడిగేవారు. ప్రతిసారీ మళ్లీ రమ్మనేవారు. విసుగు లేకుండా, తిట్టుకోకండా ఓపికగా భక్తితో జాగ్రత్తగా వచ్చే వారు. 18 సార్లు తిరిగిన తరువాత గురువుగారు తిరు మంత్రం అంటే... అష్టాక్షర మంత్రం నేర్పారు. తర్వాతి కాలంలో ఈయన ఇటువంటి మంత్రాలనూ, ముక్తి మార్గాన్నీ అందరికీ తెలియచేసి అందరూ ముక్తి పొందడానికి అవకాశం కల్పించిన సంస్కర్త అయ్యారు.

రామానుజుడు తమిళనాడు శ్రీపెరుంబుదూర్‌లో 11వ శతాబ్దంలో జన్మించారు. నాథముని, యామునాచార్యుల తరువాత విశిష్టాద్వైతాన్ని ప్రసిద్ధం చేసిన సిద్ధాంత కర్త. బ్రహ్మసూత్రాల వ్యాఖ్యానం – 'శ్రీ భాష్యం'; 'భగవద్గీతాభాష్యం', 'వేదాంత సంగ్రహ'మనేవి రామానుజుని ప్రధాన గ్రంథాలు. 'శరణాగతి గద్యం', 'శ్రీరంగ గద్యం', 'శ్రీ వైకుంఠ గద్యం' (గద్యత్రయం) ఇతర రచనలు.

మహమ్మదీయ రాజుల దాడులలో ధ్వంసమైన అనేక ఆలయాలను పునరుద్ధరించి, ఆ మత పాలకులతో వాదం జరిపి వారు ఎత్తుకుపోయిన విగ్రహాలను తిరిగి సాధించి ఆలయాల్లో నెలకొల్పిన ధీరుడు రామానుజుడు. ఆలయాలలో అన్ని కులాల వారికీ ప్రవేశం కల్పించి, అందరి కోసం చెరువులు తవ్వించి... విజ్ఞానం, మంత్రో పదేశం కొందరికే పరిమితం కాదనీ, అందరూ పొందాలనే సర్వసమతా సూత్రాన్ని బోధించి పాటించిన జగద్గురువు రామానుజుడు.

క్రీస్తు శకం 11–12 శతాబ్దాల మధ్య రామానుజాచార్యులు తమిళనాడు శ్రీరంగంలో పరమపదం పొందారు. ఆనాటి నుంచి అంటే వెయ్యేళ్ల కాలం నుంచి ప్రత్యేక లేపనాలను అద్ది ఆయన శరీరాన్ని భద్రపరుస్తున్నారు. శ్రీరంగంలోని 4వ ప్రాకారంలో ఉన్న రామానుజాచార్యులది ఒక విగ్రహం అనుకోవడం సాధ్యం కాదు. అలా అని దానిని మృత శరీరమనీ అనుకోరు. అదో దివ్య భావన కల్పించే మూర్తి. పద్మాసనంలో యోగ భంగిమలో కూర్చుని రామానుజులు కనిపిస్తారు.

జాతి, మత, కుల భేదాలు లేకుండా అందరికీ ఆలయ సమీపంలోని కూటములలో 'మధ్యాహ్న భోజనం' ఇవ్వాలనే ఆలోచనను మొదట అమలుచేసిన వాడు రామానుజుడు. ఇస్లాం మతవాదులైన ముస్లిం రాజులు కొల్లగొట్టిన హిందూ దేవతా మూర్తులను తన వాక్చాతుర్యంతో, వాదనా పటిమతో, సంప్రదింపుల నైపుణ్యంతో మర్యాదగా మాట్లాడి వారిని ఒప్పించి వందలాది దేవతా విగ్రహాలను మళ్లీ ఆయా దేవాలయాల్లో ప్రతిష్ఠించిన రామానుజుడు గోష్ఠీ సమరాంగణ సార్వభౌముడు, అహింసావాది. సంవాదం ద్వారా సమస్యలు పరిష్కరించుకోవచ్చుననే ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానానికి తొలి కర్త, కర్మ, క్రియ రామానుజుడే. గాంధీ అహింసా సిద్ధాంతాన్ని వెయ్యేళ్ల కిందటే ఆచరించి చూపిన మార్గదర్శి.



శ్రీరంగంలోని రామానుజులు

ఊళ్లో చెరువు ఉండాలనీ, అది అందరికీ నీరివ్వాలనీ... నియమాలు పెట్టిన జగద్గురువు కూడా రామానుజుడే. తొండనూరులో ఆయన తవ్వించిన చెరువు వెయ్యేళ్ల నుంచి నీళ్లిస్తూనే ఉన్నది. మేల్కోటే తిరు నారాయణ పురం ఆలయంలో ప్రవేశించడానికి తమకెందుకు అర్హత లేదని అక్కడి హరిజన, గిరిజనులు అడిగితే ఇప్పుడే రండి అని ఆలయంలోకి తీసుకువెళ్లిన మహానుభావుడు. హిందూ మతంలో అందరి సమానత గురించి ఆలోచించిన సంస్కర్త కేవలం రామానుజుడే అని బీఆర్ అంబేడ్కర్ ప్రశంసించాడని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల రామానుజ సహస్రాబ్ది తపాలా బిళ్లను ఆవిష్కరిస్తూ వివరించారు. రామానుజుని జీవితం మెదడున్న మనలను ఆలోచింపచేసే ఒక సిద్ధాంతం, ఒక ఆచరణ, ఒక సువిశాల సమతా మతం.

వ్యాసకర్త డీన్, స్కూల్ ఆఫ్ లా, మహీంద్ర యూనివర్సిటీ

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** శు.షష్ఠి ఉ.11.10 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** పునర్వసు పూర్తి (24గంటలు), **వర్జ్యం:** సా.5.29 నుండి 7.14 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.32 నుండి 12.23 వరకు, **అమృతఘడియలు:** రా.3.58 ఉండి 5.43 వరకు ; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.41, **సూర్యాస్తమయం:** 6.13.

క్లుప్తంగా...

విశ్వానికి ఆదిశంకరులే జగద్గురువులు

- విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి
- శారదాపీఠంలో ఘనంగా శంకర జయంతి వేడుకలు



ఆదిశంకరుల ప్రతిమ వద్ద పూజలు చేస్తున్న స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర

సింహాచలం: విశ్వమంతటికీ ఆదిశంకరాచార్యు లు మాత్రమే జగద్గురువులు అని విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి అన్నారు. శంకర జయంతి ఉత్సవాలను మంగళవారం విశాఖ శ్రీ శారదాపీఠంలో ఘనంగా నిర్వహించారు. ఆదిశంకరుల ప్రతిమకు పీఠం ఉత్తరాధికారి విశేషంగా అభిషేకం నిర్వహించారు. స్వరూపానందేంద్ర సరస్వతి మంగళ హారతి ఇచ్చారు. పండితులు ఉపనిషత్తులను పారాయణం చేశారు. ఈ సందర్భంగా స్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా సనాతన ధర్మం నేటికీ విరాజిల్లుతోందంటే అది ఆదిశంకరుల వారి గొప్పతనమేనని స్పష్టం చేశారు. దేశంలో అవైదిక మతాలు, ఛాందస మతాలు, శూన్య మతాలు విస్తరిస్తున్న సమయంలో ఉపనిషత్తులు, వేదాంత ప్రచారం ద్వారా సనాతన ధర్మాన్ని నిలబెట్టారని వివరించారు. విగ్రహారాధనకు అతీతంగా పరమాత్మ స్వరూపాన్ని తెలియజేసిన ఏకైక గురువు జగద్గురు ఆదిశంకరాచార్యులే అని తెలిపారు. శంకర సాంప్రదాయాన్ని అనుసరిస్తున్న పీఠాల్లో విశాఖ శ్రీశారదాపీఠం ప్రముఖమైందని తెలిపారు.

కేంద్రం మెడలు వంచైనా హక్కులు సాధించుకుందాం

- సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు రాఘవులు

అరకులోయ రూరల్: కేంద్ర ప్రభుత్వం మెడలు వంచైనా హక్కులను సాధించుకుందామని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు పిలుపు నిచ్చారు. అరకులోయలోని గిరిజన మ్యూజియం ఆవరణ వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన సీపీఎం, సీపీఐ ప్రచార భేరి బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలన్నారు. ఇప్పటికే కార్మికులు, గిరిజనుల హక్కులు, చట్టాలను నిర్వీర్యానికి కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.వి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ బీజేపీ డైరెక్షన్‌తో ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు దేశ ప్రజల్లో కుల, మతాల మధ్య చిచ్చుపెట్టి భయభ్రాంతులు సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలందరూ ఐక్యంగా తిరగబడాలని పిలుపునిచ్చారు. తొలుత ఎన్టీఆర్ మైదానం నుంచి ర్యాలీ నిర్వహించారు.

డీఎస్పీ డైరెక్షన్‌లోనే చంద్రబాబుపై రాళ్ల దాడి

- నారా లోకేశ్ ఆరోపణ

కర్నూలు (అర్బన్)/కోసిగి(కర్నూలు): తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుపై ఒక డీఎస్పీ డైరెక్షన్‌లోనే రాళ్ల దాడి జరిగిందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆరోపించారు. లోకేశ్ పాదయాత్రలో భాగంగా మంగళవారం మంత్రాలయం నియోజకవర్గంలోని కోసిగిలో బహిరంగ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చొక్కా విప్పి నిరసనకు దిగిన మంత్రి సురేశ్‌కు దమ్ముంటే దళితులను చంపి డోర్ డెలివరీ చేసిన వారివద్దకు వెళ్లి షర్ట్ విప్పి నిరసన తెలపాలన్నారు. వైఎస్సార్‌సీపీ అంటే రసిక రాజాల పార్టీ అని, అందులో ఉన్న నాయకులందరూ న్యూడ్ మోడల్స్ అని అన్నారు. ఎంపీ మాధవ్ ప్యాంట్ విప్పాడు, ఎమ్మెల్యే అవంతి షర్ట్ విప్పాడు, అంబటి అన్నీ విప్పేశాడు... వాళ్లని చూసి తగ్గేదేలే... అని మంత్రి సురేశ్ తయారయ్యారని పేర్కొన్నారు. విదేశీ విద్యకు అంబేడ్కర్ పేరు తొలగించినప్పుడు మంత్రి ఎందుకు షర్ట్ విప్పలేదన్నారు. సీఎం జగన్‌కు దమ్ముంటే ఇంటికి స్టిక్కర్ కాదు... కరెంట్ బిల్లు, బస్సు టికెట్, పెట్రోల్, డీజిల్ బిల్లులు, చెత్త పన్ను మీద స్టిక్కర్ వేయాలన్నారు. తాము అధికారంలోకి వస్తే బీసీలు మొబైల్‌లో ఒక బటన్ నొక్కగానే ఇంటికే కుల ధ్రువీకరణపత్రాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. దామాషా ప్రకారం బీసీ, ఉపకులాలకు నిధులు, రుణాలు అందిస్తామన్నారు. కాగా, బహిరంగ సభ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బ్యానర్ ఫ్రేమ్ విరిగి గ్యాలప్ప అనే వృద్ధుడిపై పడింది. నడుముపై తీవ్ర గాయం కావడంతో ఆయన అక్కడే స్పృహ తప్పి పడిపోయాడు. ఆయన్ను 108లో ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నెట్టింట.. లాభాల పంట

> **మామిడి పండ్ల ప్రేమికులకు నమస్సులు..**
>
> మూడేళ్లుగా మా తోటలో రసాయన మందులు వాడకుండా మామిడి పండిస్తున్నాం. రసాయనాలు వాడకుండా మగ్గించిన పండ్లను అమ్మకాలను ఈ నెల 23 నుంచి కర్నూలు కృష్ణానగర్‌లోని రామకృష్ణ స్కూల్ వద్ద ప్రారంభిస్తున్నాం. కిలో ధర కవర్లలో అయితే రూ.120, కవర్లు లేకుంటే కిలో రూ.100. కవర్లు లేకుండా చిన్న సైజు మామిడి ధర రూ.80.
>
> – సోషల్ మీడియాలో ఓ రైతు చేసిన పోస్ట్
>
> **అందరికీ నమస్కారం**
>
> మేం స్వచ్ఛమైన వేరుశనగ (పల్లీ) నూనె గానుగ ఆడించి అమ్ముతున్నాం. కేజీ రూ.280. ప్రత్యేకంగా పండించిన తెల్ల నువ్వుల నూనె (గానుగ ఆడించినది) కేజీ రూ.500, పొద్దుతిరుగుడు గింజల నూనె రూ.380, కుసుమ నూనె రూ.400, కొబ్బరి నూనె రూ.460 చొప్పున అమ్ముతున్నాం. ఆర్డర్లపై ఏ ప్రాంతానికైనా పంపుతాం.
>
> – సామాజిక మాధ్యమాల్లో తన ఇంటినుంచి ఓ వ్యాపారి చేసిన పోస్ట్

- బిజినెస్‌లో కొత్త పోకడ
- సామాజిక మాధ్యమాలే ప్రచార అస్త్రాలు
- దళారుల ప్రమేయం లేకుండా విక్రయాలు
- దుకాణాల అవసరం లేకుండానే మార్కెటింగ్
- సొంతంగా ధర నిర్ణయించుకునే అవకాశం
- నాణ్యతతో వ్యాపారంలో రాణింపు



ఏ మార్కెట్‌కు తీసుకెళ్లాలనే బెంగ లేదు

సాక్షి, కర్నూలు డెస్క్: రైతులు తాము పండించిన ఉత్పత్తుల్ని అమ్ముకోవాలన్నా.. వ్యాపారులు సరుకు విక్రయించాలన్నా సవాలక్ష సమస్యలు. పంట బాగా పండినా కోత కోయడం.. మార్కెట్‌కు తరలించడం.. అమ్ముకోవడం.. తీరా లెక్కలు వేసుకుంటే పెట్టుబడి కూడా దక్కలేదని నిట్టూరుస్తూ ఇంటికి చేరుకోవడం రైతులకు మామూలైపోయింది. ఈ కోవలోనే వ్యాపారులు కూడా. ఎంత నాణ్యమైన సరుకును దుకాణంలో ఉంచినా మాటల గారడీ చేయలేక.. వినియోగదారులను మోసగించలేక సతమతమయ్యే వ్యాపారులు లేకపోలేదు. ఇలాంటి వారికి సోషల్ మీడియా చక్కటి పరిష్కారం చూపుతోంది.

ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికి అందుతుందనగానే రైతును సవాలక్ష ప్రశ్నలు ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. దిగుబడిని ఎక్కడ అమ్మాలి. ఏ మార్కెట్‌లో ఎక్కువ ధర వస్తుంది. కొన్ని రోజులు ఆగితే ధరలో మార్పు ఉంటుందా? ప్రస్తుత ధరకు అమ్మితే కనీసం పెట్టుబడి అయినా దక్కుతుందా? ఇలా నిద్రలేని రాత్రులు ఎన్నో గడిపే రైతులకు ఇప్పుడా బెంగ లేదు. ఉత్పత్తులను నేరుగా రైతులే విక్రయించుకునే అవకాశం ఏర్పడింది. వివరాలను సామాజిక మాధ్యమాల్లో ఉంచి.. ధర కూడా రైతులే నిర్ణయించే రోజులు వస్తుండటం విశేషం. దళారుల ప్రమేయం లేకుండా సొంతంగా విక్రయాలు చేపట్టాలంటే నాణ్యత తప్పనిసరి. వినియోగదారుడు ఒక్కసారి ఇష్టపడితే.. ఆ తర్వాత ఎక్కడున్నా వెతుక్కుంటూ వచ్చి మరీ కొనుగోలు చేస్తారు.

ఫోన్ చేస్తే చాలు..

ఒకప్పుడు ఫలానా వస్తువు కొనుగోలు చేయాలంటే ఎక్కడ దొరుకుతుందో.. నాణ్యంగా ఉంటుందో లేదో.. ధర కరెక్టుగానే చెబుతారా? ఇలాంటి ఎన్నో ప్రశ్నలు. ఇప్పుడు ఏది కావాలన్నా నెట్‌లో వెతికితే.. వివరాలు అరచేతిలో వచ్చి వాలతాయి. ధర ఎక్కడ తక్కువ ఉంటే అక్కడ కొనుగోలు చేస్తున్న రోజులు. వ్యాపారంలో పోటీ పెరగడంతో ఇప్పుడు విక్రయదారులు ఒక అడుగు ముందుకేసి, ఫోన్ చేస్తే చాలు ఎక్కడికైనా పార్సిల్ చేస్తున్నారు. ఒకటి రెండు రూపాయలు తక్కువ లాభం వచ్చినా.. ఫోన్ చేసిన వినియోగదారులు సంతృప్తి చెందితే ఆ తర్వాత తమ వ్యాపార ఖాతాలో చేరిపోతారనే భావన కనిపిస్తోంది.

బాడుగల బాధ తప్పినట్లే!

ఇప్పుడున్న పరిస్థితుల్లో అద్దెకు దుకాణం తీసుకుని వ్యాపారం చేయాలంటే ఆస్తులు అమ్ముకోవాల్సిందే. బాడుగుల సంగతి పక్కనపెడితే.. అడ్వాన్సుల పేరు వింటేనే కళ్లు బైర్లు కమ్మే పరిస్థితి. వ్యాపారం జరుగుతుందో లేదో కానీ.. దుకాణం దక్కించుకోవడమే గగనం అవుతోంది. ఆ తర్వాత ఎంచుకున్న వ్యాపారానికి అనుగుణంగా మార్పులు చేసుకోవడం, ఫర్నిచర్, సిబ్బంది నియామకం కలిపి లెక్కలేస్తే తడిసి మోపెడవుతుంది. అదే నెట్టింట్లో వ్యాపారం చేస్తే ఇవన్నీ మిగులుబాటే.

నిరసన కూడా తెలపొచ్చు

కర్నూలు చెక్ పోస్ట్ సమీపంలోని ఓ బడా స్మార్ట్ దుకాణంలో ఓ వ్యక్తి 25 కేజీల బియ్యం బ్యాగు కొన్నాడు. అన్నం వండేటప్పుడే చెడు వాసన వచ్చింది. తినబోతే ముక్కిన వాసన రావడంతో అన్నమంతా వదిలేయాల్సి వచ్చింది. సాయంత్రం ఆ స్టోర్‌కు వెళ్లి అడిగితే.. 'రేపు తీసుకురండి. మరో బ్రాండ్ ఇస్తాం' అన్నారు. తీసుకెళ్లాక ఒరిజినల్ రశీదు కావాలన్నారు. బ్యాగ్ చూపించి మీ వద్ద కొన్నదేనని, కావాలంటే మీ సిస్టంలో చూడమని కోరితే మేనేజర్ కోపగించుకుని మాకు సంబంధం లేదన్నాడు. దీంతో ఆ బియ్యాన్ని ఆ దుకాణం ఎదుటే పారబోసి.. అదే విషయాన్ని సదరు వ్యక్తి సోషల్ మీడియాలో షేర్ చేశాడు. ఆ విషయం క్షణాల్లోనే సిటీ అంతా తెలిసింది. ఆ తరువాత సదరు వినియోగదారుడికి ఆ స్టోర్ మేనేజర్ ఫోన్ చేసి.. నష్టనివారణ చర్యలు చేపట్టాడు.

కులవాదులను అరెస్ట్ చేయాలి

- 940వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలివ్వడాన్ని వ్యతిరేకిస్తూ తమపై వివక్ష చూపుతున్న కులవాదులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 940వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. 54 వేల పట్టాలను చట్టసభల సాక్షిగా పేదలకిచ్చేందుకు నిర్ణయిస్తే కులవాదులకు వచ్చిన నష్టమేంటో చెప్పాలన్నారు. రాజధాని అంటే వీళ్ల సొత్తులాగా ఊహించుకుంటూ అడ్డగోలుగా వ్యవహరించడం వెనుక బాబు అండ్ కో మద్దతు ఉందని విమర్శించారు. ఎల్లో మీడియాతో కలిసి వ్యవస్థలను మేనేజ్ చేస్తూ రాష్ట్రంలో అధికారం కోసం బాబు తప్పుడు పనులకు దిగుతుండడం సిగ్గులేనితనానికి నిదర్శనమన్నారు. కులవాదులిచ్చే సూట్‌కేసుల కోసం వారికి వత్తాసు పలుకుతున్న దళిత దళారులు తమ వైఖరి మార్చుకోకపోతే గ్రామాల్లో తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. 940 రోజులుగా సుదీర్ఘంగా పోరాటం చేస్తున్న బహుజన పరిరక్షణ సమితి దీక్షలు సత్ఫలితాలు సాధించి ప్రభుత్వం మూడు రాజధానుల దిశగా అడుగులు వేయడం శుభ పరిణామమన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పులి దాసు, ఈపూరి ఆదాం, బేతపూడి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో మెరుగైన పారిశుద్ధ్యానికి చర్యలు

- 4 షిఫ్టుల్లో సిబ్బంది విధులు



పనులు చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

తిరుమల: తిరుమలలో సులభ్ కార్మికులు విధులు బహిష్కరించి నిరసన తెలుపుతుండటంతో టీటీడీ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. భక్తులకు అసౌకర్యం కలుగకుండా 24 గంటలూ పారిశుద్ధ్య పనులు చేయిస్తోంది. ఇక్కడ సిబ్బంది 4 షిఫ్టుల్లో పనిచేస్తున్నారు. విశ్రాంతి గృహాల్లో ఎఫ్ఎంఎస్ సిబ్బంది పారిశుద్ధ్య నిర్వహణ చేపడుతున్నారు. అన్న ప్రసాదం కాంప్లెక్స్, వైకుంఠం క్యూ కాంప్లెక్స్–1, 2, లడ్డూ కాంప్లెక్స్‌ల్లో పారిశుద్ధ్య నిర్వహణ, పలు ప్రాంతాల్లో చెత్త తరలింపు, బహిరంగ మరుగుదొడ్లు, రోడ్ల శుభ్రం తదితర పనులు చేస్తున్నారు. 4 యంత్రాలతో ఎప్పటికప్పుడు రోడ్లను శుభ్రం చేస్తున్నారు. వీటిని పర్యవేక్షించేందుకుగాను ఎస్ఈ–2 జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈఈలు, డిప్యూటీ ఈఈలతో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి ఆదేశాల మేరకు జేఈవో వీరబ్రహ్మం పర్యవేక్షణలో ఆరోగ్య శాఖ అధికారి శ్రీదేవి తదితరులు సౌకర్యాలను పర్యవేక్షిస్తున్నారు.

మల్లన్న ఆర్జిత సేవలకు ఆన్‌లైన్ బుకింగ్



వివరాలు వెల్లడిస్తున్న ఈవో ఎస్.లవన్న

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలో వెలసిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు ఆర్జిత సేవలు నిర్వహించుకునేందుకు భక్తులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని శ్రీశైలం ఆలయ ఈవో ఎస్.లవన్న చెప్పారు. మంగళవారం ఆలయ పరిపాలన భవనంలో ఆయన మాట్లాడుతూ గతంలో 70 % ఆన్‌లైన్, 30% ఆఫ్‌లైన్‌లో ఆర్జిత సేవా టికెట్లు అందుబాటులో ఉండేవన్నారు. భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో నిరీక్షించకుండా, వారి సౌలభ్యం కోసం అన్ని ఆర్జిత సేవా టికెట్లు 100% ఆన్‌లైన్‌లో ఉంచామన్నారు. మే నెల కోటా టికెట్లను మంగళవారం ఆయన విడుదల చేశారు. వీఐపీలు 2 రోజుల ముందుగా ఈవో కార్యాలయానికి వారి లెటర్ హెడ్‌తో సేవా వివరాలను మెయిల్ చేస్తే టికెట్లను అందుబాటులో ఉంచుతామన్నారు. ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకున్న భక్తులు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, టికెట్ జిరాక్స్ కాపీని వెంట తెచ్చుకోవాలని చెప్పారు.

కుప్పంలో టీడీపీ గూండాగిరి

- అర్బన్ సీఐ, ఎస్ఐలను కిందపడేసి.. వారిపై పడిన వైనం
- సీఎం జగన్ దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకున్న పోలీసులపై దౌర్జన్యం
- 60 మందిపై కేసులు

సాక్షి, చిత్తూరు/కుప్పం: ప్రశాంతమైన కుప్పంలో టీడీపీ నేతలు గూండాగిరి ప్రదర్శించారు. పోలీస్ అధికారులపైనే దాడులకు తెగబడ్డారు. అర్బన్ సీఐ శ్రీధర్, ఎస్ఐ శివకుమార్ కిందపడేలా తోసేశారు. చిత్తూరు జిల్లా కుప్పంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద మంగళవారం తెలుగు తమ్ముళ్లు సుమారు 150 మందికిపైగా గుమికూడారు. టీడీపీ కుప్పం ఇన్‌చార్జ్ పి.ఎస్.మునిరత్నం, ప్రతిపక్షనేత చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్ నేతృత్వంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజ్‌కుమార్, మాజీ ఎంపీపీ వెంకటేష్, మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ సత్యేంద్రశేఖర్, యూత్ ప్రెసిడెంట్ మణి, నాయకులు త్రిలోక్, గోపీనాథ్ కార్యకర్తలతో కలిసి పోలీసుల అనుమతి తీసుకోకుండానే టీడీపీ జెండాలతో రోడ్డుపైకి ప్రదర్శనగా వచ్చారు. సీఎం డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేస్తూ ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించారు. దీన్ని అడ్డుకున్న పోలీసు అధికారులపై తెలుగుదేశం కార్యకర్తలు దాడికి దిగారు. పోలీసులు, టీడీపీ నేతల మధ్య తీవ్రస్థాయిలో తోపులాట జరిగింది. టీడీపీ వారు బలంగా నెట్టేయడంతో అర్బన్ సీఐ శ్రీధర్, ఎస్ఐ శివకుమార్ కింద పడిపోయారు. వారిపైన టీడీపీ కార్యకర్తలు ఉద్దేశపూర్వకంగా పెద్ద ఎత్తున పడ్డారు. పోలీసులు సీఐ, ఎస్ఐలను పైకి లేపడంతో వారు తేరుకున్నారు. టీడీపీ నేతలు అరుపులు కేకలతో నినాదాలు చేస్తూ మరింతగా రెచ్చిపోతూ.. దిష్టిబొమ్మ దహనానికి ప్రయత్నించారు. పోలీసులు ఆ దిష్టిబొమ్మను స్వాధీనం చేసుకుని దూరంగా పడేశారు. టీడీపీ కార్యకర్తలు మరింత రెచ్చిపోయి ఆ దిష్టిబొమ్మను తగులబెట్టి సీఎం డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బస్టాండ్ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనలకు సంబంధించి 60 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దాడులకు తెగబడిన మరింతమందిని గుర్తించేపనిలో నిమగ్నమయ్యారు.

ప్రపంచానికే ఆదర్శంగా శ్రీసిటీ

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రశంసలు



శ్రీసిటీలోని బ్లూస్టార్ ఏసీ పరిశ్రమలో ఉత్పత్తులను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

వరదయ్యపాళెం(తిరుపతి జిల్లా): ప్రపంచానికే ఆదర్శమైన పారిశ్రామికవాడగా శ్రీసిటీ అభివృద్ధి చెందిందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రశంసించారు. మంగళవారం ఆయన శ్రీసిటీని సందర్శించారు. వివిధ పరిశ్రమల సీఈఓలతో జరిగిన సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడారు. దేశంలో అద్భుతమైన రవాణా, మౌలిక సదుపాయాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని చెప్పారు. దేశంలోని 10 ఉత్తమ పెట్టుబడుల గమ్యస్థానాల్లో ఒకటిగా శ్రీసిటీ అవతరించిందన్నారు. మెట్రో కోచ్‌లు, ఆటో మొబైల్స్, ఇంజినీరింగ్ ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్స్ తదితర తయారీ పరిశ్రమలకు శ్రీసిటీ నిలయంగా మారటం సంతోషకరమన్నారు. ఇక్కడి శ్రామిక శక్తిలో 50 శాతం మంది మహిళలు ఉండటాన్ని ఆయన అభినందించారు. శ్రీసిటీ రానున్న రోజుల్లో ప్రపంచస్థాయిలోనే ఒక మంచి కేస్ స్టడీ అవుతుందన్నారు. దీన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు తగిన సహకారం అందిస్తామని చెప్పారు. అనంతరం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శ్రీసిటీలోని బ్లూస్టార్ పరిశ్రమను సందర్శించారు. సమావేశంలో శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా మహాయజ్ఞం

- విజయవాడ స్టేడియంలో ఏర్పాట్లు
- పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి సత్యనారాయణ

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజలందరి సంక్షేమాన్ని, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిని కాంక్షిస్తూ దేవదాయ శాఖ ఆధ్వర్యంలో మే 12 నుంచి 6 రోజులపాటు రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన చండీరుద్ర రాజశ్యామల సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞానికి ఏర్పాట్లు మొదలయ్యాయి. విజయవాడ మునిసిపల్ స్టేడియంలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఉప ముఖ్యమంత్రి (దేవదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ, దేవదాయ ముఖ్య కార్యదర్శి కె.సత్యనారాయణ మంగళవారం వేర్వేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి మీడియాతో మాట్లాడుతూ.. యజ్ఞ క్రతువు మే 12న ఉదయం 5 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. యజ్ఞ నిర్వహణకు దాదాపు రూ.5 కోట్లు వ్యయం అవుతుందన్నారు. యాగ కార్యక్రమాల్లో 520 మందికి పైగా రుత్వికులు పాల్గొంటారని చెప్పారు. స్వరూపానందస్వామి, చినజీయర్ స్వామి, కుర్తాళం సిద్ధేశ్వర, మంత్రాలయం, జగద్గురు పండితారాధ్య తదితర పీఠాధిపతులు యజ్ఞ కార్యక్రమాల్లో పాల్గొంటారని చెప్పారు. మహాయజ్ఞాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖలతో 13 కమిటీలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కాగా, యజ్ఞ నిర్వహణపై ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ రాష్ట్ర సచివాలయంలోని తన చాంబర్‌లో దేవదాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఒక్కటవ్వాలనుకున్నారు.. ఒక్కటిగానే వెళ్లిపోయారు

- రాజమహేంద్రవరం వద్ద రోడ్డు ప్రమాదం
- కాబోయే వధూవరుల దుర్మరణం



మానేపల్లి రాజ్‌కుమార్, మల్లిరెడ్డి దుర్గాపావని (ఫైల్)

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): మూడు ముళ్ల బంధంతో ఒక్కటవ్వాలనుకున్న ఆ జంటను రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యురాక్షసి కౌగిలించుకుంది. వివరాలివీ.. కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం జె.కొత్తూరుకు చెందిన మానేపల్లి రాజ్‌కుమార్ (25) తాపీ మేస్త్రిగా పనిచేస్తుంటాడు. అతడికీ అదే జిల్లా కిర్లంపూడి మండలం సోమవరం గ్రామానికి చెందిన మల్లిరెడ్డి దుర్గాపావని (18)కి పెళ్లి కుదిరింది. వారిద్దరికీ వచ్చే నెల 10న పెళ్లి చేసేందుకు పెద్దలు సుముహూర్తం నిర్ణయించారు. పెళ్లి పనుల్లో భాగంగా పెళ్లి దుస్తులు కొనుక్కునేందుకు మంగళవారం ఆ జంట బైక్‌పై తూర్పు గోదావరి జిల్లా కేంద్రం రాజమహేంద్రవరం బయలు దేరారు. కొంతమూరు గామన్ బ్రిడ్జి రోడ్డులోని వంతెన వద్దకు రాగానే..తమిళనాడుకు చెందిన లారీ వెనుక నుంచి వారి బైక్‌ను బలంగా ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరూ లారీ కింద పడి అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. రాజానగరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కొద్ది రోజుల్లో పెళ్లి కావాల్సిన వారు దుర్మరణం పాలవడంతో ఇరు వర్గాల బంధువులూ కన్నీరు మున్నీరుగా విలపించారు.

తెలుగు తమ్ముళ్ల బాహాబాహీ



దాడి చేసుకుంటున్న టీడీపీ శ్రేణులు



దాడిలో గాయపడిన కొండగేని చిన్న కోసిగయ్య

- లోకేశ్ యువగళం యాత్ర సందర్భంగా టీడీపీ కార్యకర్తల అతి
- తిక్కారెడ్డి, ఉలిగయ్య వర్గాల మధ్య ఘర్షణ

మంత్రాలయం: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్రలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పరస్పరం కర్రలతో కొట్టుకున్నారు. లోకేశ్ పాదయాత్ర మంగళవారం మంత్రాలయం నియోజకవర్గంలోకి ప్రవేశించగా.. నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాలకుర్తి తిక్కారెడ్డి, వాల్మీకి నేత ఉలిగయ్య, ముత్తరెడ్డి వర్గాల మధ్య అగ్గి రాజుకుంది. కోసిగిలోని రేణుక యల్లమాంబ మైదానంలో బహిరంగ సభ ఏర్పాటు చేయగా.. ప్రసంగాలు ముగిసిన వెంటనే తిక్కారెడ్డి, ఉలిగయ్య వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇరువర్గాల నేతలు, కార్యకర్తలు ఫ్లెక్సీల కర్రలు, రాళ్లతో విచక్షణ రహితంగా కొట్టుకున్నారు. మరోవైపు రేణుక హోటల్ ముందుకూడా 20 నిమిషాల పాటు గొడవ జరిగింది. ఘర్షణలో కోసిగికి చెందిన వాల్మీకి కార్యకర్త కొండగేని చిన్న కోసిగయ్య, ఎద్దలదొడ్డి ముత్తన్న కొడుకు నర్సిరెడ్డి గాయపడ్డారు. తిక్కారెడ్డి వర్గానికి చెందిన మాజీ సర్పంచ్‌లు మాధవరం నరసింహులు, కృష్ణారెడ్డితోపాటు మరో ఇద్దరు అనుచరులకు గాయాలయ్యాయి. ఎస్ఐలు రాజారెడ్డి, నరేంద్రరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని తమ్ముళ్లను చెదరగొట్టారు.

వరికెపూడిసెలకు 19.13 హెక్టార్ల అటవీభూమి

ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు వెల్లడి



కేంద్ర అటవీశాఖా మంత్రి భూపేంద్ర యాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ లావు (ఫైల్)

నరసరావుపేట: పల్నాటి ప్రాంత వాసుల ఏడు దశాబ్దాల కల, అతిపెద్ద నీటి ప్రాజెక్టు వరికెపూడిసెల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణంలో కీలకమైన వైల్డ్‌లైఫ్ (వన్యప్రాణుల) కేంద్రం అనుమతులు ఇచ్చిందని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం ప్రభుత్వం నుంచి పంపిన నివేదికలను పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం నేషనల్ బోర్డ్ ఆఫ్ వైల్డ్‌లైఫ్ క్లియరెన్స్ నుంచి అనుమతులను మంగళవారం జారీచేసిందని తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో ముఖ్యభాగాలైన పంప్ హౌస్, ప్రెజర్‌మెయిన్, బ్రేక్‌ప్రెజర్ ట్యాంక్, ఇతర నిర్మాణాలు చేపట్టేందుకు కావాల్సిన భూమి అటవీప్రాంతంలో ఉందని, ఇది నాగార్జునసాగర్, శ్రీశైలం పులుల అభయారణ్యంలో ప్రధాన రాజీవ్‌గాంధీ వన్యప్రాణుల అభయారణ్య ప్రాంతమని వివరించారు. ఈ ప్రాజెక్టు కోసం 19.13 హెక్టార్ల అటవీభూమిని కేటాయించేందుకు కేంద్రం అనుమతి ఇచ్చిందని తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం తనతోపాటు మాచర్ల శాసనసభ్యుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఎంతో కృషిచేశారని తెలిపారు. వెల్దుర్తి మండలంలోని గంగలకుంట సమీపంలో నల్లమడ అటవీ ప్రాంతంలో నిర్మించే ఈ ప్రాజెక్టు ద్వారా మాచర్ల, వినుకొండ నియోజకవర్గాల్లోని వెల్దుర్తి, దుర్గి, బొల్లాపల్లి మండలాల్లో 50 వేల నుంచి 70 వేల ఎకరాలకు సాగునీరు, 4.5 లక్షలమందికి తాగునీరు అందుతుందని ఆయన వివరించారు.


చిత్తూరులో కిడ్నాప్ కలకలం

- క్వారీ లీజుదారు సోదరుడి అపహరణ, నిర్బంధం
- టీడీపీకి చెందిన మాజీ మేయర్ కుమార్తె, అల్లుడు, అనుచరులపై కేసు

చిత్తూరు అర్బన్: గ్రానైట్ ఫ్యాక్టరీ లీజుదారుడి సోదరుడిని టీడీపీ నేతలు కిడ్నాప్ చేసి నిర్బంధించిన సంఘటన చిత్తూరు జిల్లాలో సంచలనం కలిగించింది. ఈ వ్యవహారంలో టీడీపీకి చెందిన కటారి లావణ్య, నామె భర్త కిరణ్, మేనేజర్ దేవ, ప్రసన్నలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రసన్నను అరెస్టు చేశారు. చిత్తూరు టూటౌన్ స్టేషన్‌లో టూటౌన్ సీఐ మద్దయ్య ఆచారి మంగళవారం ఈ కేసు వివరాలు వెల్లడించారు. చిత్తూరుకు చెందిన టీడీపీ నేత, దివంగత మేయర్ కటారి అనురాధ కుమార్తె లావణ్యకు బంగారుపాళ్యం మండలంలో ఉన్న గ్రానైట్ క్వారీని ఏడాదిన్నర కిందట రాజస్థాన్‌లోని నాగూర్ జిల్లా రియాన్‌బడీ పోస్టుకు చెందిన వినోద్ లీజుకు తీసుకున్నాడు. అడ్వాన్సుగా రూ.6 లక్షలు ఇచ్చిన అతడు ప్రతినెలా రూ.1.20 లక్షలు అద్దె చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నాడు. వినోద్ తమ్ముడు అశోక్ కూడా అక్కడే పనిచేసేవాడు. రెండు నెలలుగా వ్యాపారం లేకపోవడంతో ఫ్యాక్టరీలో పనులు ఆపేసి లీజును రద్దు చేసుకుని, అడ్వాన్సుగా ఉన్న రూ.6 లక్షలు తీసుకురావాలని అశోక్‌కు చెప్పి వినోద్ వెళ్లిపోయాడు. ఆదివారం రాత్రి 7.30 గంటల ప్రాంతంలో కటారి లావణ్య, ఆమె భర్త కిరణ్, మేనేజర్ దేవ, ప్రసన్న బంగారుపాళ్యంలో ఇంటివద్ద ఉన్న అశోక్‌ను తమ వాహనంలో ఎక్కించుకుని క్వారీ వద్దకు తీసుకెళ్లారు. తమకు మొత్తం రూ.12 లక్షలు ఇవ్వాలని చెప్పారు. అడ్వాన్సుగా ఉన్న రూ.6 లక్షలు పోను మరో రూ.6 లక్షలు ఇవ్వాలని బెదిరించారు. తనవద్ద అంత డబ్బు లేదన్న అశోక్‌ను వాహనంలో చిత్తూరు తీసుకొచ్చి సంతపేటలోని ప్రసన్న ఇంటి పైఅంతస్తులో నిర్బంధించారు. అశోక్ వద్ద సెల్‌ఫోన్ అలాగే ఉంచి రాజస్థాన్ నుంచి డబ్బులు తెప్పించాలని బెదిరించారు. సోమవారం వరకు అదే గదిలో ఉన్న బాధితుడు తన కుటుంబ సభ్యులకు, స్నేహితుడికి ఫోన్‌చేసి ఈ విషయం చెప్పాడు. ఆ స్నేహితుడు రాత్రి 7.30 గంటల ప్రాంతంలో డయల్–100 ద్వారా పోలీసు కమాండ్ కంట్రోల్‌కు సమాచారం అందించాడు. పోలీసులు వెంటనే సంతపేటలోని ప్రసన్న ఇంట్లో ఉన్న అశోక్‌ను రక్షించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురిపై కిడ్నాప్, ఇతర సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. వీరిలో కటారి లావణ్య, కిరణ్, దేవలకు నోటీసులు ఇచ్చి, రౌడీషీట్‌తో పాటు ఎనిమిది క్రిమినల్ కేసులు ఉన్న ప్రసన్నను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ వివరించారు.

పురాతన విగ్రహాలు లభ్యం

గుర్తించిన శాసన పరిశోధకుడు జ్యోతి చంద్రమౌళి



లభించిన పురాతన విగ్రహాలు

అద్దంకి: బాపట్ల జిల్లా అద్దంకి మండలంలోని బొమ్మనంపాడు గ్రామంలో క్రీస్తు శకం 13, 14వ శతాబ్దానికి చెందిన విగ్రహాలను గుర్తించినట్లు శాసన పరిశోధకుడు జ్యోతి చంద్రమౌళి మంగళవారం తెలిపారు. బొమ్మనంపాడు గ్రామంలోని లక్ష్మీనారాయణస్వామివారి దేవస్థాన పరిసరాల్లో ఐదు విగ్రహాలు పడేసి ఉన్నాయని గ్రామస్తుల నుంచి సమాచారం అందుకున్న చంద్రమౌళి అక్కడకు వెళ్లి వాటిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఐదు విగ్రహాలు రెడ్డి రాజుల కాలమైన 13, 14వ శతాబ్దాలకు చెందినవని చెప్పారు. ఆ ప్రదేశంలో 17వ శతాబ్దం వరకు శివాలయం ఉండేదని, తరువాత అది శిథిలం కావడంతో ఆ స్థలంలో లక్ష్మీనారాయణస్వామి ఆలయం కట్టారని తెలిపారు. లభించిన విగ్రహాల్లో ఒకటి భిక్షాటన రూపంలో ఉన్న శివుడు, రెండోది వినాయక విగ్రహం వీరగల్లు, సగం విరిగిపోయిన కాలభైరవుని విగ్రహం, భక్తాంజనేయ విగ్రహాలు లభించాయి. ఆ క్రమంలో ఐదు విగ్రహాలను పాడుబడిన కోనేరులో పూడ్చిపెట్టగా బయల్పడ్డాయని చెప్పారు.

క్లుప్తంగా

పరువు నష్టం కేసు.. గుజరాత్ హైకోర్టుకు రాహుల్

అహ్మదాబాద్: పరువు నష్టం కేసులో స్టేకు సూరత్ సెషన్స్ కోర్టు నిరాకరించడాన్ని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మంగళవారం గుజరాత్ హైకోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్ విచారణకు రానుందని ఆయన తరఫు లాయర్ చెప్పారు. ఈ కేసులో రాహుల్‌కు రెండేళ్ల జైలు శిక్ష పడటం, అనర్హత వేటు పడటం తెలిసిందే.

సీఎం యోగిని చంపుతానంటూ ఫోన్..


లక్నో: యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను చంపేస్తానంటూ బెదిరింపు కాల్ రావడం కలకలం సృష్టించింది. తీరా అది తన ప్రేయసి తండ్రిని ఇరుకున పెట్టేందుకు ఓ యువకుడు చేసిన నిర్వాకమని తేలింది. 'త్వరలోనే సీఎం యోగిని చంపేస్తా' అంటూ పోలీసులకు మంగళవారం సెల్ సందేశం అందింది. అది లక్నోకు చెందిన సజ్జాద్ హుస్సేన్ ఫోన్‌గా తేలింది. తన ఫోన్ రెండు రోజుల క్రితమే పోయిందని అతడు విచారణలో తెలిపాడు. ఫోన్‌ను సజ్జాద్ కూతుర్ని ప్రేమిస్తున్న అమీన్ (18) ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. తమ ప్రేమను అంగీకరించనందుకు సజ్జాద్‌ను తప్పుడు కేసులో ఇరికించేందుకు అమీన్ ఈ పని చేసినట్టు తేలింది. అతనిపై దొంగతనం సహా పలు కఠిన సెక్షన్ల కింద కేసులు పెట్టారు.

యూకేలో తొలి జగన్నాథాలయానికి రూ.250 కోట్ల విరాళం

లండన్: యూకేలోని లండన్‌లో తొలి జగన్నాథాలయ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధమైంది. ఇందుకు రూ.250 కోట్లిచ్చేందుకు భారత సంతతికి చెందిన ఫిన్‌నెస్ట్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ వ్యవస్థాపకుడు బిశ్వనాథ్ పట్నాయక్ ముందుకొచ్చారు. యూకేకు చెందిన శ్రీ జగన్నాథ సొసైటీ ఈ ఆలయాన్ని నిర్మించనుంది.

మన్ కీ బాత్ @100 జాతీయ సదస్సు నేడు

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధానమంత్రి మోదీ మాసాంతపు 'ఆలిండియా రేడియో' ప్రాసంగిక కార్యక్రమం మన్ కీ బాత్ 100 ఎపిసోడ్లు పూర్తయిన సందర్భంగా కేంద్ర సమాచార ప్రసార శాఖ జాతీయ సదస్సు నిర్వహించనుంది. దీన్ని బుధవారం ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ప్రారంభించనున్నారు. సదస్సులో నాలుగు ప్రత్యేకచర్చా కార్యక్రమాలుంటాయి. వీటిలో నటులు అమీర్ ఖాన్, రవీనాటాండన్, తెలంగాణ నుంచి నిఖత్ జరీన్, పూర్ణ మలావత్‌లతో పాటు మన్ కీ బాత్‌లో ప్రధాని ప్రస్తావించిన 100 మందికి పైగా ప్రత్యేక ఆహ్వానితులు హాజరుకానున్నారు. 'మన్ కీ బాత్' 100 ఎపిసోడ్‌లకు గుర్తుగా పోస్టల్ స్టాంప్, నాణేలను హోంమంత్రి అమిత్ షా విడుదల చేయనున్నారు.



ఆనంద్ మోహన్

తెలుగు ఐఏఎస్ అధికారిని పొట్టనబెట్టుకున్న...

గ్యాంగ్‌స్టర్‌ను వదిలేశారు!

నిబంధనలను మార్చేసి మరీ మాజీ ఎంపీ ఆనంద్ మోహన్‌కు నితీశ్ సర్కారు రెమిషన్

సర్వత్రా విమర్శలు | ప్రస్తుతం జీవిత ఖైదు అనుభవిస్తున్న మోహన్ | రేప్ కేసులున్న మాజీ ఎమ్మెల్యేలకూ క్షమాభిక్ష

పట్నా: అతనో పేరుమోసిన గ్యాంగ్‌స్టర్. మాజీ ఎంపీ కూడా. పేరు ఆనంద్ మోహన్. దాదాపు 30 ఏళ్ల కింద బిహార్‌లో ఏకంగా ఐఏఎస్ అధికారిపైకే మూకను ఉసిగొల్పి అత్యంత పాశవికంగా రాళ్ల దాడి చేయించి పొట్టన పెట్టుకున్నాడు. ఆ కేసులో 15 ఏళ్లుగా జీవితఖైదు అనుభవిస్తున్నాడు. అలాంటి వ్యక్తికి క్షమాభిక్ష ప్రసాదించి విడుదల చేస్తూ నితీశ్‌కుమార్ సర్కారు వివాదాస్పద నిర్ణయం తీసుకుంది. అందుకోసం ఏకంగా జైలు నిబంధనలనే మార్చేసింది! ఆనంద్‌తో సహా పలు తీవ్ర నేరాలకు పాల్పడి జీవితఖైదు అనుభవిస్తున్న మరో 26 మంది దోషుల విడుదలకు సోమవారం రాత్రి నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రస్తుతం పెరోల్ మీద ఉన్న అతడు ఆ సమయంలో తన కుమారుడైన ఆర్జేడీ ఎమ్మెల్యే చేతన్ ఆనంద్ నిశ్చితార్థ వేడుకను ఆస్వాదిస్తున్నాడు! నితీశ్‌తో పాటు ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్, బిహార్‌లోని రాజకీయ తదితర రంగాల ప్రముఖులంతా అందులో పాల్గొన్నారు. తనకు విముక్తి ప్రసాదిస్తున్నందుకు నితీశ్‌కు ఆనంద్ మోహన్ కృతజ్ఞతలు తెలిపాడు. త్వరలో డెహ్రాడూన్‌లో జరిగే కొడుకు పెళ్లిని కూడా దగ్గరుండి జరిపించుకుంటానంటూ హర్షం వెలిబుచ్చాడు. పెరోల్ ముగియడంతో మంగళవారం జైలుకు తిరిగి వెళ్లిన అతను బుధవారం రెమిషన్‌పై విడుదల కానున్నాడు. నితీశ్ సర్కారు నిర్ణయంపై ఇంటా బయటా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీఎస్పీ, బీజేపీతో పాటు ఐఏఎస్ అధికారుల సంఘం కూడా దీన్ని తీవ్రంగా తప్పుబట్టగా అధికార జేడీ(యూ) మాత్రం సమర్థించుకుంది. క్షమాభిక్ష జాబితాలో మైనర్‌పై అత్యాచారం కేసులో దోషి ఆర్జేడీ మాజీ ఎమ్మెల్యే రాజ్ బల్లభ్ యాదవ్, పలు తీవ్ర క్రిమినల్ కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న జేడీ(యూ) మాజీ ఎమ్మెల్యే అవధేశ్ మండల్ కూడా ఉన్నారు.

ఏం జరిగింది?



జి.కృష్ణయ్య

1994లో లాలుప్రసాద్ యాదవ్ హయాంలో బిహార్లో చోటా శుక్లా అనే కరడుగట్టిన గ్యాంగ్‌స్టర్‌ను ఓబీసీ సామాజిక వర్గానికి చెందిన గ్యాంగ్‌స్టర్ బ్రిజ్ బిహారీ ప్రసాద్ సానుభూతిపరులు దారుణంగా కాల్చి చంపారు. మండల్ రిజర్వేషన్లపై దేశమంతా అట్టుడుకున్న వేళ అగ్రవర్ణ భూమిహార్ అయిన శుక్లా హత్య రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. డిసెంబర్ 5న శుక్లా అంతిమ యాత్ర సందర్భంగా ఆనంద్ మోహన్ పిలుపు మేరకు వేలాది మంది రోడ్లపైకి వచ్చి విధ్వంసానికి దిగారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న గోపాల్‌గంజ్ కలెక్టర్ అయిన తెలంగాణకు చెందిన దళిత ఐఏఎస్ అధికారి జి.కృష్ణయ్యను కార్లోంచి బయటికి లాగి రాళ్లతో విచక్షణారహితంగా కొట్టి పొట్టన పెట్టుకున్నారు. ఆనంద్ మోహన్ దగ్గరుండి మరీ వారిని ఈ దాడికి ప్రేరేపించినట్టు చెబుతారు. ఈ కేసులో జైల్లో ఉండగానే ఎంపీగా గెలిచాడు. 2007లో కింది కోర్టు మరణశిక్ష విధించింది. దాంతో స్వతంత్ర భారత చరిత్రలో మరణశిక్ష పడ్డ తొలి రాజకీయ నాయకునిగా రికార్డుకెక్కాడు. తర్వాత దాన్ని పట్నా హైకోర్టు జీవితఖైదుగా మార్చింది. అప్పట్నుంచీ అతడు జైల్లోనే ఉన్నాడు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ అధికారుల హత్యకు, అత్యాచారాలకు పాల్పడ్డవారికి రెమిషన్ మంజూరు చేయరాదన్న నిబంధనను నితీశ్ సర్కారు తాజాగా తొలగించింది. ఈ మేరకు రాష్ట్ర జైలు మాన్యువల్‌ను సవరిస్తూ ఏప్రిల్ 10న నిర్ణయం తీసుకుంది. ఇది కేవలం ఆనంద్ మోహన్ విడుదల కోసమేనని అప్పట్నుంచీ ఆరోపణలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. నితీశ్‌తో అతని బంధం ఇప్పటిది కాదు. వారిద్దరూ సమతా పార్టీ సహ వ్యవస్థాపకులు.



సోమవారం ఆనంద్ మోహన్ కుమారుడు చేతన్ నిశ్చితార్థంలో ఆయనతో పాటు పాల్గొన్న నితీశ్, తేజస్వి

కృష్ణయ్య... అట్టడుగు నుంచి ఎదిగిన తెలుగు తేజం

మూక దాడికి బలైన ఐఏఎస్ జి.కృష్ణయ్య తెలంగాణలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నిరుపేద దళిత కుటుంబంలో పుట్టారు. ఇల్లు గడిచేందుకు తండ్రితో పాటు కూలి పనికి వెళ్లారు. జర్నలిజం కోర్సు చేసిన అనంతరం కొంతకాలం క్లర్కుగా, లెక్చరర్‌గా పని చేశారు. 1985లో సివిల్స్ ర్యాంకు కొట్టి ఐఏఎస్‌గా బిహార్ క్యాడర్‌కు ఎంపికయ్యారు. పేదల పక్షపాతిగా పేరు తెచ్చుకున్నారు. రోజూ విధిగా ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకునేవారు. ఆయన దొరికిన తొలి పోస్టింగే బందిపోట్లకు, కిడ్నాపర్లకు స్వర్గధామంగా పిలిచే వెస్ట్ చంపారన్ జిల్లాలో! తన పనితీరుతో జిల్లాకున్న చెడ్డపేరుతో పాటు దాని రూపురేఖలనే సమూలంగా మార్చేశారని అక్కడ ఇప్పటికీ చెప్పుకుంటారు. తర్వాత నాటి సీఎం లాలు సొంత జిల్లా గోపాల్‌గంజ్ కలెక్టర్‌గా ఉండగా హత్యకు గురయ్యారు. అప్పుడాయనకు కేవలం 35 ఏళ్లు! ఈ దారుణంపై సీఎం హోదాలో లాలు పేలవ స్పందన తీవ్ర విమర్శలపాలైంది. కృష్ణయ్యకు నివాళులర్పించేందుకు వచ్చిన లాలును వెళ్లిపొమ్మని ఆయన భార్య ఉమా దేవి తెగేసి చెప్పడం అప్పట్లో సంచలనం సృష్టించింది. నేరగాళ్లను జైళ్లలోంచి విడుదల చేసి విచ్చలవిడిగా సమాజంపైకి ఉసిగొల్పే ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం ఎక్కడుంటుందన్న ఆమె ప్రశ్న చాలాకాలం అందరి మనసులనూ తొలిచేసింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఇప్పటికీ మాఫియా రాజ్యమే

కృష్ణయ్య భార్య ఉమ ఆవేదన



ఆనంద్ మోహన్ విడుదల వార్తతో దివంగత ఐఏఎస్ కృష్ణయ్య భార్య ఉమ షాకయ్యారు. తన గుండె పగిలిందంటూ కన్నీటి పర్యంతమయ్యారు. కేవలం కొన్ని రాజ్‌పుత్ ఓట్ల కోసం ఒక దారుణమైన ఒరవడికి నితీశ్ సర్కారు శ్రీకారం చుట్టిందని దుయ్యబట్టారు. ''ఆనంద్ మోహన్ మరణశిక్ష ఇతర నేరగాళ్లకు ఓ హెచ్చరికలా, నికార్సైన అధికారులకు భరోసాగా ఉంటుందని ఆశపడ్డా. కానీ దాన్ని జీవితఖైదుకు తగ్గించారు. దానికే నేను తల్లడిల్లిపోతే ఇప్పుడేమో ఆ శిక్షనూ రద్దు చేస్తున్నారు. అప్పటికీ ఇప్పటికీ బిహార్లో మాఫియా రాజ్యమే నడుస్తోందని మరోసారి రుజువైంది. ప్రభుత్వాధికారులపై దాడులకు తెగబడేందుకు నేరగాళ్లకు ఇది మరింత ప్రోత్సాహమిస్తుంది. ఆనంద్ మోహన్ వంటి నేరగాళ్లు, వాళ్ల కుటుంబీకులే ఇంకా తమకు రాజకీయ ప్రాతినిధ్యం వహించాలా అన్నది రాజ్‌పుత్‌లు ఆలోచించుకోవాలి'' అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ జోక్యం చేసుకుని ఈ నిర్ణయం రద్దయ్యేలా చూడాలని కోరారు. ''ఇలాంటి కేసుల్లో దోషులు జీవితాంతం జైల్లో గడపాల్సిందే. అందుకే నితీశ్ సర్కారు నిర్ణయంపై పట్నా హైకోర్టుకు, సుప్రీం కోర్టుకు వెళ్లే ఆలోచన ఉంది. దీనిపై నా భర్త బ్యాచ్ ఐఏఎస్ అధికారులతో చర్చిస్తున్నా'' అని వెల్లడించారు. కృష్ణయ్య దంపతులకు ఇద్దరు కూతుళ్లు. తండ్రిని కోల్పోయేనాటికి వారికి పెద్ద కూతురు నిహారికకు ఏడేళ్లు, చిన్నమ్మాయి పద్మకు ఐదేళ్లు. వారిని తీసుకుని ఉమ హైదరాబాద్ వచ్చి స్థిరపడ్డారు. బేగంపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో లెక్చరర్‌గా రిటైరయ్యారు. నిహారిక బ్యాంక్ మేనేజర్‌గా, పద్మ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారు.

ఉడుకుతున్న పప్పులు

భగ్గుమంటున్న ధరలు, కేంద్రం అప్రమత్తం

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా పప్పుధాన్యాల ధరలు పెరుగుతుండడంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలు, వడగళ్ల వానల కారణంగా చాలా రాష్ట్రాల్లో పంటలు దెబ్బతింటున్నాయి. ఈ ప్రభావం పప్పు ధాన్యాల ధరలపై పడకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు ప్రారంభించింది. పప్పు ధాన్యాల నిల్వల వివరాలను ఎప్పటికప్పుడు వెల్లడించాలని టోకు వ్యాపారులు, మిల్లర్లను ఆదేశించింది. అంతేకాకుండా దిగుమతులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. దేశంలో పప్పు ధాన్యాల సాధారణ సాగు విస్తీర్ణం 1.67 కోట్ల హెక్టార్లు కాగా, గత ఏడాది 1.27 కోట్ల హెక్టార్లకు పడిపోయింది. కంది, మినుము అధికంగా సాగయ్యే మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్తాన్ రాష్ట్రాల్లో గత ఏడాది కురిసిన భారీ వర్షాలతో పంటలకు భారీగా నష్టం వాటిల్లింది. ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలతో ఈ నష్టం మరింత పెరుగనుంది. ఫలితంగా ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయే పరిస్థితి కనిపిస్తోంది. ఈ ఏడాది కందిపప్పు ఉత్పత్తి 36 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ఉంటుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. వాస్తవానికి ఇది గత ఏడాది ఉత్పత్తి కంటే 6 లక్షల మెట్రిక్ టన్నులు తక్కువ. మినప ఉత్పత్తిలోనూ 3 నుంచి 5 శాతం తగ్గుదల కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో గడిచిన నెల రోజులుగా పప్పుల ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. గ్రేడ్–1 కందిపప్పు ఇప్పటికే చాలా రాష్ట్రాల్లో కిలో రూ.125 నుంచి రూ.135 దాకా పలుకుతోంది. మిగతా పప్పుల ధరలు సైతం 8 నుంచి 10 శాతం వరకూ పెరిగాయి. దేశీయ, విదేశీ మార్కెట్లలో పప్పుల లభ్యత, ధరలను నిశితంగా పరిశీలిస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. నిత్యావసర వస్తువుల చట్టం ప్రకారం పప్పు ధాన్యాల స్టాక్ హోల్డర్లు, టోకు వ్యాపారులు, రిటైలర్లు, మిల్లర్లు తమ వద్ద ఉన్న నిల్వలను బహిర్గతం చేయాలని ఆదేశించింది. దేశవ్యాప్తంగా 28.66 లక్షల టన్నుల పప్పు ధాన్యాల నిల్వలు ఉన్నట్టు ప్రభుత్వం తేల్చింది. వివిధ పోర్టుల్లో ఉన్న నిల్వలను పరిశీలించింది. ఈ వివరాలను నాఫెడ్ వెబ్‌సైట్‌లో పొందుపర్చింది. ఎక్కడైనా నిల్వలు తగ్గిపోతే మరొక చోటు నుంచి దిగుమతి చేసుకోవాలని సూచించింది. కంది, పెసర, మినప పప్పుల ధరలు పెరగకుండా చూడాలని అధికారులకు కేంద్ర ఆహార శాఖ ఆదేశాలు జారీ చేసింది.



వజ్రాలు పొదిగిన దంతాల సెట్ ఇది. ఓ కస్టమర్ ఆర్డర్ మేరకు సూరత్‌లో ఓ వజ్రాభరణాల సంస్థ దీన్ని తయారు చేసింది.

బాదల్ కన్నుమూత



చండీగఢ్/న్యూఢిల్లీ: పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి, శిరోమణి అకాలీ దళ్ అగ్రనేత ప్రకాశ్‌సింగ్ బాదల్ (95) ఇక లేరు. చాలారోజులుగా మొహాలీలోని ఓ ఫోర్టిస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం రాత్రి కన్నుమూశారు. ఆయన ఏడాది జనవరిలో కరోనా బారినపడి కోలుకున్నారు. గ్యాస్ట్రైటిస్, బ్రాంకియల్ ఆస్తమాతో బాధపడుతూ గత ఏడాది జూన్‌లో మళ్లీ చికిత్స పొందారు.

ఐదుసార్లు పంజాబ్ సీఎం


బాదల్ 1927 డిసెంబర్ 8న పంజాబ్‌లోని అబుల్ ఖురానా గ్రామంలో జాట్ సిక్కు కుటుంబంలో జన్మించారు. లాహోర్‌లోని ఫార్మన్ క్రిస్టియన్ కాలేజీలో చదివారు. 1947లో రాజకీయాల్లో అడుగుపెట్టారు. గ్రామ సర్పంచ్‌గా, బ్లాక్ సమితి చైర్మన్‌గా మొదలై 1957లో కాంగ్రెస్ టికెట్‌పై ఎమ్మెల్యే అయ్యారు. 1969లో శిరోమణి అకాలీ దళ్ టికెట్‌పై మళ్లీ గెలిచారు. 1986లో శిరోమణి అకాలీ దళ్ (బాదల్) పార్టీని స్థాపించారు. 1970–71, 1977–80, 1997–2002, 2007–2012, 2012–2017 ఇలా ఐదుసార్లు పంజాబ్ సీఎంగా చేశారు. గతేడాది పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల బరిలో 13వసారి పోటీ చేశారు. దేశంలోనే అత్యంత వృద్ధ అభ్యర్థిగా రికార్డుకెక్కినా ఓటమి పాలయ్యారు. ఏడు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఆయనకిది రెండో ఓటమి. ఎంపీగా కూడా నెగ్గిన ఆయన కేంద్ర వ్యవసాయ, సాగునీటి పారుదల మంత్రిగా పనిచేశారు. ఆయన భార్య సురీందర్ కౌర్ 2011లో మరణించారు. కుమారుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ పంజాబ్ ఉప ముఖ్యమంత్రిగా చేశారు.

గొప్ప నాయకుడు బాదల్: మోదీ

బాదల్ మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం ప్రకటించారు. ఆయన మరణం తనకు వ్యక్తిగతంగా నష్టమన్నారు. దేశ రాజకీయాల్లో ఆయన గొప్ప నాయకుడు, ఉన్నత రాజనీతిజ్ఞుడు అని కీర్తించారు. పంజాబ్ అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేశారని ప్రశంసించారు. ఎన్నో సంక్షోభాల నుంచి పంజాబ్‌ను గట్టెక్కించారంటూ మోదీ ట్వీట్ చేశారు. బాదల్ నుంచి తాను ఎన్నో విషయాలు నేర్చుకున్నానని తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తదితరులు బాదల్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

మళ్లీ ఎన్నికల బరిలోకి

అమెరికా అధ్యక్షుడు బైడెన్ అధికారిక ప్రకటన ● మళ్లీ రన్నింగ్ మేట్‌గా ఉపాధ్యక్షురాలు కమల



రిపబ్లికన్ల అతివాదంపై పోరు



2024 ఎన్నిలను రిపబ్లికన్ల అతివాదంపై పోరుగా బైడెన్ అభివర్ణించారు. అబార్షన్ హక్కులు, ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక భద్రత చట్టం వంటివి ఎన్నికల్లో ప్రధానాంశాలన్నారు. ''గత అధ్యక్ష ఎన్నికలను అమెరికా ఆత్మను పరిరక్షించేందుకు జరిగిన పోరు. అదింకా కొనసాగుతూనే ఉంది. మన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, హక్కులు మున్ముందు మరింత వికసిస్తాయా, కుదించుకుపోతాయా అన్నది ఇప్పుడు మనందరి ముందున్న పెద్ద ప్రశ్న. రానున్న ఎన్నికలు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పిడికిలి బిగించేందుకు తరానికి ఒక్కసారే వచ్చే అవకాశం. రండి అందరమూ కలిసికట్టుగా పని పూర్తి చేద్దాం'' అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటంలో కలసి రావాల్సిందిగా అనంతరం కమల కూడా ఒక ప్రకటనలో అమెరికన్లకు పిలుపునిచ్చారు. ''దేశ చరిత్రలో ఇది అత్యంత కీలక సమయం. స్వేచ్ఛ తదితర మౌలిక హక్కులపై రిపబ్లికన్ అతివాదుల దాడి నానాటికీ పెరిగిపోతోంది. మహిళకు తన శరీరానికి సంబంధించిన నిర్ణయాలపై హక్కులను హరించజూస్తున్నారు. ఓటు హక్కునూ వదల్లేదు. ప్రజల గొంతు నొక్కేందుకూ ప్రయత్నిస్తున్నారు. రిపబ్లికన్ల అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం ప్రయత్నిస్తున్న వాళ్లు దేశాన్ని తిరోగమనంలోకి నెట్టజూస్తున్నారు'' అంటూ మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై విమర్శలు ఎక్కుపెట్టారు. రిపబ్లికన్ల తరఫున అధ్యక్ష అభ్యర్థి రేసులో ట్రంప్ ముందున్న విషయం తెలిసిందే. భారత అమెరికన్లు నిక్కీ హేలీ, వివేక్ రామస్వామి తదితరులు ఆయనకు పోటీదారులుగా ఉన్నారు.

వాషింగ్టన్: అసంపూర్తిగా ఉన్న బాధ్యతలను పూర్తి చేసేందుకు తనకు మరో అవకాశమివ్వాలని అమెరికా ప్రజలను అధ్యక్షుడు జో బైడెన్ (80) కోరారు. వచ్చే ఏడాది జరగబోయే అధ్యక్ష ఎన్నికల బరిలో దిగుతున్నట్టు అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన మూడు నిమిషాల వీడియోతో ఎన్నికల ప్రచారానికి ఆయన అధికారికంగా శ్రీకారం చుట్టారు. భారత సంతతికి చెందిన ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌నే మరోసారి తన రన్నింగ్ మేట్‌గా ఎంచుకున్నారు. డెమొక్రటిక్ పార్టీకి చెందిన బైడెన్ అమెరికా చరిత్రలో అత్యంత ఎక్కువ వయసున్న అధ్యక్షుడు. ఇక కమల దేశ తొలి మహిళా వైస్ ప్రెసిడెంట్‌గారికార్డు సృష్టించారు.

బైడెన్‌పై ట్రంప్ ధ్వజం: బైడెన్ అమెరికా చరిత్రలోనే అత్యంత అవినీతిపరుడైన అధ్యక్షుడని ట్రంప్ ఆరోపించారు. ''ప్రపంచ వేదికపై దేశ పరువు ప్రతిష్టలను ఆయన పూర్తిగా మంటగలిపారు. తన చేతగానితనంతో అమెరికాను మూడో ప్రపంచ యుద్ధం ముంగిట నిలబెట్టారు'' అంటూ నిప్పులు చెరిగారు. బైడెన్ అధికార ప్రకటనకు కాస్త ముందు ట్రంప్ మీడియాతో మాట్లాడారు. అఫ్గానిస్తాన్ నుంచి వైదొలగడాన్ని అమెరికా చరిత్రలోనే అత్యంత సిగ్గుచేటైన విషయంగా అభివర్ణించారు.

ముస్లింలకు మే 9 దాకా కోటా

కర్ణాటక ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ/ధార్వాడ: కర్ణాటకలో రిజర్వేషన్లలో ముస్లింలకు 4 శాతం కోటాను మే 9వ తేదీ దాకా కొనసాగించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. వారికి 4 శాతం కోటాను రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై న్యాయమూర్తులు జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. కర్ణాటక ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కౌంటర్ దాఖలుకు గడువు కోరడంతో తదుపరి విచారణను మే 9వ తేదీకి వాయిదా వేసింది. విచారణ పూర్తయ్యేదాకా ముస్లింలకు 4 శాతం కోటాను నిర్ణయాన్ని అమలు చేయబోమని కర్ణాటక సీఎం బసవరాజ్ బొమ్మై చెప్పారు.

పాక్ ఠాణాలో భారీ పేలుళ్లు

18 మంది మృతి, 70 మందికి గాయాలు

పెషావర్: పాకిస్తాన్‌లోని ఓ పోలీస్ స్టేషన్‌లో భారీగా సంభవించిన పేలుళ్లతో 18 మంది చనిపోగా, మరో 70 మంది గాయాలపాలయ్యారు. ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా ప్రావిన్స్‌లోని స్వాత్ జిల్లా కబాల్‌లోని కబాల్ ఉగ్ర వ్యతిరేక విభాగం పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. దీని వెనుక ఉగ్రకోణం లేదని, విద్యుత్ షార్ట్ సర్క్యూటే కారణమని పోలీసులన్నారు. మృతుల్లో ఒక చిన్నారి, 12 మంది పోలీసులు, ఇద్దరు అనుమానిత ఉగ్రవాదులు సహా నలుగురు ఖైదీలున్నట్టు చెప్పారు. పేలుళ్ల తీవ్రతకు పక్కనున్న మసీదులు, ఇళ్లు, స్కూల్ భవనం గోడలు, పైకప్పు కూడా కూలిపోయాయి.

సూడాన్‌ను వీడిన 278 మంది భారతీయులు

న్యూఢిల్లీ: హింస, అంతర్యుద్ధంతో అట్టుడుకుతున్న సూడాన్ నుంచి భారతీయులను సురక్షితంగా వెనక్కి తీసుకువచ్చేందుకు కేంద్రం చేపట్టిన 'ఆపరేషన్ కావేరి' మొదలైంది. భారత నౌకాదళానికి చెందిన 'ఐఎన్ఎస్ సుమేధ' నౌక తొలి విడతగా 278 భారతీయులతో మంగళవారం సూడాన్ పోర్టు నుంచి సౌదీ అరేబియాలోని జెడ్డాకు బయలుదేరింది. విదేశాంగ శాఖ ప్రతినిధి అరిందమ్ బాగ్చి ఈ మేరకు ట్వీట్ చేశారు. వారిని భారత్ చేర్చేందుకు జెడ్డాలో రెండు విమానాలను సిద్ధంగా ఉంచినట్టు చెప్పారు.

ఆక్రమణలో సూడాన్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్

జెనీవా: సూడాన్ రాజధాని ఖార్టూమ్‌లోని నేషనల్ హెల్త్ ల్యాబ్ ఆక్రమణకు గురైందని ఐక్యరాజ్యసమితి మంగళవారం వెల్లడించింది. వైరి పక్షాలైన ఆర్మీ, ఆర్ఎస్ఎఫ్(ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్)లో ఒకరు ఈ ల్యాబ్‌ను ఆధీనంలోకి తీసుకున్నట్లు తెలిపింది. 12 రోజులుగా ఆగని ఆధిపత్య పోరుతో సామాన్యులు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్న వేళ ఇది అత్యంత ప్రమాదకరమైన పరిణామమని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూడాన్ ప్రతినిధి డాక్టర్ నీమా సయీద్ అబిద్ అన్నారు. ల్యాబ్‌లో కలరా, మీజిల్స్, పోలియో తదితర వ్యాధికారక వైరస్‌లు, బ్యాక్టీరియాలున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. ల్యాబ్‌కు అతి సమీపంలోనే ఆర్మీ, ఆర్ఎస్ఎఫ్ భీకర పోరు సాగిస్తున్నాయి. సూడాన్‌లోని మూడో వంతు అంటే 1.6 కోట్ల మందికి తక్షణం సాయం అవసరమని ఐరాస అంచనా వేసింది.

కాలుష్యంతో శిశువుల్లో మానసిక సమస్యలు

న్యూఢిల్లీ: వాయు కాలుష్యం, నాణ్యత లేని గాలి కారణంగా భారత్‌లో రెండేళ్ల లోపు శిశువుల్లో మానసికంగా ఎదుగుదల సమస్యలు తలెత్తుతున్నట్లు అధ్యయనంలో తేలింది. సాధారణంగా రెండేళ్ల లోపు వయసున్న శిశువుల్లో మెదడు వేగంగా అభివృద్ధి చెందుతుంది. ఈ వయసులో స్పర్శ, అనుభవం ద్వారా ఎన్నో విషయాలు నేర్చుకుంటారు. జ్ఞానేంద్రియాలను పూర్తిగా ఉపయోగించుకుంటారు. కాలుష్యంతో కూడిన గాలిని పీల్చడం వల్ల మెదడు అభివృద్ధిలో వేగం మందగిస్తుందని, ఈ ప్రతికూల ప్రభావం జీవితాంతం ఉంటుందని యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ ఈస్ట్ ఆంగ్లియా ఆధ్వర్యంలో నిర్వహించిన అధ్యయనంలో తేలింది. వాయు కాలుష్యం వల్ల శిశువుల్లో మానసికపరమైన ఎదుగుదలతో పాటు భావోద్వేగ, ప్రవర్తన సంబంధిత సమస్యలు తలెత్తుతాయని, ఇవి వారి కుటుంబాలపైనా తీవ్ర ప్రభావం చూపుతాయని యూనివర్సిటీ ఆఫ్ ఈస్ట్ ఆంగ్లియా పరిశోధకుడు ప్రొఫెసర్ జాన్ స్పెన్సర్ చెప్పారు.

రాష్ట్రాల అభివృద్ధే దేశాభివృద్ధి

కేరళలో వాటర్ మెట్రోను ప్రారంభించిన ప్రధాని మోదీ ● రాష్ట్రంలో మొట్టమొదటి వందేభారత్ రైలు కూడా..



ప్రధాని ప్రారంభించిన వాటర్ మెట్రో. (ఇన్‌సెట్లో) వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో చిన్నారులతో మోదీ

తిరువనంతపురం: రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశం వేగంగా పురోగతి సాధిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. కేరళ పర్యటనలో ఆయన కొచ్చి వాటర్ మెట్రోను, రాష్ట్రంలో తొలి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను మంగళవారం ప్రారంభించారు. రూ.3,200 కోట్ల విలువైన ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వీటిలో దిండిగల్-పళని-పాలక్కాడ్ సెక్షన్ విద్యుదీకరణ, దేశంలోనే మొట్టమొదటి డిజిటల్ సైన్స్ పార్క్ ఉన్నాయి. మోదీ కేరళ సంప్రదాయ దుస్తుల్లో కార్యక్రమంలో పాల్గొన్నారు. 'కేంద్రం సహకార సమాఖ్య విధానానికి పెద్దపీట వేస్తుంది. దేశం అభివృద్ధి పథంలో పయనించడానికి రాష్ట్రాల అభివృద్ధి కీలకమని విశ్వసిస్తోంది. కాబట్టే, కేరళ అభివృద్ధి చెందితేనే దేశం వేగంగా అభివృద్ధి చెందుతుంది' అని చెప్పారు. అక్షరాస్యులు, కష్టపడే తత్వం ఉన్న మేధావులు, ప్రపంచ ఆర్థిక స్థితిగతులను గురించి అవగాహన ఉన్న వారంటూ కేరళీయులపై ప్రశంసలు కురిపించారు. 'అనేక దేశాలు సమస్యలతో సతమతమవుతున్న సమయంలో భారత్ అభివృద్ధి విషయంలో భారత్ చురుగ్గా ముందుకు వెళుతోంది. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఇందుకు దోహదపడుతున్నాయి. దేశ పురోగతికి విదేశాల్లోని భారతీయులు ఎంతో సాయపడుతున్నారు. ఇదే అభివృద్ధిని కొనసాగించేందుకు అవసరమైన మౌలిక వనరుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.10 లక్షల కోట్లను ప్రత్యేకించింది' అని ప్రధాని వెల్లడించారు. కనెక్టివిటీని మరింతగా పెంచేందుకు దేశీయ సాంకేతికతతో సెమీ–హైబ్రిడ్ ట్రెయిన్, రాపిడ్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టం, రో–రో ఫెర్రీ, రోప్‌వే వంటివి చేపడతామన్నారు. అనుసంధానత ఫలితంగా ప్రాంతాల మధ్య దూరంతోపాటు ప్రజల మధ్య అంతరాలు కూడా సమసిపోతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రసంగించారు. రాష్ట్రంలో వందేభారత్ రైలు వేగం 18–24 నెలల్లోపు 100 కిలోమీటర్లకు, 36–48 నెలల్లో 150 కిలోమీటర్లకు పెరుగుతుందని తెలిపారు. అనంతరం ప్రధాని పలువురు ముస్లిం, క్రైస్తవ మత పెద్దలతో సమావేశమయ్యారు.

విద్యార్థులతో ముచ్చటించిన ప్రధాని

అంతకుముందు ఉదయం కొచ్చి నుంచి తిరువనంతపురం విమానాశ్రయానికి చేరుకున్న ప్రధాని..అక్కడిన నుంచి సెంట్రల్ రైల్వే స్టేషన్ వరకు ఆరు కిలోమీటర్ల మేర రోడ్ షో చేపట్టారు. రోడ్డుకిరువైపులా భారీ సంఖ్యలో నిలబడిన ప్రజలు ఆయనపై పూలవర్షం కురిపించి, 'మోదీ, మోదీ' అంటూ డోలు వాయిద్యాలతో ఘనస్వాగతం పలికారు. తన వాహనం ఫుట్‌బోర్డుపై నిలబడి చేతులు ఊపుతూ ప్రజలకు అభివాదం చేశారు. రైల్వే స్టేషన్‌లోని ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం నుంచి తిరువనంతపురం–కాసరగోడ్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును జెండా ఊపి ప్రారంభించారు. ఒక బోగీలో ఉన్న పాఠశాల విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. రైలులో విద్యార్థుల తల్లిదండ్రులు, కొందరు టీచర్లు కూడా ప్రయాణించారు.

వాటర్ మెట్రో ప్రత్యేకతలు..

అత్యాధునిక వసతులు, భద్రతా ప్రమాణాలు కొచ్చి వాటర్ మెట్రో సొంతం. హైబ్రిడ్, బ్యాటరీతో నడిచే ఎయిర్ కండిషన్డ్ బోట్లు ఇందులో ఉంటాయి. వీటిని రైలు బోగీల మాదిరిగా తయారు చేశారు. మెట్రో రైలులో మాదిరిగానే ఇందులోనూ సేవలు ఉంటాయి. 10 సమీప దీవుల నుంచి కొచ్చికి రూపొందించిన ఈ ప్రాజెక్టు వ్యయం రూ.1,136 కోట్లు. ఇది ఈ నెల 26న మొదలవుతుంది.

సాక్షి 24|7
కర్ణాటక
KARNATAKA
బుధవారం : 26 : ఏప్రిల్ : 2023



అయ్యో బాబోయ్
బెంగళూరు అంజనాపురలో జనవాసాల్లోకి వచ్చిన బృహత్ కొండచిలువను పట్టుకున్న పాలికె అటవీ సిబ్బంది

న్యూస్‌రీల్

అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం



తుమకూరు: గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయని, తుమకూరు లాంటి నగరం స్మార్ట్‌సిటీగా అవతరిస్తోందని మధ్యప్రదేశ్ ఎంపీ, బీజేపీ నేత కైలాస్ విజయ్ వర్గీయ అన్నారు. మంగళవారం తుమకూరు నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ...దేశం అభివృద్ధి దిశగా సాగుతోందని, 2047 నాటికి దేశం ప్రపంచంలోనే నెంబర్ వన్ అవుతుందని, అది బీజేపీతోనే సాధ్యమన్నారు.

మైసూరు జిల్లాలో 143 మంది బరిలో

మైసూరు: శాసనసభ ఎన్నికల సందర్భంగా మైసూరు నగరంతో పాటు జిల్లాలో ఉన్న మొత్తం 11 శాసనసభ నియోజకవర్గాల్లో 143 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఇందులో పిరియా పట్టణంలో ఒక అభ్యర్థి నామినేషన్ వాపస్ తీసుకోగా బరిలో 10 మంది ఉన్నారు. కేఆర్ నగరలో 8 మంది, హుణసూరులో 12 మంది, హెచ్‌డి కోటెలో 12 మంది, నంజనగూడులో 12 మంది, చాముండేశ్వరిలో 14 మంది, కేఆర్ నియోజకవర్గంలో 17 మంది, చామరాజలో 14 మంది, నరసింహరాజలో 17 మంది, వరుణలో 15 మంది, టి.నరిసిపురలో 12 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఒక్కో నియోజకవర్గంలో సగటున నలుగురు అభ్యర్థులు పోటీ నుంచి తప్పుకున్నారు.

ఒంటరిగా అధికారంలోకి వస్తాం: కుమార



మైసూరు: ఏ పార్టీతోను ఒప్పందం లేదు, ఒంటరిగా పోటీ చేస్తున్నాం, ఎక్కువ సీట్లు గెలిచి అధికారంలోకి వస్తామని, తమ విజయాన్ని ఏ పార్టీ అడ్డుకోలేదని జేడీఎస్ మాజీ సీఎం హెచ్.డి.కుమారస్వామి అన్నారు. మంగళవారం మైసూరులో చాముండి కొండపై అమ్మవారిని ఆయన దర్శించుకున్నారు. తరువాత చాముండేశ్వరి నియోజకవర్గంలో సభలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీల కంటే తమకు అధిక స్థానాలు వస్తాయని, అమిత్ షా, ప్రియాంక గాంధీ ఆటలు ఇక్కడ సాగవని అన్నారు. అమిత్ షా ర్యాలీలకు ప్రజలు రావడం లేదని, సీఎం సభలకు కూడా ప్రజల మద్దతు చాలా తగ్గిందని విమర్శించారు. జేడీఎస్ నుంచి నిలబడిన కొత్త అభ్యర్థుల్లో 20 మందికి పైగా విజయం సాధిస్తారని అన్నారు. నాకు జ్వరం వచ్చి చికిత్స పొంది కోలుకున్నానని, అనేక రోజులు విశ్రాంతి లేకపోవడంతో జ్వరము, ఒళ్ళు నొప్పులు వచ్చాయని, ఇప్పుడు బాగున్నానని చెప్పారు. అభ్యర్థుల గెలుపు కోసం రాష్ట్రమంతా తిరిగి ప్రచారం చేస్తానని చెప్పారు.

వరుణలో బీజేపీ కార్యకర్తలపై దాడి

మైసూరు: వరుణ నియోజకవర్గం పరిధిలో బీజేపీ అభ్యర్థి, మంత్రి వి.సోమన్న ప్రచారానికి వచ్చినప్పుడు ఆ పార్టీ కార్యకర్తలపై కాంగ్రెస్ మద్దతుదారులు దాడి చేశారు. హుండి గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు, గ్రామ పంచాయతీ సభ్యుడు అయిన నాగరాజు పైన కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేశారు. బీజేపీకి మద్దతిస్తే చంపేస్తామని బెదిరించినట్లు అతడు ఆరోపించాడు. సోమన్నకు మరోసారి ప్రచారం చేయవద్దని, ఆయన వెంట వెళ్లవద్దని హెచ్చరించారన్నారు. అలాగే మరో కార్యకర్త అయిన మల్లేష్‌కు ఫోన్ చేసి ఇదే మాదిరిగా బెదిరించారు. సోమన్న ప్రచారంలో గ్రామస్తులు ఎవరూ పాల్గొనరాదని హెచ్చరించారు. కాగా దుండగులపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు సోమన్న చెప్పారు.

చెక్‌పోస్టుల్లో కోట్ల నగదు స్వాధీనం



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

శివమొగ్గ: ఎన్నికల అధికారుల తనిఖీలలో భారీగా నగదు పట్టుబడుతోంది. తాజాగా శివమొగ్గ నగరంతో పాటు జిల్లాలోని వివిధ చెక్‌పోస్టుల్లో అధికారుల నిర్వహించిన తనిఖీలలో కోట్లాది రూపాయల నగదు పట్టుబడింది. సొరబ తాలూకా ఆవట్టి పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రూ. 5 కోట్ల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో నగదును సీజ్ చేశారు. ఇదే పీఎస్‌ల పరిధిలో సోమవారం రాత్రి రూ.12 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా మంగళవారం సాగర పట్టణ పరిధిలో ఓ వాహనంలో తరలిస్తున్న రూ. 3.75 లక్షల నగదు, శిరాల కొప్ప పీఎస్ పరిధిలో మరో రూ. 45 లక్షలు, ఆగుంబె పరిధిలో రూ. 59 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.

డబుల్ ఇంజిన్ ప్రగతికి మూలం

- సంకీర్ణ సర్కార్ల వల్ల ఏం జరిగిందో చూశారు
- తెరదాళ, దేవరహిప్పరగి సభల్లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా



తెరదాళ బహిరంగ సభలో అభివాదం చేస్తున్న అమిత్ షా, బీజేపీ నాయకులు

సాక్షి, బళ్లారి: కేంద్రంలోను, రాష్ట్రంలోను బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో రాష్ట్రాభివృద్ధి సాధ్యం అవుతుందని, కాబట్టి ప్రతి ఒక్క ఓటరు తమకే ఓటు వేయాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఆయన మంగళవారం బాగల్‌కోటె జిల్లా తెరదాళ, దేవరహిప్పరగిలో బీజేపీ బహిరంగ సభల్లో పాల్గొని ప్రసంగించారు. ఈసారి కర్ణాటకలో ప్రతి సమావేశంలో జనం బీజేపీకి బ్రహ్మరథం పడుతుండటం సంతోషంగా ఉందన్నారు. జేడీఎస్‌కు ఒక ఓటు వేస్తే కాంగ్రెస్‌కు ఓటు వేసినట్లేనన్నారు. రాష్ట్రంలో ఏ పార్టీకి మెజార్టీ రాకపోతే జేడీఎస్ సాయంతో అధికారం చేపట్టాలని కాంగ్రెస్ భావిస్తోందన్నారు. సంకీర్ణ ప్రభుత్వం వల్ల జరిగే అభివృద్ధి ఎలా ఉంటుందో గతంలో మీరు చూశారు, ఎట్టి పరిస్థితుల్లోను ఆ రెండు పార్టీలకు ఓటు వేయకుండా బీజేపీకి ఓటు వేయాలని ఆయన కోరారు. కాంగ్రెస్, జేడీఎస్‌లను విమర్శిస్తూ ఓటర్లను ఆకట్టుకునేలా ప్రసంగించారు.

వారివి ఓటుబ్యాంకు రాజకీయాలు

తాము అధికారంలోకి వస్తే ముస్లింలకు మళ్లీ రిజర్వేషన్లు పునరుద్ధరిస్తామని కాంగ్రెస్ చెబుతోందని, దాని వల్ల ఏ కులానికి చెందినవారి రిజర్వేషన్లు తగ్గిస్తారో కూడా ప్రజలకు తెలియజేయాలన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు కాంగ్రెస్ పాల్పడుతోందని అమిత్ షా మండిపడ్డారు. రాష్ట్రంలో బొమ్మై సర్కార్ అనేక అభివృద్ధి పనులు చేసిందని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీ ద్వారా ఉన్నత పదవులు అనుభవించిన వారు పార్టీని వీడారని, అలాంటి వారికి జనం బుద్ధి చెప్పాలని షెట్టర్, సవదిలను ఉద్దేశించి మండిపడ్డారు. పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలందరినీ అందలమెక్కిస్తున్న ఏకైక పార్టీ బీజేపీనే అన్నారు. ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దేవర హిప్పరగి సభలో ప్రసంగం



బెంగళూరు..జాగృతి శిబిరంలో విద్యార్థులు

ఓటరూ.. మేలుకో

- ఉధృతంగా జాగృతి కార్యక్రమాలు

బనశంకరి: సమాజంలో మార్పు తీసుకురావడం యువతతోనే సాధ్యమని, దాని ప్రాముఖ్యతను తెలుసుకుని మే 10 తేదీన అందరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని బెంగళూరు నగర జిల్లా ఎన్నికల అధికారి, బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ తెలిపారు. మంగళవారం చిక్కబెల్లందూరు లోని కృపానిధి కాలేజీలో యువ ఓటర్లలో ఓటు హక్కుపై జాగృతికి సమావేశం నిర్వహించారు. నగరంలో ఓటింగ్‌ను పెంచడానికి అనేక జాగృతి కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. యువత ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటు వేయాలన్నారు. యువత మనసు పెడితే ఏ రంగంలోనైనా మార్పు తీసుకువచ్చే శక్తి ఉందని, ఉత్తమ అభ్యర్థికి ఓటువేసి ఎన్నుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎన్నికల గురించి తమ అభిప్రాయాలను వెల్లడించారు. బీబీఎంపీ ప్రత్యేక కమిషనర్ త్రిలోక్ చంద్ర పాల్గొన్నారు. మరోవైపు రాష్ట్రమంతటా ఓటింగ్ ప్రచార జాగృతి (స్వీప్) కార్యక్రమాలు జరుగుతున్నాయి. అందరూ ఓటేయాలయిన కోరుతూ చిక్కమగళూరులో ఎద్దుల బండ్ల ర్యాలీని నిర్వహించారు.



జాగృతి శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం



చిక్కమగళూరులో ఓటరు జాగృతి కోసం నిర్వహించిన ఎద్దుల బండ్ల ఊరేగింపు (ఇన్‌సెట్) బెంగళూరులో ఎన్‌సీసీ విద్యార్థుల ప్రచారం

చిక్‌పేటెలో బీజేపీ భారీ బైక్‌ర్యాలీ



బనశంకరి: అన్నివర్గాల సంక్షేమానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పాటుపడ్డాయని చిక్‌పేటే ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి ఉదయ్ గరుడాచార్ తెలిపారు. మంగళవారం చిక్‌పేటే నియోజకవర్గంలో బీజేపీ ఆధ్వర్యంలో 1000 బైకులతో నిర్వహించిన బృహత్ ర్యాలీని బీజేపీ జాతీయ కార్యదర్శి రితురాజ్‌సిన్హా, బీజేపీ అభ్యర్థి ఉదయ్‌గరుడాచార్ ప్రారంభించి మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో దేశం అభివృద్ధి పథంలో నడుస్తోందని, చిక్‌పేటేలో బీజేపీ అత్యధిక మెజారిటీ గెలుస్తుందన్నారు. బీజేపీ బైక్ ర్యాలీలో వేలాదిమంది బీజేపీ కార్యకర్తలు భారత్‌మాతాకీ జై అంటూ నినాదాలతో హోరెత్తించారు.

యడ్డి- సంతోష్ భేటీ

శివాజీనగర: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ మంగళవారం మాజీ సీఎం యడియూరప్పను కావేరి నివాసంలో కలిసి ఎన్నికల పరిస్థితిపై చర్చించారు. పార్టీ అభ్యర్థుల విజయానికి కార్యాచరణ గురించి మాట్లాడారు. టికెట్ రాలేదని తిరుగుబాటు చేసి కాంగ్రెస్‌లో చేరిన జగదీశ్ షెట్టర్, లక్ష్మణ్ సవదిలను ఎలాగైనా ఓడించి బుద్ధి చెప్పాలన్నది ప్రస్తావనకు వచ్చింది. అలాగే వరుణా నియోజకవర్గంలో కాంగ్రెస్ మాజీ సీఎం సిద్ధరామయ్యను ఓడించాలని యడ్డి పేర్కొన్నారు. కొన్ని నియోజకవర్గాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.

ధన బలం లేదన్న దేవెగౌడ

శివాజీనగర: తమకు ధన బలం లేదని, ప్రజల బలం మాత్రం ఉందని, ఈసారి సొంత శక్తితో అధికారంలోకి వస్తామని జేడీఎస్ అధినేత హెచ్.డీ.దేవెగౌడ అన్నారు. మంగళవారం పద్మనాభనగరలో తన ఇంటివద్ద మీడియాతో మాట్లాడిన ఆయన, పంచరత్న హామీలను ప్రజల ముందు ఉంచామని, కుమారస్వామికి ఈసారి ప్రజలు మద్దతు పలుకుతున్నారన్నారు. మే 8 వరకు రోజుకు మూడు నియోజకవర్గాల్లో ప్రచారం చేయాలని తీర్మానించామన్నారు. అమిత్‌షా సభలకు వచ్చిన జనమందరూ బీజేపీకి ఓట్లు వేయరన్నారు.

లూటీ చేసే సర్కారు ఇది





సభలో ప్రసంగిస్తున్న ప్రియాంక గాంధీ, సభాస్థలికి వాహనంలో వస్తూ అభివాదం

- ప్రియాంక గాంధీ ధ్వజం

మైసూరు: రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజల కోసం పని చేయడం లేదు, ప్రజలను మోసం చేయడానికి, వారి సొమ్ము లూటీ చేయడానికి ఉందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ ఆరోపించారు. మంగళవారం మైసూరు జిల్లాలోని టి.నరిసిపుర తాలూకాలోని హెళవరహుండి గ్రామం వద్ద జరిగిన కాంగ్రెస్ బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. ఎక్కడ బీజేపీ అధికారంలో ఉంటే అక్కడ అవినీతి తాండవం చేస్తుందన్నారు. కాంట్రాక్టర్ల నుంచి 40 శాతం వసూళ్లు, ఎస్ఐ ఉద్యోగాల్లో కుంభకోణాలు ఇలా అంతటా అవినీతి సాగుతున్నా ప్రధాని మోదీ చర్యలు తీసుకోలేదని ఆమె ధ్వజమెత్తారు.

గత సర్కార్లు చేసిందేమీ లేదు: కేంద్రమంత్రి

సాక్షి,బళ్లారి: గతంలో సిద్దరామయ్య సీఎంగా ఉన్నప్పుడు కాంగ్రెస్ హయాంలో రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, కాంగ్రెస్, జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వం ఉన్నప్పుడు కూడా మరింత అభివృద్ధి కుంటుపడిందని, బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కేంద్ర విద్యుత్, భారీ పరిశ్రమల శాఖ మంత్రి కృష్ణ పాల్ గుర్జార్ అన్నారు. ఆయన మంగళవారం జిల్లా బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఏ కులానికైనా, మతానికైనా రిజర్వేషన్లు ఇవ్వడం, తొలగించడం రాజ్యాంగానికి లోబడి ఉంటుందన్నారు. కర్ణాటకలో 224 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్క ముస్లింకు కూడా టికెట్ ఇవ్వలేదనే విషయం తమ పరిధిలోది కాదన్నారు.

కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఉత్తుత్తి హామీలు ఇస్తోందని ఎద్దేవా చేశారు. బీజేపీ చేసే పనులను ప్రజలకు చెబుతుందని, చేయలేని పనులను ప్రజలకు హామీ ఇవ్వలేమన్నారు. కర్ణాటకలో మళ్లీ బీజేపీని అధికారంలోకి తీసుకొస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.





మొక్కు తీరాలంటే నిప్పుల్లో నడవాల్సిందే. మంగళవారం చిక్కమగళూరు జిల్లా ఎంఎండీ హిల్స్‌లో జరిగిన వీరభద్రేశ్వర స్వామి కెండోత్సవంలో భక్తుల సాహసం

మోదీ బృహత్ ప్రచారానికి ప్లాన్

యశవంతపుర: ప్రధాని మోదీ వరుసగా 6 రోజుల రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం చేస్తారని, 180 నియోజకవర్గాల్లో ప్రచారంలో పాల్గొంటారని సమాచారం. బెంగళూరు, మైసూరు, తరువాత కోలారు, చెన్నపట్టణ, బేలూరు, చిత్రదుర్గ, కుడచి, శివమొగ్గ, హొసపేట, విజయపుర, సింధనూరు, హావేరి తదితర ప్రాంతాల్లో ప్రధాని సభలో, రోడ్ షోలో పాల్గొంటారని తెలిసింది.

27న మోదీ వర్చువల్ చర్చాగోష్టి

ఈ నెల 27న ప్రధాని నరేంద్రమోదీ 50 లక్షల మంది కార్యకర్తలతో వర్చువల్ ద్వారా చర్చలో పాల్గొంటారని కేంద్ర మంత్రి శోభా కరంద్లాజె తెలిపారు. వివిధ జిల్లాల నుండి 15 మంది కార్యకర్తలు అడిగే ప్రశ్నలకు మోదీ సమాధానం ఇస్తారని చెప్పారు.

బీజేపీపై దేవనూరు ఆగ్రహజ్వాల

శివాజీనగర: సంఘ్ పరివార్ ప్రభుత్వాన్ని గుజరీకి తరలించాలని, ఈ ఎన్నికల్లో ఏ పార్టీ గెలుపొందుతుందనేది ముఖ్యం కాదని, ముందుగా ఈ ప్రభుత్వాన్ని సాగనంపాలని సీనియర్ సాహితీవేత్త దేవనూరు మహాదేవ బీజేపీపై విరుచుకుపడ్డారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఎన్నికల సమయంలో ఎద్దేళు కర్ణాటక సంఘం ద్వారా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పుడు ఓటర్లు చైతన్యవంతులయ్యారని, డబుల్ ఇంజన్ ప్రభుత్వమని చెప్పి, అభివృద్ధి లేకుండా చేశారని మండిపడ్డారు. బీజేపీ నోరు విప్పితే కాంగ్రెస్ ఏమి చేసిందని అంటారు. అయితే ప్రభుత్వ ఆస్తులను కాంగ్రెస్ కాపాడింది. డబుల్ ఇంజన్‌లో మత ద్వేషం, అవినీతి నిండుగా ఉన్నాయన్నారు.

మళ్లీ 10 కేజీల ఉచిత బియ్యం: సిద్దు

యశవంతపుర: ప్రజలకు అందిస్తున్న ఉచిత బియ్యం మోదీ ప్రభుత్వం ఇస్తుందని బీజేపీ నాయకులు చేసిన వ్యాఖ్యాలను కాంగ్రెస్ నేత సిద్దరామయ్య ఖండించారు. మంగళవారం బెళగావిలో విలేకరులతో మాట్లాడుతూ ఉచిత బియ్యం మోదీ ఇస్తున్నదీ నిజమైతే, మధ్యప్రదేశ్, గుజరాత్‌లో ఉచిత బియ్యం ఎందుకు అందించలేదని ప్రశ్నించారు. తను సీఎంగా ఉన్న కాలంలో ఒక్కో కుటుంబానికి 7 కేజీలు ఉచిత బియ్యం ఇవ్వగా, బీజేపీ వచ్చిన తరువాత ఐదు కేజీలకు తగ్గించిందని ఆరోపించారు. తమ ప్రభుత్వం వస్తే మళ్లీ 10 కేజీల బియ్యంను ఉచితంగా ఇస్తామన్నారు. సీఎం బొమ్మై అవినీతి పరుడని చెప్పాను తప్పా లింగాయత సముదాయంపై ఎలాంటి విమర్శలు చేయలేదన్నారు.

టిప్పర్ లారీ బీభత్సం



రోడ్డుపై కాలిపోతున్న ద్విచక్ర వాహనం

- యువకుడి దుర్మరణం, మరొకరికి తీవ్ర గాయాలు

బనశంకరి: బెంగళూరు నగరంలో రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా బ్యాటరాయనపుర పరిధిలో ఓ దుర్ఘటన జరిగింది. ఓ టిప్పర్ లారీ, టీవీఎస్ మోపెడ్‌ని ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు...రాయచూరుకు చెందిన మహమ్మద్ (20) ఉత్తరప్రదేశ్‌కు చెందిన గోరక్ ఇద్దరూ పెయింటర్లు, యశవంతపురలో నివాసం ఉంటున్నారు. మంగళవారం ఉదయం 10.45 సమయంలో టీవీఎస్ మోపెడ్‌లో పెయింటింగ్ పనులకు బయలుదేరారు. మార్గం మధ్యలో నాయండహళ్లి జంక్షన్‌లో వద్ద వెనుకనుంచి వాయువేగంతో దూసుకొచ్చిన టిప్పర్ లారీ, టీవీఎస్ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో మహమ్మద్ మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన గోరక్‌ను ఆస్పత్రికి తరలించారు. ద్విచక్ర వాహనం మంటల్లో కాలిపోయింది. బ్యాటరాయనపుర ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. లారీ డ్రైవర్ పరారయ్యాడు. ఈ ఘటనతో నాయండహళ్లిలో కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది.

మందుబాబులకు చుక్కలు

- రాష్ట్రంలో మద్యం లోటు
- వేసవి, ఎన్నికల వేళ తగ్గిన సప్లై



బనశంకరి: మండు వేసవి, పైగా ఎన్నికల వేడి.. ఇంకేముంది రాష్ట్రంలో మద్యానికి ఎక్కడ లేని డిమాండు ఏర్పడింది. బీర్లు, విస్కీ, బ్రాంది ఇలా ఏది చూసినా కొరత కనిపిస్తోందని మద్యం వ్యాపారులు, మందుబాబులు వాపోతున్నారు. రాష్ట్ర అబ్కారీ మండలి తగినంత మద్యాన్ని షాపులకు, బార్లకు సరఫరా చేయడం లేదన్నది వ్యాపారుల ఆరోపణ.

కోడ్ నియమాలు

ఎన్నికల కోడ్ వల్ల మద్యం దుకాణాలకు కోరినంత మద్యం ఇవ్వకపోవడం వల్ల వ్యాపారానికి ఇబ్బందిగా ఉందని బార్ యజమానుల సంఘం నేతలు తెలిపారు. మండుటెండల్లో బీర్లకు గిరాకీ పెరిగింది. ప్రతిరోజు రాష్ట్రంలో 60 వేల లీటర్ల బీర్లు కొంటున్నారు. కానీ గత 10 రోజుల నుంచి సప్లై లేక బీర్ విక్రయాలు 50 వేల లీటర్లకు తగ్గిపోయింది. ఇదే అదనుగా షాపుల్లో మద్యం, బీర్ల ధరలను పెంచి అమ్ముతున్నట్లు అంతటా ఆరోపణలున్నాయి. మద్యం దొరక్క సరిహద్దు ప్రాంతాల వారు గోవా, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లకు వెళ్లి చుక్కేస్తున్నట్లు సమాచారం. మరోవైపు ఎన్నికల అధికారులు పదే పదే వైన్ షాపులకు వెళ్లి పరిశీలిస్తున్నారు. పెద్దమొత్తంలో మద్యం కొనేవారి వివరాలను సేకరిస్తున్నారు.



మద్యంతో పాటు బీర్లకు కూడా డిమాండు విపరీతంగా పెరిగింది

20 శాతం తగ్గింది

రాష్ట్రంలో మద్యం ఉత్పత్తి చేసే 25 డిస్టిలరీలు ఉండగా వీటిలో రెండు షిఫ్టుల్లో ఉత్పత్తి చేయాలి. కానీ ప్రస్తుతం ఒక షిఫ్టులో మాత్రమే ఉత్పత్తి చేయడం వల్ల లోటు ఏర్పడింది. రాష్ట్రంలో ప్రతిరోజు 20 లక్షలకు పైగా కార్టన్ బాక్స్‌ల దేశీయ మద్యం ఉత్పత్తి, బీర్ సరఫరా అవుతుంది. కానీ ఇప్పుడు డిమాండు సరఫరా కంటే 20 శాతం ఎక్కువగా ఉంది.

సిరుగుప్ప..గెలుపెవరిదప్ప

- వలస వచ్చి స్థిరపడిన వేలాది ఆంధ్రులు
- వ్యవసాయమే వారి ప్రధాన జీవనాధారం
- భత్తదనాడులో అంతుచిక్కని ఓటరు నాడి
- నియోజకవర్గంలో తెలుగు వారి ఓట్లు కీలకం





సోమలింగప్ప నాగరాజు ధరప్ప నాయక

సాక్షి, బళ్లారి: బళ్లారి జిల్లాలోని సిరుగుప్ప నియోజకవర్గానికి ప్రత్యేకత ఉంది. అన్నపూర్ణ నియోజకవర్గంగా పేరొందిన ఈ ప్రాంతంలో పండించే వరి బియ్యానికి రాష్ట్రంలోనే కాకుండా పొరుగున ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు దేశ, విదేశాల్లో కూడా మంచి డిమాండ్ ఉంది. తుంగభద్ర డ్యాం కింద విస్తారంగా సిరుగుప్ప తాలూకాలో ఆయకట్టు భూములు ఉన్నాయి. కర్నూలు జిల్లాలోని ఆదోని, ఆలూరు నియోజకవర్గాల్లోని గ్రామాలకు కేవలం 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న సిరుగుప్ప నియోజకవర్గానికి వచ్చే నెల 10న జరుగనున్న ఎన్నికలపై కర్నూలు జిల్లా వాసులు కూడా ఆసక్తిగా గమనిస్తుంటారు. 2008 కన్నా ముందు జరిగిన ఎన్నికల్లో ఇక్కడ రెడ్డి సామాజికవర్గం, లింగాయత్‌లు ఎమ్మెల్యేలు కావడంతో పాటు నియోజకవర్గ రాజకీయాలను శాసించేవారు. 2008 నుంచి నియోజకవర్గాల పునర్విభజన, రిజర్వేషన్ల మార్పుతో సిరుగుప్ప ఎస్టీలకు రిజర్వ్ అయింది. అప్పటి నుంచి సిరుగుప్పలో వరుసగా ఎమ్మెల్యేగా గెలుపొందిన సిట్టింగ్ ఎమ్మెల్యే, ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా టికెట్ దక్కించుకుని బీజేపీ తరపున పోటీ చేస్తున్న సోమలింగప్ప కూడా బరిలో ఉన్నారు. కాంగ్రెస్ తరపున మాజీ ఎమ్మెల్యే బీ.ఎం.నాగరాజు, కేఆర్‌పీపీ తరపున ధరప్పనాయక్, జేడీఎస్ తరపున పరమేశ్వర నాయక్ పోటీ పడుతున్నారు. ఈ నియోజకవర్గంలో ప్రధానంగా బీజేపీ, కాంగ్రెస్, కేఆర్‌పీపీ మధ్యనే త్రిముఖ పోటీ కొనసాగుతోంది.

మహిళా ఓటర్లే అధికం

నియోజకవర్గ వ్యాప్తంగా 2,16,905 మంది ఓటర్లు ఉండగా, వీరిలో మహిళలు 1,10,215 మంది కాగా పురుషులు 1,06,652 మంది ఉన్నారు. సిరుగుప్పలో కన్నడిగులతో పాటు ప్రవాసాంధ్రులు కూడా అధికంగా ఉన్నారు. వీరు ప్రధానంగా కృష్ణా, గోదావరి, గుంటూరు, కర్నూలు తదితర జిల్లాల నుంచి రైతులుగా పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఇక్కడ స్థిరపడ్డారు. రైతులతో పాటు వ్యాపార రంగంలో కూడా తెలుగు వారు స్థిరపడ్డారు. సిరుగుప్ప నియోజకవర్గంలో లింగాయత్‌లు, వాల్మీకులు, కురబ, ఎస్సీ, ఎస్టీలు ఇక్కడ కీలకమైన ఓటర్లు. వీరితో పాటు మైనార్టీలు కూడా అధికంగా ఉన్నారు. ఈనేపథ్యంలో సిరుగుప్ప నియోజకవర్గంలో ఎన్నికల పోరు రసవత్తంగా మారనుంది. సిట్టింగ్ ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి సోమలింగప్ప, కాంగ్రెస్ అభ్యర్థి బీ.ఎం.నాగరాజు, కేఆర్‌పీపీ అభ్యర్థి ధరప్ప నాయక్‌లు మధ్య పోటీ నువ్వా..నేనా? అన్న విధంగా కొనసాగుతోంది. తాను చేపట్టిన అభివృద్ధి పనులే తనను గెలిపిస్తాయని బీజేపీ అభ్యర్థి ఆశల పల్లకీలో ఉండగా, బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలు, బీజేపీ అభ్యర్థి బంధుప్రీతితో నియోజకవర్గంలోని ప్రజల్లో ఉన్న వ్యతిరేకతలు తమను గెలిపిస్తాయని కాంగ్రెస్, కేఆర్‌పీపీ అభ్యర్థులు ఇద్దరు ధీమాగా ఉన్నారు.



సిరుగుప్ప పట్టణ ప్రవేశ ద్వారం

క్లుప్తంగా

కుమారణ్ణతోనే రాష్ట్రాభివృద్ధి



బిసలహళ్లిలో ప్రచారం చేస్తున్న జేడీఎస్ అభ్యర్థి అనిల్‌లాడ్ తదితరులు

బళ్లారి అర్బన్: కుమారస్వామి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి పనులు చూసి జేడీఎస్ గుర్తుకు ఓటు వేయాలని ఆ పార్టీ నగర అభ్యర్థి అనిల్‌లాడ్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం బిసలహళ్లి తదితర కాలనీల్లో ఇంటింటా విస్తృతంగా ప్రచారం చేశారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పనులు చేశానన్నారు. ఈసారి మళ్లీ తనను గెలిపిస్తే నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. నగరాభివృద్ధి జేడీఎస్‌తోనే సాధ్యం అన్నారు. ఈసందర్భంగా ఆ పార్టీ యువనాయకుడు గోపాల్, కిరణ్‌కుమార్, గౌసియా, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నగదు, అక్రమ మద్యం సీజ్

బళ్లారి రూరల్: సిరుగుప్ప రోడ్డులోని క్లాసిక్ ఫంక్షన్ హాల్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద సోమవారం ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి అక్రమంగా తరలిస్తున్న రూ.3.87 లక్షల నగదు, 69.09 లీటర్ల మద్యాన్ని తనిఖీ బృందం అధికారులు స్వాధీనం చేసుకొన్నట్లు జిల్లాధికారి ఎం.పవన్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నియమావళిని కట్టుదిట్టంగా అమలుపరచడంలో భాగంగా ఫ్లెయింగ్ స్క్వాడ్, 27 ఎస్‌ఎస్‌టీ బృందాలను, 7 ఎక్సైజ్ తనిఖీ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వినయ్ కులకర్ణి తరఫున భార్య ప్రచారం



భర్త తరుపున ప్రచారం చేస్తున్న శివలీల

హుబ్లీ: కోర్టు ఆదేశాల నేపధ్యంలో జిల్లాలో ప్రవేశం లేని ధార్వాడ గ్రామీణ అభ్యర్థి, మాజీ మంత్రి వినయ్ కులకర్ణి తరఫున ఆయన భార్య శివలీల ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ధార్వాడ తాలూకా ఉప్పినబెటగేరిలో ఇంటింటికి వెళ్లి తన భర్తను అన్యాయంగా కేసులో ఇరికించి జిల్లాకు దూరం చేశారని ఓటర్లకు నచ్చజెబుతూ కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. కాగా వినయ్ కులకర్ణి ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి అమృత దేశాయ్ సీఎం బొమ్మై కరడిగుడ్డలో భారీ రోడ్ షో చేపట్టారు.

లక్ష్మీ అరుణకు కొట్టూరు స్వామీజీ ఆశీర్వాదం



స్వామీజీ ఆశీస్సులు అందుకుంటున్న కేఆర్‌పీపీ అభ్యర్థిని గాలి లక్ష్మీ అరుణ

సాక్షి,బళ్లారి: నగరానికి విచ్చేసిన కొట్టూరు బసవలింగ స్వామీజీని కలుసుకుని నగర కేఆర్‌పీపీ అభ్యర్థిని గాలి లక్ష్మీ అరుణ ఆశీస్సులు పొందారు. మంగళవారం ఆమె నగరంలోని కొట్టూరేశ్వర మహావిద్యాలయానికి విచ్చేసిన స్వామీజీని పార్టీ నాయకులతో కలిసి కలిశారు. ఈసందర్భంగా పార్టీ జిల్లాధ్యక్షుడు రాజశేఖరగౌడ, మాజీ మేయర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

కంప్లి:కురుగోడులోని దొడ్డబసవేశ్వర ఆలయం వద్ద మంగళవారం ఎమ్మిగనూరు జెడ్పీ సభ్యురాలు బనశంకరి రవీంద్రరెడ్డి, టీపీ మాజీ ఉపాధ్యక్షులు బేగూరు యువరాజ్, టీపీ మాజీ సభ్యులు మరాఠి లింగప్ప, మున్సిపల్ కౌన్సిలర్ కేఎస్. మంజునాథ్‌శెట్టి, జీపీ సభ్యులు మల్లయ్య, పీఎల్‌డీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ బసవరాజ్, జీపీ మాజీ అధ్యక్షులు ఎస్.దొడ్డబసప్ప, కౌన్సిలర్ వీరే ష్, ప్రముఖులు ఏ.నాగమూర్తి, వీరేష్, నాగరాజ్, కే.ఈరణ్ణ, సోమసముద్ర ఈశ్వర్‌గౌడ తదితరులు బీజేపీలో చేరారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ పట్ల ఎమ్మెల్యే దురహంకార ప్రవర్తనతో విసుగెత్తి టీహెచ్ సురేష్‌బాబు సమక్షంలో బీజేపీలో చేరామన్నారు.

నగరాభివృద్ధికి సహకరించండి



ప్రచారం చేస్తున్న అభ్యర్థి నారా భరత్‌రెడ్డి

సాక్షి,బళ్లారి: నగరాభివృద్ధికి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ఆ పార్టీ నగర అభ్యర్థి నారా భరత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన మంగళవారం మోకా రోడ్డులోని కేఈబీ కార్యాలయం పక్కనే ఉన్న పలు కాలనీల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు అల్లం ప్రశాంత్, చానాళ్ శేఖర్, విష్ణు తదితరులతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. ఆయా కాలనీల్లో స్థానికులు కాంగ్రెస్ అభ్యర్థిపై పూల వర్షం కురిపించారు. నగరం సమగ్రాభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ ద్వారానే సాధ్యం అన్నారు. ఈసందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోదీతో ఎస్సీ, ఎస్టీలకు న్యాయం



మాట్లాడుతున్న అర్జున్ ముండా

రాయచూరు రూరల్: ప్రధానమంత్రి మోదీతో ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగిందని జార్ఖండ్ మాజీ సీఎం, కేంద్ర గిరిజన సాంఘీక సంక్షేమ శాఖా మంత్రి అర్జున్ ముండా పేర్కొన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌లో సంక్షేమ పథకాలను అమలు చేశామన్నారు. కోలి సమాజానికి చెందిన రామ్‌నాథ్ కోవింద్‌ను రాష్ట్రపతిగా చేశారని, ఈసారి గిరిజన మహిళ ద్రౌపది ముర్మును రాష్ట్రపతిగా చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో బీజేపీకి మరోసారి విజయం అందిస్తే మరింత అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఆయుష్మాన్ భారత్, ఆత్మనిర్భర్ పథకాల అమలుతో పాటు సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్ సాధ్యమన్నారు. ఎంపీ రాజా అమరేశ్వర నాయక్, జిల్లాధ్యక్షుడు రమానంద యాదవ్‌లున్నారు.

వర్షంతో ఉపశమనం

బళ్లారి రూరల్: నిప్పులు చెరుగుతున్న ఈ వేసవిలో నగరంలో అత్యధికంగా 39 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదవుతోంది. ఉదయం 10 గంటల నుంచి భానుడి ప్రతాపం ఆరంభమై నగరవాసులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈనేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం వరకు అత్యధికంగా 37 డిగ్రీలకు ఉష్ణోగ్రత చేరింది. సాయంత్రానికి వాతావరణం చల్లబడి ఉరుములతో కూడిన వర్షం కురిసి చల్లని గాలులతో నగరవాసులకు ఉపశమనాన్ని ఇచ్చింది.

జిల్లాలో 13 నామినేషన్లు వాపస్

రాయచూరు రూరల్: జిల్లాలో 13 నామినేషన్లు విరమించుకోవడంతో 61 మంది బరిలో నిలిచారు. ప్రధానంగా నగరంలో మహ్మద్ శాలం(కాంగ్రెస్), శివరాజ్ పాటిల్(బీజేపీ), వినయ్ కుమార్(జేడీఎస్), గ్రామీణలో బసనగౌడ(కాంగ్రెస్), తిప్పరాజ్(బీజేపీ), నరసింహనాయక్(జేడీఎస్), దేవదుర్గలో శ్రీదేవి నాయక్(కాంగ్రెస్), శివనగౌడ నాయక్(బీజేపీ), కరెమ్మ నాయక్(జేడీఎస్), మాన్విలో హంపయ్య నాయక్(కాంగ్రెస్), బి.వి.నాయక్(బీజేపీ), రాజా వెంకటప్ప నాయక్(జేడీఎస్), సింధనూరులో హంపనగౌడ(కాంగ్రెస్), కరియప్ప(బీజేపీ), వెంకట్రావ్ నాడగౌడ(జేడీఎస్), లింగసూగూరులో హులిగేరి(కాంగ్రెస్), వజ్జల మానప్ప(బీజేపీ), సిద్దు బండి(జేడీఎస్), మస్కిలో ప్రతాప్‌గౌడ పాటిల్(బీజేపీ), రాఘవేంద్ర నాయక్(జేడీఎస్), బసనగౌడ(కాంగ్రెస్) తదితరులు బరిలో మిగిలారు.

జిల్లాలో 8 చోట్ల గెలుపు మాదే



మాట్లాడుతున్న అల్లం వీరభద్రప్ప

సిరుగుప్ప: అన్ని వర్గాలకు న్యాయం చేకూర్చేది ఒక్క కాంగ్రెస్ పార్టీనేనని, జిల్లాలో ప్రజల నాడిని బట్టి చూస్తే 8 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు ఖాయమని కేపీసీసీ మాజీ అధ్యక్షులు, మాజీ మంత్రి అల్లం వీరభద్రప్ప తెలిపారు. ఆయన సిరుగుప్ప నియోజవర్గ ఎన్నికల ఇన్‌చార్జిగా, పరిశీలకులుగా మంగళవారం నగరానికి విచ్చేసిన సందర్భంగా స్థానిక వైష్ణవి ఫంక్షన్‌హాల్‌లో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో చాలా బాగుందన్నారు. ప్రస్తుత బీజేపీ పాలన అన్నింటిలో విఫలమైందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ 150 సీట్లలో గెలుపు తథ్యమని ధీమా వ్యక్తం వ్యక్తం చేశారు. తెలంగాణ నుంచి ఎన్నికల పరిశీలకులుగా విచ్చేసిన ఒమేదుల్లా కొత్వాల్, ప్రదీప్‌గౌడ, జిల్లా ప్రచార సమితి అధ్యక్షులు ముండ్రిగి నాగరాజ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కరిబసప్ప, బి.ఎం.సతీష్, బి.కె.రఘు, అప్పాజీ పాల్గొన్నారు.

జోరుగా ఎన్నికల ప్రచారం



ఫుట్‌బాల్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరుతున్న శ్రీదేవి

హొసపేటి: అసెంబ్లీ ఎన్నికల్లో రోజు రోజుకు అభ్యర్థుల ప్రచారం ఊపందుకుంటోంది. సండూరు నియోజక వర్గంలో కేఆర్‌పీపీ అభ్యర్థి కె.ఎస్.దివాకర్ తరుపున భార్య శ్రీదేవి సండూరులోని పలు వార్డులలో ఉదయం నుంచి సాయంత్ర వరకు ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. వచ్చే నెల 10న జరగనున్న ఎన్నికల్లో ఫుట్‌బాల్ గుర్తుకు ఓటు వేసి తన భర్తను గెలిపించాలని ఓటర్లను కోరారు. తన భర్త పేదలకు చేసిన అనేక సేవా కార్యక్రమాలు ఎన్నికల్లో గెలుపునకు దోహదపడతాయన్నారు. ఈసందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిద్దుపై సీఎం మండిపాటు

హుబ్లీ: లింగాయత్ సీఎంలు అవినీతిపరులంటూ విపక్ష నేత సిద్దరామయ్య చేసిన వ్యాఖ్యలపై సీఎం బసవరాజ్ బొమ్మై మరోసారి మండిపడ్డారు. హుబ్లీలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ తనపై చేసిన ఆరోపణలను నిరూపించాలని సిద్దరామయ్యకు సవాల్ చేశారు. ఉత్తుత్తి ఆరోపణలు చేయడం తగదన్నారు. కాంగ్రెస్ అంటేనే అవినీతి, అక్రమాలు అన్నారు. సిద్దరామయ్యపై ఉన్న ఎన్నో కేసులను లోకాయుక్త దర్యాప్తునకు అప్పగించామన్నారు.

ఓటు హక్కు రాజ్యాంగబద్ధం



కార్మికులకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న స్వీప్ సమితి అధ్యక్షుడు సదాశివ ప్రభు తదితరులు

హొసపేటి: తాలూకాలోని డణాపుర జీపీలోని బీఎంఎం మైనింగ్ కంపెనీలో కార్మికులకు నిర్వహించిన ఓటింగ్‌పై అవగాహన కార్యక్రమాన్ని స్వీప్ కమిటీ అధ్యక్షుడు సదాశివ ప్రభు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ముఖ్యమైన పండుగ ఓటు హక్కు అని అన్నారు. 18 ఏళ్లు పైబడిన భారతీయ పౌరులు తప్పని సరిగా ఓటు వేయాలని కోరారు. ఓటు అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. ఎన్నికల అధికారులు సిద్ధరామేశ్వర, రమేష్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కమలానికి ఓటు.. అభివృద్ధికి చోటు



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌పాల్ గుర్జార్, చిత్రంలో బీజేపీ అభ్యర్థి గాలి సోమశేఖరరెడ్డి

సాక్షి,బళ్లారి: ఈసారి ఎన్నికలు చాలా కీలకమైనవి, ప్రతి ఒక్కరు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని, దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని కేంద్ర విద్యుత్, భారీ పరిశ్రమల శాఖా మంత్రి కిషన్‌పాల్ గుర్జార్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం నగరంలోని 11వ వార్డు సభాపతి స్ట్రీట్‌లో బీజేపీ అభ్యర్థి గాలి సోమశేఖరరెడ్డి తరపున ఎన్నికల ప్రచారం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ భద్రత, రక్షణ, అభివృద్ధి, పేదరిక నిర్మూలనకు బీజేపీ కట్టుబడి ఉందన్నారు. పార్టీ అభ్యర్థి, కార్పొరేటర్లు, జైన్ సమాజ ప్రముఖులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జోరుగా మాజీ ఎంపీ ప్రచారం



వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న శాంత

కంప్లి: పదేళ్ల క్రితం తన మేనల్లుడు సురేష్‌బాబు క్షేత్రాన్ని ఎంతో అభివృద్ధి చేశాడని మాజీ ఎంపీ జే.శాంత తెలిపారు. మంగళవారం బీజేపీ అభ్యర్థి తరపున కురుగోడులోని వార్డుల్లో ఆమె జోరుగా ప్రచారం చేసి మాట్లాడారు. కురుగోడు, కంప్లిల్లో వంద పడకల ఆస్పత్రులు, మినీ విధానసౌధలను నిర్మించారన్నారు. కాంగ్రెస్‌లో విసుగెత్తిన కార్యకర్తలు నిత్యం బీజేపీలో చేరుతున్నారన్నారు. రైతాంగానికి సాగునీటితో పాటు ప్రతి సమస్యను తీర్చారన్నారు. క్షేత్ర అధ్యక్షులు వీరేష్, వై.తిమ్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి సునీల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి ప్రచారం



పాల్గొన్న అభ్యర్థి మహ్మద్ శాలం, రవి బోసురాజు

రాయచూరు రూరల్: నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను ప్రజలకు వివరిస్తూ ఓట్లు వేసి నగరంలో కాంగ్రెస్‌ని గెలిపించాలని కేపీసీసీ ప్రచార కార్యదర్శి రవి బోసురాజు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని అస్కిహాళ్, మంగళవారపేటెలో కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ శాలం తరపున ప్రచారం చేసి మాట్లాడారు. ప్రజలు బీజేపీని తిరస్కరించాలన్నారు. కమీషన్ పేరుతో రాష్ట్రాన్ని నిలువుదోపిడీ చేశారన్నారు. బసవరాజరెడ్డి, శాంతప్ప, శివమూర్తి, శ్రీనివాసరెడ్డి, జయన్న, రుద్రప్ప, తాయన్న నాయక్‌లున్నారు.

స్వతంత్ర అభ్యర్థితో చర్చలు విఫలం

రాయచూరు రూరల్: నగరంలో స్వతంత్ర అభ్యర్థి ముజుబుద్దీన్ నివాసంలో మంగళవారం కేపీసీసీ ప్రచార కార్యదర్శి రవి బోసురాజ్ చర్చలు జరిపారు. కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నించి విఫలమైన ముజుబుద్దీన్‌ను బుజ్జగించి పార్టీ అభ్యర్థి మహ్మద్ శాలంకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. అయితే ముజుబుద్దీన్ తనకు న్యాయం లభించనందున బరిలో నుంచి తప్పుకొనే ప్రశ్నే లేదన్నారు.

సంక్షేమ పథకాలే నన్ను గెలిపిస్తాయి

- కేఆర్‌పీపీ అభ్యర్థిని గాలి లక్ష్మీ అరుణ

సాక్షి,బళ్లారి: తన భర్త గాలి జనార్దనరెడ్డి రాష్ట్ర మంత్రిగా ఉన్నప్పుడు నగరంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ప్రజలు తనను గెలిపిస్తారని కేఆర్‌పీపీ నగర అభ్యర్థిని గాలి లక్ష్మీ అరుణ పేర్కొన్నారు. ఆమె మంగళవారం నగరంలోని 19వ వార్డులోని హుస్సేన్‌నగర్, మారుతీ నగర్‌లలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు మహిళా కార్యకర్తలు పెద్ద ఎత్తున పార్టీలో చేరిన సందర్భంగా, సిద్ధార్థ కాలనీ తదితర చోట్ల ఇంటింటా ప్రచారం చేస్తూ ఫుట్‌బాల్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అయా కాలనీల్లో ప్రజలు ముఖ్యంగా మహిళలు ఆమెకు బ్రహ్మరథం పట్టారు. అనంతరం గాలి లక్ష్మీ అరుణ సాక్షితో మాట్లాడారు. ఈసారి నగర ఓటర్లు మహిళను గెలిపించాలని నిర్ణయించుకున్నారన్నారు. ప్రతి చోట జనం తమ ఇంటి ఆడపడుచులా చూసుకుని స్వచ్ఛందంగా మద్దతు ఇస్తున్నారన్నారు. తన భర్తను రాజకీయ కుట్రతో 12 ఏళ్ల పాటు ప్రజలకు దూరంగా ఉంచారన్నారు. ఇకనైనా ప్రజా సేవ చేయాలనే నిర్ణయం తీసుకుని తాను, తన భర్త ఎన్నికల బరిలో నిలిచామన్నారు. నగరంలోనే కాకుండా రాష్ట్రంలోనే బీజేపీ గెలవడానికి, పలువురు మంత్రులు కావడానికి, సీఎంలు కావడానికి తన భర్త కారణమనే విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. అలాంటి వ్యక్తిని రాజకీయంగా తమ వారే అణగదొక్కడానికి ప్రయత్నించడంతో బసవణ్ణ తత్వాలు, ఆదర్శాలకు అనుగుణంగా సొంత పార్టీని స్థాపించామన్నారు. కుల మతాలకతీతంగా పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లి అభివృద్ధి చేస్తామన్నారు.



ఫుట్‌బాల్ గుర్తుకు ఓటేయమని మహిళలను అభ్యర్థిస్తున్న గాలి లక్ష్మీ అరుణ

భక్తిశ్రద్ధలతో శంకరాచార్య జయంతి

రాయచూరు రూరల్: నగరంలోని కన్నడ భవనంలో మంగళవారం సరళంగా శంకరాచార్య జయంతిని జరిపారు. కన్నడ సంస్కృతి శాఖాధికారి మంగళనాయక్, శ్రీదేవి, సిద్దు, వినోద్ కుమార్, ఇస్మాయిల్, కృష్ణమూర్తి, హన్మంతరావు, సదానంద, ఈశ్వర్, శ్రీపాదలున్నారు.

కంప్లి: హిందూ ధర్మ పునర్నిర్మాణంలో శంకరాచార్యుల పాత్ర మహత్తరమని శ్రీమన్నారాయణాశ్రమ పరమహంస నారాయణ విద్యాభారతి తెలిపారు. సత్యనారాయణ పేటలోని వెంకటరమణ దేవస్థానంలో శంకరాచార్యుల జయంతి ఉత్సవాల సందర్భంగా మంగళవారం శ్రీచక్ర సహిత శారదాంబ, చంద్రమౌళీశ్వర శంకరాచార్య మూర్తులకు ప్రజలు పూజలు నిర్వహించారు. వైష్ణవి కృష్ణమూర్తి, లలితారాణి గిరీష్, రూపా గురుప్రసాద్, సవితా శశిధర్, భగవతి, అశ్వత్ నారాయణ, సంపత్ పాల్గొన్నారు.

చెళ్లకెరె రూరల్: శ్రీరామ మందిరంలో శంకర జయంతి సందర్భంగా విప్రబాంధవులు శంకరాచార్య చిత్రపటాన్ని ప్రముఖ వీధుల్లో ఊరేగించారు. గాయత్రీ మహిళా మండలి సభ్యులు భజనలు, కోలాటాలు నిర్వహించారు. అనంతరం శంకరాచార్య చిత్రపటానికి పుష్పార్చన జరిపారు. అనంతరం మహామంగళ హారతి జరిపి ప్రసాదం వినియోగం చేశారు. ఈసందర్భంగా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు అనంతరామగౌతం, డాక్టర్ యాదాతి రాజారాం, నరహరి సద్గురు పీఠం గురువులు శంకరాచార్య జీవిత చరిత్ర గురించి ఉపన్యసించారు. విప్రగాయత్రీ మహిళా మండలి అధ్యక్షురాలు సీతాలక్ష్మి వాదిరాజు, బ్రాహ్మణ సంఘం సభ్యులు జీ.కృష్ణమూర్తి, నాగరాజరావు, సత్యనారాయణరావు, విప్రబాంధవులు పాల్గొన్నారు.

కోలారు: రంగమందిరంలో మంగళవారం శంకర జయంతిని నిర్వహించారు. కన్నడ సంస్కృతి శాఖ ఏడీ శ్రీనివాసరెడ్డి శంకరాచార్య చిత్రపటానికి పూజ చేసి పుష్పాంజలి సమర్పించారు. జగద్గురు శంకరాచార్య చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. శృంగేరి శంకరమఠంలో మంగళవార శంకర జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదమంత్రాలు, జయజయధ్వానాల నడుమ శంకరాచార్యుల విగ్రహాన్ని రథంలో ఉంచి ఊరేగించారు. మఠంలోని శారదామాత ఆలయంలో అమ్మవారికి శంకర జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. శంకర మఠం ధర్మాధికారి రామకృష్ణ, పదాధికారులు రవిశంకర్ అయ్యర్, హెబీ రమేష్ పాల్గొన్నారు.

మాలూరులో..

మాలూరు: బ్రాహ్మణ సంఘం శంకర సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం శంకరనారాయణస్వామి ఆలయంలో శంకర జయంతిని భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు ప్రకాష్ దీక్షిత్ నేతృత్వంలో రుద్రాభిషేకం, పూల అలంకరణ, అర్చన తదితర ఇతర ప్రత్యేక పూజలను నిర్వహించారు. శంకర భగవత్పాదుల చిత్రపటాన్ని రథంలో ఉంచి పట్టణంలోని ప్రముఖ వీధుల్లో ఊరేగించారు. జయంతి వేడుకలలో విప్ర సముదాయం వారు పాల్గొన్నారు.



మాలూరులో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కోలారు వార్తలు...

అభివృద్ధిని చూసి ఓటు వేయండి



మాట్లాడుతున్న రమేష్‌కుమార్

శ్రీనివాసపురం: నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి కార్యక్రమాలను చూసి తనకు ఓటు వేసి మళ్లీ గెలిపించాలని ఎమ్మెల్యే కె ఆర్ రమేష్‌కుమార్ కోరారు. మంగళవారం అరికెరెలో ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సౌలభ్యాలను పార్టీల కతీతంగా ప్రతి ఒక్కరికీ అందించానన్నారు. తన అవధిలో ప్రత్యేక శ్రద్ధ పెట్టి 23 వేల ఇళ్లు నిర్మించి ఇచ్చానన్నారు. కేసీ వ్యాలీ నీటిని జిల్లాలోని చెరువులకు అందించామన్నారు. అరికెరెలోని నాగనాథేశ్వరస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు.పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షుడు దింబాల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి వలస

రాజగుండ్లహళ్లిలో 10 కుటుంబాలు జేడీఎస్ పార్టీని వీడి ఎమ్మెల్యే కె ఆర్ రమేష్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారిని పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడిన ఎమ్మెల్యే నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఇతర పార్టీల నుంచి పెద్ద సంఖ్యలో చేరుతున్నారన్నారు.

శెట్టర్‌ను క్షమాపణ అడగను-జోషి

హుబ్లీ: మాజీ ముఖ్యమంత్రి జగదీష్ శెట్టర్‌ను క్షమాపణ అడగను అని కేంద్రమంత్రి ప్రహ్లాద జోషి చెప్పారు. హుబ్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర హోం మంత్రితో జరిగిన సమావేశంలో జగదీష్ శెట్టర్‌ను ఎట్టిపరిస్థితుల్లోను క్షమించరాదన్న వ్యాఖ్యలు వినపడిన నేపథ్యంలో ఓ ప్రశ్నకు పైవిధంగా ఆయన స్పందించారు. ఎన్నికల్లో గెలవాలన్న ఉద్దేశ్యంతో అమిత్‌షా అలా మాట్లాడారు. మా అందరి లక్ష్యం ఒక్కటే ఎన్నికల్లో గెలవడమేనన్నారు. ఈక్రమంలో శెట్టర్‌కు క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్రంలో బీజేపీ మోదీ హవాతో మరోసారి అధికారంలోకి వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ముఖ్యంగా శెట్టర్ స్థానంలో బరిలో నిలిచిన మహేష్ టెంగినకాయి అఖండ విజయం సాధిస్తారని ఆయన జోస్యం పలికారు.

టీచర్‌పై సస్పెన్షన్ వేటు

కోలారు: ఎన్నికల కర్తవ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ఆరోపణలపై బంగారుపేటె తాలూకా ఎస్.మాదమంగల పాఠశాల ఉపాధ్యాయిని నాగవేణి (సీఆర్‌పీ)ని సస్పెండ్ చేస్తూ జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాలు జారీ చేశారు. ఉపాధ్యాయిని నాగవేణికి ఎన్నికల్లో పోలింగ్ అధికారుల నియామక ఆదేశ ప్రతులను సంబంధిత అధికారులకు అందజేసే బాధ్యతను అప్పగించారు. అయితే ఆమె ఆదేశప్రతులను వారికి అందించలేదు. అంతేకాకుండా వారు ఇప్పటికే బదిలీపై వెళ్లారని తప్పుడు సమాచారం అందించారు. ఈ ఆరోపణలపై ఉపాధ్యాయిని నాగవేణిని సస్పెండ్ చేశారు.

ఈసారి గెలుపు బీజేపీదే



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు యోగేష్ సాగర్

మాలూరు: ఈ ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి మంజునాథ్‌గౌడ భారీ మెజార్టీతో గెలుపొందుతారని మహారాష్ట్ర ఎమ్మెల్యే, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌ఛార్జి యోగేష్ సాగర్ విశ్వాసం వ్యక్తం చేశారు. మంగళవారం తాలూకాలోని మాస్తిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రతి ఫిర్కా కేంద్రానికి వెళ్లి తాను సమాచారం సేకరిస్తున్నానని, ప్రజలకు బీజేపీపై ఎంతో విశ్వాసం ఉందన్నారు. నియోజకవర్గంలో తమ పార్టీ అభ్యర్థికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. ఈసందర్భంగా బీజేపీ నాయకులు అగ్రి నారాయణప్ప, తబల అప్పి, హెచ్‌ఆర్ మునియప్ప, హెచ్ వై వెంకటేష్, హెచ్ వి సతీష్, శేఖర్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన నరసింహులు

రాయచూరు రూరల్: మాజీ గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ నేత నరసింహులు ఆ పార్టీకి రాజీనామా చేసి మంగళవారం ఏపీఎంసీలో మాజీ గ్రామీణ ఎమ్మెల్యే, పార్టీ అభ్యర్థి తిప్పరాజ్ సమక్షంలో 200 మంది కార్యకర్తలు, మద్దతుదారులతో కలిసి బీజేపీలో చేరారు.

ఈవీఎంల భద్రతపై సమీక్ష



పరిశీలనకు వస్తున్న అధికారులు

కేజీఎఫ్: అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా కేజీఎఫ్ అసెంబ్లీ నియోజకవర్గానికి సామాన్య పరిశీలకుడిగా నియమితుడైన అధికారి సుధాన్షు మోహసమల్ మంగళవారం మదర్ ఆఫ్ మైన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)లను భద్రపరిచే స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ, పోలింగ్ ఏర్పాట్లు, కోడ్ ఉల్లంఘన కేసుల గురించి అధికారుల నుంచి సమాచారం సేకరించారు. నగరంలోని పోలింగ్ బూత్ నెంబరు–218కు వెళ్లి మౌలిక సౌకర్యాలను ఆరా తీశారు. పోలింగ్ కేంద్రాల్లో భద్రత, సీసీ టీవీల ఏర్పాట్ల గురించి సమీక్షించారు. అనంతరం తాలూకాలోని వివిధ చెక్‌పోస్టుల వద్దకు వెళ్లి పరిశీలన జరిపారు.

కాంగ్రెస్ అభ్యర్థి తరపున ప్రచారం



కరపత్రాలను పంచి ప్రచారం చేస్తున్న దృశ్యం

కేజీఎఫ్: తాలూకాలోని జక్కరసకుప్ప తదితర గ్రామాల్లో గ్రామ పంచాయతీ అధ్యక్షుడు చంద్రప్ప మంగళవారం కాంగ్రెస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రూపా శశిధర్ తరపున ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంచి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యే రూపా శశిధర్ రూ.10 కోట్ల వ్యయంతో మినీ విధానసౌధ నిర్మాణంతో పాటు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించారన్నారు. నగరంలో రోడ్లను అభివృద్ధి చేశారని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలను కల్పించారన్నారు. ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించే ఎమ్మెల్యేను మళ్లీ గెలిపించాలని కోరారు. ఈసందర్భంగా ప్రచార కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షురాలు నారాయణమ్మ, సభ్యులు అర్జున్ సుబ్బారెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీజేపీ కార్యకర్తల సమావేశం

కృష్ణరాజపురం: ఎన్నికల నిర్వహణపై మంగళవారం ఎమ్మెల్యే అరవింద లింబావళి కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో త్రిపుర మాజీ మాజీ సీఎం బిప్లావ్ కుమార్ దేబ్, మహాదేవపుర బీజేపీ అభ్యర్థి మంజుల లింబావళి తదితరులు పాల్గొన్నారు. నగరంలోని మారతహళ్లి ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎన్నికల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఓటర్లను తీసుకువచ్చి ఓటు వేయించే విషయంపై సలహాలు, సూచనలు ఇచ్చారు. సమావేశంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిడుగుపడి రైతు మృతి

మైసూరు: పిడుగు పడి రైతు మృతి చెందిన సంఘటన మంగళవారం మైసూరు జిల్లాలోని హెచ్‌డీ కోటె తాలూకాలోని హుల్లెమాళలో జరిగింది. రైతు ముత్తయ్య (62) పొలంలో పనిలో ఉండగా గాలీవాన మొదలైంది. రక్షణ కోసం చెట్టు కిందికి వెళ్లగా, చెట్టుపై పెద్ద పిడుగు పడడంతో క్షణాల్లోనే మృతి చెందాడు. సరగూరు పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

ఐదు నియోజకవర్గాల్లో గెలుస్తాం



మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి ఎస్‌హెచ్ శివశంకరరెడ్డి

గౌరిబిదనూరు: జిల్లాలో ఐదు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధిస్తారని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎస్‌హెచ్ శివశంకరరెడ్డి తెలిపారు. మంగళవారం నదీగట్టు ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణంలో జరిగిన ఎన్నికల ప్రచార సమావేశంలో ఆయన మాట్లాడుతూ...స్వతంత్ర అభ్యర్థి సైతం బీజేపీ తరఫున పనిచేస్తున్నారని ఆరోపించారు. ఎవరు ఎంత డబ్బులు ఖర్చు పెట్టినా ఈ నియోజకవర్గంలో తన గెలుపును ఎవరూ ఆపలేరన్నారు. ఇక చిక్కబళ్లాపురం బీజేపీ అభ్యర్థి సుధాకర్ అక్రమంగా సంపాదించిన డబ్బునంతా ఈ ఎన్నికల్లో పోగొట్టుకుని ఓటమిని చవి చూడాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ యువ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రక్షారామయ్య, ప్రకాశరెడ్డి, చిక్కబళ్లాపురం కాంగ్రెస్ అభ్యర్థి ప్రదీప్ ఈశ్వర్, భార్గవరెడ్డి, డీఎస్ఎస్ నాయకుడు సిజి గంగప్ప, అశ్వత్థ నారాయణ, కౌన్సిలర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

శంకరాచార్యుల జయంతి



బొమ్మనహళ్లి: బెంగళూరు నగర జిల్లా ఆనేకల్ పట్టణంలోని శ్రీ శంకర సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఆదిగురువు శంకరాచార్యుల జయంతి ఘనంగా నిర్వహించారు. వేడుకలను ఆధ్యాత్మిక గురువు, యోగా పండిత్ డాక్టర్. సుబ్బాభయ్యా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవ మూర్తిని పట్టణంలో ఊరేగింపు జరిపారు. వేడుకల్లో సమితి అధ్యక్షుడు ఎస్. రంగనాథ్, కార్యదర్శి రవి శాస్త్రి, పదాధికారులు నరసింహ మూర్తి, మహాలక్ష్మీ, సుబ్రమణ్యం, సత్యనారాయణ మూర్తి, రామ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

తుమకూరులో

తుమకూరు నగరంలోని గుబ్బి వీరన్న కళా క్షేత్రంలో తత్వజ్ఞాని ఆది శంకరాచార్యుల జయంతి ఘనంగా నిర్వహించారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో తుమకూరు జిల్లా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కే.ఎస్. సిద్దలింగయ్య పాల్గొని శంకరాచార్యుల చిత్రపటానికి పూజలు చేశారు.

జేడీఎస్ అభ్యర్థి ప్రచారం

బనశంకరి: బ్యాటరాయనపుర జేడీఎస్ అభ్యర్థి పీ.నాగరాజ్‌గౌడ మంగళవారం నియోజకవర్గంలో ప్రచా రం ముమ్మరం చేశారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య, మూలభూత సౌకర్యాలతో తీవ్రంగా ఉందన్నారు. ఇలాంటి సమస్యల పరిష్కారానికి ప్రాదేశిక పార్టీలు అవసరం ఉందన్నారు. జేడీఎస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.10 వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

పులకేశినగరలో బహుముఖి పోటీ

- హ్యాట్రిక్ కోసం అఖండ ఆరాటం
- అన్ని ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపుపై ధీమా



అఖండ శ్రీనివాసమూర్తి (బీఎస్పీఅభ్యర్థి)



ఏ.సీ.శ్రీనివాస్ (కాంగ్రెస్ అభ్యర్థి)




ఏ.మురళి (బీజేపీ అభ్యర్థి)



వీ.అనురాధ (జేడీఎస్ అభ్యర్థి)

శివాజీనగర: పేద, మధ్యతరగతి వర్గాలు అధికంగా ఉన్న ఎస్సీ రిజర్వుడు విధానసభ నియోజకవర్గమైన పులకేశినగర నుంచి అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను బరిలోకి దింపాయి. 2008 నియోజకవర్గాల పునర్విభజనతో ఏర్పడిన ఈ నియోజకవర్గంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది ఈసారి హ్యాట్రిక్ సాధించాలని ఆరాటపడుతున్న అఖండ శ్రీనివాసమూర్తికి కాంగ్రెస్ టికెట్ దక్కకపోవటంతో ఈసారి బీఎస్పీ నుంచి బరిలోకి దిగారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుల అండదండ ఉన్న ఏ.సీ.శ్రీనివాస్‌కు హైకమాండ్ టికెట్ కేటాయించింది.



అదే విధంగానే ప్రతి విధానసభ ఎన్నికల్లోను ఈ నియోజకవర్గంలో పట్టు సాధించాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తూ వస్తున్న అధికార బీజేపీ నుంచి ఏ. మురళి పోటీలో ఉన్నారు. దళిత, ముస్లిం ఓట్లు అధికంగా ఉన్న పులకేశినగర నియోజకవర్గంలో జేడీఎస్‌కు పలు వార్డుల్లో ఓటు బ్యాంకు ఉండటంతో ఈసారి మాజీ కార్పొరేటర్ రజనీమూర్తి కోడలు వీ.అనురాధ పోటీలో ఉన్నారు.

2,40 లక్షల మంది ఓటర్లు:

ఈ నియోజకవర్గంలో సుమారు 2.40 లక్షల ఓటర్లు ఉన్నారు. అందులో లక్షా 30 వేలు ముస్లిలు, 90 వేలు దళితులు, ఇతరులు 15 వేల మంది ఉన్నారు. ఇకఎస్‌డీపీఐ అభ్యర్థిగా పోరాట నాయకుడు బీ.ఆర్. భాస్కర్ ప్రసాద్, ఆప్ నుంచి సురేశ్ రాథోడ్, ఆర్పీఐ నుంచి మోహన్‌రాజ్‌తో పాటు మరో ఎనిమింది మంది స్వతంత్రులు బరిలో ఉన్నారు.

హ్యాట్రిక్ కోసం అఖండ పోరాటం :

2013లో జరిగిన విధానసభ ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుంచి జేడీఎస్ అభ్యర్థిగానూ, 2018లో కాంగ్రెస్ అభ్యర్థిగా రాష్ట్రంలోనే అత్యధిక ఓట్ల మెజారిటీ సాధించిన అఖండ శ్రీనివాసమూర్తి ఈసారి బీఎస్పీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. మూడోసారి గెలుపు కోసం ఆయన విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.

కాంగ్రెస్ విస్తృత ప్రచారం :

కాంగ్రెస్‌కే అవకాశాలు మెండుగా ఉన్నాయని ఆ పార్టీ అభ్యర్థి ఏ.సీ.శ్రీనివాస్ స్థానిక నాయకులతో కలసి జోరుగా ప్రచారం చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే బీ.ప్రసన్నకుమార్, మాజీ మేయర్ ఆర్.సంపత్‌రాజ్, మాజీ కార్పొరేటర్ ఏ.ఆర్.జాకీర్‌లతో పాటుగా నియోజకవర్గంలో విస్తృత ప్రచారం చేపడుతున్నారు.

ఖాతా తెరవాలని బీజేపీ ఆరాటం

ఈసారి తప్పకుండా అధికార పార్టీ బీజేపీ ఖాతా తెరవాలని బెంగళూరు ఉత్తర లోక్‌సభ సభ్యుడు, మాజీ కేంద్రమంత్రి డీ.వీ.సదానందగౌడ తమ పార్టీ అభ్యర్థి ఏ.మురళిని గెలిపించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఎంతమంది పోటీ చేసినా ప్రధానంగా బీఎస్పీ అభ్యర్థి అఖండ శ్రీనివాసమూర్తి, కాంగ్రెస్ అభ్యర్థి ఏ.సీ.శ్రీనివాస్‌ల మధ్య ఉంటుందని, ఎవరు గెలిచిన మెజార్టీ అంతంత మాత్రమేనని రాజకీయ విశ్లేషకులు సమాచారం.

దొడ్డలో బీజేపీకి ఎదురుదెబ్బ

- కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ కౌన్సిలర్లు

దొడ్డబళ్లాపురం: దొడ్డబళ్లాపురం నియోజకవర్గంలో బీజేపీకి తట్టుకోలేని ఎదురుదెబ్బ తగిలింది. ఏకంగా ఐదుగురు బీజేపీ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. దొడ్డ పట్టణ బీజేపీ అధ్యక్షుడు కౌన్సిలర్ శివశంకర్, కౌన్సిలర్లు శివు, శివన్న, ఇంద్రాణి, శివకుమార్‌లతో పాటు ప్రముఖ నాయకులు కేటీ కృష్ణప్ప, ప్రముఖ కన్నడపర ఉద్యమ నేత రాజఘట్ట రవి, శివానందరెడ్డి, చిత్ర నిర్మాత లక్ష్మీపతి పలువురు సోమవారం రాత్రి బెంగళూరులోని కాంగ్రెస్ కేంద్ర కార్యాలయంలో కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఇంకా ఇద్దరు బీజేపీ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధంగా ఉన్నట్టు సమాచారం. తాలూకాలో బీజేపీ బలోపేతానికి ఎంతో శ్రమించిన వారి అభిప్రాయాలను గౌరవించకుండా బయటి వ్యక్తులకు టికెట్ ఇవ్వడం, టికెట్ పొందిన ధీరజ్ మునిరాజు తమను పట్టించుకోకపోవడం పట్ల మనస్తాపం చెంది పార్టీ మారినట్లు కౌన్సిలర్లు చెప్పుకొచ్చారు. ఆదివారం సీఎం బొమ్మై పట్టణంలో రోడ్‌షో నిర్వహించి ఎన్నికల ప్రచారం చేసి వెళ్లిన మరుసటిరోజే ఇలా జరగడం బీజేపీ నాయకులకు మింగుడుపడడం లేదు.

అరూరులో సుధాకర్ రోడ్‌షో



చిక్కబళ్లాపురం: చిక్కబళ్లాపురం బీజేపీ అభ్యర్థి డాక్టర్ సుధాకర్ మంగళవారం పెరేసంద్ర సమీపంలోని అరూరు గ్రామంలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ..సమయాభావం వల్ల నియోజకవర్గంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఒక్కొక్కచోట కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. బీజేపీ చేపడుతున్న అభివృద్ధిని చేసి భారీ మెజార్టీతో తనను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. తన హయాంలో మెడికల్ కళాశాల, రెండు పీహెచ్‌సీలను అప్‌గ్రేడ్ చేశామని, చిక్కబళ్లాపురం జిల్లాను తీర్చిదిద్దే బాధ్యత తనపై పెట్టాలని అన్నారు. కార్యక్రమంలో సుధాకర్ తండ్రి మాజీ జెడ్పీ అధ్యక్షుడు కేశవరెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థికి బిషప్ ఆశీర్వాదం

శివాజీనగర: పులకేశినగర నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఏసీ శ్రీనివాస్ బెంగళూరు ఆర్చ్ బిషప్ పీటర్ మచోడోను కలుసుకొని ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. మంగళవారం ఆర్చ్‌బిషప్ హౌస్‌లో స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలసి వెళ్లి ఆయనకు శాలువా, పూలమాలతో సత్కరించి ప్రత్యేక ప్రార్థనలు చేయించుకొన్నారు.

పిల్లలకు సంస్కృతి, ఆచారాలు నేర్పించాలి

గౌరిబిదనూరు: మన పిల్లలకు చిన్న వయసు నుంచే మన సంస్కృతి, ఆచారాలు, ధర్మాల గురించి తెలియజేయాలని విశ్రాంత హైకోర్టు జడ్జి ఎన్ కుమార్ తెలిపారు. మంగళవారం శంకర జయంతి ఉత్సవాల సందర్భంగా నగరంలోని వీవీ పురంలో శృంగేరి శారదా దేవాలయంలో బ్రాహ్మణ క్షేమాభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆచార్య త్రయులైన శంకరాచార్యులు, మాధ్వాచార్యులు, రామానుజాచార్యుల బోధనలలో చివరిగా మన ధర్మ రక్షణకు పాటు పడాలన్నదే ధ్యేయమన్నారు. పిల్లలను దేవాలయాలకు పిలుచుకొని వచ్చి మన ధర్మం పట్ల ఆసక్తి కలిగేలా చేయాలన్నారు. బ్రాహ్మణ శాఖలన్నీ ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా దుర్గా హోం, స్తోత్ర పారాయణం, ప్రాకారోత్సవం అష్టావధాన సేవలు జరిగాయి. సాయంత్రం ఆది శంకరాచార్యుల చిత్రపటాన్ని ఊరేగించారు. అర్చకులు ఉమేశ్ భట్, బాలాజీ శర్మ, శివకుమార్, కిరణ్ శర్మ, గిరీశ్ శర్మ నేతత్వంలో ధార్మిక పూజలు జరిగాయి. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు రఘుబాబు, కార్యదర్శి రాజేశ్, జగదీశ్, డైరీ రమేశ్, డా శశిధర్, చంద్రశేఖర్, డా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న పండితులు

కాంగ్రెస్ అభ్యర్థి రిజ్వాన్ ప్రచారం



ప్రచారం చేస్తున్న రిజ్వాన్

శివాజీనగర: శివాజీనగరలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రిజ్వాన్ హర్షద్ మంగళవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. మంగళవారం ఉదయం నియోజకవర్గ పరిధిలోని కరగప్పగార్డెన్, సుబ్బయ్య సర్కిల్ ఆయన ఓటర్లను కలిసి ఓట్లను అభ్యర్థించారు. ఆయనకు మద్దతుగా సంగింరామనగర బ్లాక్ అధ్యక్షురాలు సుమతి ధనుంజయ, వార్డు అధ్యక్షుడు బీ.ఎల్.సురేశ్‌తో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు. ఆ తరువాత సాయంత్రం రామస్వామి పాళ్యవార్డు చిన్నప్పగార్డెన్‌లో వినాయక దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిపి ప్రచారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సీ.క్రిష్ణేగౌడ, వీ.పీ.ఆనందరాజ్, ఎం.సీ. శ్రీనివాస్, ఇనాయత్ తదితరులు పాల్గొన్నారు.

సీటీ రవి సీఎం అభ్యర్థి : ఈశ్వరప్ప

యశవంతపుర: వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తే సీటీ రవి సీఎం కావటం ఖాయమని మాజీ మంత్రి కేఎస్ ఈశ్వరప్ప కొత్త బాంబుపేల్చారు. కాంగ్రెస్‌లో ఎవరు ముఖ్యమంత్రి అవుతారనే విషయం చర్చ జరుగుతుండగా ఇప్పుడు బీజేపీలో ఈ రాగం వినపడుతోంది. సీటీ రవి ముఖ్యమంత్రి కావాలని ఎన్నికల బహిరంగసభలో ఈశ్వరప్ప చేసిన వ్యాఖ్యలపై తీవ్ర చర్చ నడుస్తోంది. బీజేపీకి ఈ వ్యాఖ్యలు ఇరుకున పెట్టేలా ఉందని ప్రచారం సాగుతోంది.

బీదర్‌లో యువతి హత్య

యశవంతపుర: బీదర్ తాలూకా మందకనహళ్లి గ్రామంలో తెలంగాణ యువతి హత్యకు గురైంది. వివరాలు...తెలంగాణ మేగా మదనూరు గ్రామానికి చెందిన మహి (38)కి ఓ వ్యక్తితో ఈమెకు వివాహేతర సంబంధం ఏర్పడింది. సదరు యువతి వద్ద నగదు ఉండటాన్ని గమనించిన వ్యక్తి కొంత నగదు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఆమె నిరాకరించింది. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో యువతిని మాట్లాడాలని మందకనహళ్లికి రమ్మని చెప్పి గొంతుకోసి చంపాడు. ఈ కేసులో ముగ్గురు పాల్గొనగా ఇద్దరి పోలీసులు అరెస్ట్ చేశారు. మరో వ్యక్తి కోసం గాలిస్తున్నారు.

హాసన్‌లో బీజేపీ అభ్యర్థి వ్యాఖ్యల దుమారం

యశవంతపుర: హాసన్ ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి ప్రీతంగౌడ మాట్లాడిన వీడియో ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. హాసన్ ప్రజలు బుద్ధిమంతులు కాదని ఆయన మాట్లాడిన వీడియో సామాజిక మాధ్యమల్లో హల్‌చల్ చేస్తోంది. ఎమ్మెల్యే స్థాయి వ్యక్తి ప్రజల గురించి ఇలా మాట్లాడటం తగదని నెటిజన్లు ప్రీతంపై దుమ్మెత్తి పోస్తున్నారు. ఈ క్రమంలో హాసన రాజకీయం రోజురోజుకు వేడెక్కుతోంది. జేడీఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య గట్టి పోటీ నెలకొంది. ప్రీతంగౌడ వ్యాఖ్యలను జేడీఎస్ నాయకులు అస్త్రంగా వాడుకుంటున్నారు. ఇటీవల హాసనలో జరిగిన కరావళి మిత్రమండలి సభలో ప్రీతంగౌడ ఈ వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం.

కొండచిలువ పట్టివేత

బనశంకరి: బెంగళూరు మహానగర పాలికె పరిధిలో భారీ కొండ చిలువ పట్టుబడింది. మంగళవారం అంజనాపుర కుంభత్తళ్లికి చెందిన రవిదాస్ అనే వ్యక్తి బీబీఎంపీ వన్యజీవి సంరక్షణ శాఖకు ఫోన్ చేసి తమ ప్రాంతంలో కొండచిలువ ఉన్నట్లు సమాచారం ఇచ్చాడు. సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని ఏడు అడుగుల కొండ చిలువను పట్టుకుని అటవీ ప్రాంతంలో సురక్షితంగా వదిలిపెట్టారు. వేసవి కారణంగా విష సర్పాలు బయటకు వస్తాయని, వాటికి హాని తలపెట్టకుండా వన్యజీవి అధికారులకు సమాచారం ఇవ్వాలని డిప్యూటీ అటవీ సంరక్షణాధికారి సరినాసిక్కలిగర్ తెలిపారు.

ఈ ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం తప్పదు

బనశంకరి: ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీజేపీ ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని బెంగళూరు దక్షిణ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ఆర్‌కే.రమేశ్ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం బెంగళూరు దక్షిణలోని బేగూరువార్డులో ఆర్‌కే.రమేశ్ ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్రంలో ఉన్న డబుల్ ఇంజన్ ప్రభుత్వం అన్నిరంగాల్లో విఫలమైందని, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని దుయ్యబట్టారు. వంటగ్యాస్, నిత్యావసరాలు పెరగడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజల జీవనం దుర్భరంగా మారిందన్నారు. మే 10న జరిగే ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు బీజేపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఎం.కృష్ణప్ప నియోజకవర్గానికి చేసిందేమీలేదని మండిపడ్డారు.



బేగూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ఆర్‌కే.రమేశ్

కాక్స్‌టౌన్‌లో ప్రచారం

శివాజీనగర: సీవీ రామన్ నగర బీజేపీ అభ్యర్థి ఎస్. రఘు మంగళవారం నియోజకవర్గ పరిధిలోని కాక్స్‌టౌన్‌లో భారీ రోడ్‌షో నిర్వహించారు. మంగళవారం స్థానిక గంగమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆ తరువాత ఓపెన్ జీప్‌లో బీజేపీ నేతలతో కలసి నగర వీధుల్లో వందలాది మంది పార్టీ కార్యకర్తలతో కలసి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో గుజరాత్ ఎమ్మెల్యే సంజయ్ పాల్గొని బీజేపీ అభ్యర్థి రఘు తరఫున ఓటును అభ్యర్థించారు. నాయకులు మంజునాథ్, కే.నారాయణ స్వామి, మాజీ కార్పొరేటర్ శశిరేఖ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

హోసూరు వార్తలు..

చైన్ స్నాచర్లు అరెస్ట్




నిందితులు

హోసూరు: ఇద్దరు చైన్‌స్నాచర్లను ప్రత్యేక పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు...హోసూరు హడ్కో పోలీస్‌స్టేషన్ పరిధిలోని సత్యనారాయణ లేఔట్ ప్రాంతానికి చెందిన వనితకు చిల్లర దుకాణం ఉంది. ఈనెల 17న మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఇద్దరు వ్యక్తులు తాగునీరు కావాలని అడిగారు. తీసుకొచ్చేందుకు ఆమె లోనికి వెళ్లగా ఆమె వెనుకే వచ్చి మహిళ మెడలో ఉన్న 2.5 పైన్ల తాళి చైన్ లాక్కెళ్లారు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు హడ్కో పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను పట్టుకునేందుకు హడ్కో ఎస్ఐ తంగవేల్ నేతృత్వంలో పోలీసులు గాలింపు చేపట్టారు. సోమవారం సాయంత్రం హోసూరు–నెల్లూరు చెక్‌పోస్ట్ వద్ద గస్తీ తిరుగుతున్న సమయంలో ద్విచక్ర వాహనంలో వచ్చిన ఇద్దరు వ్యక్తులను అనుమానంతో విచారణ చేయగా స్నాచింగ్‌లకు పాల్పడినట్లు తేలింది. నిందితులను బెంగళూరు క్రిష్ణదొడ్డి ప్రాంతానికి చెందిన శ్రీధర్, తుమకూరు జిల్లా గొడ్డహళ్లి గ్రామానికి చెందిన శివకుమార్‌గా గుర్తించారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

నీటికుంటలో పడి బాలుడు మృతి

క్రిష్ణగిరి: కుంటలో చేపలు పట్టేందుకెళ్లిన బాలుడు నీటిలో జారిపడి మృతి చెందిన ఘటన మత్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... క్రిష్ణగిరి జిల్లా మత్తూరు సమీపంలోని అందేరి పట్టి గ్రామానికి చెందిన మాదు, దీప దంపతుల కొడుకు ఇళవరసన్ (12). ఇతను సోమవారం సాయంత్రం అదే ప్రాంతంలోని ఓ కుంటలో చేపలు పట్టేందుకెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటిలో పడి మునిగిపోయాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని నీటిని బయటకు తోడి బాలుడి మృతదేహాన్ని వెలికితీశారు. మత్తూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

రెండవ పెళ్లి గొడవ.. వ్యక్తి ఆత్మహత్య

హోసూరు: జీవితంపై విరక్తి చెందిన వ్యక్తి రైలు కింద పడి ప్రాణాలు తీసుకున్నాడు. వివరాలు.. డెంకణీకోట తాలూకా జారకలట్టి గ్రామానికి చెందిన మునిరాజ్ కొడుకు గోవిందరాజ్ (29). గత కొన్ని సంవత్సరాల క్రితం హైదరాబాద్‌లో పనిచేస్తూ అదే ప్రాంతానికి చెందిన లక్ష్మిని ప్రేమించి పెళ్లి చేసుకొన్నాడు. వీరికి ఓ బాలుడున్నాడు. ఈ నేపథ్యంలో స్వగ్రామానికొచ్చిన మరో కులానికి చెందిన శోభ (26)ను గుట్టుగా రెండవ పెళ్లి చేసుకొన్నాడు. ఇది తెలిసి కుటుంబీకులు అతనితో సంబంధాలు తెంచుకున్నారు. దీంతో విరక్తి చెందిన గోవిందరాజ్ హోసూరు రైల్వేస్టేషన్ సమీపంలోని ఆర్సీ చర్చ్ వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకొన్నాడు. రైల్వే పోలీసులు విచారణ చేపట్టారు.

కోట మారియమ్మ ఉత్సవాలకు నాంది

హోసూరు: హోసూరు పట్టణంలో ప్రసిద్ధి పొందిన గ్రామదేవత శ్రీ స్వయంభు కోటమారియమ్మ ఆలయ ఉత్సవం మే 9వ తేదీ ఘనంగా జరగనుంది. ఈ సందర్భంగా అమ్మవారికి ముడుపు కట్టుకొన్న భక్తులు ఆ రోజు శరీరాలపై శూలాలు గుచ్చుకొని ఊరేగింపు నిర్వహించడం ఆనవాయితీ. ఊరుపండుగను పురస్కరించుకొని ఆలయ ధర్మకర్త మాజీ ఎమ్మెల్యే కే. గోపీనాథ్ అధ్యక్షతన మంగళవారం ఉదయం పాలకంభం నాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామదేవత ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. మే 10వ తేదీ రాత్రి 7 గంటలకు సిడి ఉత్సవం, అగ్నిగుండ మహోత్సవం 8 గంటలకు పల్లకీ ఉత్సవాలు జరుగుతాయి.



గ్రామదేవత ఉత్సవమూర్తిని ఊరేగిస్తున్న భక్తులు

గిరిజన గ్రామాల ప్రజలకు పట్టాలు

హోసూరు: గిరిజన ప్రాంతాల్లో నివాసముంటున్న గిరిజన ప్రజలకు అటవీశాఖ ద్వారా పట్టాలందజేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రం క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో కలెక్టర్ దీపక్ జేకప్ అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. జిల్లావ్యాప్తంగా అటవీ ప్రాంత గ్రామాల్లో 67 కమిటీలను ఏర్పాటు చేసిందని, ఈ కమిటీలో 847 మంది సభ్యులున్నారని తెలిపారు. కమిటీల ద్వారా గ్రామసభలు నిర్వహించి గిరిజన ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఫిర్యాదులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హోసూరు సబ్‌కలెక్టర్ శరణ్య, జిల్లా అటవీ శాఖాధికారిణి కార్తికేయిని, కనకరాజ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల మట్టి పొలాలకు ఉచితం

పొలాల్లో సారం పెంచేందుకు చెరువుల నుంచి ఉచితంగా బంకమట్టిని తరలించుకోవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని 43 చెరువుల్లో నుంచి బంకమట్టిని తరలించేందుకు అనుమతినిచ్చిందని, ఎకరాకు 25 ట్రాక్టర్ల మట్టిని తరలించుకొని సాగు భూముల్లో వేసుకోవచ్చని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి గల రైతులు ఖనిజ సంపదశాఖాధికార్లను సంప్రదించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఐక్యతగా పనిచేయాలి


శివాజీనగర: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దక్షిణ కన్నడ జిల్లాలో మెడికల్ కాలేజీ స్థాపిస్తామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వెల్లడించారు. మంగళవారం దక్షిణ కన్నడ జిల్లా సుళ్యలో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో మాట్లాడిన మల్లికార్జున ఖర్గే, ఎవరు సీఎం అయినా హామీలను నెరవేర్చాలని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దక్షిణ కన్నడ జిల్లాలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తామన్నారు. కాంగ్రెస్‌లో అందరూ ఐక్యతగా పని చేయాలని, 40 శాతం కమీషన్ ప్రభుత్వాన్ని తొలిగించాలి. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలన్నారు.

సతీశ్‌రెడ్డికి మద్దతుగా బీజేపీ నేత రోడ్డు షో



బొమ్మనహళ్లి: ఎన్నికలకు సమయం సమీపిస్తుండటంతో నాయకుల ప్రచారాలు జోరందుకున్నాయి. నగరంలోని బొమ్మనహళ్లిలో బీజేపీ అభ్యర్థి సతీశ్ రెడ్డి రోడ్‌షో నిర్వహించారు. ఆయనకు మద్దతుగా చత్తీస్‌ఘడ్ మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు రమణ్‌సింగ్ ఓపెన్‌టాప్ వాహనంలో అభ్యర్థితో కలిసి పుట్టెనహళ్లి, జరగనహళ్లి వార్డుల్లో రోడ్‌షో చేపట్టారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జల్లి రమేశ్, ప్రభావతి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

జేపీ నగరలో సౌమ్యారెడ్డి ప్రచారం



ప్రచారం చేస్తున్న అభ్యర్థి సౌమ్యారెడ్డి

బనశంకరి: కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని జయనగర నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి సౌమ్యారెడ్డి తెలిపారు. మంగళవారం జేపీ.నగరలో కాంగ్రెస్ నేతలతో కలిసి ఇంటింటి ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు నియంత్రణలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. గత సిద్దరామయ్య ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి ఆర్థికంగా ఎదగడానికి కృషి చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని తెలిపారు.

మా నాన్నను ఓడించడానికి కుట్ర

మైసూరు: వరుణలో మాజీ సీఎం సిద్దరామయ్యను ఓడించడానికి బీజేపీ, జేడీఎస్ పార్టీలు ఒక్కటయ్యాయని ఎమ్మెల్యే యతీంద్ర సిద్దరామయ్య ఆరోపించారు. మంగళవారం మైసూరు నగరంలో యతీంత్ర సిద్దరామయ్య మీడియాతో మాట్లాడుతూ... తన తండ్రి సిద్దరామయ్యను ఓడించడానికి ఈ రెండు పార్టీలను టార్గెట్ చేసుకున్నాయని మండిపడ్డారు. వరుణలో జేడీఎస్ పార్టీ అభ్యర్థిని మార్చడంపై కుట్ర ఉందన్నారు. ఎవరెన్ని చేసిన తన తండ్రిని ఓడించలేరన్నారు.

బాడీ బిల్డర్.. అయ్యాడు చైన్‌స్నాచర్

- విలాసాల కోసం చోరీలు
- దొంగ, అనుచరులు అరెస్టు



నిందితులు సయ్యద్ బాషా, అయూబ్

బనశంకరి: మిస్టర్ ఆంధ్రాగా పేరు గడించిన కడప రవీంద్రనగర నివాసి సయ్యద్ బాషా (34), అతని అనుచరుడు షేక్ అయూబ్‌ను మంగళవారం బెంగళూరు దక్షిణ విభాగం గిరినగర పోలీసులు అరెస్ట్ చేశారు. ఇతడి వద్ద నుంచి రూ.6 లక్షల విలువచేసే బంగారుచైన్లు, రెండు బైకులను స్వాధీనం చేసుకున్నారు. డీసీపీ కృష్ణకాంత్ వివరాలను వెల్లడించారు. సయ్యద్ పాషా 2005 నుంచి 2015 వరకు కువైట్‌లో కారుడ్రైవరుగా పనిచేశాడు. అక్కడ ఉండగానే బంగారం స్మగ్లింగ్‌లో పాల్గొన్నాడు. కరోనా సమయంలో సొంతూరికి చేరుకుని బాడీ బిల్డర్‌గా రాణించి పోటీల్లో పాల్గొని మిస్టర్ ఆంధ్రగా గుర్తింపు పొందాడు. సులభంగా డబ్బు సంపాదించాలని అడ్డదారులు తొక్కడం మొదలుపెట్టాడు. చైన్ స్నాచింగ్‌లకు పాల్పడడంతో స్థానిక పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపించారు.



స్వాధీనం చేసుకున్న బైక్‌లు

బెంగళూరులో చోరీలు సులభమని..

సయ్యద్ జైలులో ఉండగా బెంగళూరులో సులభంగా దొంగతనాలు చేయవచ్చునని తోటి ఖైదీ సలహా ఇచ్చాడు. దీంతో సయ్యద్ కొంతకాలం కిందట బెయిల్‌పై విడుదలై కడప నుంచి బెంగళూరు కు చేరుకున్నాడు. బైక్‌లను దొంగిలించి వాటిపై గిరినగర, సుబ్రమణ్యనగర పోలీస్‌స్టేషన్ల పరిధిలో తిరుగుతూ ఒంటరి మహిళలే లక్ష్యంగా చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డాడు. చోరీ తరువాత అదే ప్రాంతంలో మామూలుగానే తిరగేవాడు, దీని వల్ల తనపై ఎవరికీ అనుమానం రాదని భావించేవాడు. అంతేగాక మొబైల్‌ఫోన్‌ను కూడా వాడేవాడు కాదు. గిరినగరలో నమోదైన చైన్‌స్నాచింగ్ కేసుల్లో దర్యాప్తు చేసి సీసీ కెమెరాల చిత్రాల ఆధారంగా బైక్ నంబరును గుర్తించారు. మంగళవారం ఇద్దరిని అరెస్ట్‌చేసి విచారణ చేపట్టారు. నగరంలో చైన్‌స్నాచింగ్‌లతో పాటు 32 దొంగతనాలతో సయ్యాద్, అనుచరుని పాత్ర ఉన్నట్లు తెలిసింది.

ఐపీఎల్ బెట్టింగ్ ముఠా అరెస్టు

బెంగళూరులో ఐపీఎల్ బెట్టింగ్ దందాకు పాల్పడుతున్న 160 మందితో కూడిన ముఠాను మంగళవారం సీసీబీ పోలీసులు అరెస్ట్‌చేశారు. వీరి వద్ద నుంచి రూ.65 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరులో ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్న సమయంలో ఆన్‌లైన్‌లో బెట్టింగ్ దందా జోరుగా జరిగింది. ఆన్‌లైన్, యాప్‌ల ద్వారా జరిపేవారు.

క్లుప్తంగా...

2 నుంచి నృసింహ జయంత్యుత్సవాలు



యాదగిరిగుట్ట: యాదాద్రీశుడి ఆలయంలో మే 2 నుంచి 4 వరకు శ్రీనృసింహస్వామి జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ గీతారెడ్డి తెలిపారు. మంగళవారం ఆలయ అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తితో కలసి ఆమె విలేకరులతో మాట్లాడారు. మే 2న ఉదయం 9 గంటలకు స్వస్తి వాచనం, విష్వక్సేనారాధనతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయని.. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. జయంతి ఉత్సవాల నేపథ్యంలో ప్రధానాలయంలో 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్య, శాశ్వత కల్యాణం, నిత్య, శాశ్వత బ్రహ్మోత్సవాలను రద్దు చేసినట్లు తెలిపారు. అనుబంధ ఆలయమైన పాతగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలోనూ మే 2 నుంచి 4 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు.

అదనంగా 500 పాస్‌పోర్టు అపాయింట్‌మెంట్స్

సాక్షి, హైదరాబాద్: కొత్త పాస్‌పోర్టుల కోసం, పాస్‌పోర్టుల రెన్యువల్ కోసం వచ్చే వినియోగదారులు గంటల తరబడి ఎదురుచూసే పరిస్థితి నుంచి ఉపశమనం కల్పించేందుకు రెండు వారాల పాటు అదనపు అపాయింట్‌మెంట్లు ఇవ్వాలని హైదరాబాద్‌లోని ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం నిర్ణయించింది. పాస్‌పోర్టు సేవా కేంద్రాలు, పాస్‌పోర్టు ఆఫీస్ సేవా కేంద్రాల్లో ఎప్పుడూ ఇచ్చే రోజువారీ పాస్‌పోర్టు అపాయింట్‌మెంట్స్‌కు అదనంగా ఈ నెల 27 నుంచి రెండు వారాల పాటు మరో 500 అపాయింట్‌మెంట్స్ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. www. passportindia. gov. in వెబ్‌సైట్ ద్వారా లేదా mPassportseva మొబైల్ అప్లికేషన్ ద్వారా లేదా పాస్‌పోర్టు సేవా కేంద్రాలు, పాస్‌పోర్టు ఆఫీస్ సేవా కేంద్రాలను నేరుగా సంప్రదించడం ద్వారా ఈ అదనపు 500 అపాయింట్‌మెంట్స్ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు.

మే 31 నుంచి అంబేడ్కర్ వర్సిటీ డిగ్రీ పరీక్షలు

బంజారాహిల్స్ (హైదరాబాద్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం డిగ్రీ మూడు, రెండు, మొదటి సంవత్సరం ఓల్డ్ బ్యాచ్ 2016, అంతకుముందు బ్యాచ్‌ల విద్యార్థులకు మే 31వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ పి.వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. మూడో ఏడాది పరీక్షలు మే 31 నుంచి జూన్ 5 వరకు, రెండో ఏడాది పరీక్షలు జూన్ 7 నుంచి 14 వరకు. మొదటి ఏడాది పరీక్షలు జూన్ 16 నుంచి 19 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షల సమయం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ మే 10గా గడువు విధించినట్లు వివరించారు.మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు వారి సంబంధిత అధ్యయన కేంద్రంలో విశ్వవిద్యాలయ కాల్ సెంటర్‌లో హెల్ప్ డెస్క్ 7382929570 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

14 వరకు పాలిసెట్ దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: పాలిటెక్నిక్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (పాలిసెట్) దరఖాస్తు గడువును పెంచినట్లు సాంకేతిక విద్య కార్యదర్శి డాక్టర్ సి.శ్రీనాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 14 వరకు రూ.200 అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించినట్లు పేర్కొన్నారు. మే 17న పాలిసెట్ పరీక్ష నిర్వహించనుండగా, ఫలితాలను పరీక్ష జరిగిన పదిరోజుల్లో వెల్లడిస్తామని వెల్లడించారు.

గ్రూప్-1 అభ్యర్థులకు ఉచిత భోజనం: దాసు సురేశ్

సాక్షి, హైదరాబాద్: పేపర్ల లీకేజీలతో ఆర్థికంగా నష్టపోయిన అభ్యర్థులను ఆదుకోవడానికి తమ వంతు సాయంగా మే 1 నుంచి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు పూర్తయ్యే వరకు రెండు పూటలా ఉచిత భోజనాన్ని తమ కేంద్ర కార్యాలయం బాగ్ లింగంపల్లిలో అందిచనున్నట్లు బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపకుడు దాసు సురేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.క్వాలిఫైడ్ అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకొని ఉచిత భోజన సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎన్పీడీసీఎల్ ఆపరేటర్ రాత పరీక్ష జూన్ 4న

హన్మకొండ: టీఎస్ ఎన్పీడీసీఎల్ జూనియర్ అసిస్టెంట్ కమ్ ఆపరేటర్ రాత పరీక్ష వాయిదా పడింది. ఈ నెల 28న నిర్వహించనున్న రాత పరీక్షను వాయిదా వేసి, తిరిగి జూన్ 4న నిర్వహించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కొత్తగా 52 కరోనా కేసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మంగళవారం 7,006 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో 52 మంది వైరస్ బారినపడ్డారు. దీంతో ఇప్పటి వరకు మొత్తం నమోదైన కేసుల సంఖ్య 8.43 లక్షలకు చేరింది.

అందనంత దూరాన ఆవాసం..

నగరాలు, పట్టణాల్లో తీవ్రమవుతున్న గృహాల సమస్య

- ప్రస్తుతం దేశంలో 1.9 కోట్ల గృహాల కొరత
- ఉపాధి కోసం సామాన్య జనం పట్టణాలకు పోటెత్తుతుండటమే కారణం
- దేశంలో దాదాపు 36 శాతానికి పైగా జనాభా పట్టణ ప్రాంతాల్లోనే నివాసం
- 2050 నాటికి దేశ జనాభాలో సగం నగరాలు, పట్టణాల్లోనే..



సాక్షి ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్

వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ గృహాల కొరతను తీవ్రం చేస్తోంది. ప్రస్తుతం పట్టణాలు, నగరాల్లో 1.9 కోట్ల గృహాల కొరత ఉంటే.. 2030 నాటికి ఇది 3.8 కోట్లుగా ఉండనుందని పలు దేశీయ, అంతర్జాతీయ సంస్థల నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. కేంద్ర గృహ, పట్టణ మౌలిక సదుపాయాల మంత్రిత్వ శాఖ సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తోంది. రాబోయే ఏడేళ్లలో ఏకంగా దాదాపు నాలుగు కోట్ల గృహాల కొరత ఏర్పడుతుందని పేర్కొంటోంది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వస్తున్న వారి సంఖ్య భారీగా పెరుగుతుండటమే ఇందుకు ప్రధాన కారణమని తెలుస్తోంది. దేశంలో దాదాపు 36 శాతానికి పైగా జనాభా పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. 2050 నాటికి ఇది 50 శాతానికి చేరుతుందని అధ్యయనాలు స్పష్టం చేస్తుండగా, నిపుణులు సైతం ఇదే అంచనా వేస్తున్నారు. నగరాలు, పట్టణాల్లో ఉపాధి అవకాశాలు అధికంగా లభిస్తుండడమే పట్టణీకరణకు ప్రధాన కారణమని, గ్రామీణ ప్రాంతాల నుంచి సామాన్య జనం నగరాల బాట పడుతున్నారని చెబుతున్నారు.

భూముల ధరలు, నిర్మాణ వ్యయం పెరగడంతో..

పట్టణ ప్రాంతాల్లో భూముల విలువలు అమాంతంగా పెరగడంతో గ్రామీణ ప్రాంతాల నుంచి వస్తున్న వారికి సొంతంగా ఓ గూడు దొరకడం గగనమవుతోంది. పట్టణాలు, నగరాల్లో వివాద రహిత భూములు లేకపోవడం, పెరుగుతున్న నిర్మాణ వ్యయం, ఆచరణ సాధ్యమైన రెంటల్ మార్కెట్ లేకపోవడం తదితర అంశాలు గృహాల కొరతకు కారణమవుతున్నాయి, అందరికీ అందుబాటు ధరలో గృహాలు ఉండేందుకు వీలుగా భూముల ధరలు, నిర్మాణ వ్యయం తగ్గేలా చర్యలు తీసుకోవడమేగాక, ఆర్థిక సహకారం కూడా అందిస్తే ఈ సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉందని గృహ నిర్మాణ రంగ నిపుణులు పేర్కొంటున్నారు. పట్టణాల్లో ఒకప్పుడు భారీగా స్థలాలు సేకరించిన పలు కేంద్ర, ప్రభుత్వ రంగ సంస్థలు వాటిని పూర్తిస్థాయి వినియోగంలోకి తీసుకుని రాలేకపోయాయి. అలాంటి స్థలాలను గృహ నిర్మాణ రంగానికి కేటాయిస్తే పరిస్థితులు మెరుగు అవుతాయని అంటున్నారు.

గ్రామీణ ప్రాంతాల నుంచి 2030 నాటికి అదనంగా 8.33 కోట్ల మంది ప్రజలు నగరాలకు చేరుకుంటారని అంచనా వేస్తున్నారు. దీంతో అందుకు తగ్గట్టుగా మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఒక్క గృహవసతే కాకుం

సింగిల్ విండో పద్ధతి బెటర్..

రియల్ ఎస్టేట్ రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టే వ్యాపారులకు త్వరగా అనుమతులు రావడానికి వీలుగా సింగిల్ విండో పద్ధతిని కూడా అమలు చేయాలని అంటున్నారు. ప్రస్తుతం 'రెరా'(రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ) అనుమతుల పేరిట కొంతవరకు అలాంటి వెసులుబాటు వచ్చినా.. అది భారీ ప్రాజెక్టులకు మాత్రమే ఉపయోగపడుతోంది. మధ్య, దిగువ తరగతులకు అనుకూలంగా గృహాల నిర్మాణానికి అవసరమైన లే అవుట్‌లు, ఇళ్ల నిర్మాణానికి సులువుగా అనుమతులు వచ్చేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు అంటున్నారు. అనుమతుల కోసం పలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగడం, సకాలంలో అనుమతులు రాక నిర్మాణ వ్యయం విపరీతంగా పెరగడం వల్ల కూడా పేదలకు గృహాలు అందుబాటులో లేకుండా పోతున్నాయి. కేంద్ర ప్రభుత్వ ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) పథకం, క్రెడిట్ లింక్ సబ్సిడీ పథకం కేవలం ఆర్థికంగా వెనుకబడిన, దిగువ ఆదాయ వర్గాలకు మాత్రమే ఉపయోగ పడుతున్నాయని, వీటిని మధ్యాదాయ వర్గాలకు కూడా వర్తింప చేయాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

మౌలిక సదుపాయాలూ సమస్యే..

డా పరిశుభ్రమైన నీరు, మురుగునీటి పారుదల, రహదారుల విస్తరణ, ఇతర మౌలిక సదుపాయాల కల్పన కూడా ప్రధాన సమస్యగా మారుతోంది. పట్టణాలు, నగర జనాభాలో 17% మంది (అల్పాదాయ వర్గాలు) మురికివాడల్లోనే నివసిస్తున్నట్లు అంచనా. 71 శాతం ప్రజలకు భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ లేదు. 60 శాతం ప్రజలకు ఓపెన్ డ్రైనేజీ వ్యవస్థ ఉంటే.. మరుగుదొడ్ల సౌకర్యం లేని మురికివాడలు సైతం ఉన్నాయి. గ్రామాల నుంచి నగరాలు, పట్టణాలకు వస్తున్న వారి ఆదాయాల్లో మార్పుల కారణంగా నివాస గృహాలకు డిమాండ్ విపరీతంగా పెరుగుతున్నట్లు అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి.

భూ సేకరణ వ్యయానికీ ప్రోత్సాహకాలు ఇవ్వాలి



అందుబాటులో ఉండే గృహాలకు సంబంధించి నిర్మాణదారులను, కొనుగోలుదారులను ఇద్దరినీ ఆకర్షించేందుకు కేంద్రం పలు రాయితీలను ప్రకటించింది. పన్ను ప్రోత్సాహకాలతో డెవలపర్లను, వడ్డీ రాయితీలతో కొనుగోలుదారులను సంతృప్తి పరుస్తోంది. అయితే ప్రధాన నగరాల్లో ఈ ప్రాజెక్టులకు భూమి సేకరణ ప్రధాన సమస్యగా మారుతోంది. అందువల్ల కేంద్రం ఆయా ప్రాజెక్టుల నిర్మాణం కోసం భూ సేకరణ వ్యయాలపై కూడా ప్రోత్సాహకాలు అందించాల్సిన అవసరం ఉంది.

- అన్షుల్ జైన్, ఎండీ, కుష్‌మన్ వేక్‌ఫీల్డ్ ఇండియా

నెరవేరని పీఎంఏవై లక్ష్యం

పీఎంఏవై పథకం కింద 2015 నుంచి 2022 మధ్య మొత్తంగా 1.23 కోట్ల గృహాలు నిర్మించాలని కేంద్రం నిర్ణయించింది. ఇప్పటివరకు లబ్ధిదారులకు అప్పగించింది అందులో సగమే. 61 లక్షల గృహాలను మాత్రమే అందించినట్లు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమీక్షలో బయటపడింది. వాస్తవానికి 1.07 కోట్ల గృహాల పనులు ప్రారంభించినా.. అన్నీ పూర్తి కాలేదు. నిర్మాణం పూర్తయినా మౌలిక సదుపాయాలు లేని కారణంగా 5.61 గృహాలను లబ్ధిదారులకు అందించలేకపోవడం గమనార్హం. ఈ పథకంలో కేంద్ర, రాష్ట్ర, స్థానిక సంస్థల వాటాతో పాటు లబ్ధిదారుల వాటా కూడా ఉంటుంది. అయితే పలు రాష్ట్రాలు తమ వాటాను చెల్లించడంలో జాప్యం చేస్తున్నట్లు పార్లమెంటరీ కమిటీ గుర్తించింది.

మౌలిక వసతులు కల్పించాలి



నగరంలో అందరికీ అందుబాటులో ఉండేలా గృహాలను నిర్మించాలంటే స్థలం కొరత ప్రధాన సమస్య. దీంతో శివారు ప్రాంతాలకు వెళ్లక తప్పని పరిస్థితి. అలా వెళ్లాలంటే శివారుల్లో ముందుగా రహదారులు, మంచినీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలి. అప్పుడే డెవలపర్లు, కొనుగోలుదారులు ఇద్దరూ ముందుకొస్తారు. హైదరాబాద్ డెవలపర్ల విషయానికొస్తే.. ముందుగా ఔటర్ రింగ్ రోడ్డు గ్రిడ్ రోడ్లు, మాస్టర్ ప్లాన్ రోడ్లను అభివృద్ధి చేయాలి. అప్పుడే ఓఆర్ఆర్ పరిధిలో ఈ తరహా గృహాల నిర్మాణం ఊపందుకుంటుంది. అలాగే ఈ తరహా నిర్మాణాలకు రిజిస్ట్రేషన్ చార్జీలను నామమాత్రంగా వసూలు చేయాలి. స్థానిక సంస్థల ఫీజులను తగ్గించాలి.

- శేఖర్‌రెడ్డి, మాజీ జాతీయ అధ్యక్షుడు, క్రెడాయ్

29 ఏళ్ల తర్వాత జైలుకు..

- పరారీలో ఉన్న ఇద్దరు ఆర్థిక నేరగాళ్ల అరెస్టు
- కేరళలో నిందితులను పట్టుకున్న సీఐడీ



సాక్షి,, హైదరాబాద్ : అధిక వడ్డీ ఆశజూపి డబ్బులు కాజేసి పరారైన ఇద్దరు ఆర్థిక నేరగాళ్లను తెలంగాణ సీఐడీ పోలీసులు 29 ఏళ్ల తర్వాత కటకటాల వెనక్కి నెట్టారు. ఈ కేసులో నిందితులు ఎంఎం టామీ, సీఐ జోయ్ అలియాస్ జోసెఫ్‌లను తెలంగాణ సీఐడీ అధికారుల బృందం కేరళలోని ఎర్నాకుళంలో అరెస్టు చేసింది. సీఐడీ అడిషనల్ డీజీ మహేష్ భగవత్ మంగళవారం తెలిపిన వివరాలివి. కేరళకు చెందిన ఎంఎం టామీ, షెర్లీ టామీలు మరో ఎనిమిదిమందితో కలిసి ట్రావెన్‌కోర్ ఫైనాన్స్ అండ్ లీజింగ్ కంపెనీని హైదరాబాద్‌లో 1986లో స్థాపించారు. అధిక మొత్తంలో వడ్డీలు ఆశజూపి పలువురి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారు. తొలుత కొద్దిమందికి సకాలంలో వడ్డీ చెల్లించిన సదరు కంపెనీ ప్రతినిధులు.. ఆతర్వాత రూ.11,57,994 మొత్తాన్ని ఖాతాదారులకు చెల్లించకుండా బోర్డు తిప్పేశారు. ఈ ఆర్థిక మోసంపై సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారు. ఆ తర్వాత 1994 జనవరిలో ఎంఎం టామీ, షెర్లీటామీ, సీఐ జోసెఫ్‌లను అరెస్టు చేసి కోర్టు అనుమతిలో జ్యుడీషియల్ కస్టడీకి పంపారు. ఆ తర్వాత బెయిల్‌పై బయటికి వచ్చిన నిందితులు కోర్టుకు రాకుండా తప్పించుకు తిరుగుతున్నారు. కోర్టు 1994లో నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. అప్పటి నుంచి పరారీలో ఉన్న నిందితుల్లో ఇద్దరిని 29 ఏళ్ల తర్వాత అరెస్టు చేసినట్టు తెలిపారు. నిందితుల అరెస్టులో కీలకంగా పనిచేసిన ఇన్‌స్పెక్టర్ జేఎల్ లింగస్వామి, ఎస్‌ఐ డి.రమేశ్, హెడ్‌కానిస్టేబుల్ డి.నర్సయ్య, కానిస్టేబుల్ ఆనంద్, మహిళా కానిస్టేబుల్ అనితలను ఉన్నతాధికారులు అభినందించారు.

ఆర్టీసీలో గ్రాట్యుటీ గల్లంతు

- జనవరి నుంచి దాని చెల్లింపులకు అడ్డంకులు
- ఆర్థిక ఇబ్బందులతో చరిత్రలో తొలిసారి చెల్లింపుల నిలిపివేత
- రిటైర్ అయిన వెంటనే చెల్లించాల్సిన బెనిఫిట్ కోసం ఎదురుచూపులు

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ చరిత్రలో తొలిసారి గ్రాట్యుటీకి గండిపడింది. పదవీవిరమణ పొందిన ఉద్యోగుల హక్కుగా పొందే ఈ గ్రాట్యుటీని ఆర్థిక ఇబ్బందులను కారణంగా చూపి నిలిపేసింది. గతంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టినా గ్రాట్యుటీని మాత్రం ఆపలేదు. గత జనవరి నుంచి వీటి చెల్లింపుల్లో ప్రతిష్టంభన నెలకొంది. డిసెంబర్‌లో పదవీ విరమణ పొందినవారికి కాస్తా ఆలస్యంగా చెల్లించారు. జనవరి నుంచి రిటైర్ అవుతున్నవారికి చెల్లించే విషయంలో ఆర్టీసీ వెనకాముందు ఆడుతోంది. పదవీవిరమణ పొందిన ఉద్యోగులకు ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీలను వెంటనే చెల్లించాల్సి ఉంటుంది. వారు రిటైర్ అయ్యే సమయానికల్లా సెటిల్‌మెంట్లను సిద్ధం చేస్తారు. కానీ, ఇప్పుడు మొదటిసారి గతి తప్పింది. ఒక్కో ఉద్యోగికి వారి బేసిక్ ఆధారంగా రూ.8 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు గ్రాట్యుటీ అందుతుంది. ఆర్టీసీలో ప్రస్తుతం పింఛన్ విధానం లేనందున గ్రాట్యుటీ పెద్ద ఊరట, దాన్ని భవిష్యత్తు ఆసరాకు వీలుగా డిపాజిట్ చేసుకునేవాళ్లు, ఇంటి ప్రధాన అవసరాలకు వాడేవారు ఎక్కువగా ఉంటారు. అలాంటిది ఇప్పుడు గ్రాట్యుటీ నిలిచిపోవటం, ఎప్పుడు విడుదలవుతుందో తెలియని అయోమయం నెలకొనటంతో రిటైర్ అవుతున్న ఉద్యోగులలో తీవ్ర ఆవేదన నెలకొంది. తక్కువ వేతనాలుండే శ్రామిక్, డ్రైవర్, కండక్టర్ కుటుంబాల్లో ఇప్పుడు గందరగోళం నెలకొంది.

చివరి నెల వేతనం కూడా గల్లంతేనా..

ఆర్టీసీలో తొలి నుంచి రిటైర్ అయ్యేచివరి నెలవేతనం ఆలస్యంగా చెల్లిస్తూ వచ్చే పద్ధతి ఉంది. వారు జాయిన్ అయినప్పుడు నెల మధ్యలోనో, చివరలోనో విధుల్లో చేరినప్పుడు ఆ నెల మొత్తానికి అడ్వాన్సుగా పూర్తి మొత్తం చెల్లిస్తున్నారు. రిటైర్ అయ్యే చివరి నెల వేతనం నుంచి నాటి అడ్వాన్స్ మొత్తాన్ని సర్దుబాటు చేస్తారు. ఈ లెక్కలు చూసేందుకు సమయం పట్టనున్నందున ఓ నెల ఆలస్యంగా చివరి వేతనం చెల్లించేవారు. ఇప్పుడు గ్రాట్యుటీతోపాటు ఆ నెల వేతనం చెల్లింపునకు కూడా ఆటంకం ఏర్పడింది. వెరసి ఇటు గ్రాట్యుటీ రాక, చివరి వేతనం అందక ఉద్యోగులు తీవ్ర నిరాశతో ఇళ్లకు వెళ్తున్నారు. రిటైర్‌మెంట్ ఫంక్షన్‌రోజు కుటుంబసభ్యులను పిలిపించి సన్మానం చేసి సెటిల్‌మెంట్ల తాలూకు డబ్బు అందజేసి పంపించేరోజులు పోయి, ఖాళీ చేతులతో పంపటం ఇప్పుడు ఆర్టీసీ ఉద్యోగుల్లో ఆవేదనకు కారణమవుతోంది.


ఆర్‌ఈఎంఎస్ సిబ్బందిలో అవగాహన లేక..

ఆర్టీసీ ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులకు తార్నాకలోని ఆర్టీసీ ఆసుపత్రిలో వైద్యం ఉచితంగా అందుతోంది. రిటైర్ అవగానే ఆ వెసులుబాటు నిలిచిపోతుంది. అప్పుడు సిబ్బంది హోదా ఆధారంగా రూ.20 వేల నుంచి రూ.35 వేల వరకు నిర్ధారిత మొత్తాన్ని వసూలు చేసుకుని 'రిటైర్డ్ ఎంప్లాయీస్ మెడికల్ బెనిఫిట్ స్కీం(ఆర్ఈఎంఎస్)'లో సభ్యత్వం కల్పిస్తారు. అప్పుడు వారికి తార్నాక ఆసుపత్రి ద్వారా మెరుగైన చికిత్సకు వేరే ప్రైవేటు ఆసుపత్రికి రిఫర్ చేస్తే రూ.4 లక్షల వరకు బిల్లు కవర్ అవుతుంది. ఆర్ఈఎంఎస్ సభ్యత్వం కోసం ఉద్యోగులు చెల్లించాల్సిన మొత్తాన్ని గ్రాట్యుటీ నుంచి మినహాయిస్తూ వస్తున్నారు. ఇప్పుడు గ్రాట్యుటీ నిలిచిపోవటంతో కొన్ని డిపోల్లో సంబంధిత సెక్షన్ ఉద్యోగులు ఆర్ఈఎంఎస్ సభ్యత్వం కోసం ఏర్పాట్లు చేయటం లేదు. కొన్నిచోట్ల మాత్రం, నిర్ధారిత మొత్తాన్ని తగ్గించి గ్రాట్యుటీ సెటిల్‌మెంట్ కోసం ఉన్నతాధికారులకు ఫైల్ పంపుతున్నారు. దీంతో కొన్ని డిపోల్లో రిటైర్ అయినవారికి ఆర్ఈఎంఎస్ సభ్యత్వం లభించటం లేదు. ఏప్రిల్‌లో శుభకార్యాలు లేకపోవటంతో బస్సుల్లో ప్రయాణించేవారి సంఖ్య కూడా తగ్గించి ఫలితంగా రోజువారీ టికెట్ ఆదాయం రూ.14.50 కోట్లు రావాల్సి ఉండగా, రూ.12 కోట్ల వద్దే ఆగిపోతోంది. ఇలాంటి తరుణంలో ఈ నెల తాలూకు జీతాల చెల్లింపు ఎలా అన్న విషయంలో ఆర్టీసీ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. జీతాలకే దిక్కులేని తరుణంలో గ్రాట్యుటీ సెటిల్‌మెంట్ కష్టంగా మారింది.

నేటి నుంచి కొత్త సచివాలయానికి

శాఖల తరలింపు

- 28లోగా ప్రక్రియ పూర్తికి ఆదేశం
- శాఖలవారీగా స్థలాలు కేటాయింపు
- 30న ప్రారంభానికి చురుగ్గా ఏర్పాట్లు
- సుదర్శన యాగంతో కార్యకలాపాలు ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వశాఖ తరలింపు ప్రక్రియను ప్రారంభించి 28లోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఆరు అంతస్తుల కొత్త సచివాలయ భవన సముదాయంలోని ఒక్కో అంతస్తులో కనీసం మూడు శాఖలకు స్థలం కేటాయించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో రెవెన్యూ, మొదటి అంతస్తులో హోం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, రెండో అంతస్తులో ఆర్థిక, మూడో అంతస్తులో వ్యవసాయం, ఎస్సీల అభివృద్ధి, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ, నాలుగో అంతస్తులో నీటిపారుదల, న్యాయశాఖలు, ఐదో అంతస్తులో రోడ్లు, భవనాలు, సాధారణ పరిపాలన శాఖలు, ఆరో అంతస్తులో సీఎం, సీఎస్‌లకు స్థలం కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

సుదర్శనయాగంతో కార్యకలాపాలు షురూ

ఈ నెల 30న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు కొత్త సచివాలయాన్ని ప్రారంభించనున్న విషయం తెలిసిందే. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముందే ఉదయం కొత్త సచివాలయం ప్రాంగణంలో సుదర్శన యాగం నిర్వహించనుంది. ఇందుకోసం ప్రత్యేకంగా యాగశాలను ఏర్పాటు చేస్తున్నారు. కొత్త సచివాలయానికి శాఖల తరలింపు, సచివాలయం ప్రారంభోత్సవ ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి మంగళవారం బీఆర్‌కేఆర్ భవన్‌లో అన్ని శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించి శాఖలవారీగా బాధ్యతలను అప్పగించారు.

అయ్యో.. అముద

- క్యాన్సర్ మహమ్మారితో క్షీణిస్తున్న ఆరోగ్యం
- ఆపన్నహస్తం కోసం అభాగ్యురాలి ఎదురుచూపు



పదేళ్ల క్రితం చెత్త కుప్పల మధ్య అముద



కోదాడ: అముదకు మళ్లీ ఆపదొచ్చింది. పదేళ్ల క్రితం సూర్యాపేట జిల్లా కోదాడలోని హుజూర్‌నగర్ రోడ్డులో ఉన్న చెత్త కుప్పల్లో మతిస్థిమితం లేకుండా కనిపించిన చిన్నారి అముదను అక్కడే చెప్పులు కుట్టుకునే పల్లా వెంకటేశ్వర్లు చేరదీశారు. చికిత్స చేయించి చదువు చెప్పించారు. ఆ తర్వాత మంత్రి హరీశ్‌రావు చొరవతో కోదాడ మార్కెట్ కార్యాలయంలో ఆమె అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఇటీవల ఆమె జీవిత చరిత్రను సినిమాగా కూడా తీశారు. ఇలా సాఫీగా సాగుతున్న అముద జీవితంలో క్యాన్సర్ మహమ్మారి కల్లోలం సృష్టిస్తోంది. హైదరాబాద్‌లోని బసవతారకం వైద్యశాలలో చికిత్స చేయించినా రేడియేషన్‌ను తట్టుకోలేక పోవడంతో కేరళ వైద్యుడి పర్యవేక్షణలో ఆయుర్వేద చికిత్స పొందుతోంది. అయితే దీనికి ఖర్చు ఎక్కువగా ఉండడంతో ఆమెను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

సాయం చేయదలిచిన వారు.. సంప్రదించాల్సిన వివరాలు	పల్లె అముద నారాయణ నాడర్, బ్యాంక్ ఖాతా నంబర్: 6247 897 1579, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ : ఎస్‌బీఐఎన్0020181 ఫోన్ నంబర్ : 93915 42070

గేమ్‌ఛేంజర్‌గా ఆర్‌ఆర్‌ఆర్



- అవాంతరాలు అధిగమించి ప్రాజెక్టును టెండర్లకు సిద్ధం చేశాం
- ఎన్‌హెచ్‌ఏఐ తెలంగాణ రీజనల్ ఆఫీసర్ కృష్ణప్రసాద్
- చీఫ్ జనరల్ మేనేజర్‌గా ఢిల్లీకి బదిలీ

సాక్షి, హైదరాబాద్: "హైదరాబాద్ రీజనల్ రింగురోడ్డు (ఆర్ఆర్ఆర్) అందుబాటులోకి వచ్చాక రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రంలో భారీ మార్పులకు అవకాశం ఉంటుంది. ఔటర్ రింగురోడ్డు (ఓఆర్ఆర్) వల్ల హైదరాబాద్‌కు కలిగిన లాభం కంటే ఆర్ఆర్ఆర్ వల్ల ఏర్పడే లబ్ధి ఇంకా ఎక్కువగా ఉండనుంది. ఎక్స్‌ప్రెస్ వే తరహాలో రూపుదిద్దుకోనున్న ఆ రోడ్డును ఆసరాగా చేసుకొని పారిశ్రామిక క్లస్టర్లు రావడమే కాకుండా శాటిలైట్ టౌన్‌షిప్‌లు, టూరిజం ప్రాజెక్టులు ఏర్పడనున్నాయి. ఇది హైదరాబాద్‌పై జనాభా ఒత్తిడిని తగ్గించటమే కాకుండా ఎందరికో ఉపాధి కల్పించనుంది. ఇలాంటి ప్రాజెక్టు సాకారమయ్యేందుకు అవసరమైన ప్రాథమిక, కీలక ఏర్పాట్లు నా ఆధ్వర్యంలో జరగడం అదృష్టంగా భావిస్తున్నా'' అని జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) తెలంగాణ రీజనల్ ఆఫీసర్ ఎ.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. 2017 నుంచి రాష్ట్రానికి ఎన్‌హెచ్‌ఏఐ ఆర్‌ఓగా ఉన్న ఆయన ఇప్పుడు ఎన్‌హెచ్‌ఏఐ చీఫ్ జనరల్ మేనేజర్‌గా పదోన్నతిపై ఢిల్లీ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం కృష్ణప్రసాద్ విలేకరులతో మాట్లాడారు.

నాగ్‌పూర్–విజయవాడ ఎక్స్‌ప్రెస్ వేతోనూ మేలు

నాగ్‌పూర్–విజయవాడ మధ్య రూపుదిద్దుకొనే ఎక్స్‌ప్రెస్ వే మంచిర్యాల నుంచి విజయవాడ వరకు పూర్తి గ్రీన్‌ఫీల్డ్ హైవేగా రానుండటం కూడా రాష్ట్రానికి ఎంతో మేలు చేస్తుందని కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. అది ప్రస్తుతం హైదరాబాద్ మీదుగా విజయవాడకున్న హైవేకు ప్రత్యామ్నాయ మార్గంగా మారి ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గిస్తుందని, దీనివల్ల కూడా కొత్త ఉపాధి మార్గాలు ఏర్పడతాయన్నారు. ఈ కీలక ప్రాజెక్టు పర్యావరణ అనుమతులు సాధించడం తమకు సవాల్‌గా మారినా అడ్డంకులను అధిగమించి ఇప్పుడు పనులు ప్రారంభించే స్థాయికి తెచ్చామన్నారు.


రూ. కోట్ల విలువైన రోడ్డు ప్రాజెక్టులు పూర్తి చేశాం..

తాను తెలంగాణలో పనిచేసిన ఆరున్నరేళ్లలో రూ.10,764 కోట్ల విలువైన 335.45 కి.మీ. నిడివిగాల రోడ్లను పూర్తి చేశామని, రూ.13,664.21 కోట్ల విలువైన 432.49 కి.మీ. నిడివిగల ప్రాజెక్టులు చేపట్టేందుకు వీలుగా అవార్డ్ పాస్ చేయించామని, రూ.9102 కోట్ల విలువైన 294 కి.మీ. నిడివి గల ప్రాజెక్టుల పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. రూ.14696 కోట్ల విలువైన 275 కి.మీ. నిడివి గల ప్రాజెక్టు పనులు డీపీఆర్ తయారీ దశలో ఉన్నాయన్నారు.

సంగారెడ్డి – తూప్రాన్ మధ్య

తొలి 'రింగు' నిర్మాణం

- రెండు ప్యాకేజీలుగా 60 కిలోమీటర్ల రోడ్డు
- త్వరలో టెండర్లు.. చకచకా ఎన్‌హెచ్‌ఏఐ ఏర్పాట్లు



సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగ్‌రోడ్డు ఉత్తరభాగం నిర్మాణ పనులు తొలుత సంగారెడ్డి–తూప్రాన్ మధ్య ప్రారంభం కానున్నాయి. ఈమేరకు అధికారులు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ రెండు పట్టణాల మధ్య ఉన్న 60 కిలోమీటర్ల నిడివికి సంబంధించి రెండు ప్యాకేజీలుగా పనులు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఒక్కోటి 30 కిలోమీటర్లుగా రెండు ప్యాకేజీలకు త్వరలో టెండర్లు పిలవనున్నారు. ఇప్పటికే ప్రాజెక్టు డీపీఆర్ సిద్ధం చేసిన ఎన్‌హెచ్‌ఏఐ తాజాగా మూడు కాంపిటెంట్ అథారిటీ ఫర్ లాండ్ అక్విజిషన్ (కాలా)లకు సంబంధించి భూ పరిహార 3–డీ గెజిట్ నోటిఫికేషన్లు జారీ చేయడం తెలిసిందే. మిగతా ఐదు కాలాలకు కూడా త్వరలో గెజిట్ నోటిఫికేషన్లు విడుదల కానున్నాయి. గతేడాది ఏప్రిల్‌లో మూడు కాలాలకు 3–ఏ గెజిట్ నోటిఫికేషన్లు విడుదల కాగా, ఈ ఏప్రిల్‌తో వాటి గడువు తీరిపోనుంది. దీంతో ఏప్రిల్ ముగిసేలోపు 3–డీ గెజిట్ నోటిఫికేషన్లు జారీ కావలసి ఉంది. ఇదే విషయాన్ని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, భూపరిహారంలో తనవంతు వాటా డబ్బులు జమ చేయాలని కోరారు. ఈమేరకు ఇటీవల ఢిల్లీలో ఎన్‌హెచ్‌ఏఐ–రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల మధ్య జరిగిన భేటీలో సయోధ్య కుదిరింది. రూ.2900 కోట్లకు తొలుత రూ.100 కోట్లు చెల్లించనున్నట్టు రాష్ట్ర అధికారులు పేర్కొనగా ఎన్‌హెచ్‌ఏఐ అంగీకరించింది. ఈమేరకు కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ–ఎన్‌హెచ్‌ఏఐ–రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఒప్పందం కుదిరింది. సంతకాల ప్రక్రియ పూర్తి కాగానే, మిగతా గెజిట్ నోటిఫికేషన్లు జారీ కానున్నాయి. ఆ వెంటనే సంగారెడ్డి–తూప్రాన్ మధ్య రెండు ప్యాకేజీలుగా 60 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి టెండర్లు పిలవనున్నారు.

ఇక నాలుగేళ్ల బీఈడీ కోర్సు!

27న ఎన్‌సీటీఈ సమావేశం



సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఈడీ) కోర్సులో మార్పులు చేపట్టాలని కేంద్రం నిర్ణయించింది. బీఏ–బీఈడీ, బీఎస్సీ–బీఈడీ కోర్సులను నాలుగేళ్ల కాలపరిమితితో రూపొందించాలని భావిస్తోంది. ఇందుకు సంబంధించిన ముసాయిదా ప్రతిని 2022లోనే రూపొందించింది. దీనిపై అన్ని రాష్ట్రాల అభిప్రాయాలు కోరింది. వీటిలో మార్పులు చేర్పులతో తుది ప్రతిని రూపొందించే ప్రయత్నంలో ఉంది. నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) దీనిపై ఈ నెల 27న ఢిల్లీలో సమావేశం కానుంది. ఈ భేటీలో నాలుగేళ్ల సమీకృత బీఈడీ కోర్సులపై చర్చించనున్నా రు. 2024–25 నుంచి కొత్త బీఈడీ కోర్సులను అమల్లోకి తేవాలనే లక్ష్యంతో ఉన్నారు.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
బుధవారం ॥ 26-4-2023

జమునా టుడు... పర్యావరణ ఉద్యమకారిణి.
ఆమెకు అంత పెద్ద పదం కూడా తెలియదు.
పద్మశ్రీ పురస్కారం గురించి వినవే లేదు.
సంతాల్ ఆదివాసీ మహిళ ఆమె.
పుట్టిల్లు ఒడిశా రాష్ట్రం... అత్తిల్లు జార్ఖండ్.
ఆమెకి తెలిసిందల్లా అడవి అమ్మ ఒడి అని మాత్రమే.
అడవి పచ్చగా ఉంటేనే బతుకు చల్లగా ఉంటుందని.
చెట్టు మీద పడే గొడ్డలి వేటును అడ్డుకుంది.
ఊరందరినీ కలుపుకుని మొక్కలు నాటింది.
వన సంరక్షణతో పచ్చదనానికి చిరునామా అయింది.

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమీప బంధువు జమునా టుడు తన బాల్యం, పర్యావరణ ఉద్యమం, టింబర్ మాఫియాతో పోరాటం గురించి 'సాక్షి'తో పంచుకున్న వివరాలివి.


రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో జమునా టుడు (ఫైల్ ఫొటో)

మొక్కలే నా పిల్లలు

ఈ-మెయిల్ ఇంటర్వ్యూలో లేడీ టార్జాన్ జమున

■ **రాయ్ రంగపూర్‌లో మీ బాల్యం ఎలా గడిచింది?**

మా ఊరు ఒడిశా రాష్ట్రం, మయూర్‌భంజ్ జిల్లా, రాయ్‌రంగపూర్ తాలూకాలోని రంగ్ మటియా గ్రామం. రాయ్ రంగపూర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. మాది పెద్ద కుటుంబం. ఏడుగురు అక్కలు, నేను, తమ్ముడు. నాన్న రైతు, అమ్మ గృహిణి. కుటుంబ పోషణ కోసం చిన్న దుకాణం పెట్టి తవుడు, పొట్టు అమ్మేవారు. నా విద్యాభ్యాసం ఐదవ తరగతి వరకు మా ఊర్లోనే. హైస్కూల్‌కి రోజూ 5 కిలోమీటర్లు నడిచి వెళ్లేదాన్ని. అంతపెద్ద కుటుంబాన్ని పోషించాల్సిన స్థితిలో నాకు సైకిల్ కొనివ్వడం కూడా సాధ్యం కాలేదాయనకు. నేను ఏడవ తరగతిలో ఉన్నప్పుడు అమ్మ భగవంతుని సన్నిధికి చేరుకుంది. నాన్న మమ్మల్ని బాగా చూసుకునే వారు. నన్ను, తమ్ముడిని తనతోపాటు సరదాగా పొలానికి తీసుకెళ్లేవారు. ఇలాగ కొన్ని సంతోషాలు, అనేక సర్దుబాట్ల మధ్య గడిచింది నా బాల్యం.


కలప దొంగల మీద బాణం ఎక్కుపెట్టిన జమునా టుడు

■ **బాణాలు వేయడం ఎలా నేర్చుకున్నారు?**

మా ఆదివాసీ కుటుంబాల్లో బిడ్డను మంచం మీద పడుకోబెట్టేటప్పుడు తల దగ్గర బాణాలు, విల్లు కూడా పెడతారు. అది మా సంస్కృతి. ప్రతి ఇంట్లో విల్లంబులు ఉంటాయి. ఎవరూ నేర్పించడం అంటూ ఉండదు. మాకు మేమే సాధన చేస్తూ నేర్చుకుంటాం.

■ **విద్యాభ్యాసం, పెళ్లి వివరాలు...**

జామ్‌దాలోని బాలికల హైస్కూల్‌లో చదివాను. కానీ ఇంటి సమస్యల కారణంగా చదువు కొనసాగించలేకపోయాను.అమ్మ లేకపోవడం, అక్కలకు పెళ్లిళ్లు అయి అత్తవారిళ్లకు వెళ్లిపోవడంతో ఇంట్లో నాన్న, నేను, తమ్ముడు మాత్రమే. దాంతో ఇంటి బాధ్యత తీసుకోవాల్సి వచ్చింది. ఒక అక్క టాటానగర్‌లో ఉండేది. ఆ అక్క దగ్గరకు వెళ్లి ఏదైనా పని నేర్చుకుంటానని అడిగినప్పుడు నాన్న మొదట అంగీకరించలేదు. తమ్ముడి చదువు కోసం నేను పని చేయడం అవసరమని నాన్నని ఒప్పించి వెళ్లాను. అక్కడ రోజు కూలీగా పనిలో చేరాను. అక్కడే అక్క ఒక తాపీ పని చేసే కుర్రాడితో నా పెళ్లి కుదిర్చింది. పెళ్లి తర్వాత కూడా నాన్నకు, తమ్ముడికి సహాయంగా ఉన్నాను. అత్తగారింటికి జార్ఖండ్‌కు వెళ్లిన తర్వాత నా భర్తతో కలిసి అక్కడే పనులు చేసుకోవడం మొదలు పెట్టాను.

■ **అటవీ సంరక్షణ పట్ల ఆసక్తి కలగడానికి కారణాలేమిటి?**

మా అత్తగారి ఊరి ఎదురుగా మంచి అడవి ఉంది. నాన్నతో కలిసి మొక్కలు నాటిన బాల్యం గుర్తుకు వచ్చింది. అడవిని రక్షించుకోవాల్సిన అవసరం గురించి నాన్న చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. ఊరి వాళ్లను సమీకరించి అటవీ పరిరక్షణ కోసం మొక్కలు నాటడం వంటి పనులు మొదలు పెట్టాను. నేను ఇప్పుడు చేస్తున్న పర్యావరణ పరిరక్షణ ఉద్యమానికి మూలకారకుడు మా నాన్నే. ఆయన ఇప్పుడు లేరు.

■ **మిమ్మల్ని లేడీ టార్జాన్ అంటుంటే ఏమనిపిస్తుంటుంది?**

జనం నన్ను లేడీ టార్జాన్ అనడం గర్వంగా ఉంది.

■ **టింబర్ మాఫియాను ఎదుర్కొనే ధైర్యం ఎలా వచ్చింది?**

ఒకరోజు మా ఇంట్లో ఉన్న కలపను టింబర్ మాఫియా వాళ్లు ఎత్తుకెళ్లిపోయారు. అదేమని ప్రశ్నించిన నన్ను, నా భర్తను విచక్షణ రహితంగా కొట్టారు. రక్తం కారేటట్లు కొట్టినా సరే నేను భయపడలేదు. పుట్టిన వాళ్లం ఏదో ఒకరోజు పోవాల్సిందేనని తెలుసు కదా... అని మొండిగా ఎదుర్కొన్నాను. నాకంతటి ధైర్యాన్ని మొక్కలే ఇచ్చాయి. బహుశా! దేవుడు నన్ను మొక్కలను సంరక్షించడానికే భూమ్మీదకు పంపినట్లున్నాడు. అందుకే పిల్లలనివ్వలేదు. నాకు మొక్కలే పిల్లలు. భూమ్మీద బతికి ఉన్నంత వరకు, నేను శ్వాస తీసుకున్నంత కాలం మొక్కలను కాపాడుతూనే ఉంటాను.

■ **మన్ కీ బాత్‌లో ప్రధాని ప్రశంస...**

ప్రధానమంత్రికి ధన్యవాదాలు. మన్ కీ బాత్ సందర్భంగా నన్ను 'జంగల్ కీ టార్జాన్' అన్నారు. అది పెద్ద బిరుదుగా భావిస్తున్నాను. అత్యంత సాధారణమైన ఆదివాసీ మహిళ అయిన నాకు ప్రధానమంత్రి అంతటి గుర్తింపు నివ్వడం సంతోషంగా ఉంది.

■ **పద్మశ్రీ పురస్కారం అందుకున్న సందర్భం...**

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముగారు... జార్ఖండ్ గవర్నర్‌గా ఉన్నప్పుడు అటవీ సంరక్షణ, పర్యావరణ పరిరక్షణలో నా కార్యకలాపాల గురించి తెలుసుకుని పద్మశ్రీ పురస్కారానికి ప్రతిపాదించారు. రామ్‌నాథ్ కోవింద్ గారి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నాను. ముర్ము పుట్టిన ఊరు, మా ఊరు ఒడిశాలో ఒకే ప్రాంతంలో ఉన్నాయి. ఆమె నన్ను సొంత చెల్లెలా ప్రేమిస్తారు.

■ **పద్మశ్రీ అందుకున్న తర్వాత మీ బాధ్యత పెరిగినట్లు అనిపిస్తోందా?**

నిజమే. అంతకుముందు జార్ఖండ్ వరకే పరిమితమయ్యాను. 2019లో పద్మశ్రీ అందుకున్న తర్వాత నా కార్యకలాపాల పరిధిని దేశవ్యాప్తం చేయాల్సిన అవసరం వచ్చింది. అలాగే చేస్తున్నాను కూడా.

■ **అటవీ సంరక్షణ కోసం ఉద్యమించిన తొలినాళ్లలో అత్యున్నత పురస్కారం అందుకోగలరని ఊహించారా?**

నేను చేస్తున్న పనులకు ఇంతటి గుర్తింపు వస్తుందని తెలియదు. గుర్తింపు రావాలనే ఆకాంక్షతో పని చేయలేదు కూడా. అడవిని కాపాడితేనే మనకు జీవితం ఉంటుందని పని చేశాను. పర్యావరణాన్ని పరిరక్షించాలనే మంచి మనసుతో పని చేశాను.

■ **కుటుంబం, పిల్లలు...**

నేను, నా భర్త ఇద్దరమే ఇంట్లో. మొక్కలే నా పిల్లలు.

■ **మహిళలకు మీ సందేశం...**

మహిళలకు, యువతకు నేను చెప్పగలిగిందొక్కటే... మీ జీవితంలో కొంత సమయం మొక్కలు నాటడానికి, వాటిని రక్షించడానికి కేటాయించండి. దేశవ్యాప్తంగా, ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణాన్ని పరిరక్షించడానికి నా వంతు కృషి చేస్తామని ప్రతిన పూనండి'.

– వాకా మంజులారెడ్డి

డాక్టర్లు మందులు రాస్తారు.
శీతల్ అగర్వాల్ వాటితోపాటు తన నవ్వులను టానిక్‌లా జత చేస్తుంది.
శీతల్ బహుశా దేశంలో మొదటి మహిళా 'మెడికల్ క్లౌన్'.
అంటే ఇన్ పేషెంట్స్‌గా ఉన్న చిన్నారులను, వృద్ధులను హుషారుగా పలకరించి
ఉత్సాహపరిచే విదూషకురాలు. నిరాశ నిస్పృహలను కలిగించే
అనారోగ్యం నుంచి బయట పడాలంటే తనలాంటి వారు అవసరమని
'కౌన్సిలర్ల'కు బదులుగా 'క్లౌన్సిలర్లను' తయారు చేసే సంస్థను స్థాపించిందామె.
శీతల్ ఆలోచనను పెద్ద పెద్ద ఆస్పత్రులు ఆహ్వానిస్తున్నాయి.



డాక్టర్ స్మైల్



వినూత్న సేవ

పిల్లలో, పెద్దలో ఎక్కువ రోజులు హాస్పిటల్లో ఉండాల్సి వచ్చిందనుకోండి... అప్పుడు వారిలో ఒక రకమైన నిర్లిప్తత వచ్చేస్తుంది. వారిని అటెండ్ చేస్తున్న అయినవారిలో అలసట వచ్చేస్తుంది. నవ్వులు మర్చిపోతారు. ఉత్సాహం మర్చిపోతారు. అప్పుడు ఎవరైనా వచ్చి, వింత వింత చేష్టలు చేసి, పిచ్చి మాటలు చెప్పి హాయిగా నవ్విస్తే ఎలా ఉంటుంది? తిరిగి బలం రాదూ? శీతల్ అగర్వాల్ చేస్తున్నది అదే. నవ్వుతో రోగుల్లో జీవాన్ని తేవడం.

■ **హాస్పిటల్‌లో జోకర్**

ఇంగ్లిష్‌లో క్లౌన్ అంటే విదూషకుడు. కాని జన సామాన్యం జోకర్ అనీ బఫూన్ అనీ అంటుంటారు. అలాంటి బఫూన్ వేషంలో హాస్పిటల్‌లో ప్రవేశించి ఒక ఉత్సాహకరమైన వాతావరణం తేవడాన్నే 'మెడికల్ క్లౌనింగ్' అంటారు. ఢిల్లీకి చెందిన 36 ఏళ్ల శీతల్ అగర్వాల్‌కు ఈ మెడికల్ క్లౌనింగ్ గురించి 2016 వరకూ తెలియదు. సోషల్ ఆంత్రోపాలజీ చదివి, లాఫ్టర్ యోగా థెరపీ నేర్చుకుని, ఒక ఎన్.జి.ఓలో ఉద్యోగం చేస్తున్న శీతల్ 2016 సంవత్సరంలో అహ్మదాబాద్‌కు వెళ్లినప్పుడు అక్కడి ఒక హాస్పిటల్‌లో మెడికల్ క్లౌన్‌ను చూసింది. అతను బఫూన్ వేషం వేసుకుని పేషెంట్స్‌ను హుషారు పరచడం శీతల్‌కు చాలా నచ్చింది. ఢిల్లీకి తిరిగి వచ్చి నెట్‌లో మెడికల్ క్లౌనింగ్ గురించి తెలుసుకుంది. దేశంలో కొంత మంది ఇలాంటి సేవ చేస్తున్నారని, హాస్పిటల్స్‌లో ఇలాంటి వారి అవసరం ఉందని తెలుసుకుంది.

■ **ఒక్కతే మొదలయ్యి**

'ఢిల్లీలో అప్పటి వరకూ మెడికల్ క్లౌన్‌గా ఎవరూ పని చేయడం లేదు. ఫేస్‌బుక్‌లో నేను పోస్ట్ చేసి ఆసక్తి ఉందా ఎవరికైనా అని అడిగితే కొంతమంది స్పందించారు. నేను కేంద్ర మంత్రిత్వ శాఖ అనుమతి తీసుకుని మొదట ఐదుమందితో ఒక గ్రూప్ మొదలుపెట్టాను. మాకు ట్రైనింగ్ ఏమీ లేదు. తెలిసిందల్లా ఎదుటివారికి మనస్ఫూర్తిగా ఉల్లాసం అందించడమే. అదే సంవత్సరం నేను ఢిల్లీలోని 'చాచా నెహ్రూ హాస్పిటల్'లో మొదటిసారిగా మెడికల్ క్లౌనింగ్ చేశాను. కాని ఎలా చేయబోతామా అనే భయం చాలా కలిగింది. మేం వెళ్లేసరికి పిల్లలు చాలామంది ఏడుస్తున్నారు. పేషెంట్లు వెయిటింగ్‌లో ఈసురోమంటున్నారు. కాని ఒక్కసారి మేము రంగంలో దిగి వింత చేష్టలతో తమాషా పలకరింపులతో తిరుగాడేసరికి పిల్లలు ఏడుపు ఆపేశారు. అందరిలో కుతూహలం, ఉత్సాహం వచ్చింది. ఐదు ఫ్లోర్లలో ఐదు గంటల పాటు తిరిగితే మా వల్ల అందరి ముఖాల్లో ఆనందం చూసి ఎంతో తృప్తి కలిగింది' అంది శీతల్ అగర్వాల్.

■ **డాక్టర్లే ఆహ్వానిస్తూ**

'మొదట మేము ప్రతి శనివారం ఏదో ఒక హాస్పిటల్‌కు వెళ్లాలని అనుకున్నాం. కాని మాకు వచ్చిన స్పందన చూసి డాక్టర్లు, నర్సులు మమ్మల్ని ఆహ్వానించసాగారు. మందులకు స్పందించనివారు కూడా నవ్వులకు స్పందిస్తున్నారని వారి అభిప్రాయం. ముఖ్యంగా చిన్న పిల్లల ఆస్పత్రుల్లో మెడికల్ క్లౌన్‌ల అవసరం చాలా ఉందని మాకు అర్థమైంది. హాస్పిటల్‌లోని భయాన్ని పోగొట్టాలంటే వారికి మాలాంటి వారు కనపడుతుండాలి. అందుకే ఇన్ పేషెంట్స్‌గా ఉన్న పిల్లలు మా రాక కోసం ఎదురు చూస్తుంటారు. అంతే కాదు వారి ముఖంలో నవ్వును చూసి తల్లిదండ్రులు కార్చే ఆనంద బాష్పాలకు విలువ కట్టలేం.

– శీతల్

■ **500 వాలెంటీర్లు**

ఈ ఐదారేళ్లలో శీతల్ పిలుపు మేరకు 500 మంది వాలెంటీర్లు మెడికల్ క్లౌన్లుగా ఆమె స్థాపించిన సంస్థ 'క్లౌన్సెలర్స్'లో నమోదు అయ్యారు. వీరంతా యూనివర్సిటీ విద్యార్థులు, కార్పొరేట్ సంస్థల ఉద్యోగులు. 'మా జీవితంలో ఇలాంటి పని సంతృప్తిని ఇస్తుంది' అని వారు ఈ వినూత్న సేవకు వస్తున్నారు. ప్రస్తుతం ఢిల్లీ, ముంబై, కశ్మీర్‌లలో శీతల్ బృందాల సేవలు కొనసాగుతున్నాయి. ఆస్పత్రుల్లోనే కాకుండా ఓల్డ్ ఏజ్ హోమ్‌లకు, మానసిక చికిత్సాలయాలకు కూడా వీరు వెళుతున్నారు.

ఈ సేవలో మరింతమంది పాల్గొనాలని కోరుకుందాం.

బ్యూటిప్స్

మెరుగైన చర్మకాంతికి..

- యాపిల్, ద్రాక్ష గుజ్జు రెండూ సమపాళ్లలో తీసుకొని కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేయాలి. మచ్చలు తగ్గి నిగారింపు పెరుగుతుంది.
- బంగాళాదుంప గుజ్జు, శనగపిండి, అలొవెరా జెల్ కలిపి మిశ్రమం తయారుచేసుకోవాలి. దీనిని ముఖానికి, మెడకు ప్యాక్‌లా వేసుకొని, పదినిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి.
- పెరుగు, నారింజ రసం సమపాళ్లలో తీసుకొని, కొద్దిగా ఆలోవెరా జెల్ కలిపి ముఖానికి అప్లై చేయాలి. పది నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి.



బామ్మ చేతి సంచి

ఆలోచన ఉంటే చాలు వయసుతో పనిలేకుండా నలుగురి మేలు కోరే పని ఎంత చిన్నదైనా చేయచ్చు. ఇదే విషయాన్ని తన చేతలతో నిరూపిస్తోంది 93 ఏళ్ల మధుకాంతా భట్. వేస్ట్ క్లాత్‌తో ఎకో ఫ్రెండ్లీ బ్యాగులను తయారు చేయడమే కాదు, ఎనిమిదేళ్లుగా 35వేలకు పైగా బ్యాగులను స్వయంగా తయారుచేసి వాటిని ఉచితంగా పంపిణీ చేసింది. హైదరాబాద్‌లో ఉంటున్న ఈ గుజరాతీ బామ్మ చేస్తున్న పని పర్యావరణ ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

బ్యాగ్‌లు తయారు చేస్తున్న మధుకాంతా భట్




ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడానికి మధుకాంత భట్ తన మిషన్‌ని ప్రారంభించి ఎనిమిదేళ్లు అయ్యింది. 'పని లేకుండా కూర్చోవడం అంటే నాకు అస్సలు ఇష్టం ఉండదు. ఇదివరకటి కంటే ఇప్పుడే నేను చాలా బిజీగా ఉన్నాను. రోజూ ఉదయం టిఫిన్ చేసిన తర్వాత కుట్టు పని మొదలు పెడతాను. కుట్టు పని అంటే నాకు చాలా ఇష్టం. మాది గుజరాత్‌లోని జామ్‌నగర్ జిల్లా. అక్కడ మా రోజుల్లో ఆడపిల్లలను బడికి పంపేవారు కాదు. దీంతో నేను స్కూల్లో చదువుకోలేదు. పద్దెనిమిదేళ్ల వయసులో పెళ్లయ్యి, మా వారితో కలిసి హైదరాబాద్‌కు వచ్చాను. నేను చదువుకోకపోవడంతో నా పిల్లలకు బాగా చదువులు చెప్పించాలనుకున్నాను. నాకు గుజరాతీ తప్ప మరే భాష వచ్చేది కాదు. దీంతో ఇతరులతో మాట్లాడలేక పోయేదాన్ని. నాకు ఒక కొడుకు, నలుగురు కూతుళ్లు. పిల్లలు బాగా చదువుకోవాలని కోరుకున్నాను.

పొదుపు చేసి మిషన్

మా చుట్టుపక్కల కొందరు మహిళలు కుట్టుమిషన్ వాడుతుండేవారు. కుట్టుమిషన్ పని నాకు రాదు. కానీ, ఆ మిషన్ కావాలనుకున్నాను. ఇంటి ఖర్చులకని ఇచ్చిన డబ్బులో కొద్ది కొద్దిగా పొదుపు చేయడం మొదలుపెట్టాను. అందుకోసం ఖర్చులను తగ్గించేదాన్ని. యాభై ఏళ్ల క్రితం 200 రూపాయలు పెట్టి, కుట్టు మిషన్ కొన్నాను. మిషన్ కొన్నాను కానీ, దానిని ఎలా ఉపయోగించాలో తెలియదు. కుట్టు మిషన్‌ను ఎలా వాడాలో తెలుసుకోవడానికి నెల రోజులు పట్టింది. కుట్టు, కట్టింగ్, డిజైనింగ్ వంటివి కోర్సు ద్వారా నేర్చుకున్నాను. కొద్ది నెలల్లోనే నైపుణ్యం వచ్చేసింది. నా బట్టలు, మా పిల్లలు బట్టలు, ఇరుగుపొరుగు వారి బ్లౌజులు, పెట్టీ కోట్‌లు కుట్టేదాన్ని.

వేస్ట్ మెటీరియల్

పిల్లలు పెద్దవాళ్లయ్యి, వాళ్ల జీవితాల్లో స్థిర పడినా నా కుట్టు పని ఆగలేదు. కాకపోతే బయటివారికి కుట్టడం ఆగిపోయింది. మార్కెట్‌కు వెళ్లినప్పుడు ప్లాస్టిక్ సంచులు పట్టుకెళ్లేవారిని చూసేదాన్ని. దీనికేదైనా ప్రత్యామ్నాయం చేస్తే బాగుంటుంది కదా అనుకున్నాను. దీంతో ఇంట్లో వాడకంలో లేని క్లాత్ మెటీరియల్‌ను శుభ్రం చేసి, సంచులు కుట్టేదాన్ని. ఆ తర్వాత టైలర్ షాప్‌ల నుంచి మెటీరియల్ సేకరించేదాన్ని. రోజుకు ఎనిమిది బ్యాగులు కుట్టి, వాటిని మార్కెట్‌కు వెళ్లినప్పుడు పంచేదాన్ని. లేదంటే, మా పిల్లల చేత మార్కెట్‌కు పంపించేదాన్ని. అవసరమైన వారికి ఇచ్చి వచ్చేవాళ్లు.

కొన్నేళ్ల క్రితం కాలికి గాయం అయ్యింది. కానీ, కుట్టు పనిని వదులుకోవడానికి ఇష్టపడలేదు. దీంతో మా అబ్బాయి కుట్టుమిషన్‌కు మోటారును అమర్చాడు. కూరగాయలు అమ్మే షాప్ అతను, ప్లంబర్లు, మా పిల్లలు, ఫ్రెండ్స్ ఇళ్లలో నేను కుట్టిన బ్యాగ్ తప్పక ఉంటుంది. ఎక్కువ మొత్తం మెటీరియల్ కావాలనుకుంటే మా ప్రాంతంలో ఉన్న టైలర్లు, ఫర్నీచర్ తయారు చేసేవారి నుంచి తీసుకుంటాం. సాధారణంగా క్లాత్‌కు సంబంధించిన రంగంలో చాలా ఫ్యాబ్రిక్ వృథా అవుతుంది. మా పిల్లలు ఆ బట్టలను సేకరించి తీసుకువస్తారు. అందరం కలసి వాటిని సంచులుగా తయారు చేస్తాం. మా ఇంటికి దగ్గరలో కర్టెన్ టైలర్ ఉన్నాడు. ఐదేళ్లుగా అక్కడ నుంచి పాత కర్టెన్లు, మెటీరియల్ సేకరించి, సంచులు కుడుతున్నాం'' అని చెబుతున్న తొంభై మూడేళ్ల ఈ పర్యావరణ ప్రేమికురాలిని ప్రేమించని వారుండరేమో బహుశా!

ది ఆర్ట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్

యూత్ పల్స్

కల్లోల కరోనా సమయం డిజిటల్ రూపంలో కళాప్రపంచాన్ని యూత్‌కు దగ్గర చేసింది. ఆ ప్రభావంతో యంగ్ ఆర్ట్ కలెక్టర్‌ల సంఖ్య పెరిగింది. వారు ఆషామాషీగా ఆర్ట్ మార్కెట్‌లోకి రావడం లేదు. ఆమూలాగ్రం అధ్యయనం చేసిన తరువాతే రంగంలోకి దిగుతున్నారు...

కరోనా కరుకు కోరల ప్రభావం తీవ్రంగా లేని ఇండస్ట్రీలలో ఆర్ట్ ఇండస్ట్రీ ఒకటి. ఆ సమయంలో ఆర్టిస్ట్ కమ్యూనిటీ డిజిటల్ ప్రపంచంలోకి వచ్చింది. ఆర్ట్ లవర్స్, కలెక్టర్స్ వర్చువల్ ఆర్ట్ గ్యాలరీలోకి వచ్చి రకరకాల ఆర్ట్ వర్క్స్‌ను ఆస్వాదించారు.

డిజిటల్ ఆర్ట్స్ వరల్డ్ కొత్త క్లయింట్స్‌ను ముందుకు తీసుకువచ్చింది. వారే యంగ్ ఆర్ట్ కలెక్టర్స్.

సోషల్ మీడియా, టెక్నాలజీ ఆర్ట్ వరల్డ్‌ను యువతరానికి దగ్గర చేసింది. పెట్టుబడి పాఠాలను పరిచయం చేసింది.

రియల్ ఎస్టేట్, స్టాక్‌మార్కెట్ కంటే ఆర్ట్ ఇన్వెస్ట్‌మెంట్‌ను భద్రమైనదిగా భావిస్తున్నవారు యూత్‌లో ఎక్కువ సంఖ్యలోనే ఉన్నారు. ఆర్ట్ ఇన్వెస్ట్‌మెంట్‌ను 'ఫాస్టర్ మనీగ్రోయర్' అని పిలుచుకుంటున్నారు.

'బై అండ్ సెల్' పాలసీకి ప్రాధాన్యత ఇస్తున్నారు.

యంగ్ ఆర్ట్ కలెక్టర్‌లు ప్రధానంగా రెండు విషయాలను దృష్టిలో పెట్టుకుంటున్నారు.

ఒకటి... నిపుణుల సలహాలు తీసుకుంటూనే తమదైన అవగాహనతో ఆర్ట్‌వర్క్స్‌ను కొనుగోలు చేయడం.

రెండు...'ఇలా కొని అలా అమ్మాలి' అనే దృష్టితో కాకుండా దీర్ఘకాలిక దృష్టితో కొనుగోలు చేయడం.

దీనికి ముందు ఆర్ట్ మ్యాగజైన్‌లు చదవడం, గ్యాలరీలకు వెళ్లడంలాంటివి చేస్తున్నారు.

దీపావేద్ పాఠక్ చిత్రాల్లో వినిపించే సంగీతం గురించి, స్వాతీ పసారి చిత్రాల్లోని సెమీ-అబ్‌స్ట్రాక్ట్ స్టైల్ ఏమిటో వారికి తెలుసు. 'ఆర్ట్ బైయింగ్ టిప్స్' ఏమిటో తెలుసు.

జాన్ నిసీ రాసిన 'ఫేమస్ వర్క్స్ ఆఫ్ ఆర్ట్' పుస్తకం




ద్వారా 'మ్యాటర్ ఆఫ్ ఫైనాన్స్'ను పట్టించుకున్న ప్రసిద్ధ ఆర్టిస్ట్‌లు ఎవరో, బొత్తిగా పట్టించుకోని వారెవరో తెలుసు.

డబ్బును మంచినీళ్ల ప్రాయంలా ఖర్చు చేయకుండా జాగ్రత్తగా, నెమ్మదిగా ఆర్ట్ కలెక్షన్‌ను బిల్డ్ చేసుకుంటున్నారు.

పదిహేను, ఇరవై సంవత్సరాల క్రితం గ్యాలరీలలో తలపండిన వ్యక్తులు, సంపన్న వ్యాపారులు ఎక్కువగా కనిపించేవారు. ఇప్పుడు ఆ దృశ్యంలోకి యూత్ కూడా వచ్చేశారు. వారు సంపన్నులు, ఆర్టిస్ట్‌లు కాకపోవచ్చు. విశ్లేషకులు కాకపోవచ్చు. అయితే ఏది ఏమిటో తెలుసుకోవాలనే ఆసక్తి వారిలో ఉంది. ఆర్ట్ కలెక్టర్స్‌గా మారడానికి ఈ రాకపోకలు కారణం అవుతున్నాయి. ఈ యంగ్ ప్రొఫెషనల్స్ విద్యావంతులు. విస్తృత ప్రయాణ అనుభవం వారి సొంతం. ఆర్ట్ కలెక్టర్స్‌గా ఎదగడానికి ఇవి వారికి ఉపయోగపడుతున్నాయి.

మార్కెట్ ట్రెండ్స్‌పై ఒక కన్నేసిన యువతరం వర్క్‌షాప్స్‌కు హాజరు కావడం ద్వారా ఎన్నో విషయాలపై అవగాహన పెంచుకుంటోంది.

ఫేస్‌బుక్‌లో ఒక గ్రూప్‌గా మొదలైన ఆర్ట్ కలెక్టర్‌లు 'కలెక్టర్స్ క్లబ్'గా ఏర్పడుతున్నారు. ఒకరికొకరు సలహాలు ఇచ్చిపుచ్చుకుంటున్నారు.

ఈ కొత్త కొనుగోలుదారులు రకరకాల విభాగాల్లో ఆర్ట్‌వర్క్స్‌ను కొనుగోలు చేయడానికి ఇష్టపడుతున్నారు. ఆర్ట్‌వర్క్స్‌ను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేయడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఎంపిక విషయమై వీరిలో మంచి పరిణతి కనిపిస్తోంది.

ఆర్ట్ హౌజ్‌లు, గ్యాలరీలు యువ ఆర్ట్ కలెక్టర్స్ కోసం కొత్తగా ముస్తాబవుతున్నాయి. కావలసిన సమాచారం అందించడానికి సదా రెడీగా ఉన్నాయి.

యంగ్ ఆర్ట్ కలెక్టర్స్ పుణ్యమా అని 'మోజ్ ఆర్ట్.కామ్'లాంటి ఆన్‌లైన్ పోర్టల్స్ మెగా హిట్ అవుతున్నాయి.

'ఆర్ట్ కలెక్టింగ్ అంటే ఇంట్లో సోఫా, టేబుల్‌కు మ్యాచ్ అయ్యే ఇంటీరియర్స్‌ను కొనుగోలు చేయడం కాదు' అంటున్నారు ముంబైలోని ఒక ఆర్ట్ గ్యాలరీ ఫౌండర్ హేన కపాడియా.

'ఆర్ట్ అంటే అలంకారప్రాయం కాదు అంతకంటే ఎక్కువ' అని నమ్ముతున్న యువతరం ఆర్ట్ కలెక్టింగ్‌ను ఆషామాషీగా తీసుకోవడం లేదు. బాగా కసరత్తులు చేసి గానీ గోదాలోకి దిగడం లేదు.



డేవిడ్ వార్నర్‌కు జరిమానా

నిర్ణీత సమయంలో ఓవర్లు పూర్తి చేయనందుకు మరో ఐపీఎల్ కెప్టెన్‌పై భారీ జరిమానా పడింది. సోమవారం హైదరాబాద్‌లో సన్‌రైజర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్‌రేట్ కారణంగా ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ డేవిడ్ వార్నర్‌పై నిర్వాహకులు రూ. 12 లక్షల జరిమానా విధించారు. ఈ మ్యాచ్‌లో ఢిల్లీ 7 పరుగులతో గెలిచింది. వార్నర్ టీమ్ నిర్ణీత సమయంలో ఒక ఓవర్‌ను తక్కువగా వేసింది. ఇదే కారణంగా రైజర్స్ ఇన్నింగ్స్ 20వ ఓవర్లో 30 గజాల సర్కిల్ వెలుపల నలుగురు ఢిల్లీ ఫీల్డర్లను మాత్రమే (సాధారణంగా ఐదు) అనుమతించారు.

నాలుగో ర్యాంక్‌కు సురేఖ

ప్రపంచకప్‌లో రెండు స్వర్ణాలు సాధించి సత్తాచాటిన ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ క్రీడాకారిణి వెన్నం జ్యోతి సురేఖ వ్యక్తిగత విభాగంలో మరో మైలురాయిని అందుకుంది. మంగళవారం ప్రకటించిన ప్రపంచ ర్యాంకింగ్స్‌లో సురేఖ 4వ స్థానానికి (కాంపౌండ్) చేరుకుంది. ఇప్పటి వరకు 11వ ర్యాంక్‌లో ఉన్న ఆమె తాజా ప్రదర్శనతో ఏకంగా ఏడు స్థానాలు ఎగబాకటం విశేషం.



సుమీత్ నగాల్ సంచలనం



రోమ్: ఏటీపీ రోమ్ చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో భారత ఆటగాడు సుమీత్ నగాల్ సంచలన ప్రదర్శన నమోదు చేశాడు. ర్యాంకింగ్స్‌లో తనకంటే ఎంతో మెరుగైన స్థానిక ప్రత్యర్థిని ఓడించి రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. మంగళవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో క్వాలిఫయర్‌గా బరిలోకి దిగిన ప్రపంచ 347వ ర్యాంకర్ నగాల్ 6–2, 6–4 స్కోరుతో ఇటలీ ప్లేయర్, ప్రపంచ 172వ ర్యాంకర్ ఫ్రాన్సెస్కో మాసరెలీపై విజయం సాధించాడు. 1 గంటా 24 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో నగాల్ ఒక్క ఏస్ కూడా కొట్టలేదు. అయితే తన చక్కటి సర్వీస్‌తో ఒక్క డబుల్ ఫాల్ట్ కూడా లేకుండా చూసుకున్నాడు. ఇటలీ ఆటగాడు 3 ఏస్‌లు సంధించినా...6 డబుల్‌ఫాల్ట్‌లతో ఓటమిని ఆహ్వానించాడు.

ఐర్లాండ్ 492 ఆలౌట్



గాలే: స్ఫూర్తిదాయక ఆటతీరు కనబర్చిన ఐర్లాండ్ జట్టు శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో భారీ స్కోరు నమోదు చేసింది. మ్యాచ్ రెండో రోజు మంగళవారం ఐర్లాండ్ తమ మొదటి ఇన్నింగ్స్‌లో 492 పరుగులకు ఆలౌటైంది. టెస్టుల్లో ఆ జట్టుకు ఇదే అత్యధిక స్కోరు కావడం విశేషం. కర్టిస్ క్యాంఫర్ (229 బంతుల్లో 111; 15 ఫోర్లు, 2 సిక్స్‌లు) పాల్ స్టిర్లింగ్ (181 బంతుల్లో 103; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీలు నమోదు చేశారు. లంక బౌలర్లలో ప్రభాత్ జయసూర్య 5 వికెట్లు పడగొట్టాడు. అనంతరం శ్రీలంక ఆట ముగిసే సమయానికి వికెట్ కోల్పోకుండా 81 పరుగులు చేసింది.

మెయిన్ 'డ్రా'కు సిక్కి–రోహన్

దుబాయ్: ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో భారత జోడి సిక్కి రెడ్డి– రోహన్ కపూర్ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించింది. చివరి క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో సిక్కి – రోహన్ 21–15, 21–11 స్కోరుతో విష్ణు దేవ్ – తాబియా ఖాన్ (యూఏఈ) జంటపై విజయం సాధించారు. మరో వైపు మిక్స్‌డ్ డబుల్స్ ప్రధాన మ్యాచ్‌ల తొలి రౌండ్‌లో సుమీత్ రెడ్డి – అశ్విని పొన్నప్ప 21–16, 21–17తో టాంగ్ చున్ మన్ – సె యింగ్ సూట్ (హాంకాంగ్)ను ఓడించి రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టారు.

గుజరాత్ ఆల్‌రౌండ్ గెలుపు

- 55 పరుగులతో ముంబైపై జయభేరి
- గిల్, మిల్లర్, అభినవ్ మెరుపులు

అహ్మదాబాద్: డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో చెలరేగింది. మంగళవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో టైటాన్స్ 55 పరుగుల భారీ తేడాతో ముంబై ఇండియన్స్‌ను ఓడించింది. ముందుగా గుజరాత్ టైటాన్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 207 పరుగుల భారీస్కోరు చేసింది. శుబ్‌మన్ గిల్ (34 బంతుల్లో 56; 7 ఫోర్లు, 1 సిక్స్), డేవిడ్ మిల్లర్ (22 బంతుల్లో 46; 2 ఫోర్లు, 4 సిక్సర్లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అభినవ్ మనోహర్ (21 బంతుల్లో 42; 3 ఫోర్లు, 3 సిక్సర్లు) చెలరేగారు. పీయూష్ చావ్లా 2 వికెట్లు తీశాడు. తర్వాత ముంబై 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 152 పరుగులే చేసింది. నేహల్ వధేరా (21 బంతుల్లో 40; 3 ఫోర్లు, 3 సిక్సర్లు) రాణించాడు. నూర్ అహ్మద్ 3, రషీద్‌ఖాన్ 2 వికెట్లు తీశారు.

ముకుమ్మడి విధ్వంసం

గిల్, మిల్లర్, అభినవ్... ఈ ముగ్గురి మెరుపులతో గుజరాత్ ఇన్నింగ్స్ రాకెట్ వేగంతో దూసుకుపోయింది. శుబ్‌మన్ గిల్ 11 ఓవర్ల పాటు క్రీజులో ఉండి దంచేశాడు. ఈ ఓపెనర్ చూడచక్కని బౌండరీలతో 30 బంతుల్లో అర్ధ శతకం సాధించాడు. ఆట ఆరంభంలోనే మరో ఓపెనర్ సాహా (4) విఫలమైనా, కెప్టెన్ హార్దిక్ పాండ్యా (13), విజయ్ శంకర్ (19) తక్కువే చేసినా... గిల్ జిగేల్ ఇన్నింగ్స్‌తో ఆ లోటేమీ కనపడలేదు. 12వ ఓవర్లో అతను అవుట్ కాగానే మిల్లర్ వచ్చాడు. మరుసటి ఓవర్లో అభినవ్ కలిశాడు. ఆ తర్వాత ధాటి పెరిగి 'డబుల్' దూకుడైంది. పరుగుల వరద పారింది.



గిల్

3 ఓవర్లలో 57 పరుగులు...

అప్పటికే క్రీజులో పాతుకుపోయిన అభినవ్, మిల్లర్ ఆఖరి మూడు ఓవర్లలో ముంబైని సిక్సర్లతో ముంచెత్తారు. స్టేడియాన్ని మెరుపులతో హోరెత్తించారు. గ్రీన్ వేసిన 18వ ఓవర్లో అభినవ్ రెండు వరుస సిక్సర్లు బాదితే... మిల్లర్ బ్యాట్ మరో సిక్స్ కొట్టింది. దీంతో 22 పరుగులు వచ్చేశాయి. తర్వాత ఓవర్ తొలి బంతికే మెరిడిత్... అభినవ్‌ను బోల్తాకొట్టిస్తే... తెవాటియా ఒక సిక్స్, మిల్లర్ రెండు సిక్స్‌లతో విరుచుకు పడ్డాడు. స్కోరులో మరో 19 పరుగులు చేరాయి. బెహ్రెన్‌డార్ఫ్ ఆఖరి ఓవర్లో తెవాటియా (5 బంతుల్లో 20 నాటౌట్; 3 సిక్స్‌లు) 2 సిక్సర్లు బాదడంతో 16 పరుగులు వచ్చాయి. దాంతో టైటాన్స్ చివరి మూడు ఓవర్లలోనే 57 పరుగులు పిండుకుంది.

తిప్పేసిన నూర్, రషీద్

ముంబై బ్యాటింగ్ ఆరంభం నుంచే గతి తప్పింది. పేస్‌ను ఎదుర్కోలేకపోయింది. స్పిన్‌కు దాసోహమైంది. చెత్త షాట్‌కు కెప్టెన్ రోహిత్ శర్మ (2) వెనుదిరిగాడు. కాసేపటికి ఇషాన్ కిషన్ (13) నిష్క్రమించాడు. 'ఇంపాక్ట్ ప్లేయర్'గా దిగిన తిలక్ వర్మ (2)ను రషీద్ ఎల్బీగా పంపాడు. గ్రీన్ (26 బంతుల్లో 33; 3 సిక్సర్లు), సూర్యకుమార్ (12 బంతుల్లో 23; 3 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడినా... అది కాసేపే! వీరిద్దరితో పాటు టిమ్ డేవిడ్ (0) నూర్ అహ్మద్ స్పిన్ ఉచ్చులో చిక్కారు. 59/5 స్కోరు వద్దే ముంబై పనైపోయింది. వధేరా మెరిపించినా కొండంత లక్ష్యం ముందు అది ఏమాత్రం సరిపోలేదు.



మిల్లర్

స్కోరు వివరాలు

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (సి) ఇషాన్ (బి) అర్జున్ 4; గిల్ (సి) సూర్యకుమార్ (బి) కార్తికేయ 56; హార్దిక్ పాండ్యా (సి) సూర్యకుమార్ (బి) చావ్లా 13; విజయ్ శంకర్ (సి) డేవిడ్ (బి) చావ్లా 19; మిల్లర్ (సి) సూర్యకుమార్ (బి) బెహ్రెన్‌డార్ఫ్ 46; అభినవ్ (సి) బెహ్రెన్‌డార్ఫ్ (బి) మెరిడిత్ 42; తెవాటియా నాటౌట్ 20; రషీద్‌ఖాన్ నాటౌట్ 2; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 207. వికెట్ల పతనం:** 1–12, 2–50, 3–91, 4–101, 5–172, 6–205. **బౌలింగ్:** అర్జున్ 2–0–9–1, బెహ్రెన్‌డార్ఫ్ 4–0–37–1, మెరిడిత్ 4–0–49–1, గ్రీన్ 2–0–39–0, పీయూష్ చావ్లా 4–0–34–2, కార్తికేయ 4–0–39–1.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రోహిత్ (సి అండ్ బి) 2; ఇషాన్ (సి) జోష్ (బి) రషీద్‌ఖాన్ 13; గ్రీన్ (బి) నూర్ అహ్మద్ 33; తిలక్‌వర్మ (ఎల్బీడబ్ల్యూ) (బి) రషీద్‌ఖాన్ 2; సూర్యకుమార్ (సి అండ్ బి) నూర్ అహ్మద్ 23; టిమ్ డేవిడ్ (సి) అభినవ్ (బి) నూర్ అహ్మద్ 0; వధేరా (సి) షమీ (బి) మోహిత్ 40; చావ్లా రనౌట్ 18; అర్జున్ (సి) జోష్ (బి) మోహిత్ 13; బెహ్రెన్‌డార్ఫ్ నాటౌట్ 3, మెరిడిత్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 152. వికెట్ల పతనం:** 1–4, 2–43, 3–45, 4–59, 5–59, 6–90, 7–135, 8–137, 9–152. **బౌలింగ్:** షమీ 4–0–18–0, పాండ్యా 2–0–10–1, రషీద్‌ఖాన్ 4–0–27–2, నూర్ అహ్మద్ 4–0–37–3, మోహిత్ 4–0–38–2, జోష్ లిటిల్ 2–0–18–0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
చెన్నై	7	5	2	10	0.662
గుజరాత్	7	5	2	10	0.580
రాజస్తాన్	7	4	3	8	0.844
లక్నో	7	4	3	8	0.547
బెంగళూరు	7	4	3	8	-0.008
పంజాబ్	7	4	3	8	-0.162
ముంబై	7	3	4	6	-0.620
కోల్‌కతా	7	2	5	4	-0.186
హైదరాబాద్	7	2	5	4	-0.725
ఢిల్లీ	7	2	5	4	-0.961

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

బెంగళూరు x కోల్‌కతా (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

అజింక్య రహానే పునరాగమనం



డబ్ల్యూటీసీ ఫైనల్‌కు భారత జట్టు ప్రకటన

ముంబై: సీనియర్ బ్యాటర్ అజింక్య రహానే మరోసారి భారత టెస్టు జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఆస్ట్రేలియాతో జరిగే వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ మ్యాచ్ కోసం మంగళవారం బీసీసీఐ ప్రకటించిన 15 మంది సభ్యుల బృందంలో రహానేకు అవకాశం లభించింది. 2022 జనవరిలో దక్షిణాఫ్రికాతో రహానే తన చివరి టెస్టు ఆడాడు. ఆ తర్వాత శ్రీలంకతో సొంతగడ్డపై జరిగిన టెస్టు సిరీస్‌కు స్థానం కోల్పోయిన రహానే ఆ తర్వాత బంగ్లాదేశ్, ఆస్ట్రేలియాతో సిరీస్‌లకు కూడా ఎంపిక కాలేదు. పైగా ఇటీవల ప్రకటించిన బీసీసీఐ కాంట్రాక్ట్‌లలో కూడా అతనికి చోటు లభించలేదు. అయితే టీమ్‌లోని కీలక బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ గాయంతో దూరం కావడంతో రహానే ఎంపిక సులువైంది. టీమిండియాకు దూరమైన తర్వాత రంజీ ట్రోఫీ తాజా సీజన్లో ముంబై తరఫున 11 ఇన్నింగ్స్‌లలో 57.63 సగటుతో 634 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు ఉన్నాయి. పైగా ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్‌లో అజింక్య ఆట చూస్తే అతని బ్యాటింగ్‌లో దూకుడు కూడా పెరిగినట్లు కనిపిస్తోంది. 82 టెస్టుల అనుభవంతో పాటు ఇంగ్లండ్‌లాంటి వేదికలపై రహానే పదునైన ఆట కీలకంగా మారే అవకాశం ఉండటంతో మళ్లీ అతని పేరును పరిశీలించారు. ఇది మినహా టీమ్ ప్రకటనలో ఎలాంటి సంచలనాలు, ఆశ్చర్యకర ఎంపికలు లేవు. ఆంధ్ర వికెట్ కీపర్ కేఎస్ భరత్ టీమ్‌లో తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. ఆసీస్‌తో చివరి రెండు మ్యాచ్‌లలో ఆడే అవకాశం రాని కేఎల్ రాహుల్ కూడా టీమ్‌లో ఉన్నాడు. అయితే ఆస్ట్రేలియాతో సిరీస్‌లో టీమిండియాలో భాగంగా ఉన్న సూర్యకుమార్ యాదవ్, కుల్దీప్ యాదవ్, ఇషాన్ కిషన్ తమ స్థానాలు కోల్పోయారు. జూన్ 7నుంచి లండన్‌లోని ఓవల్ మైదానంలో ఈ మ్యాచ్ జరుగుతుంది. **జట్టు వివరాలు:** రోహిత్ (కెప్టెన్), గిల్, పుజారా, కోహ్లి, రహానే, రాహుల్, కేఎస్ భరత్, అశ్విన్, జడేజా, అక్షర్, శార్దుల్, షమీ, సిరాజ్, ఉమేశ్, ఉనాద్కట్.

ఢిల్లీ ప్రభుత్వానికి 'సుప్రీం' నోటీసులు

కొనసాగుతున్న రెజ్లర్ల నిరసన

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై మహిళా రెజ్లర్ల ఫిర్యాదుకు సంబంధించి పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై భారత అత్యున్నత న్యాయస్థానం స్పందించింది. వెంటనే దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో చెప్పాలంటూ ఢిల్లీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఒక మైనర్ సహా మొత్తం ఏడుగురు మహిళా రెజ్లర్లు ఈ లైంగిక వేధింపుల ఆరోపణలు చేశారు. 'ఏడుగురు మహిళా రెజ్లర్లు ఫిర్యాదు చేస్తున్నారు. దీనిపై గతంలో ఏర్పాటు చేసిన కమిటీ నివేదికను ఇప్పటివరకు బహిరంగ పర్చలేదు. వారిపై ఎఫ్ఐఆర్ కూడా నమోదుచేయలేదు' అంటూ పిటిషనర్ల తరఫున న్యాయవాది కపిల్ సిబాల్ వాదించారు. దాంతో సుప్రీం కోర్టు నోటీసు గురించి ఆదేశాలు జారీ చేసింది. 'భారత్‌కు ఎన్నో విజయాలు అందించిన రెజ్లర్లు చేసిన ఆరోపణలు తీవ్రమైనవి. వీటిపై లోతైన విచారణ జరపాల్సిన అవసరం ఉంది. శుక్రవారం లోగా ప్రభుత్వం వివరణ ఇవ్వాలి' అంటూ ఆదేశించింది. గత జనవరిలో బ్రిజ్‌భూషణ్‌పై తమ అసంతృప్తిని ప్రకటిస్తూ రెజ్లర్లు నిరసనకు దిగారు. చివరకు కేంద్ర క్రీడాశాఖ మేరీకోమ్ నేతృత్వంలో ఐదుగురు సభ్యుల విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. ఆ తర్వాత బబిత ఫొగాట్‌ను చేర్చి ఆరుగురు సభ్యులుగా మార్చారు. అయితే ఇప్పటి వరకు కూడా ఆ కమిటీ ఎలాంటి నివేదిక ఇవ్వలేదు. మరో వైపు రెజ్లర్ల నిరసన కార్యక్రమానికి రాజకీయ నాయకులు కూడా వచ్చి సంఘీభావం తెలుపుతున్నారు. హరియాణా మాజీ ముఖ్యమంత్రి భూపీందర్ సింగ్ హుడా, సీపీఐ నాయకురాలు బృందా కారత్, భారత్ కిసాన్ జోడో ఉద్యమకారులతో పాటు పలువురు స్వచ్ఛంద సంస్థలకు చెందిన వ్యక్తులు ఇందులో పాల్గొన్నారు.



నిరసన వేదిక వద్ద బజరంగ్, వినేశ్, సాక్షి

సినిమా

అప్పుడు కోమాలో ఉన్నట్లనిపించింది

- కార్తీక్ దండు



''ఇటీవలి కాలంలో హారర్ కామెడీ సినిమాలు వచ్చాయి కానీ ఓ స్ట్రిక్ట్ అండ్ హానెస్ట్ హారర్ ఫిల్మ్ రాలేదు. అందుకే హారర్ జానర్‌కి అభిమానిని అయిన నేను 'విరూపాక్ష' తీశాను. ప్రేక్షకులను థ్రిల్ చేయాలని సినిమాలోని మర్డర్ సీక్వెన్స్‌లను కొత్తగా డిజైన్ చేశాం'' అన్నారు దర్శకుడు కార్తీక్ దండు. సాయిధరమ్ తేజ్ హీరోగా కార్తీక్ దండు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'విరూపాక్ష'. సుకుమార్ రైటింగ్స్ పతాకంపై బి. బాపినీడు సమర్పణలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న రిలీజైంది. ఈ సందర్భంగా మంగళవారం విలేకర్ల సమావేశంలో కార్తీక్ మాట్లాడుతూ– ''2016–17 సమయంలో ఓ పేపర్‌లో ఒక ఆర్టికల్ చదివాను. చేతబడి చేస్తున్నారనే ఆరోపణతో ఓ మహిళను గ్రామస్తులు కొట్టి చంపేస్తారు. ఆమెకు నిజంగా చేతబడి చేసే శక్తులు ఉంటే ఏం జరుగుతుందని ఊహించి 'విరూపాక్ష' కథ రాశాను. నా కథను నమ్మిన సుకుమార్‌గారు స్క్రీన్ ప్లే అందించి, తాను ఓ నిర్మాతగా ఉంటానని అన్నారు. అలాగే సాయితేజ్‌గారిని హీరోగా నిర్ణయించి, బీవీఎస్ఎన్ ప్రసాద్ గారిని నిర్మాతగా నిర్ణయించారు. అయితే 'విరూపాక్ష' షూటింగ్‌ను మరో రెండు మూర్హోజుల్లో మొదలు పెడదామనుకున్న సమయంలో సాయిధరమ్ తేజ్‌గారికి రోడ్డు ప్రమాదం జరిగింది. ఆ సమయంలో సినిమా పరిస్థితి ఏంటో అని మెంటల్‌గా నాకు నేను కోమాలోనే ఉన్నట్లనిపించింది. సాయి తేజ్‌గారికి అంతా బాగానే ఉందని చెప్పగానే రిలాక్స్ అయ్యాను. 'విరూపాక్ష' విడుదలయ్యాక చాలామంది నిర్మాతలు ఫోన్ చేశారు. ఈ సినిమాను ఇతర భాషల్లో కూడా రిలీజ్ చేసే ఆలోచనలో ఉన్నాం'' అన్నారు.



'బర్రోజ్'లో...

'ఆడు జీవితం'లో...

'మామా మశ్చీంద్ర'లో

'పుష్ప2'లో...

'తంగలాన్'లో...

శైలజ గుర్తుండిపోతుంది



పాయల్ రాజ్‌పుత్

కార్తికేయ హీరోగా నటించిన 'ఆర్‌ఎక్స్ 100' సినిమాతో అజయ్ భూపతి డైరెక్టర్‌గా, పాయల్ రాజ్‌పుత్ హీరోయిన్‌గా పరిచయమయ్యారు. ఆ సినిమా విడుదలైన దాదాపు ఐదేళ్లకు అజయ్ భూపతి దర్శకత్వంలో పాయల్ రాజ్‌పుత్ ప్రధాన పాత్రలో 'మంగళవారం' అనే సినిమా రూపొందుతోంది. స్వాతి గునుపాటి, సురేష్ వర్మ .ఎం, 'ఎ' క్రియేటివ్ వర్క్స్ పతాకంపై అజయ్ భూపతి నిర్మిస్తున్న 'మంగళవారం' మూవీ ఫస్ట్ లుక్‌ని మంగళవారం విడుదల చేశారు. అజయ్ భూపతి మాట్లాడుతూ– ''గ్రామీణ నేపథ్యంలో 1990వ దశకంలో సాగే కథతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. మన నేటివిటీతో కూడిన డిఫరెంట్ యాక్షన్ థ్రిల్లర్. ఇండియాలో ఎవరూ ప్రయత్నించని కొత్త జానర్ సినిమా'' అన్నారు. ''ఆర్‌ఎక్స్ 100'లో పాయల్ చేసిన ఇందు పాత్ర ప్రేక్షకులకు ఎలా గుర్తుండిపోయిందో, 'మంగళవారం'లో శైలజ పాత్ర అలాగే గుర్తుంటుంది'' అన్నారు స్వాతి గునుపాటి, సురేష్ వర్మ .ఎం.

నావింకా బేబీ స్టెప్సే!

- డింపుల్ హయతి



''ఓ నటిగా నాకు అన్ని పాత్రలూ చేయాలని ఉంది. కెరీర్‌లో ఐదేళ్లు గడిచిపోయినా కూడా నేను ఇంకా బేబీ స్టెప్స్ వేస్తున్నాను. నేను నేర్చుకోవాల్సింది ఇంకా ఉంది'' అన్నారు హీరోయిన్ డింపుల్ హయతి. గోపీచంద్, డింపుల్ హయతి జంటగా శ్రీవాస్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'రామబాణం'. టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం మే 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం విలేకర్ల సమావేశంలో డింపుల్ హయతి మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో యూ ట్యూబ్ బ్లాగర్ భైరవి పాత్రలో నటించాను. సోషల్ మీడియాలో అంతగా యాక్టివ్‌గా ఉండని నాకు ఈ పాత్ర కొత్తగా, కాస్త చాలెంజింగ్‌గా అనిపించింది. 'ఖిలాడి' సినిమాలో నా గ్లామరస్ యాక్టింగ్‌ను చూసి శ్రీవాస్‌గారు 'రామబాణం' సినిమాలో భైరవి పాత్ర నేను చేయగలనా? అని కాస్త సంకోచించారు. దీంతో రెండు ఆడిషన్స్ ఇచ్చాను. 'భైరవి' పాత్రకు నేను సరిపోతానని ఆయన నమ్మారు. ప్రస్తుతం కొన్ని కొత్త కథలు వింటున్నాను. తెలుగు, తమిళ భాషల్లో నేను చేసిన కొత్త సినిమాల ప్రకటనలు త్వరలోనే వస్తాయి'' అన్నారు.

భాష రాకపోవడం నా బలహీనత

- డినో మోరియా



అఖిల్ హీరోగా సురేందర్ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఏజెంట్'. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 28న విడుదల కానుంది. ఈ చిత్రంలో కీలక పాత్ర చేసిన బాలీవుడ్ నటుడు డినో మోరియా విలేకరులతో మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో 'రా' (రీసెర్చ్ అండ్ ఎనాలిసిస్ వింగ్) మాజీ ఏజెంట్ 'ది గాడ్' పాత్ర చేశాను. సురేందర్ రెడ్డి 'ఎంపైర్' చూసి, నాకు 'ఏజెంట్'కి చాన్స్ ఇచ్చారు. ప్రతి సీన్‌లోనూ నా నుంచి ఆయన మోర్ ఎనర్జీని కోరుకునేవారు. అయితే తెలుగు భాష రాకపోవడం నా బలహీనతగా అనిపించింది. ఇక తెలుగు ఫ్యాన్స్ తమ స్టార్స్ కోసం ప్రాణమిస్తారు. బాలీవుడ్‌లో ఇది అంతగా కనిపించదు. చిరంజీవి ఫ్యాన్స్ రామ్‌చరణ్‌ను, నాగార్జున ఫ్యాన్స్ అఖిల్‌ను అభిమానిస్తున్నారు. బాలీవుడ్‌లో నెపోటిజమ్ అంటే ఒప్పుకోను. నాది బెంగళూరు. బాలీవుడ్‌లో ఎవరూ తెలియకుండానే ముంబై వెళ్లి, అవకాశాలు తెచ్చుకుని ఇప్పుడు నటుడిగా మంచి స్థాయిలో ఉన్నాను'' అన్నారు.

వీరి వీరి గుమ్మడిపండు
వీరి పేరేమి?

దాగుడు మూతలాట ఆడుకోని వాళ్లుండరు... కళ్లకు గంతలు కట్టి పేర్లు అడిగితే చెప్పాలి. ఇది రియల్ ఆట. రీల్ గేమ్ విషయానికి వస్తే.. గంతలు కట్టకుండా.. ఆర్టిస్ట్‌ని ఎదురుగా నిలబెట్టి, 'వీరి పేరేమి' అని అడిగితే.. ఆ ఆర్టిస్ట్‌ని గుర్తుపట్టడానికి కాస్త టైమ్ పడుతుంది. అసలు గుర్తు పట్టకపోవచ్చు కూడా. అంతలా కొందరు స్టార్స్ క్యారెక్టర్లలో ఒదిగిపోయారు. ఫిజికల్ మేకోవర్‌తో, మేకప్‌తో గుర్తుపట్టలేనంతగా మారిపోయిన ఆ హీరోల గురించి తెలుసుకుందాం.

- పాత్రల కోసం రూపాన్ని మార్చుకోవడానికి ఏమాత్రం వెనకడుగు వేయరు విక్రమ్. 'శివపుత్రుడు, అపరిచితుడు, ఐ' వంటి చిత్రాలు అందుకు నిదర్శనం. తాజాగా 'తంగలాన్'లో కొత్త అవతారంలో కనిపించనున్నారు. కోలార్ గోల్డ్ ఫీల్డ్ (కేజీఎఫ్) నేపథ్యంలో వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రంలో మాస్ లుక్‌లో కనిపించనున్నారు విక్రమ్. గనుల తవ్వకాల పనులు చేసే వ్యక్తుల జీవితాల నేపథ్యంలో దర్శకుడు పా. రంజిత్ పాన్ ఇండియా మూవీగా 'తంగలాన్'ని తెరకెక్కిస్తున్నారు.

- క్యారెక్టర్ ఎలా డిమాండ్ చేస్తే అలా మారిపోవాలనుకుంటారు అల్లు అర్జున్. గతంలో 'దేశ ముదురు' సినిమా కోసం సిక్స్ ప్యాక్ చేశారు. తాజాగా 'పుష్ప' కోసం ఫిజికల్ మేకోవర్‌తో పాటు మేకప్ పరంగానూ వ్యత్యాసం చూపించారు. స్మగ్లర్ పుష్పరాజ్‌గా తొలి భాగం 'పుష్ప: ది రైజ్'లో రెచ్చిపోయారు అల్లు అర్జున్. మలి భాగం 'పుష్ప:ది రూల్' చిత్రీకరణ జరుగుతోంది. కాగా.. పుష్పరాజ్‌గా గుర్తు పట్టలేనంతగా అల్లు అర్జున్ మారలేదు. కానీ రెండో భాగంలో జాతర బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే ఒక ఫైట్‌లో గుర్తు పట్టలేని విధంగా మారిపోయారు. పండగ చివరి రోజు స్త్రీ వేషధారణలో పురుషులు చెడును నాశనం చేసే గంగమ్మ తల్లిగా మారతారని, ఈ ఫైట్‌లో అల్లు అర్జున్ గెటప్ అదే అని తెలిసింది. సుకుమార్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది.

- దుర్గ, పరశురామ్, డీజే.. ఈ మూడు పాత్రల్లో సుధీర్‌బాబు కనిపించనున్న చిత్రం 'మామా మశ్చీంద్ర'.. వీటిలో దుర్గ పాత్ర డిఫరెంట్. ఏజ్డ్ గ్యాంగ్‌స్టర్ అన్నమాట. మామూలుగా సుధీర్‌బాబు చాలా స్లిమ్‌గా, ఫిట్‌గా ఉంటారు. అయితే ఈ పాత్రలో అందుకు భిన్నంగా బొద్దుగా కనబడతారు. హర్షవర్ధన్ దర్శకత్వంలో తెలుగు, హిందీ భాషల్లో ఈ చిత్రం రూపొందుతోంది,


- అటు మలయాళంకి వెళితే సీనియర్ హీరో మోహన్‌లాల్, యంగ్ హీరో పృథ్వీ రాజ్‌కుమారన్‌లు డిఫరెంట్ లుక్స్‌లో కనిపించనున్నారు. మోహన్‌లాల్ టైటిల్ రోల్‌లో రూపొందుతున్న చిత్రం 'బర్రోజ్'. వాస్కో డి గామా నిధిని రక్షించడానికి నియమించబడిన 400 ఏళ్ల నాటి ఆత్మ బర్రోజ్. ఆ నిధిని వాస్కో అసలు వారసునికి అప్పగించడానికి ఆ ఆత్మ వేచి ఉంటుంది. కాల్పనిక కథతో త్రీడీ చిత్రంగా 'బర్రోజ్' రూపొందుతోంది. కాగా ఈ చిత్రంలో టైటిల్ రోల్ చేయడంతో పాటు మోహన్ లాల్ దర్శకత్వం కూడా వహిస్తున్నారు.

- మరో మలయాళ హీరో–దర్శకుడు పృథ్వీ రాజ్‌కుమారన్ గొర్రెల కాపరిగా కనిపించనున్న చిత్రం 'ఆడు జీవితం'. 2008లో ఇదే పేరుతో వచ్చిన నవల నేపథ్యంలో బ్లెస్సీ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. నజీబ్ అనే మలయాళీ వలస కార్మికుడి పాత్రలో పృథ్వీరాజ్ కనిపిస్తారు. సౌదీ అరేబియాకి వలస వెళ్లిన నజీబ్‌ను గొర్రెల కాపరిని చేసి, బలవంతంగా బానిసత్వంలోకి నెట్టివేస్తారు. నిజజీవిత ఘటనల ఆధారంగా ఈ చిత్రం సాగుతుంది.

సవాళ్లను ఇష్టపడని స్టార్స్ ఉండరు. అయితే సవాళ్లు అరుదుగా వస్తుంటాయి. అందుకే చాలెంజింగ్ రోల్స్ వచ్చినప్పుడు 'సై' అంటూ ఎంత కష్టపడటానికైనా సిద్ధపడిపోతారు.

ఈ సవాళ్లు స్టార్స్‌కి కిక్కే.. అభిమానులకూ కిక్కే. సినిమా సరిగ్గా క్లిక్ అయితే బాక్సాఫీస్‌కీ కిక్కే.

రాణిగారి గదిలో...



కోమల్, అబిద్, సిరాజ్

రోషన్, కోమల్ జెన్, సాక్షి, స్రవంతి, పూజా డే కీలక పాత్రల్లో అబిద్ దర్శకత్వంలో సిరాజ్ నిర్మించిన చిత్రం 'రాణిగారి గదిలో దెయ్యం'. పీవీ సత్యనారాయణ నిర్మించిన ఈ చిత్రం త్వరలో రిలీజ్ రానుంది. నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్న కుమార్, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ ఈ చిత్రం ట్రైలర్‌ని విడుదల చేశారు. పీవీ సత్యనారాయణ మాట్లాడుతూ– ''మా బ్యానర్‌లో వస్తున్న ఐదో సినిమా 'రాణిగారి గదిలో దెయ్యం'. హారర్ కాన్సెప్ట్‌తో వినోదాత్మకంగా సాగే చిత్రమిది'' అన్నారు. ''హారర్ కథతో చక్కని సినిమా తీశాం'' అన్నారు అబిద్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	75	60,131
నిఫ్టీ ▲	26	17,769

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	11,858	▽	179
డోజోన్స్	33,578	▽	297
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,891	▽	21
డాక్స్	15,872	▲	8
షాంఘై	3,265	▽	11
నికాయ్	28,620	▲	27

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో	ముంబై	
బంగారం (24 క్యారెట్)	60,078 ▽	3
బంగారం (22 క్యారెట్)	59,837 ▽	3
వెండి (కిలో)	74,075 ▽	315

మారుతీ వాహనాలు అప్‌గ్రేడ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారత్ స్టేజ్–6 ఉద్గార ప్రమాణాలు రెండవ దశ కింద అన్ని మోడళ్లను అప్‌గ్రేడ్ చేసినట్టు వాహన తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా వెల్లడించింది. హ్యాచ్‌బ్యాక్స్, సెడాన్స్, ఎంపీవీలు, ఎస్‌యూవీలతోపాటు వాణిజ్య వాహనాలు సైతం వీటిలో ఉన్నాయని కంపెనీ తెలిపింది. ఈ20 ఇంధనం వినియోగానికి అనువుగా వీటిని తీర్చిదిద్దినట్టు పేర్కొంది. కాలుష్యం ఏ స్థాయిలో వెలువడుతుందో ఎప్పటికప్పుడు తెలిపే ఆన్–బోర్డ్ డయాగ్నోస్టిక్స్ (ఓబీడీ) సిస్టమ్‌ను వాహనంలో అమర్చినట్టు వివరించింది. అన్ని మోడళ్లు ఇప్పుడు ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్ (ఈఎస్‌సీ) వ్యవస్థను కలిగి ఉన్నాయని ప్రకటించింది. కంపెనీ ఖాతాలో ప్రస్తుతం 15 మోడళ్లు ఉన్నాయి.

ఫోన్లు ఎన్నయినా ఒకటే వాట్సాప్

అమల్లోకి కొత్త ఫీచర్



న్యూఢిల్లీ: వాట్సాప్ ఓ అనుకూల సదుపాయాన్ని తన యూజర్ల కోసం రూపొందించింది. ఒకటికి మించిన ఫోన్లలో ఒక్కటే వాట్సాప్ ఖాతాను ఉపయోగించుకోవచ్చని ప్రకటించింది. అంతర్జాతీయంగా ఈ ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు, రానున్న వారాల్లో ప్రతి ఒక్కరికీ ఇది వినియోగంలోకి వస్తుందని పేర్కొంది. ఈ ఫీచర్ కావాలంటూ వాట్సాప్ యూజర్లలో ఎక్కువ మంది నుంచి వినతులు రావడంతో దీన్ని రూపొందించినట్టు సంస్థ తెలిపింది. వాట్సాప్‌ను వెబ్ బ్రౌజర్‌కు కనెక్ట్ చేసిన మాదిరే, ఒకటికి మించిన ఫోన్లలోనూ అనుసంధానించడం ద్వారా కొత్త ఫీచర్‌ను ఉపయోగించుకోవచ్చు. ఇలా ఒకే ఖాతా అనుసంధానమై ఉన్న ఏ ఫోన్లో అయినా చాట్, మీడియా, కాల్స్ సేవలు వాడుకోవచ్చని వాట్సాప్ తెలిపింది. ఒకవేళ ప్రైమరీ ఫోన్ (మొదట ఇన్‌స్టాల్ చేసుకున్న)లో వాట్సాప్ చాలా కాలంగా యాక్టివ్‌గా లేకపోతే, అప్పుడు ఆ అకౌంట్ కనెక్ట్ అయి ఉన్న ఇతర ఫోన్లలోనూ దానంతట అదే లాగవుట్ అవుతుందని పేర్కొంది. సైనవుట్ చేయాల్సిన అవసరం లేకుండా, ఒక ఫోన్ నుంచి ఇంకో ఫోన్‌కు 'నౌ స్విచ్'ను ఎంపిక చేసుకోవచ్చని వాట్సాప్ తెలిపింది.

నెస్లే ఇండియా లాభం జూమ్

- క్యూ4లో రూ. 737 కోట్లు
- షేరుకి రూ. 27 డివిడెండ్



న్యూఢిల్లీ: ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం నెస్లే ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023) తొలి త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ1)లో నికర లాభం 25% జంప్‌చేసి రూ. 737 కోట్లకు చేరింది. గతేడాది(2022) ఇదే కాలంలో రూ. 591 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం అమ్మకాలు సైతం 20% ఎగసి రూ. 4,808 కోట్లను అధిగమించాయి. గత క్యూ1లో రూ. 3,963 కోట్ల అమ్మకాలు ప్రకటించింది. కంపెనీ జనవరి–డిసెంబర్ కాలాన్ని ఆర్థిక సంవత్సరంగా పరిగణించే సంగతి తెలిసిందే. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 27 మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. తాజా త్రైమాసికంలో ప్రొడక్టుల ధరలు, అమ్మకాల పరిమాణం తదితరాల్లో పటిష్ట ఫలితాలు సాధించినట్లు కంపెనీ చైర్మన్, ఎండీ సురేష్ నారాయణన్ పేర్కొన్నారు. 2016ను మినహాయిస్తే గత పదేళ్లలో ఒక త్రైమాసికానికి అత్యధిక వృద్ధిని సాధించినట్లు తెలియజేశారు. 2015లో తలెత్తిన మ్యాగీ వివాదం నేపథ్యంలో లోబేస్ కారణంగా 2016లో గరిష్ట వృద్ధిని అందుకున్నట్లు ప్రస్తావించారు.

దేశీయంగా భళా

క్యూ1లో నెస్లే ఇండియా దేశీ అమ్మకాలు 21% పైగా పుంజుకుని రూ. 4,613 కోట్లకు చేరాయి. కమోడిటీల ధరలు పెరిగినప్పటికీ మిల్క్ ప్రొడక్టులు, న్యూట్రిషన్ విభాగంలో రెండంకెల వృద్ధి నమోదైంది. ఈ బాటలో కాఫీ బ్రాండు నెస్‌కెఫే రికార్డ్ మార్కెట్ వాటాను సాధించినట్లు కంపెనీ పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో నెస్లే ఇండియా షేరు స్వల్ప నష్టంతో రూ. 20,670 వద్ద ముగిసింది.

నాస్కామ్ చైర్‌పర్సన్‌గా అనంత్ మహేశ్వరి

- 2023–24 సంవత్సరానికి ఎంపిక
- వైస్ చైర్‌పర్సన్‌గా రాజేష్ నంబియార్



న్యూఢిల్లీ: ఐటీ పరిశ్రమ అత్యున్నత సంఘమైన నాస్కామ్ చైర్ పర్సన్‌గా 2023–24 సంవత్సరానికి అనంత్ మహేశ్వరి ఎంపికయ్యారు. మహేశ్వరి ప్రస్తుతం మైక్రోసాఫ్ట్ ఇండియా ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నారు. అంతేకాదు నాస్కామ్ వైస్ చైర్మన్‌గానూ ఇప్పటి వరకు సేవలు అందించారు. టీసీఎస్ బిజినెస్, టెక్నాలజీ విభాగం ప్రెసిడెంట్ అయిన కృష్ణన్ రామానుజం ఇప్పటి వరకు నాస్కామ్ చైర్ పర్సన్‌గా సేవలు అందించగా, ఆయన స్థానంలో అనంత్ మహేశ్వరి పని చేయనున్నారు. కాగ్నిజంట్ ఇండియా చైర్మన్, ఎండీగా ఉన్న రాజేష్ నంబియార్‌ను నాస్కామ్ వైస్ చైర్మన్‌గా నియమించారు.

రెండో రోజూ లాభాల్లో

- సెన్సెక్స్ 75 పాయింట్లు ప్లస్
- 60,131 వద్ద ముగింపు
- నిఫ్టీ 26 పాయింట్లు అప్
- ప్రభుత్వ బ్యాంకులకు డిమాండ్



ముంబై: వరుసగా రెండో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు బలపడ్డాయి. తొలుత నేలచూపులతో మొదలైనప్పటికీ వెనువెంటనే ఊపందుకున్నాయి. చివరికి సెన్సెక్స్ 75 పాయింట్లు పుంజుకుని 60,131 వద్ద నిలిచింది. నిఫ్టీ 26 పాయింట్లు లాభపడి 17,769 వద్ద ముగిసింది. ముందురోజు భారీ డిమాండును అందుకున్న ప్రభుత్వ రంగ బ్యాంక్ కౌంటర్లకు వరుసగా రెండో రోజూ కొనుగోళ్ల మద్దతు లభించింది. గతేడాది క్యూ4(జనవరి–మార్చి)లో ఐటీ, బ్యాంకింగ్ తదితర రంగాల బ్లూచిప్ కంపెనీలు ఆకర్షణీయ ఫలితాలు సాధిస్తుండటంతో సెంటిమెంటుకు జోష్ వచ్చినట్లు మార్కెట్ నిపుణులు పేర్కొన్నారు. దీంతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకే ఆసక్తి చూపుతున్నట్లు తెలియజేశారు. అయితే గురువారం ఏప్రిల్ డెరివేటివ్ సిరీస్ ముగియనుండటంతో కొంతమేర హెచ్చుతగ్గులు నమోదవుతున్నట్లు వివరించారు.

కన్జూమర్ డ్యూరబుల్స్ వీక్

ఎన్ఎస్ఈలో ప్రధానంగా పీఎస్‌యూ బ్యాంక్స్, ఆయిల్, మెటల్, రియల్టీ 1.3–0.5 శాతం మధ్య బలపడగా.. మీడియా, కన్జూమర్ డ్యూరబుల్స్ 1.2 శాతం, మీడియా 0.7 శాతం చొప్పున డీలాపడ్డాయి. నిఫ్టీ దిగ్గజాలలో అదానీ ఎంటర్, బజాజ్ ఫైనాన్స్, ఫిన్‌సర్వ్, బ్రిటానియా, ఎయిర్‌టెల్, ఇండస్‌ఇండ్, ఐషర్, ఎస్‌బీఐ, దివీస్, ఐసీఐసీఐ, ఆర్ఐఎల్, ఐటీసీ 2.5–0.6 శాతం మధ్య ఎగశాయి.

ఆటో ఎల్‌పీజీ కథ ముగిసినట్టే!

- గణనీయంగా తగ్గిపోయిన విక్రయాలు
- ఇంధన ధరలూ అధికమే
- సీఎన్‌జీ, ఎలక్ట్రిక్ వైపు మొగ్గు



న్యూఢిల్లీ: దేశ ఆటోమొబైల్ మార్కెట్ క్రమంగా పర్యావరణ అనుకూల పరిష్కారాల వైపు అడుగులు వేస్తోంది. ఎక్కువ మంది పెట్రోల్, ఎలక్ట్రిక్ వాహనాలు, సీఎన్‌జీ కార్లకు ప్రాధాన్యం ఇస్తుండడంతో.. ఆటోమొబైల్ లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పీజీ) వినియోగం గణనీయంగా తగ్గిపోయింది. ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ తర్వాత సీఎన్‌జీ వాహనాలకే ఎక్కువ డిమాండ్ నెలకొంది. దీంతో ఎల్‌పీజీ కార్ల విక్రయాలు ఐదేళ్ల కాలంలో (2018–19 నుంచి చూస్తే) 82 శాతం తగ్గిపోయాయి. 2022–23లో కేవలం 23,618 ఎల్‌పీజీ కార్లు మాత్రమే అమ్ముడయ్యాయి. కానీ, 2018–19లో 1,28,144 యూనిట్లు అమ్ముడుపోవడం గమనార్హం. కేంద్ర రవాణా శాఖ పరిధిలోని వాహన్ పోర్టల్ గణాంకాలు ఈ విషయాన్ని తెలియజేస్తున్నాయి. ముఖ్యంగా గత ఆర్థిక సంవత్సరంలో దేశం మొత్తం మీద 2,22,24,702 యూనిట్ల వాహనాలు అమ్ముడుపోతే, ఇందులో ఎల్‌పీజీ వాహనాలు కేవలం 0.11 శాతంగా ఉండడం వినియోగదారులు వీటి పట్ల ఆసక్తిగా లేరని తెలుస్తోంది. అదే సమయంలో సీఎన్‌జీ వాహన విక్రయాలు ఇందులో 3 శాతంగా ఉంటే, ఎలక్ట్రిక్ వాహనాలు 5 శాతంగా ఉండడం, కస్టమర్లు ప్రత్యామ్నాయాల వైపు చూస్తున్నట్టు తెలియజేస్తోంది.

ఎగసి పడిన డిమాండ్

ఎల్‌పీజీ పుష్కలంగా అందుబాటులో ఉండడమే కాదు, ఎక్కువ ఆక్టేన్ కలిగి, చాలా తక్కువ ఉద్గారాలను విడుదల చేసే ఇంధనం కావడంతో.. ఆటోమొబైల్ పరిశ్రమకు ప్రత్యామ్నాయ ఇంధనంగా లోగడ భావించారు. దీంతో ఎల్‌పీజీ కార్లు, ఎల్‌పీజీ త్రిచక్ర వాహనాలు 2019లో ఎక్కువగా అమ్ముడుపోయాయి. కానీ, దేశంలో ఎల్‌పీజీ వాహనాల వినియోగం చట్టబద్ధంగా అమల్లోకి వచ్చింది మాత్రం 2020 ఏప్రిల్ నుంచి కావడం గమనార్హం. నాలుగు చక్రాల ప్యాసింజర్ వాహనాలకుతోడు, ఎల్‌పీజీ త్రిచక్ర వాహనాలు (80 శాతానికి పైగా) 2019లో రికార్డు స్థాయి ఎల్‌పీజీ వాహన అమ్మకాలకు దోహదపడినట్టు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. కానీ, 2022–23 సంవత్సరంలో ఎల్‌పీజీ వాహనాల డిమాండ్ 14 శాతానికి పరిమితమైంది. 2018–19లో ఇది 18 శాతంగా ఉంది. 2022–23లో కేవలం 3,495 ఎల్‌పీజీ నాలుగు చక్రాల వాహనాలు రిజిస్టర్ అయ్యాయి. 2018–19లో ఇలా రిజిస్టర్ అయిన నాలుగు చక్రాల వాహనాలు 23,965 యూనిట్లుగా ఉండడం గమనించాలి. ''విక్రయానంతరం ప్యాసింజర్ వాహనాలకు ఉన్న డిమాండ్ ఇది. 2018 నుంచి 2020 వరకు ప్యాసింజర్ వాహన విభాగమే ఎల్‌పీజీకి పెద్ద మద్దతుగా నిలిచింది. నిబంధనలు అనుకూలంగా లేకపోవడం, కిట్ ఆధారిత అనుమతులకు అధిక వ్యయాలు చేయాల్సి రావడం, ప్రతి మూడేళ్లకోసారి తిరిగి సర్టిఫై చేయించుకోవాల్సి రావడం, ఎల్‌పీజీ మోడళ్లు పెద్దగా అందుబాటులో లేకపోవడం వినియోగదారుల్లో ఆసక్తి ఆవిరైపోవడానికి కారణం''అని ఇండియన్ ఆటో ఎల్‌పీజీ కొయిలిషన్ డైరెక్టర్ జనరల్ సుయాష్ గుప్తా వివరించారు.

వసతులు కూడా తక్కువే..

2023 మార్చి నాటికి దేశవ్యాప్తంగా కేవలం 1,177 ఎల్‌పీజీ స్టేషన్లే ఉన్నాయి. అదే సీఎన్‌జీ స్టేషన్లు అయితే 4,600 ఉంటే, ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్లు 5,200 ఉన్నాయి. పెట్రోల్ పంపులు 80,000 పైగా ఉన్నాయి. అంటే ఎల్‌పీజీ విషయంలో సరైన రీఫిల్లింగ్ వసతులు కూడా లేవని తెలుస్తోంది. మరోవైపు ధరలు కూడా అనుకూలంగా లేని పరిస్థితి నెలకొంది. ఢిల్లీలో కిలో ఎల్‌పీజీ ధర లీటర్‌కు రూ.68కి చేరుకోగా, 2019లో రూ.40 మాత్రమే ఉంది. ఇతర రాష్ట్రాల్లో దీని ధర ఇంకా ఎక్కువే. ''ప్రభుత్వం వైపు నుంచి ప్రోత్సాహం కొరవడడంతో వాహన తయారీదారులు ఎల్‌పీజీ మోడళ్లను తీసుకొచ్చేందుకు ఆసక్తి చూపించడం లేదు. నేడు దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ ఇండియా అయితే ఎల్‌పీజీ కార్ల తయారీని నిలిపివేసింది. ప్రజలు సీఎన్‌జీ, ఈవీల పట్ల ఆసక్తి చూపిస్తుండడం దేశంలో ఎల్‌పీజీ వాహన రంగానికి గొడ్డలి పెట్టుగా మారింది''అని పరిశ్రమకు చెందిన నిపుణుడు ఒకరు పేర్కొన్నారు. ఈవీ, సీఎన్‌జీ వాహనాలను కేంద్రం సబ్సిడీలతో ప్రోత్సహిస్తుండడాన్ని పరిశ్రమ ప్రస్తావిస్తోంది.

అపోలో జీనోమిక్ ఇన్‌స్టిట్యూట్స్

చెన్నై: వైద్య సేవల రంగంలో ఉన్న అపోలో హాస్పిటల్స్ గ్రూప్ ఈ ఏడాది చివరినాటికి హైదరాబాద్, బెంగళూరు, అహ్మదాబాద్‌లో జీనోమిక్ కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే సంస్థకు ముంబై, ఢిల్లీలో ఇటువంటి ఫెసిలిటీస్ ఉన్నాయి. చెన్నై సెంటర్‌ను మంగళవారం ప్రారంభించింది. ఈ కేంద్రాల్లో జన్యు మూల్యాంకనం, క్లినికల్ డయాగ్నోస్టిక్స్, ప్రసూతి జన్యుశాస్త్రం, క్యాన్సర్ జీనోమిక్స్ వంటి సేవలను అందిస్తారు.

గ్రాన్యూల్స్ రూపంలో కాయం చూర్ణ



హైదరాబాద్: మలబద్ధకానికి ఔషధంగా గత 50 సంవత్సరాలుగా మార్కెట్‌లో ఉన్న తమ ప్రతిష్టాత్మక 'కాయం చూర్ణ' ఇక గ్రాన్యూల్స్ (గుళికలు లేదా పలుకులు) రూపంలోనూ అందుబాటులోనికి రానుందని సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ అడ్వాన్స్‌డ్ ఫార్ములా వల్ల చూర్ణ గొంతులో అతుక్కుపోవడం, అసౌకర్యం వంటి సమస్యలు తొలగిపోతాయని భావ్‌నగర్ కేంద్రంగా ఈ ఉత్పత్తిలో ఉన్న సేథ్ బ్రదర్స్ సంస్థ వివరించింది. జీలకర్ర రుచితో ఉండే ఈ కొత్త ప్రొడక్ట్ కడుపును శుద్ధి చేయడానికి మరింత సమర్థవంతంగా పనిచేస్తుందని ప్రకటన పేర్కొంటూ.. ఆముదం, గులాబీ ఆకుల మేళవింపుతో ప్రొడక్ట్ రూపొందడం దీనికి కారణమని వివరించింది.

నేడే ఇంటర్ ఫస్ట్, సెకండియర్ ఫలితాలు–2023
ఫలితాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. వెంటనే ఫలితాలు పొందండి.
పూర్తి వివరాల కోసం www.sakshieducation.com చూడొచ్చు.

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

తెలంగాణ గురుకులాల్లో 132 ఆర్ట్ టీచర్ పోస్టులు

తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ–రిక్రూట్‌మెంట్ బోర్డు(టీఆర్ఈఐఆర్‌బీ)..తెలంగాణ సాంఘిక సంక్షేమం,గిరిజన సంక్షేమం, మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమం, మైనార్టీ సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో డైరెక్ట్ ప్రాతిపదికన ఆర్ట్ టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 132
» **సొసైటీల వారీగా ఖాళీలు:** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాలు–16, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకులాలు–6, మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకులాలు–72, తెలంగాణ మైనార్టీ సంక్షేమ గురుకులాలు–38.
» **అర్హత:** పదో తరగతి, డిప్లొమా, టీసీసీ, బీఎఫ్ఏ ఉత్తీర్ణులై ఉండాలి. » **వయసు:** 01.07.2023 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.31,040 నుంచి రూ.92,050 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, డెమాన్‌స్ట్రేషన్, సర్టిఫికేట్ వెరిఫికేషన్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.04.2023 నుంచి 24.05.2023 వరకు
» **వెబ్‌సైట్:** www.treirb.telangana.gov.in

తెలంగాణ గురుకులాల్లో 1276 పీజీటీ పోస్టులు

తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ(టీఆర్ఈఐఆర్‌బీ).. తెలంగాణ సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమం, గురుకుల విద్యా సంస్థల్లో డైరెక్ట్ ప్రాతిపదికన పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1276
» **సబ్జెక్టుల వారీగా ఖాళీలు:** తెలుగు–183, హిందీ–168, ఇంగ్లిష్–180, గణితం–231, ఫిజికల్ సైన్స్–142, బయోలాజికల్ సైన్స్–161, సోషల్ స్టడీస్–202.
» **అర్హత:** కనీసం 50% మార్కులతో సంబంధిత సబ్జెక్టులో పీజీతోపాటు సంబంధిత మెథడాలజీ సబ్జెక్టులో బీఈడీ, బీఏ బీఈడీ, బీఎస్సీ బీఈడీ/లాంగ్వేజ్ పండిట్ ట్రైనింగ్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.07.2023 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.45,960 నుంచి రూ.1,24,150 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష(పేపర్–1, 2, 3), ఇంటర్వ్యూ, సర్టిఫికేట్ వెరిఫికేషన్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.04.2023 నుంచి 24.05.2023 వరకు
» **వెబ్‌సైట్:** www.treirb.telangana.gov.in

సత్వర ఉపాధికి.. సర్టిఫికేషన్స్!

» పదో తరగతి, ఇంటర్ అర్హతగా జాబ్ ఓరియెంటెడ్ కోర్సులు
» సైబర్ సెక్యూరిటీ నుంచి ఫొటోగ్రఫీ వరకు పలు సర్టిఫికేషన్స్
» సర్టిఫికెట్ సొంతం చేసుకుంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



ఆఫ్టర్ టెన్త్/ఇంటర్

పదో తరగతి, ఇంటర్మీడియెట్ పూర్తిచేసిన విద్యార్థుల్లో అనేకమంది వివిధ కారణాలతో సత్వర ఉపాధి కోసం అన్వేషిస్తున్నారు. ఇలాంటి వారు తమ ఉద్యోగ లక్ష్యాన్ని చేరుకునేందుకు దోహదం చేస్తున్నాయి.. స్వల్పకాలిక సర్టిఫికేషన్ కోర్సులు! వీటిని పూర్తి చేసుకుంటే..అదనపు నైపుణ్యాలతో ఉద్యోగాన్వేషణలో ముందంజలో నిలిచే అవకాశం లభిస్తోంది! ఇటీవల పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు అందుబాటులో ఉన్న జాబ్ ఓరియెంటెడ్ షార్ట్ టర్మ్ సర్టిఫికేషన్ కోర్సుల వివరాలు..

పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణతతో..ఎన్నో షార్ట్‌టర్మ్ కోర్సుల్లో చేరే అవకాశముంది. విద్యార్థులు కొంత సమయాన్ని ఈ సర్టిఫికేషన్స్ కోసం కేటాయిస్తే.. మెరుగైన ఉపాధి అవకాశాలు దక్కించుకోవచ్చు. కంప్యూటర్స్, సైబర్ సెక్యూరిటీ, ఐటీ మొదలు ఫోటోగ్రఫీ, వీడియో ఎడిటింగ్, బ్యుటీషియన్ వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటి వ్యవధి ఆరు నెలల నుంచి సంవత్సరం. వీటిని పూర్తి చేసుకుంటే ఉపాధికి అవసరమైన క్షేత్ర నైపుణ్యాలు లభిస్తాయి. ఫలితంగా ఉద్యోగ సాధనతోపాటు మెరుగైన వేతనాలు అందుకునేందుకు మార్గం ఏర్పడుతుంది.

సైబర్ సెక్యూరిటీ

- సైబర్ సెక్యూరిటీ..ప్రస్తుత టెక్ యుగంలో అత్యంత కీలక నైపుణ్యం. ప్రస్తుతం సంస్థలు ఆన్‌లైన్ విధానంలో వినియోగదారులకు సేవలందిస్తున్నాయి. ఆ క్రమంలో విలువైన సమాచారం తస్కరణకు గురికాకుండా.. సైబర్ సెక్యూరిటీ నైపుణ్యాలు అవసరమవుతున్నాయి. ఈ స్కిల్స్‌ను అందుకునేందుకు ఆరు నెలల నుంచి సంవత్సరం వ్యవధిలో ఉండే సర్టిఫికేషన్ కోర్సులు అందుబాటులోకి వచ్చాయి.
- పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఆయా సర్టిఫికేషన్ కోర్సుల ద్వారా ఎథికల్ హ్యాకింగ్, సైబర్ సెక్యూరిటీ అనాలిసిస్, అప్లికేషన్స్ ఆఫ్ అటాక్స్, అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ అనాలిసిస్, డేటా ప్రొటెక్షన్, హార్డ్‌వేర్ ప్రొటెక్షన్ వంటి అంశాల్లో నైపుణ్యాలు పొందొచ్చు.
- ఈ సర్టిఫికేషన్ పూర్తి చేసుకున్న వారికి ఐటీ, ఐటీ అనుబంధ సంస్థలు, లేదా ఇతర రంగాల్లోని కంపెనీల్లో ఐటీ విభాగాల్లో సైబర్ సెక్యూరిటీ టీమ్ అసిస్టెంట్స్, అసోసియేట్స్ వంటి ఉద్యోగాలు లభిస్తాయి.
- కోర్స్‌రా, యుడెమీ వంటి సంస్థలు సర్టిఫికెట్ ఇన్ సైబర్ సెక్యూరిటీ కోర్సును ఆరు నెలల వ్యవధిలో అందిస్తున్నాయి.

హార్డ్‌వేర్ మెయింటనెన్స్

- ఐటీలోనే ఉద్యోగావకాశాలు కల్పించే మరో కోర్సు.. హార్డ్‌వేర్ మెయింటనెన్స్. కంప్యూటర్‌ను ఆపరేట్ చేయడానికి అవసరమైన సీపీయూ, నెట్ వర్కింగ్, లోకల్ ఏరియా నెట్ వర్క్ నిర్వహణ వంటి వాటికి సంబంధించిన నైపుణ్యాలు హార్డ్‌వేర్ మెయింటనెన్స్ కోర్సు ద్వారా సొంతం చేసుకోవచ్చు. దీనికి సంబంధించి ప్రస్తుతం పీసీ హార్డ్‌వేర్ అండ్ నెట్‌వర్కింగ్, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేషన్, పీసీ అసెంబ్లీ అండ్ మెయింటనెన్స్ తదితర విభాగాల్లో సర్టిఫికేషన్స్ అందుబాటులో ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్ అండ్ నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేషన్, అడ్వాన్స్‌డ్ డిప్లొమా ఇన్ రిపెయిర్ అండ్ మెయింటనెన్స్ ఆఫ్ సిస్టమ్స్ వంటి కోర్సులు ఉన్నాయి.
- ప్రభుత్వ ఆధ్వర్యంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, నిమ్స్‌మే, సెట్విన్ వంటి సంస్థలు ఈ కోర్సులను బోధిస్తున్నాయి. వీటిని పూర్తి చేసుకుంటే.. చిన్న, మధ్య తరహా సంస్థల్లో హార్డ్‌వేర్ నెట్‌వర్కింగ్ అసిస్టెంట్స్, సపోర్ట్ ఎగ్జిక్యూటివ్స్ వంటి ఉద్యోగాలు లభిస్తాయి.

కంప్యూటర్ కోర్సులు

పదో తరగతి, ఇంటర్మీడియెట్ అర్హతతో మరెన్నో కంప్యూటర్ సర్టిఫికేషన్స్ అందుబాటులోకి వస్తున్నాయి. నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో.. సీసీఎన్ఏ, సీసీఎన్‌పీ, ఎస్ఏపీ, కోర్–జావా ప్రోగ్రామింగ్, అడ్వాన్స్‌డ్ జావా ప్రోగ్రామింగ్, డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్, సీ++, ఎంఎస్ ఆఫీస్ అండ్ ఇంటర్నెట్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ వంటి కోర్సులున్నాయి. ఆయా కోర్సులను బట్టి మూడు నెలల నుంచి సంవత్సరం వ్యవధిలో వీటిని బోధిస్తున్నారు. అదే విధంగా ఎన్ఎస్‌డీసీ ఐటీ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ ఆధ్వర్యంలోనూ వీటిని అభ్యసించే అవకాశం ఉంది. వీటిని పూర్తి చేసుకుంటే..ఐటీ, ఐటీ అనుబంధ విభాగాల్లో అసిస్టెంట్స్, సపోర్టింగ్ ఎగ్జిక్యూటివ్స్ ఉద్యోగాలు దక్కుతాయి.

మైక్రోసాఫ్ట్ ఆఫీస్ స్పెషలిస్ట్

- సంస్థల్లో క్లరికల్ కేడర్‌లో విధులు నిర్వహించే వారికి ఉపయోగపడే కోర్సు.. మైక్రోసాఫ్ట్ ఆఫీస్ స్పెషలిస్ట్. ఈ కోర్సును పూర్తిచేసుకుంటే..ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ టూల్స్‌గా పిలిచే వర్డ్, ఎక్సెల్, పవర్‌పాయింట్ తదితర బేసిక్ కంప్యూటర్ స్కిల్స్ లభిస్తాయి. ఇది ఆర్ట్స్, కామర్స్ విద్యార్థులకు అనుకూలమైన కోర్సుగా పేర్కొనొచ్చు. ప్రస్తుతం అన్ని సంస్థల్లో ఉద్యోగుల హాజరు నుంచి వేతన జాబితా రూపకల్పన వరకూ.. అన్నింటికీ కంప్యూటర్ ఆధారంగా మారింది. అంతేకాకుండా డాక్యుమెంటేషన్, ఎక్సెల్ షీట్ ప్రిపరేషన్స్ వంటివి సర్వ సాధారణంగా మారాయి.
- ప్రస్తుతం యుడెమీ, కోర్స్‌రా వంటి పలు ఇన్‌స్టిట్యూట్‌లు ఈ కోర్సులను ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానంలో అందిస్తున్నాయి.
- ఈ సర్టిఫికేషన్ చేతిలో ఉంటే ఎంట్రీ లెవల్ ఉద్యోగాల్లో ప్రాధాన్యత లభిస్తుంది. అడ్మినిస్ట్రేషన్ ఎగ్జిక్యూటివ్, ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ వంటి కొలువులు లభిస్తాయి. నెలకు కనీసం రూ.12 నుంచి రూ.15 వేల ప్రారంభ వేతనం అందుతుంది.

డెస్క్‌టాప్ పబ్లిషింగ్

డీటీపీలో సర్టిఫికేషన్లు పూర్తి చేస్తే డేటాఎంట్రీ ఆపరేటర్లు, ఆఫీస్ అసిస్టెంట్లుగా ఉపాధి లభిస్తుంది. డేటాఎంట్రీ ఆపరేటర్లకు ప్రారంభంలో నెలకు రూ.ఆరు వేల నుంచి రూ.పది వేల వరకు వేతనం అందుతుంది. సొంతగా డీటీపీ సెంటర్ ఏర్పాటు చేసి స్వయం ఉపాధి పొందొచ్చు. డేటాఎంట్రీ ఆపరేటర్‌గా కొలువు పొందాలంటే.. ఎంఎస్ ఆఫీస్ టూల్స్, టైపింగ్, ఫోటోషాప్ వంటి అంశాల్లో పరిజ్ఞానం తప్పనిసరి.

వీడియో ఎడిటింగ్

- ప్రస్తుతం సంస్థలు తమ ఉత్పత్తులకు సంబంధించిన సమాచారాన్ని అధికారిక వెబ్‌సైట్ ద్వారా,ఆన్‌లైన్ మాధ్యమాల ద్వారా వీడియోల రూపంలో అందిస్తున్నాయి. సదరు వీడియోలు, వాటిలో వినియోగించాల్సిన చిత్రాలను ఆకర్షణీయంగా రూపొందించే స్కిల్ ఉన్న వారికి డిమాండ్ నెలకొంది. అలాగే వీడియో ఎడిటింగ్‌పై పట్టుంటే.. టీవీ మీడియా, వెబ్ మీడియా, సినిమాలు, అడ్వర్టైజింగ్ తదితర విభాగాల్లో ఉపాధి లభిస్తుంది. వీడియో ఎడిటింగ్‌కు సంబంధించి ప్రత్యేక నైపుణ్యాలు అందించే షార్ట్ టర్మ్ కోర్సులు ఎన్నో అందుబాటులోకి వచ్చాయి. పదో తరగతి, ఇంటర్మీడియెట్ అర్హతతోనే వీటిని పూర్తి చేసుకోవచ్చు.
- వీడియో ఎడిటింగ్‌కు సంబంధించి కూడా యుడెమీ, ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన క్యాంపస్ ఆఫ్ ఓపెన్ లెర్నింగ్, కోర్స్‌రా వంటి సంస్థలు మూడు నెలల నుంచి సంవత్సరం వ్యవధిలో ఉండే వీడియో ఎడిటింగ్, లీనియర్, నాన్–లీనియర్ ఎడిటింగ్ వంటి కోర్సులను అందిస్తున్నాయి. వీటిని పూర్తి చేసుకోవడం ద్వారా మీడియా సంస్థలు, యానిమేషన్ సంస్థలు, అడ్వర్టయిజింగ్ ఏజెన్సీలలో వీడియో ఎడిటర్స్, అసిస్టెంట్ వీడియో ఎడిటర్స్ వంటి ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు.

డిప్లొమా ఇన్ హోటల్ మేనేజ్‌మెంట్

- హోటల్ మేనేజ్‌మెంట్..ఇటీవల ఉద్యోగ కల్పనలో ముందంజలో ఉంటోంది. ఇంటర్మీడియెట్ అర్హతతో డిప్లొమా ఇన్ హోటల్ మేనేజ్‌మెంట్, హాస్పిటాలిటీ, టూరిజం వంటి కోర్సుల్లో చేరొచ్చు. ఏడాది వ్యవధి ఉండే ఈ కోర్సులను పూర్తి చేసుకోవడం ద్వారా హోటల్స్, రిసార్ట్స్, టూరిజం సంస్థల్లో అసిస్టెంట్ చెఫ్, స్టివార్ట్, గైడ్, బిల్లింగ్ ఎగ్జిక్యూటివ్, గెస్ట్ రిలేషన్ ఎగ్జిక్యూటివ్ వంటి కొలువులు లభిస్తాయి.
- డిప్లొమా ఇన్ ఫుడ్ అండ్ బెవరేజ్ ప్రొడక్షన్, డిప్లొమా ఇన్ ఫుడ్ అండ్ కేటరింగ్ టెక్నాలజీ, డిప్లొమా ఇన్ ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ వంటి కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ కేటరింగ్ టెక్నాలజీ గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్‌లలో వీటిని అభ్యసించొచ్చు.

ఫొటోగ్రఫీ

మాటల్లో వర్ణించలేని భావాలను వ్యక్తం చేయడానికి చక్కటి సాధనం..ఫొటోగ్రఫీ. ఇలాంటి అద్భుతమైన మాధ్యమాన్ని కెరీర్‌గా ఎంచుకోవాలనుకునే వారు ఫొటోగ్రఫీ సర్టిఫికేషన్ల ద్వారా రాణించొచ్చు. ఫొటోగ్రఫీకి సంబంధించి ఆరు నెలల షార్ట్ టర్మ్ కోర్సులతోపాటు డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి ఫోటో జర్నలిజం, కమర్షియల్ ఫోటోగ్రఫీ, అడ్వర్టైజింగ్, ఫ్యాషన్ ఫోటోగ్రఫీ, ఇండస్ట్రియల్ ఫోటోగ్రఫీ, వైల్డ్ లైఫ్ ఫోటోగ్రఫీ, ఏరియల్ ఫోటోగ్రఫీ, సైంటిఫిక్ ఫోటోగ్రఫీ.. వంటి విభాగాల్లో ఉపాధి లభిస్తుంది. వీరికి మీడియా సంస్థలు, పబ్లిషింగ్ సంస్థలు, అడ్వర్టయిజింగ్ కంపెనీలు ప్రధాన ఉపాధి వేదికలు. వీరు సొంతంగా స్టూడియోలను ఏర్పాటు చేసుకోవడంతోపాటు ఫ్రీలాన్స్ ఫోటోగ్రాఫర్‌గా కూడా పని చేయవచ్చు. సత్యజిత్ రే ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్, ఏఏఎఫ్‌టీ, పిక్సెల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫొటోగ్రఫీ వంటి పలు సంస్థలు ఫోటోగ్రఫీలో డిప్లొమా కోర్సులను అందిస్తున్నాయి.

బ్యుటీషియన్

- వివిధ కారణాలతో బ్యూటీషియన్‌లకు డిమాండ్ పెరుగుతోంది. దీంతో ఈ రంగానికి సంబంధించి కోర్సులు పూర్తి చేసిన వారు చక్కటి ఉపాధి పొందే అవకాశముంది. ప్రస్తుతం బ్యుటీషియన్ విభాగంలో సర్టిఫికెట్, డిప్లొమా స్థాయిలో పలు కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి మీడియా సంస్థలు, ఫిల్మ్ ఇండస్ట్రీలో..హెయిర్ డ్రెస్సర్, స్కిన్ కేర్ స్పెషలిస్ట్, మేకప్ ఆర్టిస్ట్, కాస్మొటిక్ కన్సల్టెంట్ అండ్ బ్యూటీ అడ్వైజర్, సెలూన్ అండ్ స్పా డైరెక్టర్, నెయిల్ టెక్నీషియన్ అండ్ మేనిక్యూరిస్ట్, బ్యూటీ కన్సల్టెంట్, బ్యూటీ స్కూల్ ఇన్‌స్ట్రక్టర్, కాస్మోటాలజిస్ట్, డెర్మటాలజీ అసిస్టెంట్, మార్కెటింగ్ అండ్ పబ్లిక్ రిలేషన్ స్పెషలిస్ట్ ఇన్ బ్యూటీ ఇండస్ట్రీ, ఆర్మో థెరపిస్టులుగా స్థిరపడవచ్చు. లేదా సొంతంగా బ్యూటీపార్లర్ నిర్వహించవచ్చు. వివాహాలు, జన్మదిన వేడుకలు వంటి సందర్భాల్లో బ్యుటీషియన్లకు చక్కని ఆదాయం లభిస్తోంది. కొంత సృజనాత్మకత ఉంటే ఫ్యాషన్ రంగంలో అవకాశాలను కూడా అంది పుచ్చుకోవచ్చు.
- సెట్విన్, నిమ్స్‌మే వంటి సంస్థలు గ్రూమింగ్, పర్సనల్ గ్రూమింగ్, బ్యుటీషియన్, అడ్వాన్స్ బ్యుటీషియన్, బ్యూటీ కేర్‌లో కోర్సులను బోధిస్తున్నాయి.

యానిమేషన్

ఇటీవల అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న విభాగాల్లో యానిమేషన్ ఒకటి. వీడియో గేమ్స్, కార్టూన్స్, మోషన్ కార్టూన్స్ పట్ల చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు ఆసక్తి పెరుగుతుండడంతో యానిమేషన్ రంగం శరవేగంగా వృద్ధి చెందుతోంది. దీంతో.. ఈ విభాగంలో నైపుణ్యాలు సొంతం చేసుకున్న వారికి చక్కటి ఉపాధి లభిస్తోంది. ప్రస్తుతం 3డి గేమింగ్, వీడియోలకు ప్రాధాన్యం పెరిగిన నేపథ్యంలో.. వీటికి సంబంధించి కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. మాడ్యులర్(మోడలింగ్), రిగ్గింగ్, టెక్స్చరింగ్ సెట్ డిజైనర్(ఎ–యానిమేటర్, బి–లిప్సింగ్), కంపోజిటింగ్ కోర్సులు వీటిలో ముఖ్యమైనవి. నిమ్స్‌మే ఇతర యానిమేషన్ సంస్థలు మూడు నుంచి సంవత్సరం వ్యవధిలోని కోర్సులను అందిస్తున్నాయి. వీటిని పూర్తి చేసుకుంటే..వీడియో గేమింగ్ సంస్థలు, మీడియా సంస్థలు, యానిమేషన్ సంస్థలు, ఫిల్మ్ ఇండస్ట్రీలో అవకాశాలు లభిస్తాయి.

క్లుప్తంగా...

30న 'ఏకలవ్య' ప్రవేశ పరీక్ష

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 28 ఏకలవ్య గురుకులాల్లో ప్రవేశానికి ఈ నెల 30న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 26 ఉదయం 11 గంటల నుంచి https://aptwgurukulam.ap.gov.in/ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని పేర్కొంది. 7, 8, 9వ తరగతుల్లో ఉన్న బ్యాక్ లాగ్ ఖాళీలకు గిరిజన బాల బాలికలు మాత్రమే అర్హులని తెలిపింది. 6వ తరగతిలో ప్రవేశానికి ప్రవేశ పరీక్షలో మార్కు ల ఆధారంగా 80 శాతం సీట్లు ఎస్టీలకు మాత్రమే కేటాయిస్తారని పేర్కొంది. బాల బాలికలు 2022-23 విద్యా సంవత్సరంలో 5వ తరగతి ఏదైనా ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన స్కూల్‌లో చదివి ఉండాలని స్పష్టం చేసింది.

రూ.4.38 కోట్లు డిపాజిట్ చేసిన ఏపీ ప్రభుత్వం

- ఎన్జీటీ ఆదేశాల మేరకు..
- పట్టిసీమ, పురుషోత్తపట్నం ప్రాజెక్టుల పర్యావరణ నష్టపరిహారంపై సుప్రీంకోర్టులో విచారణ

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ హయాంలో నిర్మాణమైన పట్టిసీమ, పురుషోత్తపట్నం ప్రాజెక్టులకు సంబంధించి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) సంయుక్త కమిటీ సిఫార్సు చేసిన నష్టపరిహారాన్ని ఏపీ ప్రభుత్వం చెల్లించింది. పర్యావరణ అనుమతుల ఉల్లంఘన కేసులో పురుషోత్తపట్నం ప్రాజెక్టుకు రూ.2.48 కోట్లు, పట్టిసీమ ప్రాజెక్టుకు రూ.1.90 కోట్లు.. మొత్తం రూ.4.38 కోట్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డిపాజిట్ చేసింది. పట్టిసీమ ప్రాజెక్ట్ పర్యావరణ ఉల్లంఘనలపై మంగళవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఎన్జీటీ ఆదేశాల మేరకు పర్యావరణ నష్టపరిహారం కింద ఏపీ కాలుష్య నియంత్రణ మండలికి ప్రభుత్వం చెల్లించింది. ఈ సొమ్మును ప్రాజెక్టు నిర్వాసితులకు చెల్లించేలా ఆదేశాలివ్వాలని పిటిషనర్ న్యాయవాది శ్రవణ్‌కుమార్ కోరగా.. ఆ సొమ్మును పర్యావరణ పరిరక్షణ కోసం మాత్రమే వినియోగించాలని ధర్మాసనం చెప్పింది. నిర్వాసితుల పరిహారం కోసం భూసేకరణ చట్టం ప్రకారమే నడుచుకోవాలని సూచించింది. ఈ కేసు తదుపరి విచారణను అక్టోబర్‌కు వాయిదా వేసింది.

జైలు నుంచి షర్మిల విడుదల

- బెయిల్ మంజూరు చేసిన నాంపల్లి కోర్టు

హైదరాబాద్ : వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిల చంచలగూడ జైలు నుంచి విడుదలయ్యారు. పోలీసులపై చేయి చేసుకున్న కేసులో అరెస్టయిన ఆమెకు మంగళవారం నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై సిట్‌కు వినతిపత్రం ఇవ్వడానికి వెళ్తున్న తనను పోలీసులు అక్రమంగా గృహ నిర్బంధానికి యత్నించడం అమానుషమన్నారు. తెలంగాణలో తాలిబన్‌ల రాజ్యం నడుస్తోందనడానికి ఈ ఘటనే సాక్ష్యమన్నారు. పోలీసుల దాడుల నుంచి తాను ఆత్మరక్షణకు ప్రయత్నిస్తే వారు మాత్రం తమకు అనుకూలంగా ఉన్న వీడియోలనే సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారని ధ్వజమెత్తారు. తనను పరామర్శించడానికి వచ్చిన తన తల్లి వైఎస్ విజయమ్మతో కూడా పోలీసులు దురుసుగా ప్రవర్తించారన్నారు. తాను దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి బిడ్డనని, ఎంత అణగదొక్కాలని చూస్తే అంతే రెట్టింపు రోషంతో తెలంగాణ ప్రజల తరఫున పోరాడతానని చెప్పారు.

సీబీఐ విచారణకు సునీత, రాజశేఖర్‌రెడ్డి


- మూడు గంటలు ప్రశ్నించిన సీబీఐ అధికారులు

సాక్షి, హైదరాబాద్: మాజీమంత్రి వివేకానందరెడ్డి హత్యకేసు దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు వివేకానందరెడ్డి కుమార్తె సునీత, ఆమె భర్త రాజశేఖర్‌రెడ్డిలను ప్రశ్నించారు. మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు సీబీఐ కార్యాలయానికి చేరుకున్న సునీత, రాజశేఖర్‌రెడ్డిలను రాత్రి ఏడుగంటల వరకు సీబీఐ అధికారుల బృందం పలు అంశాలపై ప్రశ్నించి, వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేసినట్టు తెలిసింది. ఇప్పటికే ఓసారి రాజశేఖర్‌రెడ్డి సీబీఐ అధికారుల ఎదుట హాజరుకాగా, మంగళవారం మరోమారు హాజరయ్యారు. సునీత తొలిసారిగా కోఠిలోని సీబీఐ కార్యాలయానికి స్టేట్‌మెంట్ ఇచ్చేందుకు వచ్చారు. వివేకానందరెడ్డి హత్యకు ముందు, తర్వాత కుటుంబ పరిస్థితులు, ఇతర అంశాలపై వారి వాంగ్మూలాన్ని సీబీఐ అధికారులు నమోదు చేసినట్టు సమాచారం. మరోవైపు వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో నిందితుడు (ఏ-1) గంగిరెడ్డి బెయిల్ రద్దుచేయాలని కోరుతూ హైకోర్టులో సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం విచారించిన న్యాయమూర్తి జస్టిస్ చిల్లకూర్ సుమలత.. తదుపరి విచారణను నేటికి (బుధవారానికి) వాయిదా వేశారు.

రిజిస్ట్రేషన్‌లో కొన్ని సేవలకు చార్జీలు పెంపు

సాక్షి, అమరావతి : రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ పరిధిలో కొన్ని సేవలకు యూజర్ చార్జీలు పెంచారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రిజిస్ట్రేషన్‌కు సంబంధించి.. మార్కెట్ వాల్యూ అసిస్టెన్స్, ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్(ఈసీ), సర్టిఫైడ్ కాపీ(సీసీ) వంటి మొత్తం పది రకాల సేవలకు సేవల రుసుం పెరిగింది.






చిర్రెత్తిస్తున్న స్పామ్ కాల్స్

ప్రపంచ వ్యాప్తంగా ఫోన్ వినియోగదారులకు సమస్య

- భారత్‌లో రోజులో మూడుకు పైగా స్పామ్‌కాల్స్
- ఎక్కువగా ఆర్థిక, రియల్ ఎస్టేట్ అంశాలపై మోసపూరిత కాల్స్
- స్పామ్‌కాల్స్ ఎదుర్కొంటున్న దేశాల్లో అర్జెంటీనా టాప్



సాక్షి, అమరావతి: అర్జంట్ పనిలో ఉన్నపుడు అదేపనిగా ఫోన్ మోగుతూ ఉంటుంది. అంత పనిలోనూ ఫోన్ ఎత్తితే.. తక్కువ వడ్డీతో లోన్ ఇస్తామనో, తక్కువ రేటుకే ఇంటి స్థలం అంటూనో.. అవతలి నుంచి గొంతు వినిపిస్తుంది. ఆ మాట వినగానే ఫోన్ వినియోగదారుడికి చిర్రెత్తుకొస్తుంది. ఈ స్పామ్ కాల్ సమస్య ప్రపంచ వ్యాప్తంగా చాలా వేధిస్తోంది. యూజర్లను కాల్స్‌తో పాటు మెసేజ్‌లు, ఈ-మెయిళ్లతో కూడా చికాకు పెడుతున్నారు. మన దేశంలో ఎక్కువ మందికి రోజులో మూడు అంతకంటే ఎక్కువ స్పామ్ కాల్స్ వస్తున్నట్టు లోకల్ సర్వే నివేదిక చెబుతోంది. ఇలాంటి కాల్స్‌ను 40 శాతం మంది బ్లాక్/డిస్‌కనెక్ట్ చేస్తున్నట్టు పేర్కొంది. కేవలం 2 శాతం మంది మాత్రమే స్పామ్ కాల్స్‌లో మాట్లాడుతున్నట్టు వివరించింది. ఈ స్పామ్ కాలర్లను నియంత్రించడానికి భారత ప్రభుత్వం పదేపదే కొత్త నిబంధనలను ప్రవేశపెడుతూనే ఉంది. 2007లో డునాట్‌డిస్టర్బ్ (డీఎన్‌డీ) సదుపాయాన్ని తీసుకొచ్చింది. స్పామ్ కాల్స్‌ను అరికట్టడానికి టెలికాం కమర్షియల్ కమ్యూనికేషన్ కస్టమర్స్ ప్రిఫరెన్స్ రెగ్యులేషన్ (టీసీసీసీపీఆర్) ఫ్రేమ్‌వర్క్‌ను 2010లో ట్రాయ్ ప్రవేశపెట్టింది. వీటిని యాక్టివేషన్ చేసుకున్నప్పటికీ 95 శాతం మంది తిరిగి స్పామ్‌కాల్స్‌ను ఎదుర్కొన్నట్టు సర్వే గుర్తించింది.

స్పామ్‌బాట్‌లో రెండో స్థానం..


లండన్‌కు చెందిన స్పామ్, సైబర్ బెదిరింపులను ట్రాక్ చేసే సంస్థ 'స్పామ్‌హాస్ ప్రాజెక్ట్' నివేదిక ప్రకారం చైనా తర్వాత భారత దేశంలోనే అత్యధికంగా స్పామ్‌బాట్‌లను వినియోగిస్తున్నా రు. ఒకేసారి ఎక్కువ సంఖ్యలో స్పామ్ కాల్స్, మెసేజ్‌లను పంపేందుకు స్వయం ప్రతిపత్తి కలిగిన కంప్యూటర్ ప్రోగ్రామ్ స్పామ్‌బాట్‌ను వినియోగిస్తారు. ఈ ఏడాది మార్చి నెలాఖరుకు భారత్‌లో దాదాపు 9.39 లక్షల స్పామ్‌బాట్‌లు చురుగ్గా ఉన్నట్టు అంచనా. వీటిని ప్రధానంగా ఫిషింగ్, క్లిక్-ఫ్రాడ్, డీడీఓఎస్ కోసం ఉపయోగిస్తున్నట్టు గుర్తించారు.

రష్యాలో అధికంగా స్పామ్ ఈ-మెయిళ్లు

స్పామ్, ఫిషింగ్ తాజా నివేదిక ప్రకారం 2022లో రష్యా (29.8 శాతం), చైనా (14శాతం), అమెరికా (10.7 శాతం) స్పామ్ ఈ-మెయిళ్లలో తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. అత్యధికంగా స్పెయిన్‌లో 8.8 శాతం, తర్వాత రష్యాలో 7.3 శాతం హానికరమైన ఈ-మెయిళ్లను బ్లాక్ చేశారు. భారత్‌లో స్పామ్ మెయిళ్ల వాటా 1.8 శాతంగా ఉంటే.. బ్లాక్ చేసిన ఈ-మెయిళ్లు 1.6 శాతంగా ఉంది.

ప్రపంచ వ్యాప్తంగా ఇదే సమస్య..

స్పామ్‌కాల్ సమస్య ప్రపంచ వ్యాప్తంగా ప్రబలంగా మారింది. అర్జెంటీనాలో ఫోన్ కాల్స్‌లో అత్యధికంగా 52 శాతం స్పామ్‌కాల్స్ నమోదవుతున్నట్టు గుర్తించారు. భారత్‌లో ఆ వాటా 12.7 శాతంగా ఉంది. ఇక ఐర్లాండ్, హంగేరీ, థాయ్‌లాండ్ దేశాలు స్పామ్ కాల్ ముప్పు చాలా తక్కువగా ఉంది. ఈ దేశాల్లో 10 శాతం లోపే స్పామ్ కాల్స్ నమోదవుతున్నాయి.



ప్రొద్దుటూరులో వైఎస్ సునీత, బాబు పోస్టర్లు

ప్రొద్దుటూరు క్రైం : మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ సునీత రాజకీయ రంగప్రవేశం చేస్తున్నారంటూ వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో పోస్టర్లు వెలిశాయి. ఈ పోస్టర్లపై తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడుతో పాటు ఆ పార్టీ జిల్లా, రాష్ట్ర నాయకుల ఫొటోలున్నాయి. అంతేకాక.. సునీత తండ్రి వైఎస్ వివేకానందరెడ్డి, ఆమె భర్త రాజశేఖర్‌రెడ్డి ఫొటోలను కూడా వేశారు. ప్రొద్దుటూరులోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం ఈ పోస్టర్లు వెలుగుచూశాయి. పోస్టర్లలో జై తెలుగుదేశం.. రాజకీయ రంగప్రవేశం చేయనున్న డాక్టర్ వైఎస్ సునీతమ్మ గారికి స్వాగతం.. సుస్వాగతం అని ఉంది. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం రోడ్డు, వైఎంఆర్ కాలనీ, టీబీరోడ్డు, కొర్రపాడు రోడ్డు తదితర ప్రాంతాల్లో ఈ పోస్టర్లను అంటించారు. అకస్మాత్తుగా వెలుగుచూసిన ఈ పోస్టర్లు పట్టణంలో తీవ్ర కలకలం రేపుతున్నాయి. దీనిపై ప్రొద్దుటూరు పోలీసులు ఆరా తీస్తున్నారు. వీటిని మంగళవారం వేకువ జామున అంటించి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. అయితే, ఈ పోస్టర్లతో తమ పార్టీకి ఎలాంటి సంబంధంలేదని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.



వైఎస్ సునీత పేరుతో ప్రొద్దుటూరులో వెలసిన పోస్టర్లు

పెట్రోల్ బంకుల్లో మౌలిక వసతులు కల్పించాలి

- పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పెట్రోల్ బంకుల్లో వినియోగదారులకు పూర్తిస్థాయి మౌలిక, రక్షణ వసతులు కల్పించాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ ఆదేశించారు. మెరుగైన సేవలను అందించేందుకు ప్రభుత్వం పెట్రోల్ బంకుల తనిఖీ కోసం ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందించినట్లు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల రాష్ట్రంలో 3,430 పెట్రోల్ బంకులను తనిఖీ చేయగా, 1,062 బంకుల్లో కనీసం తాగునీరు, మరుగుదొడ్లు, అగ్నిమాపక యంత్రం, ఉచిత గాలి, ఫస్ట్ ఎయిడ్ కిట్, పవర్ బ్యాకప్ లేనట్లు గుర్తించామని పేర్కొన్నారు. ఒక నెల వ్యవధిలో పూర్తి స్థాయిలో మౌలిక వసతులను మెరుగుపర్చుకోవాలని ఆయా బంకుల ఏజెన్సీలకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. చట్ట ప్రకారం లైసెన్సులు, అనుమతులు తీసుకోవాలని పేర్కొన్నారు. స్టాక్‌లో వ్యత్యాసాలు, నాణ్యతలో మోసాలకు పాల్పడితే ఏపీ పెట్రోలియం ఉత్పత్తులు 1980, మోటార్ స్పిరిట్, హైస్పీడ్ డీజిల్- 2005 ఉత్తర్వుల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టీడీపీకి ప్రజలే శాశ్వత సమాధి కడతారు

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని

మహారాణిపేట (విశాఖ దక్షిణ): వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ప్రజలు శాశ్వత సమాధి కట్టబోతున్నారని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని అన్నారు. విశాఖ కేజీహెచ్‌లో రోగుల బంధువుల సహాయం కోసం రూ.50 లక్షలతో ఆధునికీకరించిన ఉచిత వసతి సత్రాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికలొస్తున్నాయి కాబట్టే చంద్రబాబుకు ప్రజలు గుర్తొస్తున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు కల్లబొల్లి మాటలు నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరని ధ్వజమెత్తారు. టీడీపీ హయాంలో వైద్యరంగం పూర్తిగా దిగజారిపోయిందన్నారు. జగనన్న వైద్య ఆరోగ్య శాఖను పూర్తిగా ప్రక్షాళన చేశారని తెలిపారు. రూ.వేల కోట్లు వెచ్చించి ఉచితంగా మెరుగైన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారని వివరించారు. పల్లెలు మొదలు పట్టణాలు, నగరాల వరకు ప్రజలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందుతోందని వివరించారు. వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్స్ భవనాలు అద్భుతంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఒక్కో భవనానికి రూ.1.20 కోట్ల నుంచి రూ.1.50 కోట్లను వెచ్చిస్తున్నామన్నారు. నాడు-నేడులో భాగంగా విశాఖ కేజీహెచ్ అభివృద్ధికి రూ.600 కోట్లు మంజూరు చేశామని, ప్రస్తుతం ఇందులో రూ.163 కోట్లతో పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వెల్లడించారు. వైద్య సిబ్బంది కొరత అనే మాటే లేకుండా నియామకాలు చేశామని, డాక్టర్లతో పాటు స్పెషలిస్టు డాక్టర్ల నియామకాలు చేశామన్నారు. మంత్రి వెంట ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, మేయర్ గొలగాని హరివెంకట కుమారి ఉన్నారు.


మాట్లాడుతున్న మంత్రి విడదల రజని

యూపీహెచ్‌సీలు ప్రారంభం

మంత్రి విడదల రజని పరవాడ మండలంలోని లంకెలపాలెం, విశాఖ అర్బన్ మండల పరిధి నమ్మిదొడ్డిలోని 77 వార్డులో డాక్టర్ వైఎస్సార్ క్లినిక్‌లను (యూపీహెచ్‌సీలు) ప్రారంభించారు. లంకెలపాలెం యూపీహెచ్‌సీ భవనాన్ని రూ.1.22 కోట్లతో నిర్మించగా.. నమ్మిదొడ్డిలోని 77వ వార్డులో రూ.101.50 లక్షలతో యూపీహెచ్‌సీ నిర్మించారు.

పేదల చెంతకు విద్య, వైద్య రంగాలు

ఆ ఘనత సీఎం వైఎస్ జగన్‌దే

- ఆర్బీకేల ద్వారా వ్యవసాయ రంగంలో ఆదర్శవంతమైన సేవలు
- రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత
- ఏపీ తెలుగు, సంస్కృత అకాడమి ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలు ప్రదానం

ఏఎన్‌యూ (గుంటూరు) : సామాన్యుడి సంక్షేమం, అభ్యున్నతే లక్ష్యంగా ఏపీ ప్రభుత్వం చేపడుతున్న మహాయజ్ఞంలో మేధావులు భాగస్వాములు కావాలని రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత కోరా రు. ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమీ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలు-2023 ప్రదానోత్స వం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వనిత మాట్లాడుతూ.. ఎంతో ఖరీదైనవిగా మారిన విద్య, వైద్య రంగాలను ఉచితంగా పేదల చెంతకు చేర్చిన ఘనత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదేనన్నారు. విత్తనం నుంచి పంట విక్రయం వరకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోందన్నారు. గత ప్రభుత్వం తెలుగు అకాడమీని విస్మరించిందని.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తెలుగుతోపాటు సంస్కృత అకాడమీని కూడా ఏర్పాటు చేసి ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నారని, అకాడమి అధ్యక్షురాలు నందమూరి లక్ష్మీపార్వతి అన్నారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విశ్రాంత అధ్యాపకుడు, చిత్రకళాకారుడు ఆర్.సుభాష్‌బాబు మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థి దశలోనే తోటి విద్యార్థులకు ఎంతో ప్రేరణ ఇచ్చేవారని తెలిపారు.


ఉగాది పురస్కార గ్రహీతలతో హోం మంత్రి తానేటి వనిత, లక్ష్మీపార్వతి, వీసీ రాజశేఖర్

ఉగాది పురస్కారాల ప్రదానం

షార్ డైరెక్టర్ పి.గోపీకృష్ణ (విద్య, శాస్త్ర సాంకేతిక రంగం), డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలే (వైద్య రంగం), పసుమర్తి పావని (లలిత కళలు), కురటి సత్యం నాయుడు (జానపద, నాటక రంగం), వి.గోపీచంద్ (వ్యవసాయ రంగం), మాదిరెడ్డి కొండారెడ్డి (సేవా రంగం), ఆర్.సుభాష్‌బాబు (చిత్రకళా రంగం)కు ఉగాది పురస్కారాలు ప్రదానం చేశారు. ఏఎన్‌యూ వీసీ పి.రాజశేఖర్, తెలుగు అకాడమీ డైరెక్టర్ వి.రామకృష్ణ ప్రసంగించారు.

ఏపీ వేదికగా విశ్వజనీన ఆరోగ్య పథకాలు

ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచానికే ఆదర్శమైన ఆరోగ్య పథకాలు అమలువుతున్నాయి. పేదవాడి ఆరోగ్యంపై ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలనే వాస్తవాన్ని గ్రహించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో ఎన్నో రోగాలకు చికిత్స అందించేలా నిర్ణయం తీసుకుని విశ్వజనీన ఆరోగ్య ప్రణాళికను అమలు చేస్తున్నారు. ఇలాంటి ఆరోగ్య ప్రణాళికను నేను ఇప్పటి వరకు ఎక్కడా చూడలేదు. నాడు-నేడు పథకం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది అవుతోంది. అందుకే ఏపీ ప్రభుత్వంతో కలిసి కొన్ని సేవలందించేందుకు సిద్ధమవుతున్నా.

– డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలే, ప్రముఖ కార్డియాలజీ వైద్య నిపుణులు

'ర్యాపిడో' బైకర్ వికృత చేష్టలు

- భయపడి బైక్ నుంచి దూకిన యువతి
- గాయాలు అవ్వడంతో ఆస్పత్రికి తరలింపు
- బెంగళూరులో ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

బనశంకరి: ర్యాపిడో బైకర్ లైంగిక వేధింపుల నుంచి తప్పించుకోవడానికి బైకు నుంచి కిందకు దూకిన యువతి గాయపడిన ఘటన బెంగళూరులో ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే... బాధితురాలు (30) ప్రైవేటు ఆర్కిటెక్ట్‌గా పనిచేస్తోంది. ఈ నెల 21న రాత్రి 11.30 గంటల సమయంలో ఇందిరానగర్‌కు వెళ్లడానికి ర్యాపిడో బైక్‌ను యాప్‌లో బుక్ చేసింది. యువతిని పికప్ చేసుకున్న బైకర్ ఆమె మొబైల్‌ను లాక్కుని, కౌగిలించుకుని వెకిలిచేష్టలు చేశాడు. వెళ్లాల్సిన చోటుకు కాకుండా వేరే మార్గంలో తీసుకెళ్తుండగా యువతి అతడిని ప్రశ్నించింది. సమాధానం ఇవ్వకుండా మరింత వేగంగా బైక్‌ను పోనిచ్చాడు. పైగా అతడు మద్యం మత్తులో ఉన్నట్లు తెలిసింది. భయాందోళనకు గురైన ఆమె బీఎంఎస్ ఇన్‌స్టిట్యూట్ వద్ద బైకు నుంచి దూకడంతో గాయపడింది. ఒక స్నేహితురాలికి, అలాగే పోలీసులకు కాల్ చేసి సాయం అడిగింది. అయితే పోలీసులు ఇది ప్రేమికుల గొడవ అనుకుని స్పందించలేదని బాధితురాలు తెలిపింది. ప్రస్తుతం ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. చివరకు బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని ర్యాపిడో బైకర్‌ను అరెస్ట్ చేశారు. అతనిపై కిడ్నాప్, వేధింపులు, లైంగికదాడికి యత్నం తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

సామాజిక న్యాయంలో దేశానికి ఏపీ ఆదర్శం

- బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకున్న చంద్రబాబు
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య



సాక్షి, అమరావతి: బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుని వదిలేసే చంద్రబాబు తరహా రాజకీయాలకు కాలం చెల్లిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఎన్నికలు సమీపించిన ప్రతిసారి బీసీలపై ప్రేమ నటిస్తూ చంద్రబాబు మొసలికన్నీరు కారిస్తే నమ్మే పరిస్థితి లేదని, రానున్న ఎన్నికల్లో మళ్లీ 'నిన్ను నమ్మం బాబు..' అని బీసీలే తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ నాయకత్వంలో బీసీలకు రాజ్యాధికారంలో తగిన వాటా దక్కడమే ఇందుకు కారణమని ఆయన స్పష్టంచేశారు. ఆర్.కృష్ణయ్య మంగళవారం 'సాక్షి'తో మాట్లాడుతూ సామాజికన్యాయం అమలులో సీఎం వైఎస్ జగన్ దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. 'బలహీనవర్గాలు పాలితులుగానే కాదు... పాలకులుగా ఉండాలన్నదే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం. ఆయన విశాల దృక్పథం వల్ల రాష్ట్రంలో వాస్తవ రాజ్యాధికార బదిలీ జరిగింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో బడుగు బలహీనవర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం గణనీయంగా పెరిగింది. సంక్షేమ, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, చేసిన పనులు ఆంధ్రప్రదేశ్‌కు దేశ చరిత్రలోనే ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి. దేశంలో ఇప్పటివరకు ఏ రాష్ట్రంలోనూ లేనంత సామాజికన్యాయం ఏపీలో జరిగింది. దేశంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలవారు ముఖ్యమంత్రులుగా ఉన్న రాష్ట్రాల్లో కూడా ధైర్యంగా ఇంత పెద్దఎత్తున సామాజికన్యాయం అమలుచేసే సాహసం చేయలేదు. అధికారం, సంపదను జనాభా ప్రాతిపదికన ఎవరి వాటా వారికి ఇవ్వడంలో దేశంలోనే మొదటి ముఖ్యమంత్రిగా సీఎం వైఎస్ జగన్ అందరి మన్ననలు అందుకుంటున్నారు. మంత్రి పదవులు, స్థానిక సంస్థలు, కార్పొరేషన్, నామినేటెడ్ నుంచి రాజ్యసభ సభ్యుల వరకు ఏ పదవుల్లో అయినా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఏకంగా 70శాతానికి పైగా పదవులు ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుంది. ఇటీవల 18 ఎమ్మెల్సీ పదవులు ఇస్తే... వాటిలో ఏకంగా 11 బీసీలకే కేటాయించడంతో దేశంలోని అనేక మంది బీసీ నాయకులు ఆశ్చర్యపోయారు. 75 ఏళ్లలో ఎవరూ చేయని విధంగా చట్టసభల్లో 50శాతం బీసీ రిజర్వేషన్‌ల అమలు కోసం పార్లమెంట్‌లో ప్రైవేటు బిల్లు పెట్టి చరిత్ర సృష్టించారు. బీసీ కుల జనగణన చేపట్టాలని కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేయడంతోపాటు రాష్ట్రంలో బీసీ కులగణన దిశగా అడుగులు వేస్తూ కమిటీని నియమిస్తామని సీఎం వైఎస్ జగన్ ప్రకటించడం గొప్ప నిర్ణయం.' అని కృష్ణయ్య అన్నారు.

మూడు అంశాల ఆధారంగానే.. సచివాలయాల ఉద్యోగులకు బదిలీలు

సాక్షి, అమరావతి: పరస్పర అంగీకార బదిలీలతో పాటు భార్యాభర్తలిద్దరూ ప్రభుత్వోద్యోగులై ఉండి వేర్వేరుచోట్ల పనిచేస్తున్న వారికి.. ఆరోగ్య సంబంధిత సమస్యలతో ఇబ్బందిపడుతున్న వారికి మాత్రమే ఈ ఏడాది గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీలను పరిమితం చేయాలని ఆ శాఖ ప్రాథమికంగా నిర్ణయించింది. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికనే ఈ బదిలీల ప్రక్రియను నిర్వహిస్తూ.. ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు, అలాగే ఒకే జిల్లా పరిధిలో బదిలీలకు సైతం అవకాశం కల్పించాలని నిర్ణయించారు. 2019లో జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలో కొత్తగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటుచేసి, కేవలం నాలుగు నెలల కాలంలోనే కొత్తగా 1.34 లక్షల శాశ్వ త ప్రభుత్వోద్యోగాల భర్తీ ప్రక్రియ చేపట్టిన విషయం తెలిసిందే. అప్పట్లో ఈ ఉద్యోగాలు పొందిన వారు ఇప్పుడు మూడున్నరేళ్లలోపు సర్వీసును పూర్తిచేసుకున్నారు.

విధివిధానాల ఖరారుకు కసరత్తు

ఈ ఏడాది సాధారణ ఉద్యోగులతో పాటు సచివాలయ ఉద్యోగులకు కూడా తొలిసారి బదిలీలకు అవకాశం కల్పించేందుకు సీఎం వైఎస్ జగన్ ఇప్పటికే ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో.. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన విధివిధానాల ఖరారుపై గ్రామ, వార్డు సచివాలయ శాఖ కసరత్తు మొదలుపెట్టింది. ఈ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ మంగళవారం ఆ శాఖ అధికారులతో ఈ విషయమై సమీక్షించారు. వివిధ సచివాలయ ఉద్యోగుల సంఘాల ప్రతినిధులతో వేర్వేరుగా భేటీ అయి వారి సలహాలు, సూచనలు తెలుసుకున్నారు.



సాధారణ వినతుల బదిలీలకు కళ్లెం..

ఇక సాధారణ వినతి మేరకు బదిలీలకు అవకాశం కల్పిస్తే.. మారుమూల గిరిజన ప్రాంతాలతో పాటు కొన్ని ప్రత్యేక ప్రాంతంలో పనిచేసే ఉద్యోగులందరూ బదిలీలు కోరుకుంటారని.. దీంతో ఇబ్బందులు ఏర్పడే అవకాశమున్నందున ఆ తరహా బదిలీలను పూర్తిగా కట్టడి చేయాలని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ప్రాథమికంగా నిర్ణయించింది. దీంతో పరసర్ప అంగీకారం, భార్యాభర్తల అంశం, మెడికల్ గ్రౌండ్.. ఈ మూడు అంశాల ప్రాతిపదికన ఈసారి బదిలీలకు పరిమితం కావాలని నిర్ణయించారు. వీటి ప్రాతిపదికన కనీసం రెండేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న వారికే అవకాశం కల్పించాలని నిర్ణయించారు. భార్యాభర్తల ప్రాతిపదికన కూడా ఇద్దరూ ప్రభుత్వోద్యోగులైతేనే (కేంద్ర రాష్ట్రాలకు సంబంధించి ఏ విభాగమైనా) పరిగణనలోకి తీసుకోనున్నారు. అలాగే, ఉద్యోగి సొంత గ్రామానికి ఎట్టి పరిస్థితిలోనూ బదిలీ చేయరు. ఇక ఈ బదిలీల ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రత్యేక వెబ్‌పోర్టల్‌ను సిద్ధం చేయనున్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943